
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 147

గురువారం 17-8-2017

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'లవ్ జిహాద్' కేసు ఎన్ఐఏకు..

సుప్రీం ఆదేశం.. మాజీ న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రన్ నేతృత్వంలో దర్యాప్తు - 13లో



సెన్సెక్స్ 322 పాయింట్లు జంప్

నిఫ్టీ 103 పాయింట్లు అప్

నెలరోజుల్లో అత్యధిక లాభం – బిజినెస్‌లో

చిన్నారులతో ఆప్యాయంగా వైఎస్ జగన్ సెల్ఫీ



నంద్యాలలోని హరిజనపేటలో రోడ్‌షోకు భారీగా హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మోసంలో డిగ్రీ చేశారు

కుల, మతాల పేరిట మనుషులను వాడుకోవడం చంద్రబాబు నైజం


ఒక్క హామీ నెరవేర్చకుండా అన్ని వర్గాల వారినీ మోసం చేశారు: వైఎస్ జగన్ ధ్వజం

- 2014 ఎన్నికలప్పుడు ముస్లింలకు ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించారు
- వారికి ఎన్నో హామీలు ఇచ్చి.. ఏ ఒక్కటీ నెరవేర్చలేదు
- తన పరిపాలన పేరు చెప్పి నంద్యాల ప్రజలను ఓట్లు అడిగే ధైర్యం లేదు
- పోలీసు బలం.. అవినీతి సొమ్ము ఉంటే చాలనుకుంటున్నారు
- నంద్యాలలో దుకాణాలు కూల్చి రాక్షసానందం పొందుతున్నారు
- రాబోయే కురుక్షేత్ర సంగ్రామానికి నంద్యాలే నాంది పలకాలి
- మూటల డబ్బులతో వచ్చే దెయ్యాలు పాపానికి ఓటు వేయమంటాయి..
- మీరు న్యాయానికి ఓటు వేసి.. శిల్పామోహన్‌రెడ్డిని ఆశీర్వదించండి
- ఎనిమిదవ రోజు రోడ్‌షోలో ప్రతిపక్ష నేత పిలుపు

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'రుణ మాఫీ పేరుతో రైతులు, డ్వాక్రా అక్క చెల్లెమ్మలను మోసం చేశాడు.. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి పేరుతో నిరుద్యోగులను వంచనకు గురి చేశాడు.. ప్రత్యేక డిక్లరేషన్, సబ్‌ప్లాన్ పేరుతో ముస్లిం మైనార్టీలను వంచించాడు.. రిజర్వేషన్లంటూ కాపులనూ నమ్మించి ముంచేశాడు.. పేద ప్రజలందరికీ ఇళ్లు కట్టిస్తానని చెప్పి, ఒక్క ఇల్లూ కట్టిన పాపాన పోలేదు.. ఇలా ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిన ఏకైక వ్యక్తి ఎవరైనా ఉన్నారా అంటే అది చంద్రబాబే.. ఎన్నికలప్పుడు మాయ మాటలు చెప్పి వాడుకోవడం.. ఆ తర్వాత అందరినీ పక్కకు తోసేయడం ఆయన నైజం.. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు డిగ్రీ చేశార'ంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిప్పులు చెరిగారు. మూడున్నరేళ్ల పరిపాలనలో ఒక్క మంచి పని చేయని చంద్రబాబుకు బుద్ధి చెప్పాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించండని ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా మిగతా 5వ పేజీలో ▶

కింగ్స్ కాలేజీతో యూరప్ ఇక్కడికొస్తుంది



- పెద్ద పెద్ద సంస్థలకు భూములిస్తేనే ఉపయోగం
- అమరావతిలో కింగ్స్ కాలేజీ రూ.1,600 కోట్లు పెట్టుబడి పెడుతోంది
- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

సాక్షి, అమరావతి

పెద్ద పెద్ద సంస్థలకు భూములిస్తేనే మనకు ఉపయోగం ఉంటుందని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం ఆయన 'కింగ్స్ కాలేజ్ హాస్పిటల్–ఇండో యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్' ఏర్పాటులో భాగంగా విజయవాడలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన పునాదిరాయి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కింగ్స్ కాలేజీ యూరప్‌లోనే పెద్ద పేరున్న సంస్థని, భారతదేశంలో 11 ఆస్పత్రులను ఏర్పాటు చేస్తోందని, వీటన్నింటికీ అమరావతిలో నిర్మించే వైద్యకళాశాల హెడ్‌క్వార్టర్స్ కావాలని ఆయన అన్నారు. కింగ్స్ కళాశాల అమరావతిలో రూ.1,600 కోట్లు పెట్టుబడి పెడుతోందని, 1,000 పడకలతో ఆస్పత్రి, కళాశాల నిర్మాణం చేస్తోందన్నారు. దీనివల్ల ఆంకాలజీ సెంటర్, ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటివి వస్తున్నాయన్నారు. ఇలాంటి సంస్థలు రావడం వల్ల రాష్ట్రంలో మెడికల్ టూరిజం బ్రహ్మాండంగా అభివృద్ధి జరుగుతుందని, త్రీస్టార్, ఫైవ్‌స్టార్ హోటళ్లు వస్తాయని చెప్పారు. ఇక్కడ వైద్యం ఖర్చు తక్కువగా ఉండటం వల్ల యూరప్ వాళ్లందరూ ఇక్కడికే వస్తారన్నారు. ఇప్పటికే అమృత, ఎస్ఆర్ఎం, విట్ వంటి సంస్థలు ఇక్కడికొచ్చాయని, త్వరలోనే ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తామని తెలిపారని ఆయన చెప్పారు. కేంద్ర ఆరోగ్యశాఖ సహాయమంత్రి అనుప్రియా పటేల్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే పేరున్న కింగ్ కాలేజ్ ఆఫ్ హాస్పిటల్ సంస్థ ఇండియాలో వారి సేవలు విస్తరించడం అభినందనీయమన్నారు. సమావేశంలో మిగతా 7వ పేజీలో ▶

డీజీపీ ఆఫీసును కబ్జా చేయాలనుంది..


పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ప్రారంభోత్సవ సభలో సీఎం వ్యాఖ్య

పోలీస్ ఫోర్స్ రోబోలను మించిపోతోంది

ప్రతీ పోలీస్‌కూ ఇల్లు నిర్మిస్తాం

దేశంలోనే గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌లో ఏపీ నంబర్‌వన్

7లో



నేటి నుంచి గ్రూప్-1 మెయిన్స్

4 ప్రధాన నగరాల్లో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 78 గ్రూప్–1 పోస్టుల భర్తీకి సంబంధించిన మెయిన్స్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి వైవీఎస్‌టీ సాయి బుధవారం తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 28 వరకు.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని చెప్పారు. ప్రధాన నగరాలైన విశాఖ, విజయవాడ, మిగతా 2వ పేజీలో ▶

రోహిత్ మరణానికి ఎవరూ కారణం కాదు

వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య: అశోక్ రూపన్వాల కమిషన్

- సూసైడ్‌నోట్‌లోనూ అలాగే ఉంది.. వీసీ సహా ఎవరిపైనా చర్యలు అక్కర్లేదు
- ఆ విద్యార్థి దళితుడు కాదని స్పష్టీకరణ.. కమిషన్ నివేదికను వెల్లడించిన కేంద్రం
- మండిపడుతున్న విద్యార్థి జేఏసీ, రోహిత్ తల్లి
- ఆత్మహత్యను వదిలి పెట్టి.. కులంపై శోధించడం ఏంటని నిలదీత



2లో

అర్చకుల వేతనాల తగ్గింపు నిర్ణయం దారుణం

- ముఖ్యమంత్రికి మాజీ సీఎస్ ఐవైఆర్ ఘాటు లేఖ
- ఉపాధి కూలీల కంటే అధ్వానమా?
- కనీస వేతనం రూ.20 వేలు చేయాలని డిమాండ్



సాక్షి, అమరావతి: అర్చకుల వేతనాల్లో సగం కోత విధించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మాజీ సీఎస్, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఐవైఆర్ కృష్ణారావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సుదీర్ఘ లేఖ రాశారు. హిందూ మతాన్ని నాశనం చేయడానికి బయట శత్రువులు అక్కర్లేదని, ప్రభుత్వం తీసుకుంటున్న ఈ ఒక్క నిర్ణయం చాలని దుయ్యబట్టారు. అర్చకుల వేతనాన్ని రూ.10,000 నుంచి రూ.5,000కు తగ్గిస్తే గ్రామాల్లో హిందూ మతం కనిపించకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయం లేని ఆలయాల్లో అర్చకుల వేతనాలను సగానికి తగ్గించడానికి ప్రభుత్వం సిద్ధమైన విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందిస్తూ ఐవైఆర్ బుధవారం ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. అర్చకులకు కనీస వేతనం కింద రూ.10,000 చెల్లించడానికి రూ.250 కోట్ల మూలనిధి ఏర్పాటు చేయాలని మిగతా 2వ పేజీలో ▶



కేబినెట్ పునర్వ్యవస్థీకరణ దిశగా..

- పార్టీ పదవులు, గవర్నర్లు, నామినేటెడ్ పోస్టుల నియామకంపైనా...
- కార్యాచరణ ప్రారంభించిన ప్రధాని మోదీ

13లో



మెట్రో రైలుకు ప్రైవేట్ భాగస్వామ్యం

- నూతన విధానానికి కేంద్ర కేబినెట్ ఆమోదం
- నిధుల సేకరణ వినూత్న పంథాలో సాగాలని ప్రతిపాదన

మంత్రి ఆది వ్యాఖ్యలపై భగ్గు



మంత్రి ఆది వ్యాఖ్యలకు నిరసనగా నంద్యాలలోని హరిజన పేటలో చీపుర్లు, చెప్పులతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న దళితులు


- రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసన
- పలుచోట్ల దిష్టిబొమ్మలు దహనం
- ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు..
- పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదుల పర్వం..
- ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుకు డిమాండ్
- మంత్రిని తక్షణం అరెస్ట్ చేయాలని పట్టు
- దళిత సంఘాలతోపాటు విద్యార్థి, పలు ఇతర సంఘాల ఆందోళన

6లో

ఇదండీ జగత్



అదేదో ఆరెస్సెస్ జెండా ఎగురవేసినట్లు అంత ఆందోళన ఎందుకంటున్నార్సార్!!



పులిచింతలలోనూ 'అ'ధనం'!

రూ.355 కోట్లు అదనంగా చెల్లించేందుకు సర్కారు సిద్ధం

జలవనరుల శాఖ ప్రతిపాదనలను 8 సార్లు తోసిపుచ్చిన ఆర్థిక శాఖ

అయినా కాంట్రాక్టర్ అడిగిన మొత్తానికి వడ్డీ కలిపి ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం

భారీ మొత్తంలో చేతులు మారనున్న ముడుపులు

సాక్షి, అమరావతి

చంద్రయ్యది ఉమ్మడి కుటుంబం. పెరిగిన అవసరాల కొద్దీ కొత్తగా ఇల్లు కట్టాలని అంతా కలసి నిర్ణయించారు. రూ.2.50 లక్షలకు ఇల్లు నిర్మించి ఇచ్చేలా మేస్త్రీతో ఒప్పందం చేసుకున్నారు. ఇంటి నిర్మాణం పూర్తయింది. రూ.2.50 లక్షలు మేస్త్రీకి ఇచ్చారు. కానీ మేస్త్రీ గుమ్మాలకు, కిటికీలకు టేకు కలప వాడానని, 43గ్రేడ్‌కు బదులు 53 గ్రేడ్ సిమెంట్ వినియోగించానని, అందువల్ల తనకు అదనంగా రూ.5 లక్షలు ఇవ్వాలంటూ పేచీకి దిగాడు. మేస్త్రీకి ఎంతోకొంత ఇవ్వాలని కుటుంబ పెద్ద అయిన చంద్రయ్యకు గ్రామ పెద్దలు సూచించారు. దీన్ని వ్యతిరేకిస్తూ మేస్త్రీ కోర్టును ఆశ్రయించాడు. కానీ చంద్రయ్య సకాలంలో స్పందించకుండా తాత్సారం చేయడంతో కింద కోర్టు మేస్త్రీ వాదనతో ఏకీభవించి రూ.5 లక్షలు మేస్త్రీకి ఇచ్చేయాలంటూ తీర్పు ఇచ్చింది. కింది కోర్టు తీర్పుపై హైకోర్టుకు వెళ్లాలని చంద్రయ్యకు కుటుంబసభ్యులు సూచించారు. కానీ.. చంద్రయ్య మాత్రం మళ్లీ తాత్సారం చేశాడు. తీర్పు అమలు కాని విషయం మేస్త్రీ కోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. తీర్పును తక్షణమే అమలు చేయాలంటూ కోర్టు ఆదేశించింది. కుటుంబానికి ఆర్థికంగా పెద్దయెత్తున నష్టం జరుగుతున్నా చంద్రయ్య ఎందుకు తాత్సారం చేశాడనే ప్రశ్న తలెత్తడం సహజం. అయితే తనకంటూ సొంతంగా ఎంతోకొంత వెనకేసుకోవాలనుకున్న చంద్రయ్య మేస్త్రీతో కుమ్మక్కై ఆ విధంగా వ్యవహరించాడనేది అసలు రహస్యం. ఈ కథలో చంద్రయ్య రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యనేత అయితే.. మేస్త్రీ పులిచింతల ప్రాజెక్టు కాంట్రాక్టర్. నష్టపోతోంది రాష్ట్ర ప్రజలు. 355 కోట్ల స్వాహాకు ముఖ్యనేత పన్నిన పన్నాగం కథాకమామిషు ఇదీ..!! - వివరాలు 7లో



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నచిన్నారి

ఉదయించిన బాల'చంద్రుడు'

- మృత్యుంజయుడు ఈ చంద్రశేఖర్
- బోరుబావి నుంచి సజీవంగా బయట పడ్డ చిన్నారి
- క్షణం వృథా కాకుండా రక్షణ చర్యలు ప్రారంభం
- ఫలించిన అధికారుల కష్టం.. అండగా నిలిచిన గ్రామస్తులు

- వివరాలు 2లో

22 నుంచి సాక్షి ఎడ్జ్ ఆధ్వర్యంలో
స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ

SAKSHI edge Finishing School

సాక్షి, హైదరాబాద్: ఏ భాషలోనైనా మన అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తం చేయాలంటే చక్కటి నైపుణ్యం ఉండాలి. ఇంగ్లీష్‌లో అలాంటి ప్రావీణ్యాన్ని సంపాదించేందుకు 'సాక్షి ఎడ్జ్' ఆధ్వర్యంలోని స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ దోహదం చేస్తుంది. మీలో అంతర్గతంగా నిక్షిప్తమై ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి, ఇంగ్లీష్‌పై పట్టు సాధించే దిశగా మిమ్మల్ని నడిపిస్తుంది. ఇంగ్లీష్ నేర్చుకోవాలనే తపన ఉన్న వారికి 'సాక్షి ఎడ్జ్' వినూత్న శిక్షణ అందజేస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి విజేతలుగా నిలబెడుతుంది. ఈ స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులో భాషా పరిచయంతో పాటు, ఉచ్చారణలో దొర్లే తప్పులు, ఫ్లూయెన్సీ లింకింగ్‌ను అధిగమించడం, గ్రామర్ వంటి ముఖ్య అంశాలలో శిక్షణనిస్తారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు కూడా అందజేస్తారు. తరగతులు 22వ తేదీ (మంగళవారం) నుంచి ప్రారంభమవుతాయి.

కాలపరిమితి: ఆగస్టు 22వ తేదీ నుంచి 30 రోజుల పాటు
వేళలు: సాయంత్రం 5.00 గంటల నుంచి 7.00 గంటల వరకు
కోర్సు ఫీజు: రూ.4,600
రిజిస్ట్రేషన్లు, తరగతులు: సాక్షి ప్రధాన కార్యాలయం, సాక్షి టవర్స్, రోడ్ నం.1, కేర్ ఆస్పత్రి సమీపంలో, బంజారాహిల్స్, హైదరాబాద్.
వివరాలకు: ఫోన్ నంబర్ 9603533300లో (ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు) లేదా sakshiedge@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

రోహిత్ మరణానికి ఎవరూ కారణం కాదు

వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య: అశోక్ రూపన్వాల కమిషన్

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ ఆత్మహత్యకు వర్సిటీ అధికారులు, రాజకీయ నేతల ఒత్తిడి కారణం కాదని అశోక్ రూపన్వాల కమిషన్ పేర్కొంది. వర్సిటీ వీసీ అప్పారావు సహా ఎవ్వరిపైనా చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. రోహిత్ దళితుడు కాదని, వడ్డెర (బీసీ) కులానికి చెందినవాడని నివేదికలో పేర్కొంది. 2016 జనవరిలో హెచ్‌సీయూలో రోహిత్ ఆత్మహత్య చేసుకోవడంపై దేశవ్యాప్తంగా దుమారం రేగిన సంగతి తెలిసిందే. దీంతో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ అలహాబాద్ హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ ఏకే రూపన్‌వాల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ గతేడాది డిసెంబర్‌లోనే నివేదిక సమర్పించినా.. మంగళవారం కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ తన వెబ్‌సైట్‌లో ఈ 51 పేజీల రిపోర్టును ఉంచింది. రోహిత్ ఆత్మహత్యకు కేంద్రమంత్రులు స్మృతి ఇరానీ, బండారు దత్తాత్రేయ, వర్సిటీ వీసీ అప్పారావుల ఒత్తిడే కారణమన్న ఆరోపణలను రూపన్‌వాల్ కమిషన్ తోసిపుచ్చింది. వ్యక్తిగత కారణాలతోనే రోహిత్ ఆత్మహత్యకు పాల్పడినట్లు నివేదికలో స్పష్టంచేసింది. ''యూనివర్సిటీ అధికారులు, రాజకీయ నేతల ఒత్తిడితో ఈ ఆత్మహత్యకు సంబంధం లేదు. వ్యక్తిగత నిర్ణయంతోనే రోహిత్ ఆత్మహత్య చేసుకున్నారు. రోహిత్ సుసైడ్ నోట్ ప్రకారం.. ఆయన వ్యక్తిగత సమస్యలతో బాధపడుతున్నట్లు స్పష్టమైంది. తన చుట్టూ జరుగుతున్న వ్యవహారాలతో ఆయన అసంతృప్తితో ఉన్నట్లు వెల్లడైంది''అని నివేదికలో పేర్కొన్నారు. దళిత విద్యార్థులు యూనివర్సిటీలో చేరే సమయంలోనే ఈ వివక్షను భరించలేక ఉరేసుకునేందుకు ఒక తాడుని, ఇంత విషం ఇవ్వండి అంటూ 2015 డిసెంబర్ 18న వీసీ అప్పారావుకు రోహిత్ రాశారు. అయితే ఈ లేఖ తన మరణానికి నెల ముందు రాసింది కనుక రోహిత్ ఆత్మహత్యకు అది కారణం కాదని కమిషన్ అభిప్రాయపడింది. అలాగే వర్సిటీలో జనరల్ కేటగిరీ విద్యార్థులకు ప్రత్యేకమైన సదుపాయాలు కల్పించినట్లుగా తన దృష్టికి రాలేదని వివరించింది.

కమిషన్ పని ఏంటి..?: రోహిత్ మరణానికి కారణం ఏంటన్న విషయాన్ని కాకుండా అతడు దళితుడు కాదన్న విషయాన్ని రుజువు చేసే పనిని కమిషన్ నెత్తిన వేసుకుందంటూ అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్, సామాజిక న్యాయపోరాట ఐక్య కమిటీ మండిపడింది. వర్సిటీలో రోహిత్ సహా హాస్టల్ నుంచి వెలివేతకు గురైన సామాజిక న్యాయపోరాట కమిటీ నాయకుడు దొంత ప్రశాంత్ కమిషన్ రిపోర్టును దుయ్యబట్టారు. రోహిత్ మరణానికి కారకులైన వీసీ, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, కేంద్రమంత్రి దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రామచందర్‌రావులను తప్పించేందుకే న్యాయసమ్మతం కాని ఈ రిపోర్టు ఇచ్చారని అన్నారు. రోహిత్ కులాన్ని ధ్రువీకరించే అధికారం కమిషన్‌కు లేదన్నారు.

నాడే వెల్లడించిన 'సాక్షి'

రిపోర్టు ఆద్యంతం కులం ప్రస్తావనే అంటూ ఆనాడే 'సాక్షి'బయటపెట్టింది. ఇప్పుడు కమిషన్ అదే రిపోర్టు వెల్లడించింది. గతంలో సెంతిల్ కుమార్ ఆత్మహత్య సందర్భంగా నియమించిన పావురాల కమిషన్‌కానీ, కృష్ణ కమిషన్‌గానీ యూనివర్సిటీలో పరిస్థితుల మెరుగు కోసం సూచించిన ఎలాంటి చర్యలూ ఇప్పటికీ వర్సిటీ యాజమాన్యం తీసుకోకపోవడం గమనార్హం.

రాజకీయ ప్రయోజనాల కోసమే...

దళితేతరుడైన, బీజేపీ అనుకూలురైన అశోక్ రూపన్వాల్ ఇచ్చిన నివేదికను అంగీకరించేదిలేదు. బీజేపీ సర్కారు తనకు అనుకూలమైన వారితో రిపోర్టు ఇప్పించింది. దీన్ని మేం అంగీకరించం. నేషనల్ ఎస్సీ కమిషన్ ఏనాడో రోహిత్ దళితుడని తేల్చి చెప్పింది.

– *మున్నా, అంబేడ్కర్ స్టుడెంట్స్ అసోసియేషన్ కన్వీనర్*

కులాన్ని ప్రస్తావించే అధికారం లేదు

నా కులం ఏంటో తేల్చేందుకు కమిషన్‌ను నియమించలేదు. ఆ అధికారం ఈ కమిషన్‌కి లేదు. నా భర్త వడ్డెర అయినంత మాత్రాన నేను వడ్డెర కావాల్సిన పని లేదు. ఈ దేశంలో మనుషులకు కులంతోనే గుర్తింపు. ఆ వివక్షే నా బిడ్డను చంపేసింది. ఇప్పుడు దాంతో బీజేపీ, టీడీపీ రాజకీయం నడుపుతోంది. చంద్రబాబు, అప్పారావు కుమ్మకై కేసుని నీరుగార్చేందుకు కుట్ర చేస్తున్నారు. నా కొడుకుని చంపిన వ్యక్తికి అవార్డులిచ్చి సన్మానిస్తున్నారు. కేంద్రమంత్రులను కాపాడేందుకు నా కులాన్నే కాదంటున్నారు. దళితురాలిగా నేను అనుభవించిన వివక్ష, నా బిడ్డని బలితీసుకున్న యూనివర్సిటీలో కులం పోయేవరకు నేను పోరాడుతూనే ఉంటాను.

– *రాధిక, రోహిత్ వేముల తల్లి*

నాలుగు ట్రిపుల్ ఐటీల్లో పెరిగిన సీట్లు

వేంపల్లె: రాష్ట్రంలోని ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో సూపర్ న్యూమరరీ కింద 656 సీట్లను భర్తీ చేయనున్నట్టు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ భగవన్నారాయణ, ఏవో అమరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క ట్రిపుల్ ఐటీకి 164 సీట్లు కేటాయించారని తెలిపారు. ఈ నెల 23వ తేదీన ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు సంబంధించి ఇడుపులపాయలో, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు సంబంధించి నూజివీడులో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

ఉదయించిన బాల'చంద్రుడు'

- మృత్యుంజయుడు ఈ చంద్రశేఖర్
- బిడ్డ బయటపడటంతో అందరి మోముల్లో ఆనందం

సాక్షి, గుంటూరు, వినుకొండ

గ్రామస్తులతోపాటు టీవీలు చూస్తున్న రాష్ట్రంలోని అనేక మంది తల్లులు చేసిన ప్రార్థనలు ఫలించాయి. ఓ అమ్మకు ఊరట కలిగిస్తూ బాల'చంద్రుడు' ఉదయించాడు! బోరుబావిలో చిక్కుకున్న చిన్నారి చందు బోసి నవ్వులతో మృత్యుంజయుడుగా వచ్చాడు. గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరంలో మంగళవారం చంద్రశేఖర్ అనే రెండేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు బోరు బావిలో పడటంతో ఆగమేఘాలపై రంగంలోకి దిగిన అధికారులు శక్తి వంచన లేకుండా 10 గంటలకుపైగా శ్రమించి చిన్నారిని రక్షించారు. ఉత్కంఠ వాతావరణంలో ఒకవైపు వర్షం కురుస్తున్నా చంటిబిడ్డ ప్రాణాల కోసం కృషి చేసిన అధికార యంత్రాంగం, ప్రజలు చందు సజీవంగా రావటంతో ఊపిరి పీల్చుకున్నారు. 15 అడుగుల లోతులో కూరుకుపోయి బాలుడు అనుభవిస్తున్న నరకయాతనకు తల్లిదండ్రులతో పాటు గ్రామస్తుల కళ్లు చెమర్చాయి. చిన్నారి తల్లిదండ్రులు మల్లికార్జునరావు, అనూష తమ గారాల బిడ్డ క్షేమంగా రావాలని వేయి దేవుళ్లకు మొక్కుకున్నారు. మంగళవారం




బోరుబావిలో నుంచి వెలికితీసిన క్షణంలో చిన్నారి చందు, 108లో చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

సాయంత్రం 4.30 గంటలకు బాలుడు బోరు బావిలో పడిపోగా బుధవారం తెల్లవారు జామున 2.40 గంటలకు సురక్షితంగా బయటకు తీశారు.

ఊరంతా సంబరాలు

ముద్దులొలికే చిన్నారి చందు క్షేమంగా బయటపడటంపై ఉమ్మడివరం ప్రజలు సంబరం చేసుకున్నారు. చందు చిరంజీవిగా తమ కళ్ల ముందుకు రావటంలో అధికారులు పడిన శ్రమ మరువలేనిదని, ఎప్పటికీ తమ గ్రామస్థులు రుణపడి ఉంటారని అంటున్నారు. జిల్లా కలెక్టర్ కోన శశిధర్, జిల్లా రూరల్ ఎస్పీ వెంకటప్పలనాయుడులు స్పందించిన తీరు అభినందనీయమని కొనియాడారు.

ఊరంతా కదిలింది...

చందు బోరు బావిలో పడిపోయిన వెంటనే రక్షించటానికి ఊరంతా ఒక్కటై సహాయ చర్యల్లో పాల్గొంది. ఆపరేషన్ పూర్తయ్యేంతవరకు గ్రామస్తులు నిద్రాహారాలు మాని అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. అధికారులు వచ్చే వరకు విశ్రమించకుండా వారు పడ్డ శ్రమ ఎనలేనిదని చందు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనూష తన బిడ్డ బోరు బావిలో పడ్డాడని కేకలు వేయగానే గ్రామస్తులు స్పందించారు. బిడ్డ ఎన్ని అడుగుల దూరంలో ఉన్నాడు అని గమనించి పెద్ద ఇనుప రాడ్డును లోపలికి పంపి అంతకన్నా కిందకు జారకుండా రక్షణ చర్యలు చేపట్టటం చందు ప్రాణాలను కాపాడటానికి వీలైంది. సమీపంలోని క్వారీ నుంచి ప్రొక్లెయిన్ తెచ్చి సమాంతరంగా గుంత తవ్వకం చేపట్టారు. అధికారులు ఘటనా స్థలికి చేరుకునేలోగా దాదాపు 7 అడుగులకు పైగా గుంత తవ్వటం సహాయ చర్యలకు కలిసొచ్చే అంశంగా మారింది. ప్రతి క్షణం విలువైన ఆ సమయంలో గ్రామస్తులు వేగంగా స్పందించి తీసుకున్న నిర్ణయం బాలుడి ప్రాణాలను కాపాడింది. సహాయక చర్యలు వేగంగా జరుగుతున్న సమయంలో అందరిని ఉలికిపాటుకు గురి చేస్తూ కొద్దిసేపు వర్షం చినుకులు రాలాయి. అయినా మొక్కవోని దీక్షతో అధికారులు, గ్రామస్తులు శ్రమించి లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

పరామర్శించిన మంత్రి కామినేని

గుంటూరు మెడికల్: బోరు బావి నుంచి బయటపడి గుంటూరు జీజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారి చందును వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. బాలుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిన మూడేళ్ల తరువాత బోరుబావిలో పిల్లవాడు పడిన సంఘటన ఇదే మొట్టమొదటిదని మంత్రి పేర్కొన్నారు. బోరుబావిలో నుంచి బయటకు తీయడంలో మీడియా ప్రముఖ పాత్ర పోషించిందని అభినందించారు. పసికందు ఆరోగ్యంపై సీఎం చంద్రబాబు తనతో నాలుగు సార్లు మాట్లాడారని చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పనిచేయని బోరుబావులను మూసివేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. బిడ్డ ఆరోగ్యం బాగుందని, చీకట్లో పది గంటల పాటు ఉండటం వల్ల తాగేందుకు నీరు, పాలు లేకపోవడం వల్ల ఇబ్బంది పడ్డాడు తప్ప ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

అర్చకుల వేతనాల తగ్గింపు నిర్ణయం దారుణం

▶ మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు ఆదేశించిందని, కానీ ప్రభుత్వం రూ.200 కోట్ల నిధిని మాత్రమే సమకూర్చిందన్నారు. టీటీడీ నుంచి అదనంగా మరో రూ.200 కోట్లతో పాటు దేవాదాయ శాఖ నుంచి రూ.50 కోట్లు సమకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. కనీస వేతనం అనేది కేవలం ఒక కులానికి చెందిన అర్చకులకు మాత్రమే ఉపయోగపడదని, హిందూ ధర్మ పరిరక్షణ కోసం దేవాలయాల్లో పనిచేసే చాత్తాద శ్రీ వైష్ణవులు, తంబళ్ల, లింగాయత్, బోయ, తదితర వెనుకబడిన వర్గాల్లోని వారికి కూడా ప్రయోజనం ఉంటుందన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకే నెలకు రూ.10,000 లభిస్తున్న తరుణంలో ఆగమశాస్త్రాన్ని నేర్చుకొని హిందూమత పరిరక్షణ కోసం పనిచేస్తున్న అర్చకుల వేతనాలను సగానికి సగం తగ్గించాలని చూడటం తగదన్నారు. చిన జీయర్ ట్రస్ట్ లాంటి సంస్థల కింద ఉన్న దేవాలయాల్లో అర్చకులకు నెలకు కనీస వేతనం కింద రూ.20,000 ఇస్తున్నారని, అదే స్థాయిలో ఇతర అర్చకుల వేతనాలను క్రమంగా పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఐవైఆర్ లేఖలో వాస్తవం లేదు: వేమూరి ఆనంద్ సూర్య

అర్చకుల వేతనాలు తగ్గించారంటూ ఐవైఆర్ కృష్ణారావు ముఖ్యమంత్రికి రాసిన లేఖలో వాస్తవం లేదని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్‌సూర్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ అధికారి అయిన ఆయన ఇలాంటి తప్పుడు సంకేతాలు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు.

నేటి నుంచి గ్రూప్-1 మెయిన్స్

▶ మొదటి పేజీ తరువాయి

తిరుపతి, అనంతపురంలోని 11 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 3,900 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని చెప్పారు. అభ్యర్థులు 15 నిముషాలు ముందుగానే తమతమ సీట్లలో కూర్చోవలసి ఉంటుందని.. అందువల్ల అంతకు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఇంకా ఏమైనా సందేహాలుంటే.. 8498098265, 8498098257 నంబర్లను సంప్రదించాలని కోరారు. కాగా, ఈ నెల 17న జనరల్ ఇంగ్లిష్, 19న పేపర్ 1, 21న పేపర్ 2, 23న పేపర్ 3, 26న పేపర్ 4, 28న పేపర్ 5 పరీక్ష జరగనుంది.

'బోరు' ప్రమాదాల నివారణకు చర్యలేవీ?

- రాష్ట్ర సర్కార్‌ను వివరణ కోరిన హైకోర్టు
- గుంటూరు జిల్లా ఘటనపైనా ఆరా

సాక్షి, హైదరాబాద్: బోరు బావుల్లో పిల్లలు పడకుండా ఎటువంటి నివారణ చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బోర్లు తవ్వి పూడ్చకుండా వదిలేసే వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో, బోర్లు తవ్వి వదిలేసిన బోర్లు ఎన్ని ఉన్నాయో చెప్పాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం కోరింది. బోరు బావులు నిరుపయోగంగా ఉన్న వాటి వల్ల జరుగుతున్న ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ న్యాయవాది బుద్దారపు ప్రకాశ్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ధర్మాసనం విచారించింది. చేవెళ్ల దగ్గరలోని ఇక్కారెడ్డిగూడలో బోరు బావిలో పడి చిన్నారి మరణించిన ఘటనలో ఆ బోరుబావి యజమానిపై పెట్టిన కేసు విచారణ ఏ దశలో ఉందో తెలపాలని కోరింది. కేసు విచారణకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి బీఆర్ మీనా కోర్టుకు హాజరయ్యారు. గత విచారణ సమయంలో వివరాలు సమర్పించడంలో పొరపాటు జరిగిందని ప్రభుత్వ న్యాయవాది అంగీకరించారు. వేసవిలో బోర్లకు బిగించిన మిషన్లను తొలగించడం వల్ల ఈ ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. ఈ విషయంలో పంచాయతీ రాజ్, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. గుంటూరు జిల్లాలో బాలుడు చంద్రశేఖర్ బోరు బావిలో పడిన ఘటనపై ధర్మాసనం ప్రస్తావించింది. చేవెళ్ల ఘటనలో బోరుబావి యజమానిపై పెట్టిన కేసు పురోగతి వివరాలు తెలపాలని కోరిన ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది.

ఉపయోగంలో లేని బోరుబావులను పూడ్చండి

రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం లేఖ

సాక్షి, అమరావతి: ఉపయోగంలో లేని చేతి పంపులు, బోరు బావులను తక్షణమే పూడ్చి వేయాలని సూచిస్తూ కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసింది. బోరు బావుల గుంతలను అలానే వదిలివేయడం ద్వారా ప్రమాదవశాత్తు చిన్న పిల్లలు అందులో పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, ఈ ప్రమాదాలను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వాలే చొరవ తీసుకోవాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ అదనపు కార్యదర్శి ఏకే శ్రీవాస్తవ అన్ని రాష్ట్రాల గ్రామీణ మంచినీటి సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శులకు లేఖ రాశారు.

22న కృష్ణా బోర్డు సమావేశం

సాక్షి, అమరావతి: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం ఈ నెల 22న విజయవాడలోని జల వనరుల శాఖ కార్యాలయంలో నిర్వహించాలని బోర్డు చైర్మన్ ఎస్కే శ్రీవాత్సవ నిర్ణయించారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈ ఏడాది నీటి లభ్యత తగ్గిపోయిన నేపథ్యంలో జలాల కేటాయింపు, వినియోగంపై ప్రధానంగా చర్చించనున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం, నాగార్జునసాగర్‌లలో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాల కోసం కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్‌ల నుంచి 25- 30 టీఎంసీలు విడుదల చేయించాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించారు.

పాతవారికి పది వేలే.. కొత్తగా ఇచ్చే వారికే రూ.5 వేలు

దేవాదాయ శాఖ కమిషనర్ వివరణ

సాక్షి, అమరావతి: 'అర్చకుల జీతాల్లో కోత' శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై కమిషనర్ అనురాధ స్పందించారు. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేసే అర్చకులకు రూ.10 వేల కనీసం వేతనం చెల్లించడానికి 2016 జనవరి 16న ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో 23,834 ఆలయాలు దేవాదాయ శాఖ పరిధిలో ఉండగా.. ఇప్పటి వరకు 923 మంది అర్చకులకు రెన్యుమరేషన్ నిధి నుంచి నెలకు కనీసం రూ.10 వేల చొప్పున వేతనం అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. ఎక్కువ మంది అర్చకులకు ఈ పథకం కింద లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతో జులై 6న జరిగిన సమావేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అర్చకులకు కనీసం రూ.10 వేల వేతనం చెల్లించడంపై చర్చ జరిగినట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ పథకం అమలు చేస్తున్న 923 మంది మినహా మిగిలిన గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం లేని ఆలయాల్లో పనిచేసే అర్చకులకు రెన్యుమరేషన్ నిధి నుంచి లేదంటే ధూపదీప నైవేద్యం పథకం ద్వారా కనీసం రూ.5 వేలు చెల్లించడంపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఇప్పుడు రూ.10 వేల వేతనం పొందుతున్న 923 మందికి జీతాల్లో కోత ఉండదని స్పష్టం చేశారు.

అర్చకులకు కనీసం రూ.10 వేల వేతనమివ్వాలి

బ్రాహ్మణ ఫెడరేషన్ యువజన విభాగం అధ్యక్షుడు రవికుమార్

సాక్షి, అమరావతి: ఆదాయం లేని గుడిలో పనిచేసే అర్చకులందరికీ కనీసం రూ.10వేల వేతనం ఇవ్వాలని ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ యువజన విభాగం అధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్ డిమాండ్ చేశారు. లేదంటే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో తెచ్చిన దేవాదాయ శాఖ చట్టాన్నైనా అమలు చేయాలని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే అర్చకులందరికీ ఒకే రకమైన పని ఉంటుందని, అలాంటప్పుడు వారి మధ్య వేతనాల్లో, హక్కుల్లో వ్యత్యాసం ఎందుకని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే చేష్టలకు పొంతన లేదన్నారు. అర్హులైన బ్రాహ్మణులందరికీ ఇంటిస్థలం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలోప్రకటించి ఇప్పటి వరకూ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. అర్చకుల వేతనాల కోత నిర్ణయాన్ని విరమించుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

కసాయి 'తల్లి'..

- కన్నకూతురిని వ్యభిచార కూపంలోకి నెట్టేందుకు యత్నం
- తల్లి వేధింపులు భరించలేక పారిపోయిన బాలిక
- నిందితురాలితో పాటు ఆమెకు సహకరించిన వారు అరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రావణి, పక్కన సీఐ సాహేరాబేగం, ఎస్సై. వారి వెనుక బాలిక తల్లి, నిందితులు

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్): నవమాసాలు మోసి కనిపెంచిన కన్నతల్లే కసాయిగా మారింది.. డబ్బు కోసం కడుపున పుట్టిన బిడ్డనే వ్యభిచార కూపంలోకి నెట్టేందుకు ప్రయత్నించింది. తప్పుడు పనులు చేయనని వేడుకొన్నా.. ఆరోగ్యం సహకరించడం లేదమ్మా అని బతిమాలుకున్నా.. ఏమాత్రం జాలి చూపలేదు. కన్నతల్లే గుండె పగిలేలా బాధిస్తుండడంతో తట్టుకోలేని ఆ కూతురు ఇంటి నుంచి పారిపోయింది. కృష్ణా జిల్లా నున్న రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. గొట్టం మణి (35) అనే మహిళకు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఓ వ్యక్తితో పదహారేళ్ల కిందట వివాహమైంది. కూతురు పుట్టినప్పటి నుంచీ మణి ప్రవర్తనలో మార్పు వచ్చింది. దీంతో మణిని ఆమె భర్త విడిచిపెట్టి వెళ్లిపోయాడు. మణి అక్కడ్నుంచి కూతురిని తీసుకొని పాయకాపురం ఉడా కాలనీకి వచ్చేసింది. ఈ మధ్య కాలంలో మరో వ్యక్తిని పెళ్లి చేసుకోగా.. అతను కూడా ఆమె ప్రవర్తన నచ్చక వదిలి పెట్టాడు. అనంతరం పాత రాజరాజేశ్వరీపేటకు చెందిన దువ్వె మల్లికార్జునరావుతో సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో కుమార్తెను వ్యభిచారం కూపంలోకి నెట్టడం ద్వారా డబ్బులు సంపాదించాలనుకుంది. ఇందుకు ఆ బాలిక అంగీకరించకపోవడంతో మల్లికార్జునరావుతో కలసి హింసించడం మొదలుపెట్టింది. వారు పెట్టే బాధలు భరిం చలేక ఆ బాలిక తన స్నేహితుడైన లీలాకృష్ణతో కలసి జూన్‌లో ఇంటి నుంచి పారిపోయి అతన్నే వివాహం చేసుకుంది.

పోలీసులకు ముప్పతిప్పలు

కాగా, కూతురు ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మణి నున్న రూరల్ పోలీసులకు జూన్ నెలలో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కూతురు గురించి వివరాలు అడుగుతుంటే మణి సరైన సమాధానాలు చెప్పక పోవడంతో.. అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను విచారించడం మొదలుపెట్టారు. ఈక్రమంలో పొంతన లేని సమాధానాలు చెప్పడమే కాకుండా.. గుట్టుచప్పుడు కాకుండా రెండు మూడు ప్రాంతాలకు మకాం మార్చేసింది. స్థానికుల సహకారంతో ఆమె కూతురి వివరాలను సేకరించిన పోలీసులు.. ఆ బాలిక ఆచూకీ కనిపెట్టారు. ఆమె చెప్పిన విషయాలు విని వారు ఒక్కసారిగా అవాక్కయ్యారు. బాలిక ఫిర్యాదు మేరకు తల్లి మణితో పాటు ఆమెకు సహకరించిన మల్లికార్జునరావు, లీలాకృష్ణలను అరెస్టు చేశారు. వారిని ఏసీపీ శ్రావణి బుధవారం మీడియా ముందు ప్రవేశపెట్టారు.

జయంతిని వర్ధంతి అన్న మంత్రి అచ్చెన్నాయుడు

మంత్రి లోకేశ్ సహచర్యంతో అలా అన్నానన్న మంత్రి



గుంటూరు వెస్ట్: స్వాతంత్య్ర సమరయోధుడు, బీద బడుగుల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని మంత్రి అచ్చెన్నాయుడు వర్ధంతి అనడమేకాక, వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందంటూ వ్యాఖ్యానించడం దుమారం రేపింది. మంత్రి వ్యాఖ్యలతో అక్కడ ఉన్నవారంతా అవాక్కయ్యారు. సర్దార్ గౌతు లచ్చన్న 108వ జయంతి వేడుకలు బుధవారం గుంటూరు జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. నగరంలోని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోనూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అచ్చెన్నాయుడు విలేకరులతో మాట్లాడుతూ.. గౌతు లచ్చన్న వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దీంతో పక్కన ఉన్న సహచరులు మంత్రి వ్యాఖ్యలను సరిచేశారు. దీనిపై మంత్రి అచ్చెన్న స్పందిస్తూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు, రాష్ట్ర మంత్రి లోకేశ్ గతంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని వర్ధంతి అని సంబోధించారని, ఆయన సాహచర్యం వల్ల తనకు కూడా అలానే వచ్చిందని వ్యాఖ్యానించారు. దీంతో అక్కడున్న వారంతా నవ్వుకున్నారు. సాక్షాత్తూ రాష్ట్ర మంత్రులకు జయంతికి, వర్ధంతికి తేడా తెలియకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు.

కాకినాడ కార్పొరేషన్‌పై నేడు హైకోర్టు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ వార్డుల పునర్విభజన జీవో, ఎన్నికల నోటిఫికేషన్లను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాల్లో ఉమ్మడి హైకోర్టు తన నిర్ణయాన్ని గురువారం వెల్లడించనుంది. ఈ కేసుల్లో బుధవారమే హైకోర్టు తన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని తొలుత వార్తలు రాగా న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేయనున్నారు. కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు చేస్తూ పురపాలకశాఖ ఈ నెల 2న జారీ చేసిన జీవో, తద్వారా 3వ తేదీన ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేసిన కేసుల్లో వాద ప్రతివాదనలు ఇప్పటికే ముగియగా తీర్పును హైకోర్టు గురువారం వెల్లడించనుంది.

కాపులను బీసీల్లో చేర్చితే యుద్ధమే

తెలంగాణ టీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: కాపులను బీసీల్లో చేర్చొద్దని తెలంగాణ టీడీపీ శాసనసభ్యులు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. ఈ చర్యతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. బుధవారం బీసీ భవన్‌లో జరిగిన బీసీ సంఘాల కోర్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో మైనారిటీలను బీసీల్లో చేర్చిన సందర్భంలో విద్య, ఉద్యోగాల్లో మాత్రమే అవకాశం కల్పిస్తామని అప్పటి ప్రభుత్వం చెప్పినప్పటికీ, హైకోర్టు తీర్పుతో పరిస్థితి తారుమారైందన్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో కాపులను బీసీల్లో చేర్చుతామని, విద్య, ఉద్యోగాల్లో మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం ఆచరణలో అమలు కాదన్నారు. రాజకీయ ఒత్తిళ్లు, లబ్ధికోసం రిజర్వేషన్లు నిర్ణయించవద్దని, అలాచేస్తే బీసీ కులాలన్నీ ప్రభుత్వంపై యుద్ధం చేస్తాయని హెచ్చరించారు.

జీఎస్‌టీ రిటర్నులకు గడువు 4 రోజులే

- ఇంకా 10 శాతం కూడా దాఖలు కాని జీఎస్‌టీఆర్ 3బీ రిటర్నులు
- వ్యాపారుల్లో తొలగని సందేహాలు
- చివరిక్షణంలో సర్వర్‌పై ఒత్తిడి పెరుగుతుందన్న ఆందోళనలో అధికారులు

సాక్షి, అమరావతి: జీఎస్‌టీ పరిధిలో ఉన్న వ్యాపారులు తొలిసారిగా రిటర్నులు దాఖలు చేయడానికి ఇక కేవలం నాలుగు రోజులు మాత్రమే గడువు మిగిలింది. జూలై నెల లావాదేవీలకు సంబంధించి సరళమైన రిటర్ను జీఎస్‌టీఆర్ 3 బీని ఆగస్టు 20వతేదీ లోగా దాఖలు చేయాలి. ప్రతి నెలా దాఖలు చేయాల్సిన జీఎస్‌టీఆర్ 1, 2, 3 రిటర్నులను జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తొలి రెండు నెలలకు మినహాయింపు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ మూడు రిటర్నులు స్థానంలో మొదటి రెండు నెలలు జీఎస్‌టీఆర్ 3బీ పేరుతో సరళమైన రిటర్నులను ప్రవేశపెట్టారు.



జీఎస్‌టీ పరిధిలో రెండు లక్షల మంది

జూలై నెల రిటర్నులు దాఖలు చేయడానికి గడువు సమీపిస్తున్నా ఇప్పటికీ వ్యాపారుల్లో సరైన అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. రాష్ట్రంలో సుమారుగా రెండు లక్షల మంది జీఎస్‌టీ పరిధిలో ఉండగా ఇప్పటి వరకు కేవలం 10 శాతం మంది మాత్రమే రిటర్నులు దాఖలు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. రిటర్నుల దాఖలుపై బుధవారం విజయవాడలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వెళ్లివచ్చినా ఇంకా పలు సందేహాలు తీరలేదని, మరోవైపు గడువు ముంచుకురావటంతో ఆందోళన చెందుతున్నట్లు రిటైల్ చైన్ సంస్థ ప్రతినిధి ఒకరు వాపోయారు. ఇప్పటికీ సాఫ్ట్‌వేర్ పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదని, సర్వర్ డౌన్ అవుతోందని మరో వ్యాపారి వాపోయారు. ఆన్‌లైన్ ద్వారా ఈవే బిల్లులు తీసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇప్పుడు రిటర్నుల్లో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

అయితే చివరి రోజు అందరూ ఒకేసారి రిటర్నులు దాఖలు చేయడానికి ప్రయత్నిస్తే సర్వర్‌పై భారం పెరుగుతుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏ రిటర్ను ఎప్పుడు దాఖలు చేయాలి?

ఫాం	జూలై నెలవి	ఆగస్టు నెలవి
జీఎస్‌టీఆర్–3బి	ఆగస్టు 20	సెప్టెంబర్ 20
జీఎస్‌టీఆర్–1	1–5 సెప్టెంబర్	16–20 సెప్టెంబర్
జీఎస్‌టీఆర్–2	6–10 సెప్టెంబర్	21–25 సెప్టెంబర్
జీఎస్‌టీఆర్–3	11–15 సెప్టెంబర్	26–30 సెప్టెంబర్

యూఎంటీసీఎల్‌కు విజయవాడ డీపీఆర్ కాంట్రాక్టు

సాక్షి, అమరావతి: విజయవాడలో ఇంటిగ్రేటెడ్ ప్రజా రవాణా, మోటారు రహిత రవాణా వ్యవస్థలు నెలకొల్పటంపై సవివర నివేదిక (డీపీఆర్) రూపకల్పన కాంట్రాక్టును గుర్గావ్‌కు చెందిన అర్బన్ మాస్ ట్రాన్సిట్ కంపెనీ లిమిటెడ్ (యూఎంటీసీఎల్) కు అప్పగించారు. ఈమేరకు మున్సిపల్, పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరానికి మెట్రో రైలు కంటే ఈ రవాణా వ్యవస్థలే మేలని అమరావతి మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో డీపీఆర్ రూపకల్పనకు టెండర్లు పిలవగా మూడు కంపెనీలు బిడ్లు దాఖలు చేశాయి. యూఎంటీసీఎల్ తక్కువగా 98.05 లక్షలకు కోట్ చేయడంతో డీపీఆర్ తయారీ కాంట్రాక్టును ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎవరిని ఓడించాలో కాపు జాతికి తెలుసు

- నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో లబ్ధిపొందాలనే కాపులతో బాబు సమావేశం
- ఉద్యమాన్ని అణచివేస్తే కాపు జాతి చూస్తూ ఊరుకోదు
- చంద్రబాబుపై కాపు ఉద్యమనేత ముద్రగడ ధ్వజం

కిర్లంపూడి: నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో విజయం సాధించాలనే తాపత్రయంతోనే సీఎం చంద్రబాబు సోమవారం విజయవాడలో కాపులతో సమావేశం నిర్వహించి కాపుల చెవిలో పెద్ద క్యాబేజీ పెట్టారని మాజీ ఎంపీ, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఆరోపించారు. బుధవారం తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడిలోని స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నంద్యాల ఎన్నికలో ఎవరిని ఓడించాలో తెలుసుకోలేని స్థితిలో కాపు జాతి లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రిజర్వేషన్లు కల్పిస్తామని దేహీ దేహీ అని ఓట్లు అడుక్కుని, కాపు జాతి ఓట్లతో అందలమెక్కి.. ఇప్పుడు తమని ఎండలో నిలబెట్టి బాబు సుఖాలు పొందుతున్నారని మండిపడ్డారు. విజయవాడ సమావేశంలో శుభవార్త చెబుతారనుకుంటే రెండోసారి తమ చెవిలో పెద్ద క్యాబేజీ పెట్టారని చంద్రబాబును ఉద్దేశించి అన్నారు. హామీలు అమలు చేయాలని గతనెల 26న నిరవధిక



పాదయాత్ర తలపెడితే పోలీసులతో నిర్బంధించడం, కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. 'మీరు అమెరికా వెళ్లి మీ సామాజిక వర్గంతో సమావేశం పెట్టుకోవచ్చా? మేం మాత్రం పెట్టుకోకూడదా?' అంటూ మండిపడ్డారు. 'మా వెనుక ఎవరో ఉండి ఉద్యమాన్ని నడిపిస్తున్నారని మాట్లాడిస్తున్నారు.. గతంలో కాంగ్రెస్ పాలనలోనూ ఇదే విధంగా ఉద్యమం చేశా.. అప్పుడు నా వెనుక ఉండి మీరు ఉద్యమం నడిపించారా' అని నిలదీశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే కాపు జాతి ఊరుకోదని హెచ్చరించారు.

పాదయాత్రను మళ్లీ అడ్డుకున్న పోలీసులు

మాజీ ఎంపీ, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తలపెట్టిన పాదయాత్రను బుధవారం కూడా పోలీసులు అడ్డుకున్నారు. జేఏసీ నాయకులు, కాపు నేతలతో కలిసి నల్ల స్టిక్కర్లు చేతబూని తన స్వగృహం నుంచి పాదయాత్రకు బయలుదేరిన అతడిని గేటు వద్దే పోలీసులు అడ్డుకున్నారు. పాదయాత్రకు అనుమతి లేదని స్పష్టం చేశారు. దీనిపై ముద్రగడ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తక్షణమే పాదయాత్రకు అనుమతినివ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వాసిరెడ్డి యేసుదాసు, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాశ్, తుమ్మలపల్లి రమేశ్, గౌతు స్వామి, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించండి

గవర్నర్‌కు ఏపీ బీసీ సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని గవర్నర్ నరసింహన్‌కు ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో గవర్నర్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఉదయ్‌కిరణ్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను యాభై శాతం పెంచేందుకు అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని, బీసీ సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం పలు రిజర్వేషన్ల ప్రక్రియను తెరపైకి తెచ్చి కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

విద్యుత్ ఉద్యోగుల ఉద్యమ బాట

- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్
- ఏకమైన 8 జిల్లాల కాంట్రాక్ట్ ఉద్యోగులు
- రేపు తిరుపతిలో భారీ బహిరంగ సభ, ర్యాలీ

సాక్షి ప్రతినిధి, తిరుపతి: రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న విద్యుత్ ఉద్యోగులు మళ్లీ ఉద్యమ బాట పట్టారు. ఈసారి అన్ని జిల్లాల ఉద్యోగులనూ కలుపుకుని పెద్ద ఎత్తున నిరసన గళం వినిపించేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ సంస్థలో విలీనం చేయాలన్నదే వీరి ప్రధాన డిమాండ్. గడిచిన ఆరేళ్లుగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని, ఇకపై తాడోపేడో తేల్చుకుంటామని ఏపీ కాంట్రాక్ట్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ స్పష్టం చేస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 18న తిరుపతి తుడా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. అలాగే శాంతియుత ర్యాలీ చేపట్టి ఎస్పీడీసీఎల్ సీఎండీ దొరకు వినతి పత్రం సమర్పించనుంది.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి...

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 24 వేల మంది కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగులు ఉన్నారు. సబ్‌స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్లు, కంప్యూటర్ అసిస్టెంట్లు, వాచ్‌మెన్లు, డ్రైవర్లు, సబ్ ఇంజినీర్లుగా వీరు విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఏళ్ల తరబడి సేవలందిస్తున్నా తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడ్డ ఉద్యోగులు ఆరేళ్లుగా ఆందోళనలు చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో వారు ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేసేందుకు మళ్లీ ఆందోళన బాట పట్టారు. ఈ నెల 8న తిరుపతిలో, 28న విశాఖలో బహిరంగ సభలను నిర్వహించనున్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి..

విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి. దాదాపు 20 ఏళ్లుగా పనిచేస్తోన్న డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా ఉంది. కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై సర్కారు సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నాం. లేకపోతే ఆందోళనలు నిర్వహించడం ఖాయం.

– ఎం.శ్రీనివాస్, విద్యుత్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్

ఆరు జిల్లాల్లో తీవ్ర వర్షాభావం: సోమిరెడ్డి

- కర్నూలు, అనంతపురం జిల్లాల్లో సాధారణ వర్షపాతమూ నమోదుకాని వైనం
- రాయలసీమ, ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేయాలి



కర్నూలు (కొండారెడ్డి ఫోర్టు): రాయలసీమతో పాటు ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఆగస్టు 15వ తేదీ వరకు సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 217 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదు అయినట్లు వివరించారు. బుధవారం ఆయన కర్నూలు జిల్లా నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాయలసీమతో పాటు ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో నాలుగు లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగు కాలేదన్నారు. ఇప్పుడు వేరుశనగ విత్తడం మంచిదికాదన్నారు. ప్రత్యామ్నాయంగా అలసంద, ఉలవ, కొర్ర, కంది, పెసర, మినుము, జొన్న, మేతజొన్న మొదలగు పంటలను వేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ విత్తనాలను రూ.105 కోట్లతో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా వంద శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తామన్నారు.

సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు 70 ఎకరాల టీటీడీ భూమి

సాక్షి, అమరావతి: తిరుపతిలో సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) చెందిన 70.11 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో తిరుపతిలో సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతి తెలిపింది. కేటాయించిన భూమికి లీజు ధర నిర్ణయాధికారం టీటీడీకి వదిలివేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ జీవో నంబర్ 365 జారీ చేశారు.

సాక్షి
గురువారం, ఆగస్టు, 17


దళితులంటే చులకనా!

ఏడు పదుల స్వాతంత్ర్య సంబరాలు దేశవ్యాప్తంగా మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మంత్రి ఆదినారాయణ రెడ్డి దళితులను అత్యంత దారుణంగా కించపరుస్తూ మాట్లాడటానికి స్వాతంత్ర్య దినోత్సవం రోజునే ఎంచుకున్నారు. మరోపక్క అర్థంతరంగా తనువు చాలించిన దళిత విద్యార్థి రోహిత్ వేముల మరణంపై నియమించిన న్యాయ విచారణ కమిషన్ వివాదాస్పద నివేదికను బయటపెట్టడానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ స్వాతంత్ర్య దినోత్సవం మరుసటి రోజును ముహూర్తంగా ఎంచుకుంది. ఆ నివేదిక రోహిత్ బలవన్మరణానికి ఆయనే తప్ప అన్యులెవరూ బాధ్యులు కారని సెలవిచ్చింది. అంతేకాదు...ఆయన దళితుడు కాడని నిర్ధారించింది. దురహంకారాన్ని ప్రదర్శించడంలో, ఎవరినైనా ఏమైనా అనడంలో మంత్రి ఆదినారాయణ రెడ్డి ఆరితేరారు. 'దళితులు శుభ్రంగా ఉండరు. సక్రమంగా చదువుకోరు. వారు అభివృద్ధి చెందకపోవడానికి వారే కారణం'అంటూ ఒక సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఆ దురహంకారంలో నుంచి పుట్టుకొచ్చినవే. పైగా 'అంబేద్కర్ కేవలం పదేళ్లు మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తే 70 ఏళ్లవుతున్నా అవి కొనసాగుతున్నాయ'నడం ద్వారా తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొన్నాళ్లక్రితం ఇలాంటి మాటలే మాట్లాడారు. 'ఎస్సీలలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా?' అంటూ అందరినీ విస్మయపరిచారు. అధికారంలో ఉన్నవారు ఏం చేసినా, మాట్లాడినా పర్యవసానాలేమీ ఉండబోవన్న భరోసాయే ఇలాంటి అతివాగుడుకు చోటిస్తోంది. స్వల్ప కారణాలతో సామాన్యులపై విరుచుకుపడే చట్టాలు అధికారంలో ఉన్నవారి ముందు పెంపుడు జంతువుల్లా ఒదిగిపోతాయి.

రోహిత్ వేముల విషాదాంతంపై విచారణ జరిపిన జస్టిస్ రూపన్‌వాల్ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి రిటైరైనవారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఉత్తర్వుల మేరకు నిరుడు ఫిబ్రవరిలో ఏర్పాటైన ఈ కమిషన్ వాస్తవానికి ఆ ఏడాది ఆగస్టులోనే ఆ శాఖకు నివేదిక సమర్పించింది. ఆ తర్వాత మీడియాలో కమిషన్ నిర్ధారణలంటూ అడపా దడపా వార్తలొచ్చాయి. మొన్న ఫిబ్రవరిలో ఒక పౌరుడు నివేదికను బయటపెట్టాలంటూ సమాచార హక్కు చట్టం కింద కోరితే ఆ శాఖ అందుకు నిరాకరించింది. నివేదిక పరిశీలనలో ఉన్నదని జవాబిచ్చింది. ఏడాది వ్యవధి తర్వాత ఎట్టకేలకు ఇన్నాళ్లకు అది వెలుగు చూసింది. రోహిత్ బలవన్మరణానికి కేంద్రమంత్రులు స్మృతి ఇరానీ, బండారు దత్తాత్రేయ, కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ పొదిలె అప్పారావు బాధ్యులు కారని ఆ నివేదిక నిర్ధారించింది. చనిపోవాలనుకున్నది ఆయన 'సొంత నిర్ణయం' అని తేల్చింది. అందుకు ఆ యువకుడు వదిలి వెళ్లిన ఉత్తరమే తార్కాణమన్నది. తన చావుకు ఎవరూ బాధ్యులు కారంటూ ఆయన రాసిన వాక్యాలను ఉదహరించింది. రోహిత్ ఆత్మహత్యకు ముందు ఆయన, ఆయనతోపాటు మరో నలుగురు సస్పెన్షన్‌లో ఉన్నారు. దానిపై వారు పోరాడుతున్నారు. దళితులమైనందుకే తమకు అన్యాయం జరుగుతున్నదని ఎలుగెత్తారు. అయినా వర్సిటీ అధికారులు వివక్ష చూపారనడానికి సంబంధించిన ఆధారాలు ఎవరూ ఇవ్వలేదని కమిషన్ అంటున్నది.

రూపన్‌వాల్ కమిషన్‌కు అప్పజెప్పిన విచారణాంశాలు రెండు. అందులో ఒకటి రోహిత్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులేమిటో, అందుకు బాధ్యులెవరో తేల్చడం. రెండోది– విద్యార్థుల ఇబ్బందుల పరిష్కారానికి వర్సిటీ అనుసరిస్తున్న విధానాలను సమీక్షించి అవసరమైన ఉపశమన చర్యలు సూచించడం. ఈ రెండూ కాకుండా రోహిత్ వేముల కులమేమిటో ఆరా తీసే బాధ్యతను కమిషన్ ఎందుకు నెత్తికెత్తుకున్నదో అనూహ్యం. కుల నిర్ధారణతోసహా విచారణాంశాల పరిధిని మించి చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకోబోమని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ వర్గాలు చెప్పినట్టు నిరుడు ఆగస్టులో ఒక వార్తా సంస్థ తెలిపింది. కానీ ఇప్పుడా శాఖ అధికారిక వైఖరేమిటో వెల్లడి కాలేదు. కులానికి సంబంధించినంత వరకూ నిర్ధారణ చేయాల్సింది రెవెన్యూ విభాగం. అది పలు సందర్భాల్లో రోహిత్ వేములకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేసింది. రోహిత్ ఆత్మహత్య ఉదంతం తర్వాత జాతీయ ఎస్సీ కమిషన్ గుంటూరు జిల్లా కలెక్టర్ నుంచి నివేదిక కోరింది. కలెక్టర్ సైతం రోహిత్ వేముల షెడ్యూల్ కులానికి చెందినవాడని అప్పట్లో నిర్ధారించారు. పైగా దాదాపు 20 ఏళ్లక్రితం ఇచ్చిన కీలకమైన తీర్పులో అమ్మ కులం బిడ్డలకు వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రోహిత్ తల్లి రాధికను షెడ్యూల్ కులానికి చెందిన కుటుంబం పెంచుకుంది. వడ్డెర కులానికి వ్యక్తితోనే ఆమెకు వివాహమైనా ఆ దంపతులు అనంతర కాలంలో విడిపోయారు. అటుపై ఆమె దళిత వాడలోనే పిల్లలను పెంచారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకోకుండా... తన పరిధిలో లేని అంశంలోకి వెళ్లి రోహిత్‌ను వడ్డెర కులస్తుడని కమిషన్ ఎలా నిర్ధారించిందో అనూహ్యం. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన గుంటూరు జిల్లా యంత్రాంగం జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఒక రకంగా, కమిషన్‌కు మరో విధంగా నివేదిక ఇస్తుందనుకోవడానికి లేదు. లోపం ఎక్కడ జరిగిందో కనీసం కేంద్ర ప్రభుత్వమైనా తెలియజేయడం ధర్మం.

న్యాయమూర్తుల నిష్పాక్షికత గురించి చెబుతూ న్యాయం చేయడమే కాదు... చేసినట్టు కనబడాలని తొమ్మిది దశాబ్దాలక్రితం బ్రిటన్ హైకోర్టు న్యాయమూర్తి ఒకరు చెప్పారు. దాన్ని ఈనాటికీ ఎవరూ సరిగా అవగాహన చేసుకోవడంలేదని రూపన్‌వాల్ నివేదిక గమనిస్తే అర్థమవుతుంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోట బురుజులపై నుంచి ప్రసంగించిన ప్రధాని కశ్మీర్ సమస్యకు ఆత్మీయ ఆలింగనమే తప్ప తూటాలో, దూషణలో పరిష్కారం కాదన్నారు. దళితుల విషయంలోనూ ఇలా ప్రత్యేకించి చెబితే తప్ప, కఠినంగా వ్యవహరిస్తే తప్ప ఇప్పుడున్న పరిస్థితులు మారవా?




న్యాయం అందనిచోట,
దారిద్ర్యం కుళ్లబొడుస్తున్నచోట,
మనిషి హక్కు పట్ల నిర్లక్ష్యం
రాజ్యమేలుతున్న చోట..
వ్యక్తులు గానీ, వారి జీవితాలు
గానీ సురక్షితంగా ఉండవు.

– ఫ్రెడరిక్ డగ్లస్
ఆఫ్రికన్–అమెరికన్ సంస్కర్త

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి బ.దశమి ఉ.11.02 వరకు, తదుపరి ఏకాదశి నక్షత్రం మృగశిర రా.10.30 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం ఉ.5.21 నుంచి 6.50 వరకు, దుర్ముహూర్తం ఉ.9.58 నుంచి 10.48 వరకు, తదుపరి ప.3.00 నుంచి 3.51 వరకు, అమృతఘడియలు ప.2.17 నుంచి 3.46 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం : 6.23
రాహుకాలం : ప 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	4.44	మగ్రీబ్	6.41
జొహర్	12.20	ఇషా	7.56
అసర్	4.47		

శుష్క వాగ్దానాలే సంక్షేమమా?



మల్లెపల్లి లక్ష్మయ్య

మోదీ ప్రభుత్వం దేశంలో ఎస్సీ, ఎస్టీల ఉనికి ఉన్నట్టే భావించడంలేదు. రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాలను పట్టించుకోవడం లేదు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి అంశమే మోదీ ప్రభుత్వం ఎజెండాలో లేకుండా పోయింది. పైగా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం కేటాయిస్తున్న అరకొర నిధులు ఖర్చు కాకుండా మిగిలిపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి అంబేడ్కర్ పట్ల నిజంగానే గౌరవం, భక్తి ఉన్నట్లయితే ఆయన 40 ఏళ్ల శ్రమించి రూపొందించిన పథకాలను, అహర్నిశలు తపనపడి నిర్మించిన రాజ్యాంగాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలి.

''స్వరాజ్యం నా జన్మహక్కు'' బాలగంగాధర్ తిలక్ నినాదం. ఇప్పుడు స్వతంత్ర భారతంలో సురాజ్యం నా జన్మహక్కు అనేదే నినాదం కావాలి. ప్రభుత్వాలు బాధ్యతలను, పౌరులు తమ విధులను నిర్వర్తించాలి. దివ్య, భవ్య భారత నిర్మాణమే మనందరి ధ్యేయం కావాలి'' భారత ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై నుంచి ఏడు పదుల స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల సందర్భంగా పలికిన వ్యాఖ్యలివి. ఈ మాటలకీ, దేశంలో అమలు జరుగుతున్న అంశాలకీ ఏదైనా పొంతన ఉన్నదా? అని ఆలోచిస్తే, కచ్చితంగా లేదనే చెప్పాలి. అభివృద్ధి ధ్యేయంగా అదే ఏకైక నినాదంగా అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఎంత మాత్రం ఆ దిశగా అమలు జరుగుతున్న దాఖలాల్లేవు. ముఖ్యంగా దళిత, ఆదివాసుల జీవితాలు మరింత దుర్భర పరిస్థితిలోకి కూరుకుపోతున్నాయి. గత ఎన్నో పోరాటాల ఫలితంగా, అంబేడ్కర్ లాంటి ఎందరో త్యాగధనుల ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న హక్కులనుసైతం నరేంద్రమోదీ ప్రభుత్వం రకరకాల పద్ధతుల్లో రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నది. గత మూడేళ్ళలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దళిత, ఆదివాసీ ప్రజల కోసం ప్రత్యేకించి ఎటువంటి పథకాలు ప్రవేశపెట్టకపోగా, అంబేడ్కర్ నామజపంతోనే దళితులను బుజ్జగించే ప్రయత్నానికి ఒడిగడుతున్నది.

నోటుమీది బొమ్మ ఆకలి చల్లార్చేనా?

ఇటీవల కొంత మంది కరెన్సీ నోట్లపైన అంబేడ్కర్ బొమ్మని ముద్రించాలనే నినాదాన్ని ముందుకు తెస్తున్నారు. అందుకోసం క్యాంపెయిన్‌ను సైతం మొదలుపెట్టారు. దళితులు, ఆదివాసీల కోసం కేటాయించిన నిధులను కూడా సరిగా ఖర్చు చేయని మోదీ ప్రభుత్వం... అంబేడ్కర్ సంస్మరణార్థం ఐదు స్థలాలను అభివృద్ధి చేస్తామని ప్రకటించుకొన్నది. అంబేడ్కర్ జన్మించిన మవు, ఆయన ఢిల్లీ నివాసం, అలీపూర్ 26, ఆయన ముంబై నివాసం రాజగృహ, ఆయన బౌద్ధం స్వీకరించిన స్థలం నాగపూర్ దీక్షా భూమి, ఆయన సమాధి ఉన్న ముంబైలోని చైత్యభూమి. అంతేకాకుండా ఆయన లండన్‌లో ఉంటూ చదువుకున్న స్థలాన్ని కూడా స్మారక కేంద్రంగా ప్రకటించారు. దానిని భారత ప్రభుత్వం కొనుగోలు చేసింది. మూడేళ్లలో అంబేడ్కర్‌ను స్మరించడం, అప్పుడప్పుడు ఆయన పేరును ప్రస్తావించడం మాత్రమే నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసింది. ఇప్పుడు ఎవరితోనో అంబేడ్కర్ బొమ్మ కరెన్సీ నోట్ల మీద ముద్రించాలనే చర్చ మొదలు పెట్టించారు. అయితే ఇవేవీ నిజమైన అంబేడ్కర్ భావజాలాన్ని పరివ్యాప్తి చేయలేవన్నది నగ్న సత్యం. ఉదాహరణకు అమెరికా చరిత్రనే తీసుకుంటే అమెరికా కరెన్సీ 20 డాలర్ల నోటుపైన ఉన్న మాజీ అధ్యక్షులు ఆండ్రూ జాక్సన్ బొమ్మను తొలగించి, నల్లజాతి ప్రజల హక్కుల కోసం పరితపించిన, జీవితాంతం పోరాడిన పౌరహక్కుల నాయకురాలు హరియత్ ట్యూబ్‌మన్ బొమ్మను పెడుతున్నట్టు ఏప్రిల్ 20, 2016న అమెరికా ట్రెజరీ సెక్రటరీ జాకబ్ ల్యూ ప్రకటించారు. అయితే ఆ నిర్ణయం నల్లజాతి ప్రజల జీవితాల్లో ఎటువంటి మార్పులు తీసుకురాలేదనడానికి ఇప్పటి పరిస్థితే తార్కాణం. ఓట్ల కోసమే తప్ప, నిజంగా అణగారిన ప్రజల కోసం ప్రభుత్వాలు పనిచేస్తున్నట్టు లేదనడానికి నల్లజాతి ప్రజలు ఎదుర్కొంటున్న వివక్ష, ఆకలి అవమానాలే సాక్ష్యాలు. నూటికి 30 శాతం మంది నల్లజాతి ప్రజలు తినడానికి రొట్టెముక్కకు కూడా నోచుకోలేకపోతున్నారని ''బ్రెడ్ ఫర్ వరల్డ్ ''అనే సంస్థ అధ్యయనం వెల్లడించింది. బతకడానికి వేరే దారే లేక పలువురు నల్లజాతి యువతీ యువకులు మత్తు మందు వ్యాపారంలో పావులుగా మారి జైళ్లలో మగ్గుతున్నారని పలు నివేదికలు తెలిపాయి.

కొత్త కోణం



అంబేడ్కర్ జపం కాదు, ఆయన బాటన సాగండి

అందుకే ఓ రచయిత చెప్పినట్టు అంబేడ్కర్ ఫొటోని కరెన్సీ నోట్లపై ముద్రించడం కాదు, కనీసం జీవితానికి సరిపోయేంత కరెన్సీ దళిత, ఆదివాసుల జేబుల్లో ఉండేటట్టు చేస్తే మంచిది. దళితుల ఆర్థిక, సామాజిక అభివృద్ధిని నిజంగానే కోరితే, అంబేడ్కర్ పూజలకు బదులు ఆయన నిర్దేశించిన మార్గాన్ని అనుసరిస్తే మంచిది. దళితుల సామాజిక సమానత్వం కోసం, రాజకీయ ఆర్థిక సాధికారత కోసం అంబేడ్కర్ తన జీవిత కాలాన్నంతటినీ వెచ్చించారు. దళితుల రాజకీయ సాధికారత కోసం బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక ఓటింగ్ విధానం... దళితులను హిందువులపైన ఆధారపడకుండా స్వతంత్రులను చేయగలదన్న అభిప్రాయంతో గాంధీజీ దానికి గండి కొట్టాలని యత్నించి, కృతకృత్యుడయ్యాడు. చివరకు మధ్యే మార్గంగా గాంధీజీ, అంబేడ్కర్‌ల మధ్య కుదిరిన పూనా ఒప్పందంలో తొమ్మిది అంశాలున్నాయి. ఎనిమిది అంశాలు ఓటింగ్, సీట్ల రిజర్వేషన్ తదితర అంశాల మీద ఉండగా, తొమ్మిదవ అంశం మాత్రం అంటరాని కులాల విద్యాభివృద్ధికి సంబంధించినది. ప్రతి రాష్ట్రం తమ బడ్జెట్‌లో తగు నిధులను అంటరాని కులాల విద్యాభివృద్ధికి కేటాయించి ఖర్చు చేయాలని పూనా ఒప్పందంలో స్పష్టంగా పేర్కొన్నారు. దాని ప్రకారమే 1935 భారత ప్రభుత్వ చట్టం అమలులోకి వచ్చిన తరువాత అంటరాని కులాలకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. అర్హతగల షెడ్యూల్డ్ కులాల విద్యార్థులను విదేశీ చదువులకు పంపించారు కూడా. ఇటువంటి విధానాన్ని స్వాతంత్ర్యం తరువాత కూడా కొనసాగించడానికి భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 38, ఆర్టికల్ 46లను చేర్చారు.

రాజ్యాంగంలోని 38వ ఆర్టికల్, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నది. జాతీయ జన జీవితంలో భాగమైన అన్ని సంస్థలు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం కృషి చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కూడా ఆ ఆర్టికల్ స్పష్టం చేసింది. వివిధ వర్గాల ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య, వ్యక్తులు, సామాజిక వర్గాల మధ్య అసమానతలను నిర్మూలించాలని కూడా ఆర్టికల్ 38 సూటిగా ఆదేశించింది. అదేవిధంగా ఆర్టికల్ 46 బలహీన వర్గాల ప్రజల కోసం, ప్రత్యేకించి షెడ్యూల్డ్ కులాలు, తెగల ఆర్థిక విద్యారంగాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అందుకు ప్రభుత్వాలు తగు కార్యక్రమాలను రూపొందించాలని సూచించింది. ఈ ఆర్టికల్ వల్లనే, ఈ రోజు వెనుకబడిన కులాలుగా చెప్పబడుతున్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అవకాశం లభించింది.

సబ్‌ప్లాన్‌ను రద్దు చేసి...

అయితే 1974 వరకు ప్రభుత్వాలు రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఎటువంటి విధానాలనూ చేపట్టలేదు. ఆయా వర్గాలకు ప్రత్యేకమైన శాఖలు కానీ, కార్యక్రమాలుగానీ రూపొందించలేకపోయాయి. 1960 దశకం చివరిభాగంలో, 1970 దశకం తొలి భాగంలో దేశవ్యాప్తంగా నక్సలైటు తిరుగుబాటు రూపంలో ఆదివాసులు, దళితుల పోరాటాలు వెల్లువెత్తాయి. ఆ తర్వాతనే నాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వం ఈ వర్గాల సంక్షేమంపై దృష్టి సారించడం మొదలు పెట్టింది. అందులో భాగంగానే నాటి ప్రభుత్వం ట్రైబల్ సబ్‌ప్లాన్ పేరుతో బడ్జెట్‌లో ప్లాన్ పద్దు నుంచి జనాభా శాతం ఆధారంగా నిధులను కేటాయించడాన్ని 1974లో ప్రారంభించింది. ఆ తరువాత 1980 నుంచి ఎస్సీల కోసం స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్‌ను అమలులోనికి తీసుకొచ్చారు. దాని ద్వారా కొంత మెరుగైన పథకాలు అమలులోకి వచ్చినప్పటికీ నూటికి నూరు శాతం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వాలు ఖర్చు చేయలేదు. పేరుకు మాత్రమే కేటాయింపులు చేసి చేతులు దులుపుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తరువాత 2001లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సబ్‌ప్లాన్ నిధుల అమలు కోసం ఉద్యమం ప్రారంభమైంది. ఆ సంస్థ చొరవతో అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు 11 ఏళ్ల పాటు జరిపిన ఉద్యమం వల్ల 2012 డిసెంబర్ 2న నిధుల ఖర్చు కోసం ఒక చట్టాన్ని తెచ్చారు. అయితే 2017లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నరేంద్రమోదీ ప్రభుత్వం ప్లాన్, నాన్ ప్లాన్ పద్దులను తొలగించడం వల్ల సబ్‌ప్లాన్ చట్టానికి గానీ, ఆ విధానానికి గానీ అర్థం లేకుండా పోయింది. కానీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు చొరవతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సబ్‌ప్లాన్ చట్టం స్థానంలో ఎస్సీ, ఎస్టీ డెవలప్‌మెంట్ ఫండ్ యాక్ట్‌ను తీసుకొచ్చింది. దాని ద్వారా మరొక్కసారి జాతీయ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ నిధుల చట్టం ఆవశ్యకత ముందుకొచ్చింది.

నిధులను మురగబెడుతూ..

అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వంలో మాత్రం ఈ దేశంలో ఎస్సీ, ఎస్టీల ఉనికి ఉన్నట్టే భావించడంలేదు. రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాలను పట్టించుకోవడం లేదు. దానితో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి అంశమే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎజెండాలో లేకుండా పోయింది. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం కేటాయిస్తున్న అరకొర నిధులు కూడా ఖర్చు కాకుండా మిగిలిపోతున్నాయి. 2014–15 సంవత్సరంలో కేంద్ర బడ్జెట్ రూ. 17,63,214 కోట్లు కాగా వారికి కేటాయించింది రూ. రూ. 50,548 కోట్లు. వాస్తవానికి వారి వాటాకు రావాల్సింది రూ. 81,460 కోట్లు. వారికి కేటాయించిన నిధుల శాతం 2.87గా తేల్చారు. 2015–16లో అది 1.47 శాతం, 2016–17లో 1.96 శాతం, 2017–18లో 2.44 శాతం. అదే విధంగా ఎస్టీ సబ్‌ప్లాన్ కూడా అంతకంటే దయనీయంగా ఉంది. 2014–15లో అది 1.84 శాతం, 2015–16లో 1.13 శాతం, 2016–17లో 1.21 శాతం, 2017–18లో 1.49 శాతం కేటాయించారు. ఈ కేటాయింపులను కూడా ప్రధానంగా ఎస్సీ, ఎస్టీల అవసరాలకు పెద్దగా ఉపయోగపడని శాఖలకే అధికంగా కేటాయించారు. ఫలితంగా, 2014–15లో రూ. 39,585 కోట్లు, 2015–16లో రూ. 21,730 కోట్లు, 2016–17లో రూ. 32,168 కోట్లు 2017–18లో రూ. 26,684 కోట్ల రూపాయల నిధులు వీరికి ఉపయోగపడకుండా మురిగిపోయాయి. ఇందులో 78 శాతం పైగా ఇటువంటి పథకాలకే కేటాయించినట్టు లెక్కలు చెపుతున్నాయి.

గత మూడేళ్లలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమం పట్ల చూపుతున్న నిర్లక్ష్యం ఎలాంటిదో పై లెక్కల ద్వారా మనకు అర్థం అవుతుంది. బాబా సాహెబ్ అంబేడ్కర్ పట్ల గౌరవం, భక్తి ఉన్నట్లయితే, ఆయన నలభై సంవత్సరాల పాటు శ్రమించి రూపొందించిన పథకాలను, అహర్నిశలు తపనపడి నిర్మించిన రాజ్యాంగాన్ని అమలు చేయడం ఒక్కటే దళితులు, ఆదివాసుల నిజమైన విముక్తి మార్గం.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు | 97055 66213

అంధకారంలో 'అడవి పూలు'

ఆదివాసీ గ్రామాల్లో జ్వరంతో ఎవరూ చనిపోలేదని, కలుషిత నీరు, నాటుసారా, మృత జంతువుల మాంసం తినడం, మూఢనమ్మకాల వంటి వాటివల్లే వారు చనిపోతున్నారని మంత్రి కామినేని ప్రకటించడంతో గిరిజనుల్లో ఆగ్రహం పెల్లుబికింది.

సందర్భం



యాతం వీరాస్వామి

దేశంలోని వేల కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న అడవుల్లో నివసిస్తున్న గిరిజనులు నాగరిక మానవుడికి పరోక్షంగా ఎంతో వెలుగునిస్తూ ఆధునిక జీవితాన్ని అందుకోలేని అడవిపూలుగా మిగిలిపోతున్నారు. బాధ్యత మర్చిన పాలకులు.. గిరిజనులను కాపాడుకునే మాట అటుంచి కనీసం అర్థం చేసుకోవడంలో కూడా విఫలమయ్యారు. పాలకులకు అడవుల ద్వారా వచ్చే ఆదాయంపై, అడవులను దోచుకుంటున్న స్మగ్లర్ల ద్వారా వచ్చే కాసులపై ఉన్న మోజు గిరిజనుల బతుకులపై ఉండదు. రాష్ట్ర సీఎం చంద్రబాబుకి నెలనెలా కేబినెట్ భేటీల్లో అడవుల ఆదాయం, పంటల ఆదాయం, ఏజెన్సీలో రాజకీయ సమీకరణాలు వంటి వివరాలు తెలుసుకోవడంలో ఉండే శ్రద్ధ.. గిరిజనులకు దూరమైన మౌలిక, ఆరోగ్య వసతులు, తినడానికి కావలసిన రేషన్ సదుపాయాలు వంటివాటిపై లేదని చెప్పడానికి, నేడు ఏజెన్సీ ప్రాంతంలో వ్యాధుల బారినపడిన ఆదివాసుల మరణాలే సాక్ష్యం.

దాదాపు రెండు నెలలనుంచి ఏజెన్సీ ప్రాంతాలైన రంపచోడవరం, జీకే వీధి, చింతపల్లి, పాడేరు, నాతవరం, అరకువేలీ, పెదబయలు వంటి ప్రాంతాల్లో వర్షాలు, తుపానులు, రోగాలు వచ్చినా మారుమూల గ్రామాల్లోని తమను ఎవరూ పట్టించుకోవడం లేదని అక్కడి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఎడతెరపి లేని వర్షాలు కురవడంతో పేద గిరిజనులకు కూలిపనులు లేవు. చేతిలో చిల్లిగవ్వ లేదు. వ్యవసాయ పనులు లేవు. రేషన్ సరఫరా చేసేవారు లేరు. తిండి లేక అన్నమో రామచంద్రా అంటూ రోగాలతో మంచాలపై పస్తులు ఉంటున్నారు. మరోవైపు మలేరియా జ్వరాలు, ఆంత్రాక్స్ ఇంటింటినీ వెంటాడుతోంది. వైద్య సౌకర్యాలు లేవు. పేదలకు అంబులెన్స్ అందుబాటులో లేదు. వర్షాలు వచ్చినప్పుడు, గిరిజనులు చనిపోయినప్పుడే నాయకులకు, అధికార్లకు మౌలిక సదుపాయాల విషయం గుర్తువస్తుంది.

గత నెల చివర్లో కేబినెట్ మీటింగులో అధికారుల నిర్లక్ష్యం వల్లే గిరిజనుల ప్రాణాలు పోతున్నాయని ముఖ్యమంత్రి ఆరోపించడం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ ఏజెన్సీ గ్రామాల్లో కనీస మౌలిక వసతులు లేవని సమాధానమివ్వడం ఒక ఎత్తు అయితే ఆరోగ్యమంత్రి కామినేని వాదన మరొకలా ఉంది. ఆదివాసీ గ్రామాల్లో జ్వరంతో ఎవరూ చనిపోలేదని, కలుషిత నీరు, నాటుసారా, మృత జంతువుల మాంసం తినడం, మూఢనమ్మకాల వంటి వాటివల్లే వారు చనిపోతున్నారని కామినేని ప్రకటించడంతో గిరిజనుల్లో ఆగ్రహం పెల్లుబికింది. ఇది చాలదన్నట్లుగా 60 మంది కుటుంబాలున్న కొండ పైకి రోడ్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు అందించాలా అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. మరైతే విశాఖ, విజయవాడ నగరాల్లోని కొండలపై నివాసముండే ప్రజలకు సకల సౌకర్యాలు ఎలా కల్పించగలిగారు? రాజకీయాల్లో ఉండే వారికి పేదల పట్ల ఉండే అభిప్రాయం ఇదేనా?



ఏజెన్సీలో ఇప్పటి వరకు దాదాపు 101 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. వందలాదిమంది మంచానపడి లేవలేని స్థితిలో ఉన్నట్లు తెలిసింది. జి. మాడుగుల మండలంలో 108కి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ రాకపోవడంతో బాధితుడిని కాపాడలేక పోయామని అక్కడి ప్రజలు చెబుతున్నారు. 108 సిబ్బందిని ప్రశ్నించగా సొలభం–గడుతూరు రోడ్డు పెద్ద గోతులతో అధ్వానంగా ప్రమాదకరంగా ఉండటం, వాహన కండిషన్ సక్రమంగా లేకపోవడంతో నాలుగు నెలల నుంచి అంబులెన్స్ రాకపోకలు నిలుపుదల చేశామన్నారు. ఈ ఏడాది మన్యంలో ఉన్న గిరిజనులకు రక్త పరీక్షలు చేయగా 2,24,973 మంది మలేరియా కేసులు నమోదయ్యాయి. చనిపోయిన వారిలో 12మంది పాఠశాల విద్యార్థులు కూడా ఉన్నారు. దీనితో పాటు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు వ్యాధులతో మాతా మరణాలు 41, శిశు మరణాలు 134 సంభవించాయని వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరించింది.

రాష్ట్రంలో రూ. 2 లకే 20 లీటర్ల మినరల్ వాటర్ అనీ, అన్న క్యాంటీన్లను అమలు చేస్తాననీ చెప్పి దాంట్లో కూడా విఫలమైన చంద్రబాబు కనీసం గిరిజన ప్రాంతాలకైనా మినరల్ వాటర్, అన్న క్యాంటీన్లు, ఉచిత రేషన్, దుప్పట్లు, దోమ తెరలు, విద్యుత్, రోడ్లు, వైద్య సదుపాయాలు కల్పించడంపై దృష్టిపెడితే బాగుంటుంది.

కొసమెరుపు : మన్యంలో వ్యాధులు ప్రబలినప్పుడు విశాఖ కేజీహెచ్ నుండి రోగులను అధ్యయనం చేయడానికి డాక్టర్స్ టీమ్‌గా వెళ్తుంటారు. ఆ టీమ్‌లో ఒక డాక్టరు చెప్పిన ఒక ఉదాహరణ. మన్యంలోని గిరిజన గ్రామాలకు మందులతో ఇద్దరేసి డాక్టర్లు ఒక్కొక్క ప్రాంతానికి వెళ్లి బాధితులను పరిశీలిస్తారు. ఆ సమయంలో మలేరియా ప్రాథమిక దశలో ఉన్నట్లు భావించి సాధారణ కోర్సు 10–14 మాత్రలు 3–5 రోజులకు కోర్సుగా ఇస్తారట. ప్రాథమిక దశలో ఉన్న వారికి క్లోరోక్వినైన్ ఫాస్ఫేట్ మాత్రలు రోజుకు మూడు చొప్పున 3–5 రోజులు కోర్స్ ఇవ్వాలి. ఆ మాత్ర ఖరీదు 15 పైసలు మాత్రమే. కానీ, టీమ్‌లోని డాక్టర్ ఆ బాధితునికి 14 మాత్రలు ఇవ్వండి. మరలా రాము కదా అని చెబితే, 3 మాత్రలు చాలు మావాళ్లు (ఐటీడీఏ) అంతే ఇవ్వమన్నారు అక్కడి సిబ్బంది. ఎప్పుడూ ఇలాగే ఇస్తామన్నారు. మా డాక్టర్లను ఈ మన్యంలోకి రప్పించి, కొన్ని రోజులు ఇక్కడ ఉండటానికి మాకు టీఏ, డీఏలు, వాహన ఖర్చులు వేలకొలది ఖర్చు చేస్తూ... గిరిజన బాధితులకు ఒక 15 పైసలు ఖరీదు చేసే మాత్రలు ఇవ్వడానికి వెనకాడుతున్నారు. ఇదీ ఇక్కడ గిరిజనుల ఆరోగ్యం అన్నారు ఆ డాక్టర్.

వ్యాసకర్త రచయిత, విశ్లేషకుడు | 95816 76918

బంగారు మనిషి

జీవితంలో ఆఖరిసారిగా పోటీలో పాల్గొంటున్న మహావీరుడికి గెలిచిన వీరుడు అక్కడికక్కడే మోకాళ్ల మీద నిలిచి మోకరిల్లాడు. ప్రపంచం నిశ్చేష్టమయింది. ఓ గొప్ప చరిత్ర ముగిసింది.

విశ్లేషణ



గొల్లపూడి మారుతీరావు

అతను ప్రపంచంలోకెల్లా వేగంగా పరిగెత్తగల యోధుడు. తొమ్మిది సంవత్సరాలపాటు ప్రపంచాన్ని దిగ్భ్రాంతుల్ని చేసి, అభిమానుల్ని ఆనందోత్సాహాలతో ఉర్రూతలూగించిన చాంపియన్. అతను ఉస్సేన్ బోల్ట్.

అభిమానుల తృప్తికోసం ఆఖరిసారి పరుగు పందెంలో పాల్గొంటున్నాడు. అభిమానులు గర్వంగా అతని విజయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రపంచం మరొక్కసారి ఆ విశ్వవిజేత చేసే విన్యాసానికి సిద్ధపడుతోంది. కాని ఆ రోజు అతని అడుగు ఒక్క లిప్తకాలం జంకింది. శరీరం మొరాయించింది. ఆఖరి 50 మీటర్లు ఒక జీవితకాలం దూరంగా కనిపించాయి. తనని దాటి ఏనాడూ కాలు కదపలేని ఇద్దరు ముందుకు దూసుకుపోయారు. అతనికి కాదు. వారికే ఇది పెద్ద షాక్. ఇదేమిటి? పెద్దాయన తడబడ్డాడు! 9 సంవత్సరాలపాటు అతనికి ముందు గాలికూడా జొరబడలేని వేగంతో 8 ఒలింపిక్ పతకాలూ, 11 ప్రపంచ చాంపియన్ పతకాలూ గెలుచుకుని ఎన్నోసార్లు తనని తానే జయించుకుని రికార్డులు సృష్టించిన ఒక వీరుడు ఆ రోజు కేవలం మూడు సెకెన్లు ఆలస్యమయాడు. అతని ముందు ఇద్దరు నిశ్చేష్టులయి, నిస్సహాయంగా ముందుకు దూకారు. అక్కడితో కథ ముగియలేదు. జీవితంలో ఆఖరిసారిగా పోటీలో పాల్గొంటున్న మహావీరుడికి గెలిచిన వీరుడు అక్కడికక్కడే మోకాళ్ల మీద నిలిచి మోకరిల్లాడు. ప్రపంచం నిశ్చేష్టమయింది. ఓ గొప్ప చరిత్ర ముగిసింది.

9 సంవత్సరాలు ప్రపంచంలో మకుటం లేని మహారాజుగా నిలిచిన బోల్టు ఏమన్నాడు? 'నేనూ మామూలు మనిషినే!' అన్నాడు. ఇలాంటి మామూలు మనుషులు చరిత్రలో ఎంతమంది ఉంటారు!

అలాంటి అనూహ్యమైన సంఘటన మరొక్కసారి జరిగింది. ప్రపంచ ప్రఖ్యాత క్రికెట్ లెజెండ్ డాన్ బ్రాడ్‌మెన్ బ్యాటింగ్ ఏవరేజ్ 100 ఉండేది. ఇది అనూహ్యం. కాని ఆయన ఆఖరి ఆటలో కంటి నిండా నీరు ఉంది. మొదటి బాల్‌కి అవుట్ అయాడు. కనుక ఏవరేజ్ 99.99 అయింది. ఇది కూడా చాలా అరుదయిన విషయం.

పరుగు పందెం ముగుస్తూనే బోల్ట్– ఆఖరిసారి పందెం చివరి గీతని తలవొంచి తాకి ముద్దుపెట్టుకున్నాడు.. ఆ గీతమీద లోగడ గోమతేశ్వరుడిలాగ నిలిచిన చరిత్ర అంతటితో ముగిసింది. చూస్తున్న లక్షలాది అభిమానుల కళ్లు చెరువులయాయి.

ఒక దశాబ్దంపాటు ప్రపంచాన్ని పరిపాలించిన ఈ జమైకా వీరుడు– 30సార్లు ప్రపంచంలోని ఎందరో పరుగు వీరులతో పోటీ చేశాడు. వారిలో కేవలం 9 సందర్భాలలో మాత్రమే మాదకద్రవ్యాలు పుచ్చుకోని వీరులు పరుగు తీశారు. ఆ 9 సందర్భాలూ ఒక్క బోల్ట్ విజయాలే!

జీవన కాలమ్



ఓ పాత్రికేయుడు– ఆయన గురించి అన్న మాటని– ఎంత ప్రయత్నించినా తెలుగులో అంత గొప్పగా చెప్పలేను. At a time when there was- and still is- a deep sense of cynicism about sporting excellence of any kind, he was the ultimate escape artist.

ఆఖరి పరుగు పందాన్ని గెలిచిన గాట్లిన్ అన్నాడు. ''నేను గెలుస్తున్నంత సేపూ నన్ను వేళాకోళం చేసే కేకలు అభినందించే చప్పట్లకన్నా మిన్నుముట్టాయి. కారణం నాకు తెలుసు. ప్రపంచం బోల్ట్ అపజయాన్ని కూడా పండగ చేస్తోంది.. గెలిచినా బోల్ట్ ముందు ఒక్కసారి మోకరిల్లాలనుకున్నాను. ఈ క్రీడకి ఆయన చేసిన ఉపకారం అనితరసాధ్యం.''

బోల్ట్ అన్నాడు: ''ఈ వెక్కిరింతలు న్యాయం కాదు. గాట్లిన్ గొప్ప పోటీదారుడు. మంచిమనిషి''.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రపంచంలోని నలుమూలల నుంచి అభిమానుల సందేశాలు వెల్లువెత్తాయి. మనకు తెలిసివచ్చే ఒకే ఒక అభిమానిని ఉటంకిస్తాను. అతను ఇండియా క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లీ. ఆయన మాటలు: 'ప్రపంచంలో బోల్ట్ కంటే గొప్పవాడెవడూ లేడు. ఉండడు.. అంత గొప్ప క్రీడా జీవితాన్ని ఇంతవరకూ చూడలేదు. ఇంత త్వరగా ఆ రికార్డులు ఎవరూ అధిగమించలేరు. ఉస్సేన్ సాబ్! ప్రపంచం మిమ్మల్ని తప్పక మిస్ అవుతుంది. ఎప్పుడయినా సరదాకి క్రికెట్ ఆడాలనిపిస్తే రండి. నేనెక్కడ ఉంటానో మీకు తెలుసు!'.

బోల్ట్ గొప్ప క్రికెట్ అభిమాని. 'థ్యాంక్స్ చాంప్' అని సమాధానం ఇచ్చాడు.

పర్వతాన్ని ఎక్కిన ప్రతీవాడికీ దిగే రోజు వస్తుంది. కిరీటాన్ని ధరించిన మహారాజుకీ ఆఖరి విశ్రాంతి ఆరడుగులే. కాని తలవొంచే క్షణంలో తనూ మనలాంటి మనిషే అన్న స్పృహ అతన్ని మళ్లీ ఆకాశాన నిలుపుతుంది.

బోల్ట్ వేగంలో గాలికి పాఠం నేర్పిన గురువు. మనలాగే అందలాన్ని దిగి మనమధ్య నిలిచిన మహోన్నతమైన వీరుడు. చరిత్రలో ఎక్కువమంది బోల్ట్‌లు ఉండరు. ఆ మాటకి వస్తే ఎక్కువమంది డాన్ బ్రాడ్‌మెన్‌లూ ఉండరు.


బుధవారం నంద్యాలలోని హరిజనపేట రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న వైఎస్ జగన్. చిత్రంలో పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి


నంద్యాలలోని ఆత్మకూరు బస్టాండులో రోడ్‌షోలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మోసం చేయడంలో డిగ్రీ చేశారు

▶ మొదటి పేజీ తరువాయి

నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఎనిమిదవ రోజు బుధవారం రోడ్‌షో పట్టణంలోని హరిజనపేట నుంచి ప్రారంభమై మాల్దారిపేట, స్వాలిహీన మసీదు, నడినగడ్డ, నబీనగర్, కోటవీధి, నడిగడ్డ, జగజ్జననీనగర్, ఆత్మకూరు బస్టాండు మీదుగా పార్కురోడ్డు వరకు సాగింది. ఈ సందర్భంగా హరిజనపేట, చింత అరుగు సెంటర్, నడిగడ్డ, ఆత్మకూరు బస్టాండు సెంటర్లలో జగన్ ప్రసంగించారు. ప్రసంగం ఆయన మాటల్లోనే..

ఎన్నికలొస్తే ప్రజల కళ్లకు గంతలు కడతాడు..

''అధికారంలోకి రావడానికి 2014 ఎన్నికలప్పుడు చంద్రబాబు ఎన్నో హామీలిచ్చాడు. ఈ హామీలన్నింటినీ విస్మరించాడు. మైనార్టీలు, కాపులు, బీసీలు, ఎస్సీ ఎస్టీలు, బ్రాహ్మణులు, ఆర్యవైశ్యులు అంటూ అందరి ముందుకు వచ్చాడు. తన అవసరాల కోసం అందరినీ వాడుకుని.. ఆ తర్వాత తోసేశారు. మాయ మాటలు చెప్పడం.. తర్వాత వారికి అన్యాయం చేయడం చంద్రబాబు నైజం. నంద్యాల ఉప ఎన్నిక, కాకినాడ కార్పొరేషన్ ఎన్నిక రాగానే ఇపుడు మళ్లీ చంద్రబాబుకు ముస్లింల మాదిరిగా కాపులు గుర్తొచ్చారు. టీడీపీకి చెందిన కాపు నేతలను పిలిచి ఆత్మీయ సదస్సు నిర్వహించాడని ఇటీవల పేపర్లో చదివాను. బాబు చేస్తున్న ఈ నికృష్ట రాజకీయాలను చూసి ఒక స్నేహితుడు నాకొక నోట్ ఇచ్చాడు. అందులో బాబు గుణం, నైజం ఎలాంటిదో చెప్పడం జరిగింది. ఆ నోట్ చూశాక.. చంద్రబాబు మోసంలో డిగ్రీ చేశాడన్నది స్పష్టమైంది. కులాలు, మతాలు పేరిట మనుషులను వాడుకోవడం.. తర్వాత ఏరుదాటాక తెప్ప తగలేయడం బాబు చేసిన డిగ్రీ. 'జామాత దశమ గ్రహం' అంటూ చంద్రబాబు నైజం గురించి అతని మామ ఎన్టీఆర్ చాలా చక్కగా చెప్పారు. పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కే వెన్నుపోటు పొడిచిన ఘనుడు చంద్రబాబు. పదవి కోసం, అధికారం కోసం ఎందుకిలా గడ్డి తింటున్నావని నాడు ఎన్టీఆర్ నిలదీసి అడిగారు. కూతుర్నిచ్చిన తండ్రి లాంటి తనను ఎలా మోసం చేశాడో చూడండని ఎన్టీఆర్ నాడు ప్రజలకు చెప్పుకున్నారు. ఇలా అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలతో పాటు, వెన్నుపోట్లు పొడిచి అందలమెక్కిన చంద్రబాబుకు అహంకారం పెరిగిపోయింది. మూడున్నరేళ్ల దుర్మార్గ పాలనలో విచ్చలవిడిగా సంపాదించిన రూ.లక్షల కోట్ల అవినీతి సొమ్ము వినియోగించి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేశాడు.. ఇపుడు చిన్నాచితక లీడర్లనూ కొనుగోలు చేస్తున్నాడు.. ఇక ప్రజలను కూడా డబ్బులిచ్చి కొనేస్తే సరిపోతుందన్నది చంద్రబాబు భావన. తన పరిపాలన ఆధారంగా బాబు ఓట్లు అడగడం లేదు. అక్రమంగా సంపాదించిన డబ్బు, పోలీసుల బలం ఆధారంగా చంద్రబాబు ఓట్లు అడుతున్నాడు.

ముస్లింల సబ్‌ప్లాన్ ఏమైంది?

ఎన్నికలు వస్తే చాలు మన కళ్లకు చంద్రబాబు గంతలు కడతాడు. ఇంద్ర లోకం చూపిస్తానంటాడు. బాబు ఏమి చెప్పినా ఆహా.. ఓహో అంటూ ఆయన పేపర్లు రాసేస్తాయి. తీరా ఏరుదాటాక ఆ విషయానికి పాతర వేస్తాడు. ఎవరైనా నిలదీస్తే చిందులేస్తాడు. కాస్త గట్టిగా అడిగితే ప్రపంచంలో ఉన్నవీ, లేనివీ కల్పించి తప్పుడు ప్రచారం చేస్తాడు. వ్యక్తిత్వాన్ని దెబ్బదీసి రాక్షస ఆనందం పొందుతాడు. ఇప్పుడు నంద్యాల ఉప ఎన్నిక, కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికలొస్తున్నాయనే సరికి బాబుకు కాపులు గుర్తొచ్చి వారితో ఆత్మీయ సదస్సు ఏర్పాటు చేశాడు. ఒక వైపు వారికి వెన్నుపోటు పొడుస్తూ.. మరోవైపు వారిని మోసం చేస్తున్న ప్రక్రియకు తెరతీశాడు. ఇంచుమించు ఇలాంటి రీతిలో ముస్లిం.. మైనార్టీలను చంద్రబాబు ఘోరంగా మోసం చేశాడు. 2014 ఎన్నికలకు ముందు వారి అభ్యున్నతికి పాటు పాడతానంటూ ఒక డిక్లరేషన్ ప్రకటించాడు. ఎన్నికల్లో మైనార్టీలకు 15 సీట్లు ఇస్తానన్నాడు. విద్యలో 10 శాతం, ఉద్యోగాల్లో 6 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్నాడు. కేజీ నుంచి పీజీ దాకా ఉచిత విద్యను అందిస్తానన్నాడు. రూ.2,500 కోట్లతో మైనార్టీల కోసం ప్రత్యేకంగా సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేస్తానన్నాడు. ఈ విషయం అప్పట్లో ఈనాడు పేపర్‌లో ప్రముఖంగా ప్రచురించారు. గత ఎన్నికలప్పుడు ముస్లింల కోసం చెప్పిన ఏ ఒక్క హామీని ఆ తర్వాత అమలు చేయలేదు. ఏటా రూ.2,500 కోట్ల చొప్పున సబ్‌ప్లాన్‌కు ఇస్తానన్న నిధుల్లో ఈనాటికీ ఒక్క



> చంద్రబాబు పేదల జీవితాలతో చెలగాటం ఆడాడు. బెల్టుషాపులు ఒక్కటీ లేకుండా చేస్తానన్నాడు. మద్యం లేకుండా చేస్తానన్నాడు. కానీ ఒక్క బెల్టుషాపు మూయించలేదు. దివంగత నేత రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు రేషన్‌షాపులో కిరోసిన్, చక్కెర, గోధుమపిండి, కందిపప్పు, పామాయిల్ ఇలా మొత్తం తొమ్మిది రకాల సరుకులు లభించేవి. ప్రస్తుతం రేషన్‌షాపుల్లో ఒక్క బియ్యం తప్ప మరేమీ ఇవ్వడం లేదు. వేలి ముద్రలు సరిగా పడటం లేదంటూ ఆ బియ్యాన్ని కూడా చాలా మందికి దూరం చేస్తున్నాడు.

రూపాయి ఇవ్వలేదు. దివంగత నేత రాజశేఖరరెడ్డి ముస్లింల ఉన్నతి కోసం తపించి 4 శాతం రిజర్వేషన్లను ప్రకటిస్తే.. రాజశేఖరరెడ్డి తనను కాపీ కొట్టారని చెప్పడం ఘోరం.

పేదవాళ్లు ఇల్లు, పొలం అమ్ముకునేలా చేస్తున్నాడు..

ఏ పేదవాడు చదువుల కోసం అప్పులపాలయ్యే పరిస్థితి రాకూడదని.. అలా అప్పులపాలయ్యే పరిస్థితి వస్తే ఆ పేదవాడు మరింత పేదరికంలోకి వెళ్లిపోతాడని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టారు. పేదరికం నుంచి బయటకు రావాలంటే డాక్టర్లు, ఇంజినీర్లు, కలెక్టర్లు వంటి గొప్ప చదువులు చదవాలని భావించారు. పేద పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లుగా పెద్ద పెద్ద చదువులు చదివేందుకయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించింది. ఇవాళ చంద్రబాబు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాడు. ఇంజనీరింగ్ చదవాలంటే ఇప్పుడు ఏటా లక్ష రూపాయలు అవుతోంది. టీడీపీ ప్రభుత్వం మాత్రం తనకు బుద్ధిపుట్టినప్పుడు రూ.35 వేలు ఇస్తోంది. మిగిలిన రూ.65 వేల గురించి పట్టించుకోవడం లేదు. ఏ మాత్రం దయాదాక్షిణ్యం లేకుండా అవసరమైతే ఆ డబ్బుల కోసం పేదవాడు తన ఇల్లు, పొలం అమ్ముకుంటాడులే అని గాలికి వదిలేసింది. పేదలంటే ఇంత చులకన భావన ఉన్న చంద్రబాబుకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలి.

ఆరోగ్యశ్రీకి ఆర్థిక చేయూత ఇవ్వలేదు..

ఏ కుటుంబంలోని వ్యక్తి అయినా అనారోగ్యంతో ఆసుపత్రి పాలైతే.. పెద్ద ఆపరేషన్లు చేయాల్సి వస్తే.. ఆ కుటుంబం అప్పులపాలు కాకూడదన్న సదుద్దేశంతో దివంగత నేత రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆపదలో ఉన్న వాళ్లను ఆసుపత్రికి చేర్చడం కోసం 108 వాహనాలను ఏర్పాటు చేశాడు. 108కి ఫోన్ చేయగానే.. 20 నిమిషాలలోపు కుయ్..కుయ్.. అంటూ అంబులెన్సు వచ్చి ఆపదలో ఉన్న పేదవాడిని పెద్ద ఆసుపత్రిలో చేర్చి రక్షించేవి. ఇప్పుడు 8 నెలలుగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లులు చెల్లించలేదు. 108 వాహనాల్లో డీజిల్ ఉండడం లేదు. ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టి పదేళ్లవుతోంది. రేట్లు పెంచండని డాక్టర్లు అడిగినా చంద్రబాబు పెంచడం లేదు. దాంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో పెద్ద పెద్ద ఆపరేషన్లు నిలిపివేశారు. ఇవాళ కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీకి చంద్రబాబు సర్కారు అనేక కొర్రీలు పెట్టింది. క్యాన్సర్ రోగులకు చేసే కీమోథెరపీకి రెండుసార్లు మాత్రమే సాయం చేస్తున్నారు. చంద్రబాబు హయాంలో ఇంత దారుణంగా ఆరోగ్యశ్రీ పథకం నడుస్తోంది.

రైతులు, అక్కచెల్లెమ్మలను మోసం చేశాడు..

అధికారంలోకి రావడానికి అలవికాని హామీలిచ్చి.. రైతులు, డ్వాక్రా అక్క చెల్లెమ్మలు, విద్యార్థులను చంద్రబాబు మోసం చేశాడు. రైతులకు సంబంధించిన రూ. 87,612 కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తానన్నాడు. ఒక్క రూపాయి మాఫీ చేయలేదు. సున్నా, పావలా వడ్డీ రుణాలు ఎగ్గొట్టి పేరు మార్చి రుణమాఫీ అంటూ ముష్టి వేసినట్లుగా రూ.3 వేల కోట్లు ఇచ్చాడు. అది వడ్డీకే సరిపోలేదు. దీంతో రైతులపై అపరాధ వడ్డీ భారం పడింది. ఏటా రూ.15 వేల కోట్ల చొప్పున ఈ మూడేళ్లలో రూ.45 వేల కోట్లు కట్టాల్సిన పరిస్థితి వచ్చింది. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రాలేదు. డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలకు సంబంధించిన రూ.14 వేల కోట్ల రుణాల్లో ఒక్క రూపాయి మాఫీ కాలేదు. రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ఇలా 38 నెలల్లో ప్రతి ఇంటికీ నిరుద్యోగ భృతి కింద రూ.76 వేలు బాకీ పడ్డాడు. కర్నూలు జిల్లా అభివృద్ధి కోసమంటూ చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు. కర్నూలులో ఎయిర్‌పోర్టు, స్విమ్స్ స్థాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మైనింగ్ కళాశాల, ఉర్దూ విశ్వవిద్యాలయం, అవుకులో ఇండస్ట్రియల్ హబ్, ఆదోని, ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్, అపెరల్ పార్కులు, బెంగళూరు – హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్, గుండ్రేవుల ప్రాజెక్టు పూర్తి చేస్తానంటూ ఇలా అనేక హామీలు ఇచ్చాడు. వాటిలో ఒక్కటీ అమలు కాలేదు. ఇప్పుడు నంద్యాల ఉప ఎన్నికలో అవే మోసపూరిత వాగ్దానాలు, అబద్ధాలు చెబుతున్నాడు.

డబ్బు మూటలతో వస్తాడు..

లంచాల రూపంలో సంపాదించిన డబ్బు మూటలతో చంద్రబాబు మీ ఇంటికి వస్తాడు. మీ చేతిలో రూ.5 వేలు పెట్టి.. ఆ తర్వాత జేబులో నుంచి దేవుడి పటం తీసి చేతిలో పెట్టి.. దేవుడి మీద ప్రమాణం చేయించుకుని మరీ డబ్బులు ఇచ్చే కార్యక్రమం చేస్తాడు. ఏ దేవుడు కూడా పాపానికి ఓటు వేయమని చెప్పలేదు. పాపానికి ఓటెయ్యండి అని చెప్పేది దెయ్యాలు మాత్రమే. కాబట్టి రేపు మీ ఇంటికొచ్చే దెయ్యాలతో గొడవ పడకుండా లౌక్యంగా వ్యవహరించండి. మనస్సులో దేవుణ్ణి తలచుకొని.. ధర్మంవైపే మేముంటామని అనుకోండి. ఆ తర్వాత ధర్మానికే మీరు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించండి. చంద్రబాబు మాదిరిగా నా దగ్గర డబ్బుల్లేవు. నా దగ్గర ముఖ్యమంత్రి పదవి లేదు. పోలీసుల బలం నా దగ్గర లేదు. చంద్రబాబు మాదిరిగా లేనిది ఉన్నట్టుగా...ఉన్నది లేనట్టుగా చూపించే టీవీ చానళ్లు నా దగ్గర లేవు. ప్రియతమ నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చనిపోతూ ఇచ్చిన ఇంత పెద్ద కుటుంబం నాకున్న ఆస్తి. నాన్నగారు చేసిన ఆ సంక్షేమ పథకాలు ఇంకా మీ గుండెల్లో బతికే ఉండటం నాకున్న ఆస్తి. జగన్ అబద్ధం ఆడడు. జగన్ మోసం చేయడు. జగన్ మాట ఇస్తే తప్పడు. జగన్ ఏదైనా చెబితే చేస్తాడు.. అన్న విశ్వసనీయత నాకున్న ఆస్తి. విలువలతో కూడిన రాజకీయాలు చేయడం నాకున్న ఆస్తి. నవరత్నాలతో జగన్ కూడా ప్రతీ పేదవాడి ఇంట్లో వెలుగులు నింపుతాడు.. వాళ్ల నాన్న మాదిరిగానే పేదల కోసం తపిస్తాడు అన్న ప్రజల్లో ఉన్న నమ్మకమే నాకున్న ఆస్తి. నాకున్న ఆస్తి దేవుడి దయ. మీ ఆశీస్సులే'' అని జగన్ పేర్కొన్నారు.

చంద్రబాబు మోసానికి వ్యతిరేకంగా ఓటు వేయండి..

అధికారంలో ఉన్న ఈ మూడున్నరేళ్లలో చంద్రబాబు ప్రజలకు మంచి చేశాడని నమ్మితే ఆయనకు ఓటు వేయండి. బాబు ఎవరికీ మంచి చేయలేదు.. అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచాడని నమ్మితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి. ఉప ఎన్నిక ముందు వరకు నంద్యాల అభివృద్ధి పట్టని చంద్రబాబు.. ఉప ఎన్నిక రాగానే ప్రజలు గుర్తొచ్చారు. ఇప్పుడు ఆగమేఘాల మీద అభివృద్ధి అంటూ రోడ్ల విస్తరణ పనులు చేపట్టి రెండు మూడు కిలోమీటర్లు అటూ ఇటూ భవనాలను టపటపమని కూలగొట్టి రాక్షసానందం పొందుతున్నాడు. మళ్లీ ఇప్పుడు ఉప ఎన్నిక రాగానే నంద్యాలకు అది చేస్తాను.. ఇది చేస్తాను అంటూ కొత్తగా బొంకుతున్నాడు. ఇలాంటి మోసం చేసే వ్యక్తికి ఓటు వేయొద్దు. వైఎస్సార్‌సీపీకి, టీడీపీకి మధ్య జరుగుతున్న న్యాయ పోరాటంలో ప్రజలు న్యాయం వైపు నిలబడి.. చంద్రబాబు చేసిన మోసానికి వ్యతిరేకంగా ఓటు వేయండి.


నంద్యాలలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్ జగన్

ఉప ఎన్నిక వల్లే నంద్యాల గుర్తొచ్చింది...

దివంగత నేత రాజశేఖరరెడ్డి హయాంలో నంద్యాలలో 21,800 పింఛన్లు ఉండేవి. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ పింఛన్ల సంఖ్యను 15 వేలకు కుదించారు. కానీ కొత్తగా ఒక్క పింఛను కార్డు ఎవరికీ ఇవ్వలేదు. రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదు. వర్షాలు వస్తే నంద్యాలలో చాలా కాలనీలు నీట మునుగుతాయి. చంద్రబాబుకు ఈ విషయం బాగా తెలుసు. కానీ ఈ మూడున్నరేళ్ల కాలంలో నీటి ముంపునకు గురికాకుండా ఉండేలా కాలనీల్లో ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదు. ఇప్పుడు ఉప ఎన్నిక రాగానే సీఎంకు నంద్యాల గుర్తొచ్చింది. హడావుడిగా రోడ్ల విస్తరణ పనులు చేపట్టాడు. ప్రతీ పేదవాడికి 3 సెంట్ల స్థలం.. పక్కా ఇల్లు కట్టిస్తానన్నాడు. కానీ ఒక్క ఇల్లు కట్టించలేదు. ఇప్పుడు నంద్యాలలో ఇళ్లు కట్టిస్తానంటున్నాడు. అయితే రూ.3 లక్షల విలువజేసే ఇంటిని రూ.6 లక్షలకు అమ్ముతాడంట. చదరపు అడుగుకు రూ.1,000 ఖర్చవుతుంటే.. తన బినామీ కాంట్రాక్టర్‌తో మాత్రం చదరపు అడుగుకు రూ. 2078 చొప్పున ఒప్పందం చేసుకున్నాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 1.50 లక్షల చొప్పున సబ్సిడీ ఇస్తే.. మిగిలిన సొమ్ము రూ.3 లక్షలు బ్యాంకుల్లో అప్పుగా ఇచ్చినట్లు రాసుకుంటారట. 20 ఏళ్ల పాటు నెలకు రూ.3 వేల చొప్పున పేదవాడు చెల్లించాలట. లంచం తీసుకునేది చంద్రబాబు.. కంతులు కట్టేది పేదవాడు. ఇలా పేదలకు పక్కా ఇల్లు కట్టిస్తానంటూ అంతా మాయ చేస్తున్నాడు.


జగన్‌తో కరచాలనం చేయడానికి పోటీపడుతున్న మహిళలు

టీడీపీ కార్యకర్తపై సినీ హీరో దాడి

నంద్యాల: టీడీపీ నేత, ప్రముఖ సినీ హీరో ఒకరు బుధవారం రాత్రి కర్నూలు జిల్లా నంద్యాలలో తన అభిమాని అయిన టీడీపీ కార్యకర్తపై దాడి చేశారు. నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా బుధవారం టీడీపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేసిన ఆ సినీ హీరో రాత్రి బస కోసం పట్టణంలోని ఓ లాడ్జి వద్దకు వచ్చారు. ఆ సమయంలో తన అభిమాన హీరోతో సెల్ఫీ దిగాలని ఆశపడిన ఓ టీడీపీ కార్యకర్త ఉత్సాహంగా ఆయన వద్దకు వచ్చారు. దీంతో ఆగ్రహించిన ఆ హీరో ఒక్కసారిగా ఆ కార్యకర్తపై దాడి చేసి గాయపరిచాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు తమ నాయకుడు దాడి చేసిన తీరు చూసి అవాక్కయ్యారు. గాయపడ్డ కార్యకర్తను గుట్టు చప్పుడు కాకుండా ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఆ హీరో ఇలా పార్టీ కార్యకర్తలు, అభిమానులపై చేయిచేసుకున్న సంఘటనలు గతంలోనూ ఉన్నాయి.

రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమ పథకాలు

నంద్యాల ప్రచారంలో బాలకృష్ణ

నంద్యాల సాక్షి బృందం: రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అన్నివిధాలా ముందుకు తీసుకెళ్తున్నారని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నంద్యాల మరింత అభివృద్ధి చెందాలంటే టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. మంత్రులు అఖిలప్రియ, సుజయకృష్ణ రంగారావు, ఆదినారాయణరెడ్డి, అమరనాథరెడ్డి, టీడీపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు. నంద్యాల మండలం వెంకటేశ్వరపురం నుంచి ప్రారంభమైన బాలకృష్ణ రోడ్‌షో బొమ్మలసత్రం, నూనెపల్లి, రైతు నగరం, కానాల, చింతకుంట, జూలేపల్లి, పసురపాడు, జిల్లెల్ల, గోస్పాడు, కానాలపల్లి, దీబగుంట్ల, అయ్యలూరు మెట్ట వరకు సాగింది. సినీ నటుడు కావడంతో అధిక సంఖ్యలో జనాలు వస్తారని ఆశించిన టీడీపీ నాయకులకు నిరాశే ఎదురైంది. రోడ్ షో చాలా గ్రామాల్లో వెలవెలబోయింది. బాలకృష్ణ రోడ్‌షోలో చేసిన ప్రసంగం ఒక్క ముక్క అర్థంకాలేదని కార్యకర్తలు, ఆయన అభిమానులు అనుకోవడం కనిపించింది. సినిమాల్లో అనర్గళంగా భారీ డైలాగులు చెప్పే మా బాలయ్యేనా అని చర్చించుకోవడం కనిపించింది.


నంద్యాలలో బాలకృష్ణ ప్రచారం

అద్దె కార్యకర్తలను తరలించి...

వైఎస్సార్‌సీపీకి పట్టున్న గ్రామాల్లో ప్రజలు రాక రోడ్‌షో వెలవెలబోతుందని భావించిన నాయకులు పెద్దవారికి ఒక్కొక్కరికి రెండు వందలు, పిల్లలకు వంద లెక్కన కూలీ ఇచ్చి కార్యకర్తల్లా టోపీలు, జెండాలు ఇచ్చి తరలించారు. పసురపాడు గ్రామానికి అయ్యలూరు నుంచి సుమారు 100 మందిని లారీలో తరలించారు. అక్కడ రోడ్‌షో ముగిసిన వెంటనే వారిని కానాలపల్లికి తరలించారు. దీబగంట్లకు సాంబవరం, అయ్యలూరుల నుంచి సుమారు 300 మందిని తరలించారు.

ప్రతాప్‌రెడ్డి మా పార్టీ సభ్యుడు కాదు

వైఎస్సార్‌సీపీ వెల్లడి

సాక్షి, అమరావతి : కర్నూలు జిల్లాకు చెందిన గంగుల ప్రతాప్‌రెడ్డి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు కాదని ఆ పార్టీ వెల్లడించింది. ఆయన తమ పార్టీలో చేరలేదని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి వేణుంబాక విజయసాయిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతాప్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగేదేశం పార్టీలో చేరినట్లు కొన్ని చానళ్లు, పత్రికల ద్వారా జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఆయన తమ పార్టీ సభ్యుడు కానందున, పార్టీని వీడటం అనే ప్రశ్న ఉత్పన్నం కాదని విజయసాయిరెడ్డి స్పష్టంచేశారు.

వెంకయ్య కార్యదర్శిగా సుబ్బారావు

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కార్యదర్శిగా మాజీ ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు నియమితులయ్యారు. రెండేళ్ల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన ఆయన ఈ పదవి చేపట్టడానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదముద్ర వేసింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుబ్బారావు 1979 బ్యాచ్ అధికారి. ఆయన 2015, ఆగస్టులో పదవీ విరమణ పొందారు.

గంగుల చేరికతో అలిగిన అఖిల

- బాబుతో గంగుల ప్రతాప్‌రెడ్డి భేటీ
- టీడీపీలో చేరిక సమాచారంతో షాక్ తిన్న మంత్రి అఖిలప్రియ
- అర్ధాంతరంగా రోడ్ షో నుంచి వెళ్లిపోయి అనుచరులతో భేటీ

సాక్షి ప్రతినిధి, కర్నూలు: మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. నంద్యాల ఉప ఎన్నిక సమయంలో ప్రతాప్‌రెడ్డి సీఎంను కలవడం చర్చనీయాంశమయ్యింది. ఆయన తెలుగుదేశంలో చేరారనే వార్తలతో మంత్రి అఖిలప్రియ శిబిరంలో కలకలం రేగింది. వచ్చే ఎన్నికల్లో ఆళ్లగడ్డ టికెట్ కూడా ప్రతాప్‌రెడ్డికే ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారనే ప్రచారం సాగుతుండటంపై ఆ వర్గంలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం తనతో మాట మాత్రంగానైనా చెప్పకుండా ప్రతాప్‌రెడ్డిని ఎలా చేర్చుకుంటారంటూ అఖిలప్రియ రగిలిపోతున్నట్లు సమాచారం. బుధవారం నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో ఎమ్మెల్యే బాలకృష్ణతో కలసి పాల్గొన్న అఖిలప్రియ.. విషయం తెలియగానే అక్కడినుంచి బయలుదేరి వెళ్లి తన ముఖ్య అనుచరులతో సమావేశమైనట్లు తెలిసింది. ఆళ్లగడ్డలో మొదటినుంచీ భూమా, గంగుల వర్గాల మధ్య తీవ్రమైన విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో తనకు కనీస సమాచారం ఇవ్వకుండా ప్రతాప్‌రెడ్డిని పార్టీలో చేర్చుకోవడం అఖిలప్రియను షాక్‌కు గురిచేసింది. జిల్లాతో సంబంధం లేని ఇద్దరు మంత్రులు జరిపిన మంత్రాంగంతోనే గంగుల ప్రతాప్‌రెడ్డి టీడీపీలో చేరారని తెలుస్తోంది.

అఖిలను పక్కన పెట్టిన బాబు

వాస్తవానికి నంద్యాల ఉప ఎన్నిక వ్యవహారాల నుంచి మంత్రి అఖిలప్రియను చంద్రబాబు దూరంగానే ఉంచారు. అటు ప్రచారంలో కానీ, ఇటు డబ్బు పంపిణీ వ్యవహారంలో కాని ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. మంత్రులు ఆదినారాయణరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, సోమిరెడ్డిలు చక్రం తిప్పుతుండటం ఇప్పటికే భూమా వర్గానికి మింగుడు పడటం లేదు. మొత్తం పెత్తనమంతా జిల్లాకు సంబంధం లేని మంత్రులకు అప్పగించడాన్ని ఆమె వర్గీయులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక నంద్యాల పట్టణంలో కూడా నగదు పంపిణీ వ్యవహారాలను అఖిలప్రియతో విభేదాలున్న ఎ.వి.సుబ్బారెడ్డికి, ఎమ్మెల్సీ ఫరూక్‌కు అప్పగించడం గమనార్హం.

25 కోట్లకు అమ్ముడుపోయిన నువ్వా మా గురించి మాట్లాడేది?

ఆదిపై నంద్యాల హరిజన పేట మహిళల మండిపాటు

సాక్షి బృందం, నంద్యాల: 'ఎస్సీలకు శుచి, శుభ్రత ఉండదు.. చదువుకోరు.. రిజర్వేషన్లు అనుభవిస్తున్నార'ని దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మార్కెటింగ్ మంత్రి ఆదినారాయణరెడ్డిని చెప్పులు, చీపుర్లతో కొడతామని నంద్యాల హరిజనపేట మహిళలు హెచ్చరించారు. మంగళవారం వారు పీవీనగర్– నంద్యాల రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ... 'వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచి చంద్రబాబుకు రూ. 25 కోట్లకు అమ్ముడుపోయిన నీవు శుచి, శుభ్రత గురించి మాట్లాడుతుంటే విడ్డూరంగా ఉంది. నీ నాలుక చీరేస్తాం. నీ వియ్యంకుడు కేశవరెడ్డి పేద ప్రజలకు రూ. వేల కోట్లు ముంచితే కనిపించలేదా? అంబేడ్కర్‌ను విమర్శించి.. రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన నువ్వు దేశంలో నివసించడానికి అనర్హుడివి. ఒళ్లు జాగ్రత్తగా పెట్టుకో. లేకపోతే మంత్రివని చూడకుండా దేహశుద్ధి చేస్తాం. వెంటనే దళితులందరికీ క్షమాపణ చెప్పాలి. లేదంటే నీ ఊరికొచ్చి బుద్ధి చెబుతామ'ని హెచ్చరించారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరన్నా అనుకుంటారా.. ఎస్టీలకు తెలివి ఉండదని చంద్రబాబు దళితులను అవమానిస్తుంటే.. మరోవైపు దళితులు స్నానం చేయరు, శుభ్రంగా ఉండరని ఆదినారాయణరెడ్డి మాట్లాడడం చూస్తుంటే తెలుగుదేశం పార్టీకి దళితులంటే ఎంత చులకనో తెలిసిపోతోందన్నారు. నంద్యాలలో మైనార్టీలు, దళితులందరూ వైఎస్సార్‌సీపీ వైపే ఉంటారని, నీలాగా అమ్ముడుపోరని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు టీడీపీకి ఓటు వేయరన్నారు.

మంత్రి ఆదిని పదవి నుంచి తొలగించాలి: సీపీఐ

సాక్షి, అమరావతి: దేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున దళితులను కించపరుస్తూ మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని, తక్షణమే ఆయనను పదవి నుంచి తొలగించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. దళితులపై మంత్రి అవమానకర వ్యాఖ్యలు చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. గరగపర్రులో టీడీపీ నాయకులు దళితులను సాంఘిక బహిష్కరణ చేశారని, ప్రకాశం జిల్లా దేవరపల్లిలో టీడీపీ నేతలు దళితుల భూములు లాక్కున్నారని, కృష్ణా జిల్లా దొండపాడులో దాడి వంటి ఘటనలు రాష్ట్రంలో దళితులపై పాలకుల వివక్షతకు నిదర్శనాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దళితులకు మంత్రి ఆది క్షమాపణలు చెప్పాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: దళితులను అవమానించేలా మాట్లాడిన రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలను సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దళితులకు మంత్రి వెంటనే క్షమాపణలు చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'దళితులు శుభ్రంగా ఉండరు. సక్రమంగా చదువుకోరు' అంటూ మంత్రి స్థాయిలో ఉండి ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అది రాజ్యాంగ ఉల్లంఘనే!

దళితుల గురించి మంత్రి ఆది వ్యాఖ్యలపై ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

పార్వతీపురం టౌన్: మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులను కించపర్చేలా వ్యాఖ్యానించడం అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం అన్నారు. తక్షణమే మంత్రి వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేదంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని సామల డిమాండ్ చేశారు.

రిజర్వేషన్లు ఆదినారాయణరెడ్డి తాత సొత్తా?

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెంగయ్య ధ్వజం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు మంత్రి ఆదినారాయణరెడ్డి తాత సొత్తా? అని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య ధ్వజమెత్తారు. ఆదినారాయణరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి హోదాలో ఉండి అన్ని సామాజికవర్గాలను సమానంగా చూడాల్సిన వ్యక్తి దళితుల పట్ల వివక్షపూరితంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా చిత్తూరు జిల్లాలో దళిత సంఘాలు ఆందోళన చేపట్టాయి. తిరుపతి, మదనపల్లి, పుత్తూరు మండల కేంద్రాల్లో ఆదినారాయణరెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు.

ముస్లింలు ఓట్లు వేయరని టీడీపీ భావిస్తోంది

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కపిలేశ్వరయ్య

కర్నూలు (టౌన్): బీజేపీతో టీడీపీకి పొత్తు ఉన్నందున నంద్యాల ఉప ఎన్నికలో ముస్లింలు ఓట్లు వేయరని టీడీపీ భావిస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కపిలేశ్వరయ్య అన్నారు. బుధవారం కర్నూలులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'తెలుగుదేశం పార్టీ.. బీజేపీతో తాళి కట్టించుకుంది. సంసారం చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది. అయితే తాళి తెంచుకుంటారా.. సంసారం చేస్తారా.. అనేది వారే తేల్చుకోవాలి' అని కపిలేశ్వరయ్య వ్యాఖ్యానించారు.

నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో జనసేనది తటస్థ వైఖరి: పవన్

జనసేన మద్దతు ఉందని ఎవరైనా ప్రచారం చేసుకుంటే నమ్మొద్దు



సాక్షి, అమరావతి: నంద్యాల ఉప ఎన్నిక, కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో జనసేన పార్టీ తటస్థంగా ఉంటుందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. పార్టీ ఇంకా నిర్మాణ దశలో ఉన్నందున, 2019 వరకు ఎన్నికలకు దూరంగా ఉండదలచుకున్నట్లు చెప్పారు. ఎవరైనా పవన్ కల్యాణ్ మద్దతు ఉందంటూ చేసే ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. ఈ మేరకు పార్టీ వైఖరిని వెల్లడిస్తూ పవన్ కల్యాణ్ ప్రసంగించిన వీడియోను బుధవారం పార్టీ కార్యాలయం మీడియాకు విడుదల చేసింది. పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు సేకరించిన తర్వాత ఈ నిర్ణయం ప్రకటిస్తున్నామని చెప్పారు. తమకు పవన్ కల్యాణ్ మద్దతు ఉందని ఎవరైనా ప్రచారం చేసుకుంటే అలాంటివి నమ్మవద్దని ఆయన పార్టీ అభిమానులకు సూచించారు. '2019లో జరిగే సాధారణ ఎన్నికల వరకు మేం (జనసేన పార్టీ) ఎన్నికలకు దూరంగా ఉండదలుచుకున్నాం. దానికి కారణం మేం నిర్మాణ దశలో ఉన్నాం. క్షేత్ర స్థాయి పార్టీ నిర్మాణం జరిగిన తర్వాతే 2019లో సాధారణ ఎన్నికలకు వెళ్తాం. అప్పటివరకు ఇలాంటి ఎన్నికలకు దూరంగా ఉండదలుచుకున్నాం' అని పవన్ స్పష్టం చేశారు. నంద్యాల ఉప ఎన్నికతోపాటు కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి లేఖ రాశారని పవన్ కల్యాణ్ చెప్పారు.

కోడ్ దాటిన సోమిరెడ్డి

ప్రత్యామ్నాయ పంటలకు సబ్సిడీతో విత్తనాలిస్తామని ప్రకటన



కర్నూలు (కొండారెడ్డి ఫోర్టు): మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నంద్యాలలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసే రైతులకు వంద శాతం సబ్సిడీతో రూ.105 కోట్ల వ్యయంతో 1.50 లక్షల క్వింటాళ్ల విత్తనాలను, వంద శాతం సబ్సిడీతో సూక్ష్మ పోషకాలను అందజేస్తామని మంత్రి ప్రకటించారు. కర్నూలు, వైఎస్సార్, చిత్తూరు, అనంతపురం, ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మంత్రి నంద్యాలలో ఈ విషయాన్ని ప్రకటించడం ద్వారా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంది. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం సాయంత్రం 4.45 గంటలకు నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి రాయితీలు ప్రకటించడం గమనార్హం.



బుధవారం అనంతపురం టవర్‌క్లాక్ వద్ద మంత్రి ఆదినారాయణరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నేతలు



విశాఖ డాబాగార్డెన్స్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కోలా గురువులు, జాన్‌వెస్లీ తదితరులు



యోగి వేమన వర్సిటీ ఎదుట ఆది దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మంత్రి ఆది వ్యాఖ్యలపై భగ్గు

రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసన ● పలుచోట్ల దిష్టిబొమ్మలు దహనం ● ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు..

సాక్షి నెట్‌వర్క్: దళితుల పట్ల మంత్రి ఆదినారాయణరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దళితుల్ని కించపరిచేలా ఆయన చేసిన వ్యాఖ్యల పట్ల రాష్ట్రవ్యాప్తంగా నిరసన వెల్లువెత్తింది. దళిత సంఘాలతోపాటు విద్యార్థి, ఇతర సంఘాలు, వివిధ పార్టీల నేతృత్వంలో పెద్ద ఎత్తున బుధవారం నిరసన ప్రదర్శనలు, రాస్తారోకోలు, ఆందోళనలు జరిగాయి.

- రాజమహేంద్రవరంలో మాలమహానాడు ఆధ్వర్యంలో మంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. పిఠాపురంలో దళితనాయకులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మంత్రి వ్యాఖ్యల్ని అమలాపురం బార్ అసోసియేషన్ దళిత న్యాయవాదులు, పలు దళిత సంఘాలు ఖండించాయి.
- అనంతపురం టవర్‌క్లాక్ వద్ద మంత్రి దిష్టిబొమ్మను దహనం చేయగా.. గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మార్పీఎస్, రాయలసీమ దళిత సంఘం నేతలు మంత్రిపై ఫిర్యాదు చేశారు. ఎస్కేయూ ప్రధాన గేటు ముందు ఎంఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. కదిరిలో రాస్తారోకో నిర్వహించారు.
- ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కలెక్టరేట్ ఎదుట మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆదినారాయణరెడ్డిని కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ నంద్యాలలో డిమాండ్ చేశారు.
- పశ్చిమగోదావరి జిలా నిడదవోలులో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్, చర్చిపేట యూత్ ఆధ్వర్యంలో దళితులు రాస్తారోకో నిర్వహించారు.
- శ్రీకాకుళం జిల్లాలో పలుచోట్ల దళిత సంఘాల నాయకులు ఆందోళనలు నిర్వహించారు. పాలకొండలో మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు.
- వైఎస్సార్ జిల్లా కడపలోని కోటిరెడ్డి సర్కిల్‌లో మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. యోగివేమన యూనివర్సిటీలో ఆర్ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐలతో కూడిన విద్యార్థి సంఘాలు, పులివెందులలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. కడపలో న్యాయవాదులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మంత్రిపై ఫిర్యాదు చేశారు.
- ప్రకాశం జిల్లా చీరాలలో ర్యాలీ నిర్వహించారు. మంత్రిపై చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొత్తపట్నం మండలం ఈతముక్కల, కొండపి, పర్చూరుల్లోనూ ఆందోళనలు జరిగాయి.
- విజయనగరం జిల్లా గరివిడిలో మాలమహానాడు సంఘం ఆధ్వర్యంలో మంత్రిపై కేసు నమోదు చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్వతీపురంలో మంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు.
- విశాఖపట్నంలోని ఏయూ మెయిన్‌గేట్ వద్ద విద్యార్థులు మంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేశారు. డాబాగార్డెన్స్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి శుద్ధిచేశారు. దేవరాపల్లిలో దళితులు ఆందోళన నిర్వహించారు.
- గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్సిటీలో దళిత, ఉద్యోగ, విద్యార్థి, పరిశోధక సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలతో నిరసన ప్రదర్శన చేసి ప్రధాన గేటు వద్ద ధర్నా చేశారు. నిడుముక్కల, తెనాలి, బాపట్ల, పిడుగురాళ్లలోనూ ఆందోళనలు కొనసాగాయి. సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో గుంటూరు–మాచర్ల రహదారిపై ధర్నా నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేశారు. నరసరావుపేటలోనూ ఆందోళన జరిగింది.
- కృష్ణా జిల్లా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన జరిగింది. అవనిగడ్డలో మంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. చిలకలపూడి, చందర్లపాడు పోలీసుస్టేషన్‌లలో మంత్రిపై ఫిర్యాదులు దాఖలయ్యాయి.
- హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో దళిత సంఘాల నాయకులు నిరసన తెలిపారు. డా.బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం ఉత్సవాల కమిటీ కన్వీనర్ ఆడాల రమేష్ ఇందులో పాల్గొన్నారు.

బర్తరఫ్ చేయాలి

ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి డిమాండ్



జియ్యమ్మవలస (కురుపాం): దళితులు, గిరిజనులను అవమానపరిచేలా మాట్లాడిన మంత్రి ఆదినారాయణరెడ్డిని తక్షణమే బర్తరఫ్ చేయాలని విజయనగరం జిల్లా కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి డిమాండ్ చేశారు. బుధవారం జియ్యమ్మవలస మండలం చినమేరంగిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి ఆదిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని గతంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించి వారిపట్ల చులకన భావం ఎంత ఉందో తెలియజేశారని, ఇప్పుడు మంత్రులు ఆయన బాటలోనే వాగుతున్నారని వ్యాఖ్యానించారు. ఊసరవెల్లిలా పార్టీలు మారి ప్రజలను మోసం చేసిన ఆదికి విమర్శించే హక్కు ఉందా అని ప్రశ్నించారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు

మంత్రి ఆదిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల డిమాండ్

నంద్యాల: మంత్రి ఆదినారాయణరెడ్డి దళితులను అవమానపరుస్తూ మాట్లాడి రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ ఎమ్మెల్యేలు నారాయణస్వామి, ఆదిమూలం సురేష్, సంజీవయ్య, సునీల్‌కుమార్, ఐజయ్య, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ తదితరులు బుధవారం మధ్యాహ్నం నంద్యాల డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ రవిప్రకాష్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. మాట్లాడుతూ.. దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించిన రోజే ఆయనపై కేసు నమోదు చేసుంటే ఇవాళ మంత్రి ఆదినారాయణ ఇలా మాట్లాడేవారు కాదన్నారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్టుగా టీడీపీ పాలన కొనసాగుతోందన్నారు. చంద్రబాబే దళితుల్ని అవమానించి మాట్లాడాక.. ఏమవుతుందిలే అని ఈరోజు మంత్రి ఆదినారాయణరెడ్డి కూడా మాట్లాడారన్నారు. జమ్మలమడుగులో ఆదినారాయణరెడ్డి, కుప్పంలో చంద్రబాబు.. దళితుల ఓట్ల వల్లనే గెలిచారన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబం వల్ల నేడీ స్థాయికి చేరుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో ఎమ్మెల్యేగా గెలిచి.. టీడీపీకి అమ్ముడుపోయిన చరిత్ర ఆదినారాయణరెడ్డిదని దుయ్యబట్టారు. దమ్ము, ధైర్యముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో తలపడాలన్నారు. దళితుల ఓట్లడిగే హక్కును మంత్రి, సీఎం పోగొట్టుకున్నారన్నారు. నంద్యాల ఉపఎన్నికలో టీడీపీకి దళితులు బుద్ధి చెప్పాలన్నారు. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా కేసు నమోదు చేయాల్సిన పోలీసులు కళ్లు లేని కబోదులుగా మారిపోయారని వారు విమర్శించారు.



డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ రవిప్రకాష్‌కు వినతిపత్రం అందచేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు

టీడీపీలోని దళితులు నోరు విప్పరేం?

ఎమ్మెల్యే రాజన్నదొర మండిపాటు



సాలూరు: ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఆయన సహచర మంత్రుల్లోనూ దళితులపై హీనమైన, హేయమైన భావం నెలకొందని విజయనగరం జిల్లా సాలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడిక రాజన్నదొర ఆవేదన వ్యక్తం చేశారు. వారు ఎస్సీ, ఎస్టీలను ఇంతగా అవమానిస్తున్నా ఆ పార్టీలోని దళిత నాయకులు నోరుమెదపరెందుకని ప్రశ్నించారు. ఆయన బుధవారం సాలూరులో విలేకరులతో మాట్లాడారు. ఆదినారాయణరెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

బర్తరఫ్ చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన

మంత్రి ఆదినారాయణరెడ్డిని బర్తరఫ్ చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంప ప్రకాశరావు హెచ్చరించారు. కారెం శివాజీ, జూపూడి ప్రభాకర్, మాణిక్య వరప్రసాద్ తదితరులు టీడీపీలో చేరి పదవులు అనుభవిస్తుండడంతో దళితులకు అవమానం జరుగుతున్నా వారికి పట్టడం లేదన్నారు.

ఓట్ల కోసమే కాపులపై బాబు కపటప్రేమ: రాధా



నంద్యాల: నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో ఓట్ల కోసమే సీఎం చంద్రబాబు కాపులపై కపటప్రేమ చూపిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వంగవీటి రాధాకృష్ణ విమర్శించారు. నంద్యాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'తానా అంటే తందానా' అనే బ్యాచులతో ఇటీవల చంద్రబాబు సమావేశం పెట్టారని ఎద్దేవా చేశారు. నంద్యాల ఉప ఎన్నికను దృష్టిలో పెట్టుకొని కాపుల ఓట్ల కోసం విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇస్తామని చంద్రబాబు కొత్త పల్లవి ఎత్తుకున్నారని విమర్శించారు. ముద్రగడ పద్మనాభం, ఇతర ఉద్యమ నేతలు సమావేశాలు పెట్టుకుంటామంటే అల్లర్లు జరుగుతాయంటూ అనుమతులివ్వని చంద్రబాబు.. కాపులతో ఎలా సమావేశం పెట్టుకున్నారని ప్రశ్నించారు. వంగవీటి రంగా, పింగళి దశరథ్‌ను చంద్రబాబే హత్య చేయించారని ఆరోపించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట రోశయ్య, యూఎస్ఏ కన్వీనర్ రత్నాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలే ప్రచార అస్త్రాలు

- నంద్యాల, కాకినాడల్లో విజయం తథ్యం
- 'దేశం' పాలనలో రాజ్యాంగ ఉల్లంఘన
- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ధర్మాన



బుధవారం కాకినాడలో విలేకరులతో మాట్లాడుతున్న ధర్మాన. చిత్రంలో విజయసాయిరెడ్డి, బొత్స, పిల్లి సుభాష్, చెవిరెడ్డి, చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి, ముత్తా శశిధర్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: మూడున్నరేళ్లలో అన్ని వర్గాలనూ దగా చేసి అవినీతి ఊబిలో కూరుకుపోయిన టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలే నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో తమ ప్రచారాస్త్రాలని వైఎస్సార్ సీపీ జిల్లా పరిశీలకుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని సరోవర్ పోర్టికోలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలుపొందిన 21 మంది ఎమ్మెల్యేలకు చంద్రబాబు కండువా కప్పినా స్పీకర్ మాత్రం ఇదేమీ తెలియదన్నట్టు నటిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఓటు ద్వారా ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కాకినాడ పార్లమెంట్ కో–ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, సిటీ కో–ఆర్డినేటర్ ముత్తా శశిధర్ తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా



పెద్దకొట్టాల గ్రామంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆర్‌కే రోజా

నంద్యాల రూరల్: టీడీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని నగరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా అన్నారు. కర్నూలు జిల్లా నంద్యాల మండల పరిధిలోని పెద్దకొట్టాల, అబాండం తాండ, బిల్లలాపురం, కొత్తపల్లె గ్రామాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆమె రోడ్‌షో నిర్వహించారు. 2004 నుంచి నంద్యాల గడ్డ వైఎస్సార్ అడ్డాగా నిలిచిందని, ఈ ఉప ఎన్నిక రాజన్న రాజ్యం స్థాపనకు పునాది కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలుగా గెలిచి పార్టీ ఫిరాయించి మంత్రి పదవులు అనుభవిస్తున్న ఆదినారాయణరెడ్డి, అఖిలప్రియ, అమర్‌నాథరెడ్డిలను పక్కనబెట్టుకొని శిల్పా సోదరులపై సినీ నటుడు, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే హోదాలో ఉండి అమ్మాయిలు అందంగా కనబడితే ముద్దు పెట్టుకోవాలని చెప్పడం బాలకృష్ణకే చెందిందని ఎద్దేవా చేశారు. ఇసుక మాఫియాను అడ్డుకున్న తహసీల్దార్ వనజాక్షికి రక్షణ కల్పించకుండా ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు బెదిరింపులకు దిగారని గుర్తు చేశారు. ఇలాంటి బావ, బావమరుదుల పాలనలో మహిళలకు రక్షణ ఎక్కడ ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా నంద్యాలలో గెలిచిన భూమానాగిరెడ్డిపై అక్రమ కేసులు బనాయించి, రౌడీ షీట్ తెరిపించిన ఘనత చంద్రబాబుది కాదా అని ప్రశ్నించారు. విశ్వసనీయతకు, వెన్నుపోటుకు మధ్య నంద్యాలలో ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రజలు ధర్మంవైపు నిలబడాలని పిలుపునిచ్చారు. శిల్పామోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



పోలీసుల ఏకపక్ష వైఖరి

- వైఎస్సార్సీపీకి చెందిన మాజీ సర్పంచ్ ఇంట్లో సోదాలు
- రూ.1.75 లక్షలు స్వాధీనం.. రసీదులు చూపినా పట్టించుకోని వైనం



బంగారం తనఖా రసీదులను చూపిస్తున్న బాల హుస్సేన్

సాక్షి బృందం, నంద్యాల: నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్లు నడుచుకుంటున్నారు. సోదాల పేరుతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను భయాందోళనకు గురిచేస్తున్నారు. బుధవారం నంద్యాల మండలం చాబోలు గ్రామంలో రైతు, మాజీ సర్పంచ్ బాల హుస్సేన్ ఇంట్లో పోలీసులు చొరబడి హల్‌చల్ చేశారు. బాలహుస్సేన్ వ్యవసాయ ఖర్చుల కోసం నంద్యాల ఆంధ్రబ్యాంకు శాఖలో బంగారు తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకున్నాడు. ఈయనకు 50 గేదెలు, 14 ఎకరాల పొలం ఉంది. రోజూ పాల విక్రయం ద్వారా వచ్చే ఆదాయం రూ.20వేల వరకు ఉంటుంది. రైతు దగ్గర ఉన్న డబ్బులకు సరైన ఆధారాలు చూపినా పోలీసులు కనికరించలేదు. ఇంట్లో చొరబడి అణువణువూ గాలించి బెదిరింపు చర్యలకు దిగారు. ఇంట్లో ఉన్న రూ.1.75 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. రైతు బాల హుస్సేన్ జూలై 24వ తేదీన రూ.1.20 లక్షలు, ఈ నెల 16వ తేదీన రూ.50వేలను బంగారు తాకట్టు పెట్టి తెచ్చుకున్నాడు. ఆ రసీదులు చూపినా పోలీసులు పట్టించుకోకుండా పంచనామా రాశారు. నంద్యాల రూరల్ ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో 20 మంది పోలీసులు, ఎన్నికల మండల ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, బాల హుస్సేన్, ఆయన కుమారులు పెద్ద జమాలు, చిన్న జమాలతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ సోదాలు చేసి భయాందోళనకు గురిచేశారు.

'కారుణ్యం' చూపండి

- నయం కాని వ్యాధితో బాధపడుతున్నా సాయమందించడం లేదు
- ఈ జీవితం నా వల్ల కాదు.. కారుణ్య మరణానికి అనుమతించండి
- ప్రభుత్వానికి బాధితుడు శ్రీనివాస్ విజ్ఞప్తి

గుడివాడ: 'రెండేళ్లుగా నయం కాని వ్యాధితో బాధపడుతున్నాను. ఎనిమిది నెలలుగా మంచానికే పరిమితమైపోయాను. పౌష్టికాహారం లేదు.. మందులు అంతంత మాత్రమే. నా తల్లి కూలీనాలీ చేసి పోషిస్తోంది. ముఖ్యమంత్రి, ప్రధాని సహాయ నిధి కోసం విన్నవించినా ఫలితం లేదు. ఈ జీవితం నా వల్ల కాదు. కనీసం కారుణ్య మరణానికి అయినా అవకాశం కల్పించండి..' అంటూ కృష్ణా జిల్లా దొండపాడుకు చెందిన 34 ఏళ్ల యువకుడు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. పదో తరగతి చదివిన సబ్బినేని శ్రీనివాస్(34)కు రెండేళ్ల క్రితం నయం కాని వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. పౌష్టికాహారం అందక అతి తక్కువ కాలంలోనే రోగ తీవ్రత పెరిగి మంచాన పడ్డాడు. సొంత అన్న చిన్న వయసులోనే గుండెపోటుతో మరణించగా.. తల్లి కూలీనాలీ చేసి పోషిస్తోంది. ఈ నేపథ్యంలో తన పరిస్థితిని వివరిస్తూ.. సీఎం సహాయ నిధి నుంచి సాయమందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. దీంతో గుడివాడ రెవెన్యూ అధికారులు జూన్ మొదటి వారంలో శ్రీనివాస్ ఇంటికి వచ్చి పరిశీలించి వెళ్లారు. అనంతరం జూన్ 24న సమస్య పరిష్కారమయ్యిందంటూ శ్రీనివాస్‌కు మెసేజ్ పంపారు. కానీ ఎలాంటి సాయమందలేదు. కనీసం నెలకు రూ.వెయ్యి పింఛన్ కూడా అందించట్లేదు. చివరకు ప్రధాని సహాయ నిధి కోసం కూడా దరఖాస్తు చేశాడు. కానీ అటు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీనివాస్.. కనీసం కారుణ్య మరణానికైనా అనుమతివ్వాలని జూలై 25న రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. దీనిపైన కూడా ప్రభుత్వం స్పందించలేదు. ఈ నేపథ్యంలో 'బతికేందుకు ఎటూ సాయం చేయలేకపోయారు.. కనీసం చనిపోయేందుకైనా అనుమతించండి..' అంటూ శ్రీనివాస్ కన్నీటిపర్యంతమయ్యాడు.

నెల్లూరు యువకుడు చెన్నైలో అదృశ్యం


సాయితేజ (ఫైల్)

జలదంకి: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చెన్నైలో అదృశ్యమయ్యాడు. వివరాలు.. జలదంకి మండలంలోని జమ్మలపాలెం గ్రీన్‌హౌస్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కంచర్ల ప్రసాద్, రాధ దంపతుల కుమారుడు వెంకట సాయితేజ.. చెన్నైలోని మైండ్ ట్రీ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. వరుస సెలవులు కావడంతో అతని స్నేహితులు తమతమ స్వస్థలాలకు వెళ్లిపోయారు. సాయితేజ మాత్రం కంపెనీ ప్రాజెక్ట్ నిమిత్తం ఆస్ట్రేలియా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉందంటూ చెన్నైలోనే ఉండిపోయాడు. ఆదివారం సాయంత్రం సాయితేజ తన సెల్‌ఫోన్‌ను రూములోనే వదిలి.. బైక్‌పై చెన్నైలోని పల్లవాకం బీచ్‌కు వెళ్లాడు. అప్పట్నుంచి అతని ఆచూకీ తెలియడం లేదు. తీవ్ర ఆందోళనకు గురైన సాయితేజ తల్లిదండ్రులు మంగళవారం చెన్నై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అగ్రిగోల్డ్‌ను కొనాలంటే రూ.వంద కోట్లు డిపాజిట్

షరతు విధించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: అగ్రిగోల్డ్‌ను కొనేందుకు ఆసక్తి చూపుతున్న కంపెనీ తొలుత రూ.100 కోట్లను డిపాజిట్ చేయాలని హైకోర్టు షరతు విధించింది. వంద కోట్ల రూపాయల్ని డిపాజిట్ చేశాకే ఆ కంపెనీ వాదన వింటామని ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ ఎస్‌వి భట్‌లతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. అగ్రిగోల్డ్ కంపెనీ డిపాజిటర్లను మోసం చేసిన కేసును సీబీఐతో విచారణకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాల్ని బెంచ్ బుధవారం విచారించింది. అగ్రిగోల్డ్ సంస్థను కొనుగోలు చేసేందుకు తమ కంపెనీ సిద్ధంగా ఉందని ఓ కంపెనీ తరపు సీనియర్ న్యాయవాది రఘురాం చెప్పారు. ఆస్తుల మదింపునకు అర్ధ సంవత్సరం కాలం పట్టవచ్చు.. ఆ తర్వాత కంపెనీని కొనుగోలు చేయలేం.. అని చెబితే పరిస్థితి ఏమిటి? అందుకే కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్న కంపెనీ రూ.100 కోట్లను డిపాజిట్ చేస్తే ఆ సంస్థ నిజాయితీ కూడా వెల్లడి అవుతుంది అని బెంచ్ పేర్కొంది. వచ్చే విచారణలో దీనిపై స్పందిస్తామని న్యాయవాది చెప్పారు. ఈ–వేలంలో వచ్చిన రేట్లకు రెట్టింపు ధర చెల్లించే బిడ్డర్లను ఈ నెల 31లోగా తేవాలని అగ్రిగోల్డ్ యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. లేనిపక్షంలో పాత వాటిని ఆమోదిస్తామని ప్రకటించింది.

అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర ప్రారంభం

ఇచ్ఛాపురం(శ్రీకాకుళం): తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ప్రకటించింది. అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్రవ్యాప్త చైతన్య యాత్ర బుధవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం దాసన్న కూడలిలో ప్రారంభమైంది. 142 మంది అగ్రిగోల్డ్ బాధితులు చనిపోతే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బస్సు యాత్ర సెప్టెంబర్ 17న అనంతపురం చేరే వరకు కొనసాగుతుందని తెలిపారు. చైతన్య యాత్రలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణ, అగ్రిగోల్డ్ బాధిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అగ్రిగోల్డ్ బాధితుడి మృతి

కొత్తూరు (తాడేపల్లి రూరల్): గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని కొత్తూరు పశువుల ఆసుపత్రి సెంటర్‌లో నివాసం ఉండే అగ్రిగోల్డ్ బాధితుడు వేముల రాజశేఖర్ (43) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. రాజశేఖర్ అగ్రిగోల్డ్‌లో ఏజెంట్‌గా ఉంటూ తాడేపల్లి పట్టణ పరిధిలోని చాలామందితో నగదును అగ్రిగోల్డ్‌లో డిపాజిట్ చేయించాడు. దాంతోపాటు తన ఇద్దరు కుమార్తెల పేరుతో కూడా రూ.3 లక్షలు డిపాజిట్ చేసినట్లు భార్య విజయ లక్ష్మి తెలిపారు. కష్టపడి సంపాదించిన డబ్బంతా అగ్రిగోల్డ్‌లో డిపాజిట్ చేయగా సంస్థ మూతపడడంతో రాజశేఖర్ మనోవేదనకు గురైనట్లు బంధువులు చెప్పారు. ఆవేదన తట్టుకోలేక గుండెపోటుతో మరణించాడని తెలిపారు.


మద్యం విధానం లోప భూయిష్టం

బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతంపేట (విశాఖ ఉత్తరం): రాష్ట్రంలో మద్యం విధానం లోప భూయిష్టంగా ఉందని బీజేపీ శాసనసభా పక్షనేత పి.విష్ణుకుమార్‌రాజు మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయాల సమీపంలో, నివాసాల మధ్య బార్‌లు, వైన్ షాపులకు లైసెన్స్‌లు మంజూరు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో జనావాసాల మధ్య ఉన్న ఆరు వైన్ షాపులను తొలగించాలని ఎక్సైజ్ కమిషనర్ లక్ష్మీనరసింహంకు లేఖ రాశానని, అయినా లైసెన్స్‌లు మంజూరు చేశారన్నారు. ప్రభుత్వ వైఖరి మారకుంటే మహిళలతో కలిసి వైన్‌షాపుల ఏర్పాటును అడ్డుకొని తీరతామని హెచ్చరించారు.

చంద్రబాబును నమ్మి మోసపోయాం..!

- డ్వాక్రా రుణమాఫీ చేస్తామంటే నమ్మి టీడీపీకి ఓట్లేశాం
- చంద్రబాబు మాట విని రుణం చెల్లించకపోతే కోర్టు నుంచి సమన్లు వచ్చాయి
- రాజధానికి చేరువలోని మోతడక గ్రామ డ్వాక్రా మహిళల ఆవేదన
- గ్రామంలోని మరో 15 డ్వాక్రా గ్రూపులకూ కోర్టు సమన్లు..


Senior Civil Judge Mangalagiri
SBI Mothadaka
Rep by its B.M.
and
Divya M.G. members
TO
Tadikonda (M), Guntur (D)
(By Order)
SUPERINTENDENT


తమ గోడు చెప్పుకుంటున్న డ్వాక్రా మహిళలు (పక్క చిత్రంలో) కోర్టు సమన్లు

సాక్షి, గుంటూరు: ''డ్వాక్రా అక్క చెల్లెళ్లకు రుణాలన్నీ మాఫీ చేస్తాం.. అధికారులు, బ్యాంకర్లు వచ్చినా డబ్బు కట్టవద్దు.. మీకు అండగా నేనుంటా.. అంటూ ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీలు నమ్మి మోసపోయాం. ఆయన మాట నమ్మి రుణం చెల్లించనందుకు డిఫాల్టర్లుగా మారడంతోపాటు, వడ్డీలు పెరిగిపోయి రుణభారం ఎక్కువైంది. రుణం చెల్లించలేదనే కారణంతో బ్యాంకు వారు కోర్టు నుంచి దావా సమన్లు పంపారు. టీడీపీని నమ్మి ఓట్లేసినందుకు మమ్మల్ని కోర్టు మెట్లు ఎక్కిస్తున్నారు'' అని గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు వాపోయారు. ఇదే విషయమై గుంటూరు నగరంలో ఉన్న టీడీపీకి చెందిన తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌ను సుమారు 30 మంది మహిళలు బుధవారం సాయంత్రం కలిసి తమ గోడు విన్నవించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు మాట నమ్మి డ్వాక్రా రుణం చెల్లించనందుకు ఇప్పుడు వడ్డీలతో కలసి తడిసిమోపెడైందని, కోర్టు నుంచి సమన్లు అందుకునే దురవస్థ దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి తమకు ఇబ్బందుల్లేకుండా చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు 'సాక్షి'తో మాట్లాడుతూ.. బాబు ఇచ్చిన హామీ నమ్మి ఓట్లు వేసి మోసపోయామన్నారు. ప్రభుత్వమిచ్చిన హామీ ప్రకారం తమను రుణ విముక్తుల్ని చేసి కొత్త రుణాలందించాలని కోరారు.

ఇదీ జరిగింది..: తాడికొండ మండలం మోతడకకు చెందిన దివ్య డ్వాక్రా మహిళ గ్రూపు సభ్యులు ఆరేళ్లక్రితం మోతడకలోని ఎస్‌బీఐ బ్రాంచ్ నుంచి రూ.4 లక్షలు రుణం తీసుకున్నారు. అప్పట్నుంచీ నెలకు రూ.10 వేలు చొప్పున 26 నెలలపాటు రూ.2.60 లక్షలు తిరిగి చెల్లించారు. ఆ సమయంలో.. తాను అధికారంలోకొస్తే డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానన్న చంద్రబాబు హామీని విశ్వసించి మిగతా బకాయి రూ.1.40 లక్షలను 2014 నుంచి తిరిగి చెల్లించకుండా వదిలేశారు. చంద్రబాబు సీఎం అయి మూడేళ్లు దాటినా డ్వాక్రా రుణమాఫీ చేయకపోవడంతో రూ.1.40 లక్షలు కాస్తా వడ్డీతో కలిపి రూ.7 లక్షలకు పెరిగిపోయింది. బకాయి ఉండటంతో ఈ గ్రూపును డిఫాల్టర్‌గా గుర్తించిన బ్యాంకు కొత్త రుణాలివ్వకపోగా, తమ బాకీ చెల్లించాలంటూ కోర్టు ద్వారా దావా సమన్లు పంపింది. ఈ నెల 21న కోర్టులో హాజరవ్వాలంది. దివ్య మహిళ గ్రూపుతోపాటు గ్రామానికి చెందిన మరో నాలుగు డ్వాక్రా గ్రూపులకు సమన్లు అందినట్లు చెబుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన మరో 11 గ్రూపులకు సైతం కోర్టు సమన్లు వచ్చాయి.

పెన్షనర్లకు 3.668 శాతం కరువు భృతి

సాక్షి, అమరావతి: పెన్షనర్లకు 3.668 శాతం కరువు భృతి (డీఆర్)ని ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా, ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ) విడుదల చేస్తూ ప్రభుత్వం వారం క్రితమే ఉత్తర్వులిచ్చింది. దీనికి అనుగుణంగా పెన్షనర్లకు డీఆర్ మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది జులై నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు మూడు డీఏలు, డీఆర్‌లు పెండింగులో ఉండగా ప్రస్తుతం ఒకటి మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసింది. పెన్షనర్లకు బేసిక్ పెన్షన్‌పై 18.340 శాతం ఉన్న డీఆర్‌ను 22.008 శాతానికి పెంచింది. 2010లో సవరించిన పే స్కేలు ప్రకారం బేసిక్ పెన్షన్‌పై డీఆర్ 93.304 శాతం నుంచి 99.296 శాతానికి పెరిగింది. 2005లో సవరించిన వేతనాల ప్రకారం పెన్షన్ పొందుతున్న వారికి బేసిక్ పెన్షన్‌పై డీఆర్ 222.312 శాతం నుంచి 232.674 శాతానికి పెరిగింది. ఈ పెరిగిన డీఆర్ గత ఏడాది జూలై 1వ తేదీ నుంచే వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కుప్పకూలిన పాఠశాల భవనం

- విద్యార్థులు సమీపంలో లేకపోవడంతో తప్పిన ముప్పు
- శ్రీకాకుళం జిల్లాలో ఘటన


శ్రీరామపురంలో కూలిన పాఠశాల తరగతి గది

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శిథిలావస్థకు చేరిన భవనానికి మరమ్మతులు చేయించే విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం బట్టబయలైంది. శ్రీకాకుళం జిల్లాలో బుధవారం ఓ ప్రభుత్వ పాఠశాల భవనం కూలిపోయింది. విద్యార్థులు సమీపంలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం శ్రీరామపురం (అద్వానం పేట)లో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో 25 మంది విద్యార్థులున్నారు. పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పటిలాగే ఉదయం విద్యార్థులు వచ్చి ప్రార్థన చేస్తున్న సమయంలో ఒక గదిలో పైకప్పు నుంచి పెచ్చులు కిందపడ్డాయి. విద్యార్థులను ఉపాధ్యాయులు మరో గదిలో కూర్చోబెట్టి పాఠాల బోధన ప్రారంభించారు. పెచ్చులు పడిన గదిని శుభ్రం చేయించారు. తర్వాత విరామం కోసం బయటకు విడిచిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే గది మొత్తం కుప్పకూలిపోయింది. పెద్ద శబ్దం రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బయటకు పరుగులు తీశారు. కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

పలుచోట్ల మోస్తరు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగనున్నాయి. ప్రస్తుతం ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర, రాయలసీమల మీదుగా అల్పపీడన ద్రోణి కొనసాగుతోంది. మరోవైపు గురువారం వాయవ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమబెంగాల్ తీరానికి ఆనుకుని ఉపరితల ఆవర్తనం ఏర్పడనుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం రాత్రి పేర్కొంది. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్రలో పలుచోట్ల, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. ఈనెల 20వ తేదీన కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురవవచ్చని పేర్కొంది. గడచిన 24 గంటల్లో పలాస, వీరఘట్టం, గరుగుబిల్లిల్లో 7, డెంకాడ, కుప్పంలలో 5, ధోన్, ఎర్రగొండపాలెంలలో 4, దర్శి, సీతానగరంలో 3 సెం.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది.

పులిచింతలలోనూ అ'ధనం'!

అదనంగా రూ.355 కోట్లు చెల్లించేందుకు సర్కారు సిద్ధం

సాక్షి, అమరావతి

పులిచింతల ప్రాజెక్టు పనుల ఒప్పంద విలువ రూ.268.87 కోట్లు. అయితే కాంట్రాక్టర్‌తో ముఖ్యనేత కుదుర్చుకున్న చీకటి ఒప్పందం వల్ల కాంట్రాక్టర్‌కు రూ.355 కోట్లు అదనంగా చెల్లించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున ముడుపులు చేతులు మారనున్నాయనేది బహిరంగ రహస్యం. కృష్ణా డెల్టాలో 12.57 లక్షల ఎకరాల ఆయకట్టుకు సకాలంలో నీళ్లందించాలన్న లక్ష్యంతో ప్రకాశం బ్యారేజీకి 83 కిమీల ఎగువన పులిచింతల ప్రాజెక్టుకు అక్టోబర్ 15, 2004న దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. హెడ్ వర్క్స్ పనులను టీడీపీతో సన్నిహిత సంబంధాలు ఉన్న ఎంఎస్ఎస్‌సీఎల్–షీర్ సంస్థ చేజిక్కించుకుంది. పనులు దాదాపుగా పూర్తయ్యాక ప్రాజెక్టు డిజైన్ మారిందని, స్పిల్ వేను 500.25 మీటర్లు పెంచారని, గేట్లను 39 నుంచి 24కు తగ్గించారని, భూసేకరణ చేయకపోవడం వల్ల పనుల్లో జాప్యం జరిగినందున ధరల సర్దుబాటు కింద అదనపు నిధులు ఇవ్వాలని.. ఇలా మొత్తం మీద అదనంగా రూ.220 కోట్లు ఇవ్వాలంటూ 2013లో కాంట్రాక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అప్పట్లో ఈ ప్రతిపాదనను వామన్‌రావు, జె.ఈశ్వర్‌ప్రసాద్, మోతీలాల్.బి.నాయక్‌లతో కూడిన ఆర్బిట్రేషన్ కమిటీ పరిశీలనకు సర్కార్ పంపింది. కమిటీ ఫిబ్రవరి 2, 2014న నివేదిక ఇచ్చింది. కాంట్రాక్టర్‌కు అదనంగా రూ.122 కోట్లు చెల్లించవచ్చునని ఇద్దరు సభ్యులు అభిప్రాయపడితే, మరో సభ్యుడు మాత్రం రూ.11 కోట్లు ఇస్తే సరిపోతుందని సూచించారు. ఈ సూచనలను అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ పరిశీలనకు ప్రభుత్వం పంపింది. పనుల జాప్యానికి కాంట్రాక్టర్ చెప్పిన కారణాల్లో అధిక శాతం వాస్తవం కాదని..అయితే రూ.72 కోట్లను అదనంగా చెల్లించవచ్చునని ఆ కమిటీ అభిప్రాయపడింది. కానీ ఆర్బిట్రేషన్ కమిటీ ప్రతిపాదనలనే అమలు చేయాలని కాంట్రాక్టర్ పట్టుబట్టారు. దాంతో ఆర్బిట్రేషన్ కమిటీ ప్రతిపాదనలను సవాల్ చేస్తూ కృష్ణా డెల్టా అప్పటి ఎస్ఈ మచిలీపట్నం ప్రిన్సిపల్ జడ్జి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

కింది కోర్టు తీర్పుపై హైకోర్టుకు వెళ్లకుండా..

ఒకపక్క హైకోర్టుకు వెళ్లకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంటే.. మరోవైపు కాంట్రాక్టర్ జూన్ 2, 2015 నాటి తీర్పును అమలు చేయడం లేదంటూ మరోసారి మచిలీపట్నం కోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన కోర్టు తక్షణమే తీర్పును అమలు చేయాలంటూ గత నెల 31న తీర్పు ఇచ్చింది. ఆ క్రమంలో కాంట్రాక్టర్ ప్రతిపాదించిన మేరకు విజయవాడలో జలవనరుల శాఖకు చెందిన కొన్ని ఆస్తులను జప్తు చేసింది. మచిలీపట్నం కోర్టు తాజా తీర్పుపై హైకోర్టుకు వెళదామని జలవనరుల శాఖ ఉన్నతాధికారి మరోసారి చేసిన సూచనను సైతం ముఖ్యనేత, కీలక మంత్రి తోసిపుచ్చినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. కాంట్రాక్టర్‌కు 2013 నుంచి వడ్డీతో కలిపి అదనంగా రూ.355 కోట్లను పరిహారంగా ఇచ్చేయాలంటూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపాయి. ఆ మేరకు మూడు రోజుల క్రితం ఆర్థిక శాఖకు జలవనరుల శాఖ ప్రతిపాదనలు పంపింది. కోర్టు తీర్పును సాకుగా చూపుతూ కాంట్రాక్టర్‌కు పరిహారం ఇచ్చేయాల్సిందేనంటూ ఆర్థిక శాఖపై ముఖ్యనేత తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

కాంట్రాక్టర్‌తో చీకటి ఒప్పందం

2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కోర్టులో వాదనలు విన్పించడంలో పూర్తిగా విఫలమయ్యింది. దీంతో కాంట్రాక్టర్ కోరిన విధంగా రూ.220 కోట్లు అదనంగా ఇవ్వాలని జూన్ 2, 2015న న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఇదే అదనుగా ముఖ్యనేత కాంట్రాక్టర్‌తో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన కీలక మంత్రి.. కోర్టు తీర్పు మేరకు 2013 నుంచి ఇప్పటివరకు వడ్డీతో కలిపి కాంట్రాక్టర్‌కు పరిహారంఇవ్వాలంటూ జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు ఆర్థిక శాఖకు జలవనరుల శాఖ ప్రతిపాదనలు పంపింది. 2013లో హైపవర్ కమిటీ సూచించిన మేరకు కాంట్రాక్టర్‌కు రూ.72 కోట్లుకు మించి ఇచ్చేది లేదని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. మరోవైపు న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై హైకోర్టుకు వెళదామని ఓ ఉన్నతాధికారి ప్రతిపాదించినా మంత్రి మాత్రం కాంట్రాక్టర్‌కు పరిహారం ఇవ్వాల్సిందేనంటూ అధికారులపై ఒత్తిడి తెస్తూ వచ్చారు. ఈ మేరకు జలవనరుల శాఖ దాదాపు 8 సార్లు ప్రతిపాదనలు పంపినా ఆర్థిక శాఖ తోసిపుచ్చింది.

కబ్జా చేయాలనుంది..

పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ప్రారంభోత్సవ సభలో సీఎం వ్యాఖ్య


పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు, డీజీపీ

సాక్షి, అమరావతి: ''డీజీపీ కార్యాలయాన్ని కబ్జా చేయాలనుంది.. ఇక్కడే సీఎం ఆఫీసును పెట్టుకోవాలనుంది'' అని సీఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో రూ.40 కోట్లతో నిర్మించిన పోలీస్ హెడ్‌క్వార్టర్స్(డీజీపీ కార్యాలయం)ను సీఎం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. డీజీపీ కార్యాలయం కబ్జా చేయాలని ఉన్నా చేయనని, తాను అలా చేస్తే ఎవరూ మంచి ఆఫీసు కట్టుకోరని ముక్తాయించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకోసం పాటుపడుతున్న పోలీసుల బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని, ప్రతీ పోలీసుకూ ఇల్లు కట్టిచ్చే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో పోలీస్ ఫోర్స్ రోబోలను మించిపోతోందన్నారు. గుంటూరు జిల్లాలో బోరుబావి నుంచి చిన్నారిని కాపాడటంలో పోలీసుల చొరవ అభినందనీయమన్నారు. 20ఏళ్ల క్రితం గ్రేహౌండ్స్ ప్రాధాన్యాన్ని గుర్తించి ప్రోత్సహించామని, ఇప్పుడు ఏపీ గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌లు దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచాయని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వినూత్నరీతిలో ఆలోచించే ఆధునిక పోలీసింగ్ ఉండాలన్నారు. అలాగాక బ్లూ బుక్ ప్రకారమే పనిచేస్తామంటే ఫలితాలు కూడా అలానే ఉంటాయన్నారు. ఇందుకోసం ప్రతీ నెలా క్రైం సమావేశాల్లో నిర్వహించే సమీక్షల్లో నేరాల తీరును గమనించి నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేలా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రజలకు భద్రత, భరోసాతో కూడిన సంతోషం ఉండేలా పోలీసు వ్యవస్థ పనిచేయాలని సూచించారు. కాగా, సీఎం తన ప్రసంగానికి ముందు అడ్డుగా ఉన్నవారందర్నీ పక్కకు తప్పుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తనకు చుట్టూ రక్షణగా ఉన్న పోలీసుల్ని సైతం తప్పుకోవాలంటూ, ఇంతమంది పోలీసులుండగా ఎవరూ ధైర్యం చేయరని వ్యాఖ్యానించారు. తొలుత డీజీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం ఐదు అంతస్తుల్ని పరిశీలించారు. తీవ్రవాదుల్ని ప్రతిఘటించి వారి ఆటకట్టించడంలో ఎటువంటి టెక్నిక్‌లు పాటిస్తారనే విషయంలో పోలీస్ శాఖకు చెందిన ఆక్టోపస్ టీమ్ ఇచ్చిన ప్రదర్శన(డెమో)ను చూసి సీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, పితాని సత్యనారాయణ, నక్కా ఆనందబాబు, జవహర్, కామినేని శ్రీనివాస్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఆర్ అనురాధ, డీజీపీ నండూరి సాంబశివరావు, పలు విభాగాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కింగ్స్ కాలేజీతో యూరప్ ఇక్కడికొస్తుంది

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రులు కామినేని శ్రీనివాస్, నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ కేశినేని నాని, కింగ్స్ కాలేజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మమ్మల్ని బలవంతంగా సమావేశానికి తీసుకొచ్చారు

ఈ సమావేశానికి నగరం నలువైపుల ఉన్న విద్యాసంస్థల నుంచి విద్యార్థినుల్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారిని పలకరిస్తే.. తమను బలవంతంగా తీసుకొచ్చారని విద్యార్థినులు చెప్పారు. అచ్చెన్నాయుడు కార్యక్రమముందని తమ మేడం తొలుత చెప్పారని, తర్వాత ఊరంతా తిప్పి ఇక్కడికి తీసుకొచ్చారని, ట్యాబ్‌లిస్తారని ఆశచూపారని, ఇక్కడకొచ్చాక ఏమీ ఇవ్వలేదని గుణదలలోని బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో ఉన్న విద్యార్థినులు తెలిపారు. సీఎం సమావేశం జరుగుతోందని, మీరంతా రావాలని మా సారు చెబితే వచ్చామని కస్తూర్బానగర్‌లోని బిషప్ హజరయ్య హైస్కూలు విద్యార్థినులు చెప్పారు. సీఎం సమావేశానికని తమను తీసుకొచ్చారని, ఇక్కడికొచ్చాక తమను బయటే నిలుచోబెట్టి మంచినీళ్లు కూడా ఇవ్వలేదని పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఆవేదన వెలిబుచ్చారు.

ఇంటింటికీ జగన్

- మహిళల నుంచి అపూర్వ స్పందన
- పోటీలు పడుతూ తమ ఇళ్లల్లోకి ఆహ్వానం
- తన కోసం ప్రార్థన చేయాలన్న వైఎస్సార్‌సీపీ అధినేత
- పాదయాత్రగా మారిన రోడ్ షో

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్‌షో కాస్తా పాదయాత్రగా మారిపోయింది. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో దారి పొడవునా మహిళల నుంచి ఆయనకు అపూర్వ ఆదరణ లభిస్తుండటంతో.. ఎవరినీ కాదనలేక అడిగిన వారందరి ఇళ్లకూ వెళ్లి కుటుంబసభ్యులను పలుకరించారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన జగన్ ప్రచారం రాత్రి 8 గంటల దాకా సాగింది. 1వ వార్డు హరిజన పేటలో జగన్ తన రోడ్‌షోను ప్రారంభించిన కొద్దిసేపటికే మహిళలు ఆయనను తమ ఇళ్లల్లోకి ఆహ్వానించడం మొదలు పెట్టారు. 'మా ఇంట్లో ఒక్కసారి అడుగు పెట్టి వెళ్లన్నా...', 'మా ఇంట్లో గుక్కెడు నీళ్లు తాగన్నా...' అని మహిళలు కోరడంతో జగన్ దాదాపుగా ప్రతి ఇంటిలోకి వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా ఇళ్లల్లో కుటుంబసభ్యులు జగన్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. జగన్ కూడా ఎవరినీ నిరాశ పరచకుండా సెల్ఫీలు దిగారు. ముస్లిం సోదరుల ఇళ్లల్లోకి వెళ్లినప్పుడు.. తన కోసం 'దువా' (ప్రార్థన) చేయండి తల్లీ అంటూ జగన్ మహిళలను కోరారు. మరి కొందరు తమ సమస్యలను వివరించినప్పుడు పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తర్వాత మాల్దారిపేట, స్వాలీహీనా మసీదు, నడిగడ్డ, నబీనగర్, కోట వీధి, జగజ్జననీ నగర్, ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతాల్లో జగన్ పర్యటించారు.

నడిగడ్డలో స్పందన అమోఘం

ముస్లింలు ఎక్కువగా ఉన్న నడిగడ్డ ప్రాంతంలో కూడా మహిళల నుంచి జగన్ పర్యటనకు మంచి స్పందన లభించింది. గంటల తరబడి వారు జగన్ రాక కోసం వేచి చూశారు. తమ ఇళ్లల్లోకి రావాలంటూ ఆహ్వానించారు. జగన్ ఎవరినీ నిరుత్సాహ పర్చకుండా, ప్రచారం ఆలస్యం అవుతున్నా లెక్క చేయకుండా ఇంటింటికీ వెళ్లడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ఈ ప్రాంతంలో తనకు రాఖీ కట్టిన హిజ్రా ఒకరిని ఆయన ఆప్యాయంగా పలుకరించారు. జగన్‌తో హిజ్రా సెల్ఫీ కూడా తీసుకున్నారు. దారి పొడవునా జగన్ ఇళ్లల్లో ఉన్న చిన్న పిల్లలను ఎత్తుకుంటూ మురిపెం చేశారు. వృద్ధ మహిళల ఆశీస్సులు పొందారు.

పార్టీలో చేరిన ఎన్జీవో నేతలు

కర్నూలు జిల్లా ఎన్జీవోల సంఘం మాజీ అధ్యక్షుడు క్రిష్టఫర్, ఇతర నేతలు జయకర్, అరుణ్‌లు బుధవారం జగన్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ శాసనసభాపక్ష ఉప నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వై.రామయ్య ఈ సందర్భంగా హాజరయ్యారు.


వైఎస్ జగన్‌తో కరచాలనం చేయడానికి ఉత్సాహం చూపుతున్న ముస్లిం మహిళలు


వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

హాఫీజ్ ఏ ఖురాన్ దువా

రజావలి అనే హాఫీజ్ ఏ ఖురాన్ జగన్‌ను తన ఇంట్లోకి సాదరంగా ఆహ్వానించి ఆయన కోసం ప్రత్యేకంగా దువా చేశారు. జగన్‌కు రాజకీయంగా విజయం చేకూరాలని ఆకాంక్షించారు. ఇరుకైన సందులు, వీధుల్లో ఉన్న మారుమూల ఇళ్లల్లోకి కూడా జగన్ వెళ్లారు.

నబీ నగర్ ప్రాంతంలో జగన్ ప్రచారం సాగుతూ ఉండగానే అక్కడి మసీదులో ముస్లింలు నమాజు ముగించుకుని పెద్ద సంఖ్యలో బయటకు వచ్చారు. వారంతా జగన్‌ను ఆపి ఆలింగనం చేసుకున్నారు. ఆయన వారి పేర్లను అడిగి తెలుసుకుంటూ అక్కడ కొద్దిసేపు గడిపారు.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

దరఖాస్తు చేశారా?

- హెచ్‌ఎంటీ మెషిన్ టూల్స్ లిమిటెడ్‌లో 12 'మేనేజర్' పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 18
- హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్‌లో 42 ట్రేడ్ అప్రెంటీస్ పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 19
- బెల్(బెంగళూరు)లో 9 'మేనేజర్' పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 19



45వ సీజేఐగా జస్టిస్ దీపక్ మిశ్రా

జాతీయం

ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం



71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 15న న్యూఢిల్లీలోని ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ప్రసంగించిన మోదీ..గత మూడేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలు, కీలక నిర్ణయాలను ప్రస్తావించారు. నోట్ల రద్దు, జీఎస్టీ అమలును సాహసోపేత నిర్ణయాలుగా అభివర్ణించారు. అవినీతి, నల్లధనంపై పోరు కొనసాగుతుందని, దేశాన్ని దోచుకున్నవారు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. ఉగ్రవాదంపై కఠిన వైఖరి కొనసాగుతుందన్నారు. సముద్రం, సరిహద్దులు ఎక్కడైనా, ఎలాంటి భద్రతా సవాలునైనా ఎదుర్కొనే సత్తా భారత్‌కు ఉందన్నారు.

75 ఏళ్ల 'క్విట్ ఇండియా'పై తీర్మానం

క్విట్ ఇండియా ఉద్యమానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 9న లోక్‌సభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ..స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేశారు. సభ్యుల ప్రసంగాల అనంతరం ఉభయసభల్లో సంబంధిత తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఉద్గారాల తగ్గింపుపై ఐరాసకు భారత్ హామీ

కర్బన ఉద్గారాల తగ్గింపుపై క్యోటో ప్రోటోకాల్‌కు అనుగుణంగా 2020 నాటికి నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కట్టుబడిఉన్నట్లు ఐక్యరాజ్యసమితికి ఆగస్టు 8న భారత్ హామీ పత్రం సమర్పించింది. 1997 డిసెంబర్‌లో కుదిరిన క్యోటో ప్రోటోకాల్ 2005 ఫిబ్రవరిలో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాల సాధనకు ఆయా దేశాలు కట్టుబడాల్సిన తొలి కాలవ్యవధి 2008–2012.
ఖతార్‌లోని దోహాలో 2012లో జరిగిన వాతావరణ సదస్సులో ఈ ఒప్పందానికి సవరణ తీసుకొచ్చారు. దీన్ని దోహా సవరణగా పిలుస్తారు. 2013 జనవరి నుంచి 2020 డిసెంబర్ వరకు సాధించాల్సిన లక్ష్యాలు, ఇతర అంశాలు ఇందులో ఉన్నాయి.

100 శాతం పారిశుద్ధ్యం @ కేరళ, హరియాణా


కేంద్రం నిర్వహించిన గ్రామీణ పారిశుద్ధ్య సర్వేలో కేరళ , హరియాణా ముందుండగా బిహార్ చివరి స్థానంలో నిలిచింది. సర్వే వివరాలను తాగునీటి, పారిశుద్ధ్య మంత్రిత్వ శాఖ ఆగస్టు 8న విడుదల చేసింది. సర్వేలో భాగంగా క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 2016 మే–జూన్ మధ్యన దేశవ్యాప్తంగా 4,626 గ్రామాల్లోని 1.4 లక్షల గ్రామీణ గృహాలను పరిశీలించింది. కేరళ, హరియాణాల్లో దాదాపు అన్ని గ్రామీణ గృహాలకు మరుగుదొడ్డి సౌకర్యం ఉంది. బిహార్‌లో 30 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 37 శాతం ఇళ్లలోనూ, దేశంలో 62.45 శాతం ఇళ్లలో మరుగుదొడ్డి సౌకర్యం ఉంది.

అంతర్జాతీయం

ప్రపంచ ర్యాంకింగ్స్‌లో హార్వర్డ్‌కు అగ్రస్థానం

షాంఘై ర్యాంకింగ్స్ కన్సల్టెన్సీ ఆగస్టు 15న విడుదల చేసిన అకడమిక్ ర్యాంకింగ్స్ ఆఫ్ వరల్డ్ యూనివర్సిటీలో అమెరికా వర్సిటీలు అగ్రస్థానాల్లో నిలిచాయి. ఈ ర్యాంకింగ్స్‌లో అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయం అగ్రస్థానం దక్కించుకుంది. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ రెండో ర్యాంకు, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మూడో ర్యాంకు, కాలిఫోర్నియా యూనివర్సిటీ నాలుగో ర్యాంకు సాధించాయి. ఆసియా నుంచి టోక్యో యూనివర్సిటీ (24) మెరుగైన ర్యాంకు పొందింది. ఈ సంస్థ 2003 నుంచి ప్రపంచంలోని అత్యుత్తమ తొలి 500 విద్యా సంస్థలకు ర్యాంకులు ప్రకటిస్తోంది.

కరెంట్ అఫైర్స్



ఆసియాన్ 50వ వార్షికోత్సవ ప్రకటన

ఆగ్నేసియా దేశాల సమాఖ్య (ఆసియాన్) 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 8న సమాఖ్య నేతలు ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటన ఆసియాన్ 50వ వార్షికోత్సవాన్ని ఒక చారిత్రాత్మక సంఘటనగా, ఆసియాన్ సమాజ నిర్మాణం సాధించిన విజయంగా పేర్కొంది.

ఖతార్ పర్యటనకు వీసా అవసరం లేదు

80 దేశాలకు చెందిన పౌరులు ఖతార్‌లో పర్యటించేందుకు వీసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఆ దేశ అధికారులు ఆగస్టు 8న ప్రకటించారు. ఈ జాబితాలో భారత్‌తోపాటు యూకే, కెనడా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాలు ఉన్నాయి.

ఉత్తర కొరియా దిగుమతులపై చైనా నిషేధం

ఐక్యరాజ్యసమితి తాజా ఆంక్షల నేపథ్యంలో ఉత్తర కొరియా దిగుమతులను తాత్కాలికంగా నిషేధిస్తున్నట్లు చైనా ఆగస్టు 15న ప్రకటించింది. బొగ్గు, ఇనుము, సముద్ర ఆహార ఉత్పత్తులపై నిషేధం విధించింది.

ఆర్థికం



వృద్ధిరేటు 6.75-7.5 శాతంగా అంచనా

ఈ ఆర్థిక సంవత్సరంలో (2017 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం) వృద్ధిరేటు 6.75 నుంచి 7.5 శాతం మధ్య ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 11న లోక్‌సభకు సమర్పించిన ఆర్థిక సర్వే 2016–17 రెండో భాగంలో పేర్కొంది.

సర్వే రెండో భాగం ముఖ్యాంశాలు

- పెరుగుతున్న వాణిజ్య లోటుపై ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. 2017–18 ఏప్రిల్–జూన్‌లో భారత వాణిజ్య లోటు 108.2 శాతం పెరిగింది.
- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రపంచంలోని అత్యుత్తమ దేశాల్లో భారత్ ఒకటని తెలిపింది.
- ఎయిరిండియా ప్రైవేటీకరణ ఆలోచనను స్వాగతించింది.
- అభివృద్ధి చెందిన దేశాలు విధిస్తున్న వీసా నిబంధనల వల్ల దేశ ఐటీ రంగానికి ఇబ్బంది ఉంటుందని అంచనా వేసింది.

వార్తల్లో వ్యక్తులు

45వ సీజేఐగా జస్టిస్ దీపక్ మిశ్రా



45వ భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా జస్టిస్ దీపక్ మిశ్రా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ ఆగస్టు 7న నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగదీశ్ సింగ్ ఖేహర్ పదవీ విరమణ అనంతరం ఆగస్టు 28న జస్టిస్ మిశ్రా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ఈ పదవిలో 13 నెలల పాటు కొనసాగుతారు. 1977లో న్యాయవాదిగా కెరీర్‌ను ప్రారంభించిన జస్టిస్ మిశ్రా అంచెలంచెలుగా ఎదిగి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థాయికి చేరారు. 1996లో ఒడిశా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన 1997లో మధ్యప్రదేశ్‌కు బదిలీ అయ్యారు. 2009లో పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2010లో ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2011 సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.

పాకిస్థాన్ మదర్ థెరిసా రూత్ పఫావూ మృతి

పాకిస్థాన్ మదర్ థెరిసాగా పేరుగాంచిన రూత్ పఫావూ(87) కరాచీలో ఆగస్టు 10న మరణించారు. జర్మనీకి చెందిన ఆమె పాకిస్థాన్‌లో కుష్టు వ్యాధి నిర్మూలనకు తన జీవితాన్ని అంకితం చేశారు. దీంతో ఆమెను పాకిస్థాన్ మదర్ థెరిసాగా అక్కడి ప్రజలు కొనియాడతారు.

కెన్యా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన కెన్యట్టా

కెన్యా అధ్యక్షుడిగా ఉహురు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. ఆగస్టు 8న జరిగిన ఎన్నికలో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు ఆ దేశ ఎన్నికల సంఘం ఆగస్టు 12న ప్రకటించింది. ప్రతిపక్ష నేత రైలా ఒడింగాకు 44.74 శాతం ఓట్లు వచ్చాయి.

క్రీడలు

ప్రపంచ అథ్లెటిక్స్‌లో వెనిజులాకు తొలి స్వర్ణం

మూడున్నర దశాబ్దాల నిరీక్షణ తర్వాత ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో వెనిజులా తొలి స్వర్ణ పతకం సాధించింది. లండన్‌లో ఆగస్టు 7న మహిళల ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో వెనిజులా క్రీడాకారిణి యులీమార్ రోజస్ 14.91 మీటర్లు దూకి పసిడి దక్కించుకుంది. కాటరీన్ ఇబాల్‌గుయెన్ (కొలంబియా) రజతం, ఓల్గా రిపకోవా (కజకిస్థాన్) కాంస్యం గెలుచుకున్నారు.

అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు రోజర్స్ కప్

ఏటీపీ మాస్టర్స్ సిరీస్ రోజర్స్ కప్ టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) గెలుచుకున్నాడు. మాంట్రియల్ (కెనడా)లో ఆగస్టు 15న జరిగిన ఫైనల్లో రోజర్ ఫెదరర్(స్విట్జర్లాండ్)ను అలెగ్జాండర్ జ్వెరెవ్ ఓడించాడు. పురుషుల డబుల్స్ టైటిల్‌ను హెర్బర్ట్, మహుట్ (ఫ్రాన్స్) జోడీ గెలుచుకుంది.

శ్రీలంకపై టెస్టు సిరీస్ నెగ్గిన భారత్

శ్రీలంకతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ 3–0 తేడాతో గెలుచుకుంది. కాగా,



భారత్‌కు ఇది వరుసగా ఎనిమిదో టెస్టు సిరీస్ విజయం. విదేశాల్లో క్లీన్‌స్వీప్‌తో టెస్టు సిరీస్‌ను అందించిన తొలి కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ గుర్తింపు పొందాడు. రెండు సెంచరీలు చేసిన శిఖర్ ధావన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డు లభించింది.

సైన్స్ అండ్ టెక్నాలజీ

బెంగళూరులో ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్ - 2017

రెండు రోజుల ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్ ఆగస్టు 11న బెంగళూరులో ముగిసింది. ఈ సదస్సు 'ఇండస్ట్రీ 4.0–ఇంజనీరింగ్ ద ఇంటర్‌ఫేస్ విత్ ద రియల్ వరల్డ్' అనే ఇతివృత్తంతో జరిగింది. సదస్సుకు 1,200 మందికిపైగా స్వదేశీ, విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. వీరు పారిశ్రామిక, టెక్నాలజీ, వ్యవసాయ రంగాలపై 121 ప్రజెంటేషన్లు ఇచ్చారు.

అవార్డులు

ఐదుగురికి కీర్తిచక్ర పురస్కారం



ఉగ్రవాదులపై పోరులో అమరులైన ఇద్దరు సైనికులతోపాటు ఐదుగురు భద్రతా దళ సిబ్బందికి దేశ రెండో అత్యున్నత శౌర్య పురస్కారం కీర్తిచక్ర లభించింది. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మొత్తం 112 శౌర్య పురస్కారాలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపారు. వీటిలో ఐదు కీర్తిచక్ర, 17 శౌర్యచక్ర, 85 సేవా మెడల్స్ (గ్యాలెంట్రీ), మూడు నౌకా దళ మెడల్స్, రెండు వాయుసేన మెడల్స్ ఉన్నాయి. హవల్దార్ గిరీశ్ గురుంగ్ (గూర్ఖా రైఫిల్స్), మేజర్ డేవిడ్ మన్‌లున్ (నాగా రెజిమెంట్), ప్రమోద్ కుమార్ (సీఆర్‌పీఎఫ్ 49వ బెటాలియన్ కమాండెంట్)లకు మరణానంతరం, మేజర్ ప్రీతం సింగ్ కున్వర్ (గర్వాల్ రైఫిల్), చేతన్ కుమార్ చీతా (సీఆర్‌పీఎఫ్ సీనియర్ అధికారి)లు కీర్తిచక్ర పురస్కారానికి ఎంపికయ్యారు.



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్

భారతదేశం- వాయు రవాణా



ఆధునిక ప్రపంచంలో వాయు రవాణా వ్యవస్థకు ప్రాముఖ్యం పెరిగింది. ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి అత్యంత వేగంగా ప్రయాణించడానికి, తేలికైన సరుకులను తక్కువ కాలంలో రవాణా చేయడానికి విమానాలు బాగా ఉపయోగపడుతున్నాయి. ప్రపంచంలో పశ్చిమం నుంచి తూర్పునకు వెళ్లే అధిక శాతం వాయుమార్గాలన్నీ మనదేశం మీదుగానే వెళుతున్నాయి. మనదేశ శీతోష్ణస్థితి విమానయానానికి చాలా అనుకూలం.

- ☆ దేశంలో 1911లో తొలి విమాన సర్వీస్ అలహాబాద్ – నైని జంక్షన్ మధ్య ప్రారంభమైంది. అలహాబాద్ నుంచి సుమారు 10 కి.మీ దూరంలో ఉన్న నైని జంక్షన్‌కు మెయిల్‌ను చేరవేసే ఉద్దేశంతో ఈ సర్వీసును ప్రారంభించారు. దీన్ని 'హెన్రీ ఫికెట్' నడిపాడు. అయితే మరో తొమ్మిదేళ్ల వరకు వాయురవాణా వ్యవస్థీకృతం కాలేదు. 1920లో టాటా సన్స్ సంస్థ కొన్ని ఎయిర్ డ్రోమ్స్‌ను ప్రారంభించడంతో అప్పటి నుంచి దేశంలో విమాన రవాణా వ్యవస్థ వ్యవస్థీకృతం అయింది.
- ☆ దేశంలో జె.ఆర్.డి.టాటా పైలట్‌గా మొదటి విమానం కరాచీ నుంచి ముంబయి వరకు నడిచింది. అందుకే జె.ఆర్.డి.టాటాను 'భారతదేశ విమానయాన పితామహుడు'గా వ్యవహరిస్తారు.
- ☆ ఈయనే దేశంలో తొలి ఎయిర్‌లైన్ సర్వీస్ 'టాటా ఎయిర్‌లైన్స్'ను ప్రారంభించాడు. తర్వాత 1946లో దీనికి 'ఎయిర్ ఇండియా'గా పేరు మార్చారు.
- ☆ 1948లో 'ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్' పేరుతో దేశం నుంచి తొలి అంతర్జాతీయ సర్వీసు ముంబై, లండన్ మధ్య ప్రారంభమైంది.
- ☆ దేశంలో విమాన సర్వీసుల ఏర్పాటుకు 1950లో 'రాజ్యాధ్యక్ష' కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ సూచనల ప్రకారం 1953లో వాయు రవాణాను జాతీయం చేశారు. అలాగే ఇదే సంవత్సరంలోనే రెండు ఎయిర్ కార్పొరేషన్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అవి..

1. ఎయిర్ ఇండియా (విదేశీ సర్వీసుల కోసం)
2. ఇండియన్ ఎయిర్‌లైన్స్ (స్వదేశీ సర్వీసుల కోసం)

- ☆ వీటితోపాటు 1981లో 'వాయుదూత' సర్వీసులను ప్రవేశపెట్టారు.

1. ఎయిర్ ఇండియా: ఇది ఖండాంతర విమానయాన సర్వీసులను నడుపుతోంది. దీన్ని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఏఏఐ) నిర్వహిస్తోంది. దీనికి అన్ని ఖండాల్లోని దాదాపు 90 దేశాలతో ఒప్పందాలు ఉన్నాయి. ఇది అమెరికా, కెనడా, యూరోప్, రష్యా, తూర్పు ఆసియా, పశ్చిమ ఆసియా, గల్ఫ్, ఆఫ్రికా, ఆస్ట్రేలియాలతో సర్వీసులను కలిగి ఉంది. ఇందులో గల్ఫ్ మార్గం లాభదాయకంగా ఉంది. ఎయిర్ ఇండియా మస్కట్ 'మహారాజా'.

- ☆ ఐఏఏఐ అధీనంలోని కొన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు..

1. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం– **న్యూఢిల్లీ**
   - ☆ దీని పాతపేరు – పాలెం
2. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం **– కోల్‌కతా (పశ్చిమ బెంగాల్)**
   - ☆ దీని పాతపేరు ఢండం
3. ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం **–ముంబై(మహారాష్ట్ర)**
   - ☆ దీనిపాత పేర్లు– శాంతాక్రజ్, సహారా
4. అన్నాదురై అంతర్జాతీయ విమానాశ్రయం **– చెన్నై (తమిళనాడు)**
   - ☆ దీని పాతపేరు– మీనంబాకం
5. కొచ్చిన్(నిడంబస్సేరి) అంతర్జాతీయ విమానాశ్రయం **– కొచ్చి (కేరళ)**
6. గురురామ్‌దాస్‌జీ/రాజాసాన్సీ అంతర్జాతీయ విమానాశ్రయం **– అమృత్‌సర్ (పంజాబ్)**
7. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం **– శంషాబాద్ (తెలంగాణ)**
   - ☆ ఇది దేశంలోనే మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం.
   - ☆ ఇక్కడ దేశంలోనే అత్యంత పొడవైన 'రన్ వే' ఉంది.
8. లోకప్రియ గోపీనాథ్ బర్డోలియా అంతర్జాతీయ విమానాశ్రయం **–గౌహతి (అసోం)**
9. సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం **– అహ్మదాబాద్ (గుజరాత్)**
10. వీరసావర్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం **– పోర్ట్ బ్లెయిర్ (అండమాన్ నికోబార్ దీవులు)**
11. దేవి అహల్యాభాయి అంతర్జాతీయ విమానాశ్రయం **– ఇండోర్ (మధ్యప్రదేశ్)**
12. డా.బాబాసాహెబ్ అంబేద్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం **–నాగపూర్ (మహారాష్ట్ర)**
13. గయ అంతర్జాతీయ విమానాశ్రయం **– గయ (బిహార్)**
14. కెంపెగౌడ (బెంగళూరు/దేవనహళ్లి) అంతర్జాతీయ విమానాశ్రయం **– బెంగళూరు(కర్ణాటక)**
15. రాజాభోజ్ అంతర్జాతీయ విమానాశ్రయం **–భోపాల్(మధ్యప్రదేశ్)**
16. సంగనేశ్వర్ అంతర్జాతీయ విమానాశ్రయం **– జైపూర్ (రాజస్థాన్)**
17. వాస్కోడిగామా అంతర్జాతీయ విమానాశ్రయం **– పనాజి (గోవా)**
18. జరుకి అంతర్జాతీయ విమానాశ్రయం **– షిల్లాంగ్ (మేఘాలయ)**
19. సివిల్ ఏరోడ్రోమ్ అంతర్జాతీయ విమానాశ్రయం **– కోయంబత్తూర్ (తమిళనాడు)**

2. ఇండియన్ ఎయిర్ లైన్స్: ఇది దేశంలోని వివిధ నగరాలను, పట్టణాలను కలుపుతుంది. అలాగే 19 పొరుగుదేశాలకూ సర్వీసులను అందిస్తోంది. 2005–06లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ తన బ్రాండ్ పేరును 'ఇండియన్'గా మార్చింది. దీని మస్కట్ ఒడిశాలోని కోణార్క్ సూర్య దేవాలయంలోని రథచక్రం. దేశంలోని సాధారణ విమానాశ్రయాలను 'నేషనల్ ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా' నిర్వహిస్తుంది.

- ☆ 2007లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌ను, ఎయిర్ ఇండియాతో కలిపి 'ఏవియేషన్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్'గా ఏర్పాటు చేశారు.
- ☆ **వాయుదూత్:** దేశంలో సరుకు రవాణాకు దీన్ని 1981లో ప్రారంభించారు. అలాగే ప్రయాణికుల పరంగా ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాలు నడవని ప్రాంతాల్లో.. ముఖ్యంగా దట్టమైన అడవులున్న ఈశాన్య రాష్ట్రాల్లో సర్వీసులు అందజేయడానికి ఉపయోగిస్తారు. దీన్ని 1993లో 'ఇండియన్ ఎయిర్‌లైన్స్'లో విలీనం చేశారు.
- ☆ **పవన్ హన్స్ లిమిటెడ్:** దీన్ని 1985లో స్థాపించారు. దీని కేంద్ర కార్యాలయం ఢిల్లీలో ఉంది. దీన్ని పెట్రోలియం స్థావరాలకు సహాయం చేయడానికి ఏర్పాటు చేశారు. తర్వాత కాలంలో కొండలు, మారుమూల ప్రాంతాలకు, ఎన్‌టీపీసీ, గెయిల్, బీఎస్‌ఎఫ్ వంటి సంస్థలకు దీని సేవలను విస్తరించారు.
- ☆ **ప్రైవేటు రంగంలోని ఎయిర్ లైన్స్:** భారత ప్రభుత్వం 1994లో 'ఓపెన్ స్కై పాలసీ' ప్రవేశపెట్టింది. దీంతో ప్రైవేటు కంపెనీలు ప్రయాణికులకు రవాణా సర్వీసులను అందించడానికి అవకాశం కలిగింది. ప్రైవేటు రంగంలో మొత్తం 8 ప్యాసింజర్ ఎయిర్ వేస్, 2 కార్గో ఎయిర్ వేస్‌లు ప్రారంభమయ్యాయి.
- ☆ **ప్యాసింజర్ ఎయిర్ వేస్:**

1. జెట్ ఎయిర్ వేస్ 2. కింగ్‌ఫిషర్ ఎయిర్ వేస్
3. ఇండిగో ఎయిర్ వేస్ 4. స్పైస్ జెట్
5. జెట్ లైట్ 6. గో ఎయిర్ వేస్
7. పారామౌంట్ ఎయిర్‌వేస్
8. దక్కన్ ఏవియేషన్

- ☆ కార్గో ఎయిర్‌వేస్

1. దక్కన్ కార్గో ఎక్స్‌ప్రెస్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్
2. బ్లూడార్ట్ ఏవియేషన్

- ☆ 1995 ఏప్రిల్ 1న ఎయిర్‌పోర్టు 'అథారిటీ ఆఫ్ ఇండియా'ను ఏర్పాటు చేశారు. దీనిలో విలీనమైన సంస్థలు:

1. ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ అథారిటీ ఆఫ్ ఇండియా
2. నేషనల్ ఎయిర్‌పోర్టు అథారిటీ

- ☆ 1927లో 'సివిల్ ఏవియేషన్ డిపార్ట్ మెంట్' ఏర్పడింది.
- ☆ ప్రస్తుతం 'ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఏఐ)' ఆధ్వర్యంలో మూడు సంస్థలు పనిచేస్తున్నాయి. అవి.

1. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు డివిజన్
2. నేషనల్ ఎయిర్‌పోర్టు డివిజన్
3. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్

- ☆ పైలెట్లకు శిక్షణ ఇవ్వడానికి మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆధ్వర్యంలో 'ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ' పనిచేస్తోంది. ఇది ఉత్తరప్రదేశ్‌లోని పుర్‌సత్‌గంజ్‌లో ఉంది.
- ☆ దేశంలో విమానాల తయారీ, రిపేర్లు మొదలైన వాటిని నిర్వహిస్తున్న సంస్థ – హిందుస్థాన్ ఎయిర్ క్రాఫ్ట్ లిమిటెడ్. ఇది బెంగళూరులో ఉంది.
- ☆ హిందుస్థాన్ ఎరోనాటిక్స్ లిమిటెడ్ బెంగళూరులో ఉంది. దేశంలో దీని యూనిట్‌లు ఉన్న ప్రదేశాలు.

1. నాసిక్ (మహారాష్ట్ర) **–మిగ్ విమానాల విడిభాగాలు**
2. కోరాపుట్ (ఒడిశా) **– మిగ్ విమానాల ఇంజన్స్**
3. హైదరాబాద్ (తెలంగాణ) **– మిగ్ విమానాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు**
4. బెంగళూరు (కర్ణాటక) **– జెట్ ట్రైనర్, మారుత్, హెలికాప్టర్, పుష్పక్, కృషక్ విమానాలు.**
5. **కాన్పూర్ (ఉత్తరప్రదేశ్):** హెచ్.ఎస్–748 విమానాలు.
6. **లక్నో (ఉత్తరప్రదేశ్):** విమానాల పరికరాలు, విడిభాగాలు.

- ☆ భారత్‌లో అత్యంత రద్దీ విమానాశ్రయం.. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, న్యూఢిల్లీ.
- ☆ దేశంలో ఎత్తైన ప్రదేశంలో ఉన్న విమానాశ్రయం.. లేహ్ విమానాశ్రయం (జమ్మూకశ్మీర్)
- ☆ దేశంలోని గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు

1. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం
2. కెంపెగౌడ (దేవనహళ్లి) అంతర్జాతీయ విమానాశ్రయం
3. కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ పరిశ్రమను జాతీయం చేసిన సంవత్సరం?
1) 1950 2) 1953 3) 1947 4) 1948

2. పవన్ హన్స్ దేనికి సంబంధించింది?
1) హెలికాప్టర్ సర్వీసులు
2) తీరప్రాంత ఓడ వ్యాపారం
3) దేశంలోని జలమార్గాలు
4) చిన్నరకం విమానాలు

3. ఏ భారతీయ నగరంలో జోలీ గ్రాంట్ విమానాశ్రయ సేవలు ఉన్నాయి?
1) న్యూఢిల్లీ 2) కోల్‌కత
3) డెహ్రాడూన్ 4) జార్ఖండ్

4. అహల్యాభాయి హోల్కర్ విమానాశ్రయం ఎక్కడ ఉంది?
1) ఇండోర్ 2) ఉజ్జయిని 3) భోపాల్ 4) లక్నో

సమాధానాలు

1) 2 2) 1 3) 3 4)1



ముల్కల రమేష్
సీనియర్ ఫ్యాకల్టీ,
జీవీఎస్ స్టడీ సర్కిల్

టెక్ స్టోరీస్


పోర్టబుల్ కంప్యూటింగ్‌ను చేరువ చేసిన గ్యాడ్జెట్..పవర్ కట్ అయినా.. ప్రయాణాల్లో ఉన్నా.. ఎప్పుడంటే అప్పుడు.. ఎక్కడంటే అక్కడ వినియోగించుకునే సౌకర్యం.. ఒకటీ.. రెండు కాదు.. ల్యాప్‌టాప్ సౌలభ్యాలు మాటల్లో చెప్పలేం.! అందుకనే.. ఇంట్లో డెస్క్‌టాప్ ఉన్నా.. కొందరు ల్యాపీనీ కొంటుంటారు..! తాజాగా మార్కెట్‌లోకి వస్తున్నవైతే చాలా స్లిమ్‌గా.. తక్కువ బరువుతో.. అందుబాటు ధరల్లో ఉంటున్నాయి. ఎన్ని అనుకూలతలున్నా... ల్యాపీ పనితీరు మాత్రం మన వాడకంపైనే ఆధారపడి ఉంటుంది. ఎంత జాగ్రత్తగా వినియోగించినా.. కొన్నిసార్లు ఇబ్బందులు సాధారణమే. ఈ నేపథ్యంలో ల్యాప్‌టాప్‌లో ఎదురయ్యే ప్రధాన సమస్యలు.. వాటిని అధిగమించడమెలాగో తెలుసుకుందాం.. !



ల్యాపీ..టిప్ టాప్

హెచ్చరిక ఘంటికలు..

- మదర్‌బోర్డ్ నుంచి అసాధారణ శబ్దాలు వెలువడుతున్నాయా..? కచ్చితంగా మదర్ బోర్డ్ ప్రమాదంలో ఉన్నట్లే. ఈ సంకేతాలను ముందస్తు హెచ్చరికలుగా భావించి సర్వీసింగ్ సెంటర్‌కు తీసుకెళ్లడం ఉత్తమం.
- ఆన్ చేసిన గంటలోపే అధిక వేడి ఉత్పన్నమవుతోందా..? ఇదీ మంచి సంకేతం కాదు.
- ల్యాప్‌టాప్ తరచూ రీస్టార్ట్ అవుతోందా..? రీబూట్ సమయంలో సమస్యలు ఎదురవుతున్నాయా..? వెంటనే సర్వీసింగ్ చేయించాలి.
- ఏదైనా ఫైల్ ఓపెనింగ్ లేదా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ అప్‌డేట్ సమయంలో File Errors ను చూపిస్తోందా..? ఇది ల్యాప్‌టాప్ ట్రబుల్‌కి సంకేతం.
- ల్యాప్‌టాప్ నత్తనడకన నడుస్తోందా..? ఏదైనా ఫైల్ ప్రాసెసింగ్‌కి అధిక సమయం తీసుకుంటోందా..? అంటే.. సాంకేతిక లోపం తలెత్తిందని అర్థం.
- చార్జింగ్ త్వరగా అయిపోతున్నా.. ఏదో సాంకేతిక లోపం ఉన్నట్లే.



పరిష్కార మార్గాలు

- ల్యాప్‌టాప్‌లో నిత్యం యాంటీ వైరస్ రన్ చేయాలి. దీనివల్ల ల్యాపీలో చేరిన వైరస్‌ను పట్టుకోవడమే కాదు. బ్యాటరీ జీవిత కాలాన్ని కూడా పెంచుకోవచ్చు. అలాగే సిస్టమ్ నెమ్మదిగా పనిచేయడానికి కారణాలు తెలుసుకోవచ్చు.
- ల్యాపీలో బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతున్న యాప్స్, సాఫ్ట్‌వేర్స్, ప్రోగ్రామ్‌లను క్లోజ్ చేయాలి. దీనివల్ల బ్యాటరీ వినియోగం తగ్గుతుంది.
- పాత తరం ల్యాప్‌టాప్‌లలో బ్యాటరీలను వేరు చేసుకునే అవకాశం ఉంటుంది. అలాంటివాటిలో ఎప్పటికప్పుడు బ్యాటరీ కనెక్టర్లను శుభ్రం చేసుకోవడం మంచిది. పిన్‌లు వంగిపోయినా.. వాటిపై దుమ్ము పేరుకుపోయినా బ్యాటరీ వృథా అవుతుంది.
- ల్యాపీకి నిరాటంకంగా చార్జింగ్ పెట్టడం మంచిది కాదు. బ్యాటరీ ఎప్పుడూ వంద శాతం ఉండాలనుకోవడమూ సరికాదు. అప్పుడప్పుడూ బ్యాటరీ స్థాయి సున్నా వచ్చే వరకు వినియోగించాలి. అలాచేస్తే బ్యాటరీ ఫంక్షనింగ్ కచ్చితంగా ఉంటుంది.
- ల్యాపీలోని చిన్న ఫ్యాన్ ల్యాప్‌టాప్ వేడెక్కకుండా చూస్తుంది. కాబట్టి ఆ ఫ్యాన్ ఉండే భాగాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి.
- ల్యాపీలో ర్యామ్ సైజు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ర్యామ్ ఎంత ఎక్కువగా ఉంటే బ్యాటరీ వినియోగం అంత తక్కువగా ఉంటుంది.
- అవసరం లేనప్పుడు బ్లూటూత్, వై-ఫై, వై-ఫై హాట్‌స్పాట్‌లను ఆఫ్ చేసి ఉంచాలి. ఆన్‌లోనే వదిలేస్తే ఆ ప్రభావం బ్యాటరీ మీదా పడుతుంది. వీటితోపాటు బ్లూటూత్ రేడియో, గ్రాఫిక్స్ ప్రాసెసర్ వంటి వాటిని కూడా ఆఫ్ చేసి ఉంచడం మంచిది.
- బ్యాటరీ వినియోగం విషయానికొస్తే ల్యాపీ స్క్రీన్‌దే సింహభాగం. అవసరం లేని సమయంలో స్క్రీన్ బ్రైట్‌నెస్ తగ్గించుకోవడం మంచిది. దీంతోపాటు ల్యాపీ కీ బోర్డుకు బ్యాక్‌గ్రౌండ్ లైటింగ్ వచ్చే ఏర్పాటు ఆపేయడం ఉత్తమం.
- సమాచారాన్ని హార్డ్ డిస్కుల్లో, డీవీడీల్లో కాకుండా.. ఎస్ఎస్‌డీ (సాలిడ్ స్టేట్ స్టోరేజ్)ల్లో భద్రపరుచుకోవడం మంచిది. ఎందుకంటే.. వీటిని సాధారణ హార్డ్‌డిస్క్‌ల్లా కాకుండా ఎప్పటికప్పుడు ల్యాపీ నుంచి వేరు చేసుకునే అవకాశం ఉంటుంది. దీనివల్ల బ్యాటరీ వినియోగం తగ్గుతుంది.
- బ్యాటరీ వినియోగం తగ్గించడానికి బ్యాటరీ సేవ్ మోడ్‌ను ఆన్‌చేసుకోవచ్చు. ల్యాపీల్లో ఈ తరహా సౌకర్యం ఉంటుంది.

జీఎస్టీ యాప్స్

జీఎస్టీ.. (Goods and Service Tax) దేశమంతా ఏకీకృత పన్ను విధానం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త సంస్కరణ. గత నెల 1 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీతో వస్తువులు, సేవల ధరలు క్రమంగా తగ్గుతాయని కేంద్రం చెబుతోంది. ప్రయోజనాల మాట ఎలా ఉన్నా.. ఈ ఏకీకృత పన్నును అర్థం చేసుకోవడం చాలామందికి పెద్ద పజిల్‌గా మారుతోంది. ఈ నేపథ్యంలో జీఎస్టీపై అవగాహన కల్పించే ఆండ్రాయిడ్ యాప్స్ వివరాలు...

1. జీఎస్టీ రేట్ ఫైండర్ (GST Rate Finder)



వినియోగదారులు ఒక ఉత్పత్తి మీద ఎంత జీఎస్టీ పడుతుందో తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ప్రతి ప్రొడక్ట్‌కు, ప్రతి సర్వీస్‌కు ఎంత జీఎస్టీ విధిస్తారో దీనిలో సెర్చ్ చేసి తెలుసుకోవచ్చు. ఒకవేళ మీరు ఉత్పత్తిదారుడైతే.. తయారుచేయబోయే వస్తువులకు ఎంత ట్యాక్స్ వేయవచ్చో కూడా ఈ యాప్‌లో కాలిక్యులేట్ చేసుకోవచ్చు. ప్రభుత్వమే డిజైన్ చేసి విడుదల చేసిన యాప్. ఇది ఉచిత యాప్.

2. జీఎస్టీ ఎన్‌రోల్‌మెంట్ యాప్ (GST Enrollment app)



జీఎస్టీ ఎన్‌రోల్‌మెంట్‌ను సులభతరం చేసే యాప్ ఇది. ఇప్పటివరకు స్టేట్ వ్యాట్, సెంట్రల్ వ్యాట్, సర్వీస్ ట్యాక్స్ చెల్లింపుదారులుగా ఉన్నవారు.. జీఎస్టీ విధానంలోకి మారడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఇది ఆఫ్‌లైన్‌లో కూడా పనిచేస్తుంది. జీఎస్టీ రిజిస్ట్రేషన్ మైగ్రేషన్ అప్లికేషన్‌ను ప్రాసెస్ చేసి.. డేటా అప్‌లోడ్ ఫైల్‌ను ఆటోమేటిగ్గా క్రియేట్ చేస్తుంది. ఇది కూడా ఫ్రీ యాప్.

3. జీఎస్టీ కనెక్ట్ (GST Connect)



జీఎస్టీ గురించి క్షుణ్నంగా తెలుసుకుని.. ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావడానికి ఈ యాప్ దోహదపడుతుంది. ముఖ్యంగా సీఏలకు, ట్యాక్స్ ప్రాక్టీషనర్లకు బాగా ఉపయోగకరం. జీఎస్టీ యాక్ట్, ఐజీఎస్టీ లా, నిపుణులు, సీఏల ఆర్టికల్స్ వంటివన్నీ ఈ యాప్‌లో ఉంటాయి. జీఎస్టీకి సంబంధించి ఎలాంటి సందేహం ఉన్నా.. దీనిలో చూసి క్లారిఫై చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్‌లోనూ పని చేస్తుంది.

జీఎస్టీ కాలిక్యులేటర్ ఇండియా (GST Calculator India)



వ్యాపారవేత్తలు జీఎస్టీ కింద ఒక ఉత్పత్తికి ఎంత ఎమ్మార్పీ వేయవచ్చో తెలుసుకోవడానికి జీఎస్టీ కాలిక్యులేటర్ యాప్ ఉపయోగపడుతుంది. ట్రేడ్ టైప్‌ను ఎంచుకుని, ఉత్పత్తి ఖరీదు, ప్రాఫిట్ మార్జిన్, జీఎస్టీ రేట్స్ అప్లయ్ చేస్తే .. ఈ యాప్ ప్రొడక్ట్ ఇన్‌వాయిస్‌కు సంబంధించిన పూర్తి విశ్లేషణ ఇస్తుంది. ఉత్పత్తిదారులు, టోకు వర్తకులు, చిల్లర వ్యాపారులకు ఈ యాప్ ఉపయోగకరం అంతేకాక జీఎస్టీ గురించి ముఖ్యమైన సమాచారాన్ని అందిస్తుంది. ఆఫ్‌లైన్‌లో పనిచేస్తుంది.

బులెటిన్ బోర్డ్

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 1,300 ఖాళీలు

ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)లో 1300 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/ఎగ్జిక్యూటివ్(ఏసీఐఓ-2(ఈఎక్స్ఈ)) పోస్టుల భర్తీకి భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. దీనిద్వారా అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/ఎగ్జిక్యూటివ్ ఎగ్జామ్-2017ను నిర్వహించనుంది.


- **మొత్తం ఖాళీలు:** 1300 (అన్‌రిజర్వ్‌డ్-951 + ఓబీసీ 184 + ఎస్సీ-109 + ఎస్టీ-56). ఇందులోనే రిజర్వేషన్ల వారీ ఎక్స్-సర్వీస్‌మెన్ కేటగిరీకి 130 పోస్టులు కేటాయించారు.
- **నోట్:** దివ్యాంగ అభ్యర్థులకు పోస్టులు రిజర్వ్ చేయలేదు. కాబట్టి వారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.
- **వేతనం:** రూ.9,300-రూ.34,800+ గ్రేడ్ పే రూ.4,200.
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన విద్య ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం అభిలషణీయం.
- **వయోపరిమితి:** 18-27 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** రాత పరీక్షలు (టైర్-1, టైర్-2), ఇంటర్వ్యూ.
- **పరీక్షల విధానం:** టైర్-1 రాతపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో ఒక్కో భాగం నుంచి 25 ప్రశ్నల చొప్పున నాలుగు భాగాల నుంచి మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు. తప్పుగా గుర్తించిన సమాధానానికి 0.25 చొప్పున నెగిటివ్ మార్కు ఉంటుంది. ఇందులోని నాలుగు భాగాలు.. జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్/అనలిటికల్ ఎబిలిటీ, ఇంగ్లిష్ ల్యాంగ్వేజ్. టైర్-1 రాతపరీక్ష వ్యవధి గంట; టైర్-2 రాతపరీక్ష డిస్క్రిప్షన్ విధానంలో ఉంటుంది. ఇందులో ఇచ్చిన అంశాల్లోంచి వ్యాసం(ఎస్సే) రాయాలి. ఇది 30 మార్కులకు, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అండ్ ప్రెస్సీస్ రైటింగ్ 20 మార్కులకు .. మొత్తం 50 మార్కులకు పరీక్ష ఉంటుంది. వ్యవధి గంట. టైర్-1, టైర్-2లో వచ్చిన మార్కుల ఆధారంగా 100 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ మూడింటిలోనూ కనబర్చిన ప్రతిభ ఆధారంగా నియామకం చేపడతారు.
- **టైర్-1 రాతపరీక్ష కేంద్రాలు(తెలుగు రాష్ట్రాల్లో):** హైదరాబాద్, విజయవాడ.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 2, 2017.
- **వెబ్‌సైట్:** **www.mha.nic.in**

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 18 ఖాళీలు

చెన్నైలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) ప్రాంతీయ కార్యాలయం తాత్కాలిక పద్ధతిలో 18 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు పేరు:** సైట్ ఇంజనీర్
- **వేతనం:** రూ.50,000
- **కాంట్రాక్టు వ్యవధి :** రెండేళ్లు
- **అర్హతలు:** సివిల్ ఇంజనీరింగ్ డిగ్రీతో పాటు ఏడాది ఉద్యోగానుభవం తప్పనిసరి.
- **వయో పరిమితి:** 2017 సెప్టెంబర్ 4 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** సెప్టెంబర్ 4, 2017.
- **వెబ్‌సైట్:** **www.nhai.org**

డీపీపీక్యూఎస్‌లో 68 'రీసెర్చ్' ఖాళీలు



డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారంటైన్ అండ్ స్టోరేజ్(డీపీపీక్యూఎస్)లో 68 ఖాళీలను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** రీసెర్చ్ అసోసియేట్(ఆర్ఏ)-36; సీనియర్ రీసెర్చ్‌ఫెలో (ఎస్ఆర్ఎఫ్)-32.
- **వేతనం:** ఆర్ఏ-రూ.40,000; ఎస్ఆర్ఎఫ్-రూ.25,000. దీంతోపాటు నిబంధనల మేర హెచ్ఆర్ఏ.
- **అర్హతలు:** ఆర్ఏ పోస్టులకు డాక్టరేట్ డిగ్రీ (ఎంటమాలజీ/ప్లాంట్ ప్యాథాలజీ/అగ్రోనమీ); ఎస్ఆర్ఎఫ్ పోస్టులకు వీడ్ సైన్స్ స్పెషలైజేషన్‌తో ఎంఎస్సీ(ఎంటమాలజీ/నెమటాలజీ/ప్లాంట్ పాథాలజీ/బోటనీ)/ఎంఎస్సీ(అగ్రికల్చర్).
- **వయోపరిమితి:** ఆర్ఏ పోస్టులకు.. పురుషులకు 40 ఏళ్లు, మహిళలు 45 ఏళ్లు మించకూడదు; ఎస్ఆర్ఎఫ్ పోస్టులకు పురుషులకు 35 ఏళ్లు, మహిళలకు 40 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్లో సూచించిన దరఖాస్తు పత్రం నమూనాలో వివరాలు నింపి, దానికి సంబంధిత ధ్రువపత్రాలు తదితర అవసరమైన వాటిని జతచేసి నిర్దేశిత తేదీలో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలి.
- **ఎంపిక విధానం:** వాక్ ఇన్ ఇంటర్వ్యూ
- **వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీ:** సెప్టెంబర్ 16, 2017
- **వాక్-ఇన్-ఇంటర్వ్యూ వేదిక:** దక్షిణాది రాష్ట్రాల అభ్యర్థులకు.. 'రీజనల్ ప్లాంట్ క్వారంటైన్ స్టేషన్, జీఎస్టీ రోడ్, నియర్ ట్రిడెంట్ హోటల్, మీనంబాక్కం, చెన్నై-600027'

వెబ్‌సైట్: **www.ppqs.gov.in**



లాంగ్వేజ్ లెర్నింగ్ యాప్స్

నేర్చుకొని.. పలుకుదాం..

ఓవైపు గ్లోబలైజేషన్‌తో ప్రపంచమే కుగ్రామంగా మారిపోతున్న పరిస్థితి..! మరోవైపు చదువు కోసం, ఉద్యోగ వేటలో సుదూర ప్రాంతాలకు పయనం..! ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లడం సర్వసాధారణంగా మారినా.. స్థానికులతో మమేకం కావాలంటే వారి భాష తెలిసుండాలి. కానీ ఇదంత సులువు కాదు..! ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక భాషలో సరైన ఉచ్చారణతో మాట్లాడటం నేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాయి.. 'లాంగ్వేజ్ లెర్నింగ్ యాప్స్'! అలాంటి కొన్నిటి గురించి..

డ్యులింగో(Duolingo)

ఈ యాప్ ద్వారా 23 భాషలు నేర్చుకోవచ్చు. ఆన్‌లైన్‌లో భాషాభ్యాసనాన్ని సులభతరం చేసిన యాప్ ఇది. పీసీ, ఐపాడ్, ఐఫోన్, ఆండ్రాయిడ్ డివైసెస్, విండోస్ మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్స్‌లోనూ డ్యులింగోను వినియోగించవచ్చు. వొకాబ్యులరీ, గ్రామర్, యూసేజ్ ద్వారా ఎంచుకున్న భాషపై పట్టు సాధించే వీలు కల్పిస్తుంది. లిజనింగ్, స్పీకింగ్, ట్రాన్స్‌లేషన్ ప్రాక్టీస్ కూడా చేసుకోవచ్చు. యాప్ డౌన్‌లోడ్ ఉచితం.

డ్రాప్స్(Drops)

విజువల్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చే యాప్ ఇది. టైపింగ్, రీడింగ్ అవసరం లేకుండానే రోజుకు కేవలం 5 నిమిషాల సమయం కేటాయించడం ద్వారా 19 భాషల్లో నచ్చినదాన్ని నేర్చుకోవచ్చని పేర్కొంటోంది ఈ యాప్. డ్రాప్స్, ఫుడ్, డ్రింక్స్, నంబర్స్ తదితరాలకు సంబంధించిన 460 పదాలను పిక్చర్స్ సాయంతో నేర్పుతుంది. వీటిలో 60 శాతం పదాలు మన రోజువారీ సంభాషణల్లోనివేనని డ్రాప్స్ పేర్కొనడం విశేషం. ఫ్లాష్‌కార్డ్స్‌కు బదులు ఈ యాప్ ఇల్లస్ట్రేషన్‌పై ఫోకస్ చేస్తుంది. నౌన్స్ ద్వారా వొకాబ్యులరీని ఎక్కువగా నేర్పించే ప్రయత్నం ఇది. గ్రామర్, కంజక్షన్స్, యూసేజ్‌పై పట్టుచిక్కే అవకాశం ఉండదు. ఫ్రీగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

బుస్సు (Busuu)

12 భాషలు నేర్చుకునే వీలుంది. ప్రపంచ వ్యాప్తంగా వెబ్, మొబైల్ ద్వారా వినియోగించుకోవచ్చు. సైన్ అప్ ద్వారా ఫ్రీగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గ్రామర్ లెసన్స్ మరింత లోతుగా ఆఫ్‌లైన్ విధానంలో నేర్చుకోవాలంటే మాత్రం సబ్‌స్క్రైబ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీని ద్వారా భాషలకు సంబంధించి రీడింగ్, రైటింగ్, లిజనింగ్, స్పీకింగ్‌పై అవగాహన పొందొచ్చు. ఈ యాప్ ప్రత్యేకత ఏమంటే... మీరు ఫ్రెంచ్ నేర్చుకుంటుంటే... మీ లాంగ్వేజ్ ఎక్సర్‌సైజ్‌లను నేటివ్ స్పీకర్స్ ఎవాల్యుయేట్ చేస్తుంటారు. ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ ఇస్తుంటారు.

మెమ్‌రైజ్(Memrise)

వినోదంతో పాటు భాషపై ప్రాక్టికల్ నాలెడ్జ్ సైతం పొందేందుకు దోహదం చేసే యాప్ ఇది. ప్రతి పాఠంలో ఎన్ని వర్డ్స్‌ను మీరు గుర్తుపెట్టుకోగలరో తెలుసుకునే వీలుంది. నేర్చుకుంటూ ముందుకుసాగుతున్న కొద్దీ సరైన సమాధానాలకు క్రెడిట్ పాయింట్స్ పొందొచ్చు. లాంగ్వేజ్ లెర్నింగ్‌ను ప్రోత్సహించేలా సరదా కోసం ర్యాంకులు, బ్యాడ్జెస్ కూడా ఇస్తుంది ఈ యాప్. ఫేస్‌బుక్, ట్వీటర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలపైనా నేర్చుకునే వీలు కల్పించే యాప్ మెమ్‌రైజ్. ప్రొనౌన్సియేషన్స్‌ను ప్రాక్టీస్ చేసే అవకాశం ఎక్కువగా లేకపోవడం ప్రతికూల అంశంగా పేర్కొనొచ్చు.

మోన్‌డ్లీ(Mondly)

మోన్‌డ్లీ ద్వారా 33 భాషలు నేర్చుకోవచ్చు. లోకలైజేషన్‌తో పాటు పిక్చర్స్, గ్రాఫిక్స్, నేటివ్ స్పీకర్స్ వంటి ఫీచర్స్ ఈ యాప్ ప్రత్యేకత. మొత్తం 10 56 స్థానిక భాషల్లో ఏదైనా మీకు వచ్చిన భాష ద్వారా నచ్చిన ఫారిన్ లాంగ్వేజ్‌ను నేర్చుకునే వీలుంది. ఉచితంగా నేర్చుకోవచ్చు. ప్రతి టాపిక్‌పై ముఖ్యంగా జంతువులు, ట్రావెల్, షాపింగ్ వంటి వాటిపై కనీసం 2 గంటలు సమయం కేటాయించాల్సి ఉంటుంది.

సాక్షి బిజినెస్

గురువారం 17-8-2017

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
322 ▲	103 ▲
31,771	9,897

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు సూచీలు రాత్రి 11.30)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	6,345	▲	12
డోజోన్స్	22,031	▲	32
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,433	▲	49
డాక్స్	12,264	▲	87
షాంఘై	3,247	▼	5
నికాయ్	19,729	▼	24

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	63.45	65.13
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	81.37	84.18
€	యూరో	ఎస్‌బీఐ	74.08	76.69
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.10	59.10
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.49	51.29
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	46.23	47.80
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.43	18.29
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.91	18.60
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.80	11.03

22 క్యారెట్ల స్వచ్ఛతపైన

పసిడి ఎగుమతులపై నిషేధం



కేంద్ర ప్రభుత్వం తాజా ఉత్తర్వులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం 22 క్యారెట్లకుపైన స్వచ్ఛత గల బంగారం ఉత్పత్తుల ఎగుమతులను నిషేధించింది. బంగారం ఉత్పత్తుల రౌండ్ ట్రిప్పింగ్‌ను అడ్డుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 8 క్యారెట్ల నుంచి 22 క్యారెట్ల వరకు స్వచ్ఛత గల బంగారం ఎగుమతులకు మాత్రమే అనుమతులున్నాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) ఒక ప్రకటనలో తెలిపింది. 22 క్యారెట్లలోపు స్వచ్ఛత గల బంగారం ఉత్పత్తులను ఎగుమతి చేసే వారికే ప్రోత్సాహకాలు లభిస్తాయని పేర్కొంది. కొందరు ఎగుమతిదారులు 22 క్యారెట్లకుపైన స్వచ్ఛతగల బంగారం ఉత్పత్తులకు కొంత విలువను జోడించి ఎగుమతి చేయడం ద్వారా ప్రోత్సాహకాలు పొందుతున్నారని జెమ్స్ అండ్ జువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) అధికారి ఒకరు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వపు తాజా నిషేధం బంగారం ఎగుమతులపై ప్రభావం చూపబోదని, అంతర్జాతీయ మార్కెట్‌లో 22 క్యారెట్లపైన స్వచ్ఛతగల బంగారం వస్తువులకు డిమాండ్ చాలా తక్కువగానే ఉందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈవో) వివరించింది. దక్షిణ కొరియా నుంచి దేశంలోకి బంగారం దిగుమతులు బాగా పెరిగాయని దేశీ బంగారు ఆభరణాల వర్తకులు ఆందోళన చెందుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఈ ప్రకటన వెలువడటం గమనార్హం.

స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలపై కన్ను



డేటా భద్రత చర్యలు తెలపాలని కేంద్రం సూచన

న్యూఢిల్లీ: యూజర్ల డేటా దుర్వినియోగం కాకుండా భద్రపర్చేందుకు తీసుకుంటున్న చర్యలు, ప్రక్రియల గురించి తెలియజేయాలంటూ స్మార్ట్‌ఫోన్ కంపెనీలను కేంద్రం ఆదేశించింది. ఈ సంస్థల్లో ఎక్కువ భాగం చైనా కంపెనీలే ఉన్నాయి. డోక్లాం ప్రాంతంపై భారత్, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో.. చైనా నుంచి ఐటీ, టెలికం ఉత్పత్తుల దిగుమతులపైనా ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయా కంపెనీలు తమ వివరణ తెలియజేయడానికి ఆగస్టు 28 దాకా సమయం ఇచ్చినట్లు కేంద్ర ఐటీ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మొబైల్ ఫోన్ల నుంచి డేటా లీకవుతోందంటూ అంతర్జాతీయ స్థాయిలో నివేదికలు వస్తున్న నేపథ్యంలో తొలి దశలో డివైజ్‌లను, వాటిల్లో ముందస్తుగానే లోడ్ చేసిన సాఫ్ట్‌వేర్, యాప్స్‌ను నిశితంగా పరిశీలించడం జరుగుతుందని ఆయన వివరించారు. డేటా భద్రతలో నిర్దేశిత ప్రమాణాలు పాటించడం లేదని తేలిన పక్షంలో ఐటీ చట్టంలోని 43 (ఎ) సెక్షన్ కింద జరిమానా విధించడం జరుగుతుందని అధికారి పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం (డైటీ) నోటీసులు పంపిన సంస్థల్లో చైనాకు చెందిన వివో, ఒప్పో, షావోమీ, జియోనీలతో పాటు మొత్తం 21 కంపెనీలు ఉన్నాయి. అలాగే, యాపిల్, శాంసంగ్, బ్లాక్‌బెర్రీ వంటి చైనాయేతర కంపెనీలతో పాటు పలు భారతీయ సంస్థలూ జాబితాలో ఉన్నట్లు కేంద్ర ఐటీ శాఖ అధికారి తెలిపారు.

జీఎంఆర్ కాకినాడ పవర్ ప్లాంటు రూ.400 కోట్లకు విక్రయం



హైదరాబాద్: కాకినాడ వద్ద ఉన్న 220 మెగావాట్ల గ్యాస్ ఆధారిత పవర్‌ప్లాంటును సుమారు రూ.400 కోట్లకు ఓ కంపెనీకి విక్రయిస్తున్నట్టు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. త్వరలో ఆ కంపెనీతో ఒప్పందం చేసుకోనున్నట్టు వెల్లడించింది. జీఎంఆర్ ఈ ప్రాజెక్టుకు చేసిన వ్యయం రూ.600 కోట్లు. ఈ ప్లాంటు 2001లో ప్రారంభం అయింది. సహజవాయువు కొరత కారణంగా 2013 నుంచి ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది.

పొదుపు వడ్డీ రేటు తగ్గించిన యస్ బ్యాంక్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ 'యస్ బ్యాంక్' తాజాగా సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్స్ (పొదుపు ఖాతాలు)పై వడ్డీ రేటును 1 శాతం వరకు తగ్గించింది. దీంతో రూ.లక్ష లోపు డిపాజిట్లపై వడ్డీ రేటు 5 శాతానికి దిగివచ్చింది. ఇక బ్యాంక్ రూ.లక్షకు పైన, రూ.కోటి లోపు ఉన్న డిపాజిట్లకు ఎప్పటిలాగే 6 శాతం వడ్డీ రేటును ఆఫర్ చేస్తోంది. రూ.కోటి పైన ఉన్న డిపాజిట్ల విషయానికి వస్తే వడ్డీ రేటును 6.5% నుంచి 6.25%కి తగ్గించింది. సవరించిన కొత్త వడ్డీ రేట్లు సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంక్ తెలిపింది. కాగా ఇప్పటికే ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్ తదితర బ్యాంకులు సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలపై వడ్డీ రేట్లను తగ్గించడం తెలిసిందే.

డిజిన్వెస్ట్‌మెంట్.. జోష్!

హైపవర్ ప్యానల్ ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం

- ఆర్థిక, రవాణా, పాలన విభాగాల మంత్రులకు చోటు
- త్వరలో నాలుగు సంస్థల్లో వ్యూహాత్మక వాటా విక్రయాలు
- జాబితాలో బీఈఎంఎల్, స్కూటర్స్ ఇండియా, పవన్‌హన్స్, హిందుస్తాన్ ప్రీఫ్యాబ్
- వీటికి సంబంధించి అడ్వైజర్ల నియామకం



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ సంస్థల్లో వ్యూహాత్మక వాటాల విక్రయం, పెట్టుబడుల ఉపసంహరణ(డిజిన్వెస్ట్‌మెంట్) ప్రక్రియ మరింత వేగం పుంజుకోనుంది. ఇందుకు గాను అత్యున్నత స్థాయి మంత్రుల కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఆర్థిక, రోడ్డు, రవాణా, పరిపాలనా విభాగం మంత్రులతో ప్రత్యామ్నాయ యంత్రాంగం ఏర్పాటుకు ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. వ్యూహాత్మక పెట్టుబడుల వ్యవహారాలపై ఈ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని సమావేశం అనంతరం అధికారికంగా విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం పేర్కొంది. దీనికితోడు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు వీలుగా... ఎప్పటికప్పుడు విధానపరమైన అంశాలపై నిర్ణయ అధికారాన్ని సెక్రటరీల కోర్ గ్రూపుకు ప్రభుత్వం కట్టబెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.72,500 కోట్ల నిధుల సేకరణ లక్ష్యాన్ని ప్రభుత్వం విధించుకున్న సంగతి తెలిసిందే. ఇందులో రూ.46,500 కోట్లు మైనారిటీ వాటాల విక్రయం ద్వారా, రూ.15,000 కోట్లు వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా, సాధారణ బీమా సంస్థల లిస్టింగ్ ద్వారా రూ.11,000 కోట్ల సమీకరణ ఇందులో ఉంది. ఇప్పటి వరకు మొత్తం మీద రూ.8,427 కోట్ల సమీకరణ పూర్తి చేసింది.

నాలుగింటిపై దృష్టి

బీఈఎంఎల్, స్కూటర్స్ ఇండియా, పవన్‌హన్స్, హిందుస్తాన్ ప్రీఫ్యాబ్ సంస్థల్లో వ్యూహాత్మక వాటాలను విక్రయించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. లక్నో కేంద్రంగా నడిచే స్కూటర్స్ ఇండియాలో నూరు శాతం, బెంగళూరు కేంద్రంగా భారీ యంత్రపరికరాలను తయారు చేసే బీఈఎంఎల్‌లో 26 శాతం, హెలికాప్టర్ సేవల్లోని పవన్‌హన్స్‌లో 51 శాతం చొప్పున వాటాలను అమ్మాలనుకుంటోంది. ఈ వ్యవహారాలను ముందుకు తీసుకెళ్లేందుకు సలహాదారుల నియామక ప్రక్రియ పురోగతిలో ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ సలహాదారులు ప్రొఫెషనల్ ఇంటర్‌మీడియరీలను ఎంపిక చేస్తారని వెల్లడించాయి. ఈ వర్గాలు అందించిన సమాచారం మేరకు... స్కూటర్స్ ఇండియాలో ముందుగా వాటాల విక్రయం జరగనుంది. ఇక పవన్‌హన్స్‌లో వాటాల విక్రయానికి సంబంధించి సమగ్ర ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు. పౌర విమానయాన శాఖ ఆదేశాల కోసమే ఇది ఆగింది. మరోవైపు హెచ్‌పీసీఎల్‌లో కేంద్ర ప్రభుత్వ వాటాలను ఓఎన్‌జీసీ కొనుగోలు చేస్తుండటంతో దీని ద్వారా సర్కారుకు రూ.33,000 కోట్ల నిధులు అందనున్నాయి. ఈ డీల్‌కు సంబంధించి కన్సల్టెంట్, న్యాయ సలహాదారుల నియామకంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది.

నాలుగు సంస్థల ఐపీవోలు

నాలుగు ప్రభుత్వరంగ సంస్థల్లో ఐపీవోల ద్వారా వాటాల విక్రయ ప్రక్రియను పెట్టుబడుల ఉపసంహరణ విభాగం (దీపం) ప్రారంభించింది. గార్డెన్‌రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్, మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్, భారత్ డైనమిక్స్, మిశ్రధాతు నిగమ్ ఇందులో ఉన్నాయి. వీటికి అదనంగా ప్రభుత్వరంగంలోని ఐదు సాధారణ బీమా సంస్థలు కూడా ఐపీవోలకు క్యూలో ఉన్నాయి. ఇక ఈ నెల మొదట్లో 22 ప్రభుత్వరంగ సంస్థలతో ఈటీఎఫ్ భారత్-22ను ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇది ప్రభుత్వం నుంచి రానున్న రెండో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్. దీని ద్వారా 22 ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాలను ప్రభుత్వం తగ్గించుకోవాలని అనుకుంటోంది.

ఎంఎన్‌పీ సమస్యలకు ట్రాయ్ చెక్

తిరస్కరణలు తగ్గించే దిశగా చర్యలు



న్యూఢిల్లీ: నంబర్ పోర్టబిలిటీ అభ్యర్థనలు తిరస్కరణకు గురవుతున్న ఉదంతాలను నియంత్రించే దిశగా టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎంఎన్‌పీ క్లియరింగ్ హౌస్ (ఎంసీహెచ్) ఏర్పాటు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. నంబర్ పోర్టబిలిటీ ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ ఎంసీహెచ్‌లో అందుబాటులో ఉండేలా చూడాలని ప్రతిపాదించింది. ప్రస్తుత విధానం ప్రకారం నెట్‌వర్క్ మారదల్చుకున్న వారి గత బిల్లింగ్ బకాయిల వివరాలు, అందుకున్న నోటీసులు, విశిష్ట పోర్టింగ్ కోడ్ (యూపీసీ) ఆఖరు తేదీ మొదలైనవి కొత్త ఆపరేటరు (ఆర్‌వో)కి అందుబాటులో ఉండటం లేదు. దీంతో ఆయా అంశాలను ధ్రువీకరించుకోలేక పలు నంబర్ పోర్టబిలిటీ అభ్యర్థనలను ఆపరేటర్లు తిరస్కరించాల్సి వస్తోంది. తిరస్కరణకు గురైన కేసుల్లో దాదాపు 40 శాతం అభ్యర్థనలు యూపీసీ సరిపోలక పోవడం, యూపీసీ గడువు ముగిసిపోవడం వంటి అంశాల కోవకి చెందినవే ఉంటున్నాయి. ఇది గుర్తించిన ట్రాయ్.. ప్రస్తుత పోర్టబిలిటీ ప్రక్రియలో ఎంసీహెచ్‌ని కూడా చేర్చాలని భావించింది. దీనిపై ఆగస్టు 31 దాకా సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలను ట్రాయ్‌కి తెలియచేయొచ్చు.

కొత్త ఇన్వెస్టర్లకు ఓపెన్ ఆఫర్ నుంచి మినహాయింపు



మొండి బాకీలున్న కంపెనీల్లో వాటాల కొనుగోలు నిబంధనల సడలింపు

న్యూఢిల్లీ: నష్టాల్లో ఉన్న కంపెనీల్లో వాటాలను రుణదాతలు కొనుగోలు చేయడం, తిరిగి ఈ వాటాలను కొత్త ఇన్వెస్టర్లు విక్రయించే అంశానికి సంబంధించి నిబంధనలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ సడలించింది. ఇలాంటి సంస్థల్లో వాటాలు కొనుగోలు చేసేటప్పుడు పబ్లిక్ షేర్‌హోల్డర్లకు కచ్చితంగా ఓపెన్ ఆఫర్ ప్రకటించడం నుంచి మినహాయింపునిచ్చింది. అయితే, వాటాల కొనుగోలుకు సంబంధించి ప్రత్యేక తీర్మానం ద్వారా షేర్‌హోల్డర్ల అనుమతి పొందడం తదితర షరతులు దీనికి వర్తిస్తాయి. దాదాపు రూ. 8 లక్షల కోట్ల మేర పేరుకుపోయిన మొండిబాకీల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ తీవ్రంగా కసరత్తు చేస్తున్న నేపథ్యంలో సెబీ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. నష్టాల్లో ఉన్న లిస్టెడ్ కంపెనీలు కోలుకోవడానికి, తద్వారా వాటాదారులు.. రుణదాతలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఈ చర్యలు ఉద్దేశించినవని ఆగస్టు 14న జారీ చేసిన నోటిఫికేషన్‌లో సెబీ పేర్కొంది. ప్రస్తుతం వ్యూహాత్మక రుణ పునర్‌వ్యవస్థీకరణ (ఎస్‌డీఆర్) పథకం కింద నష్టాల్లో ఉన్న కంపెనీల్లో వాటాలు దక్కించుకున్న రుణదాతలకు మాత్రమే ఓపెన్ ఆఫర్ తదితర నిబంధనల నుంచి మినహాయింపులు ఉన్నాయి. అయితే, సదరు రుణదాతల నుంచి వాటాలు కొనుగోలు చేయాలంటే తాము కచ్చితంగా ఓపెన్ ఆఫర్ ఇవ్వాల్సి వస్తుండటం వల్ల కొత్త ఇన్వెస్టర్లు (కొత్త యాజమాన్యం) ముందుకు రావడం లేదు. ఒకవేళ ఓపెన్ ఆఫర్ ప్రకటిస్తే.. కంపెనీలో ఇన్వెస్ట్ చేయగలిగే నిధుల పరిమాణం తగ్గిపోతోంది. ఈ సమస్యలను రుణదాతలు .. తన దృష్టికి తీసుకురావడంతో సెబీ తాజాగా ఓపెన్ ఆఫర్ మినహాయింపులను కొత్త ఇన్వెస్టర్లకు కూడా వర్తించేలా నిర్ణయం తీసుకుంది.

పావుశాతానికే ఉర్జిత్ మొగ్గు

బ్యాంకులు ఇంకా ఎక్కువే తగ్గించొచ్చని అభిప్రాయం

- ఎంపీసీ భేటీ మినిట్స్‌తో వెల్లడి



ముంబై: ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) ఈ నెల 1-2వ తేదీల్లో జరిగిన సమావేశంలో గవర్నర్ ఉర్జిత్ పటేల్ కేవలం 0.25 శాతం వరకే రేట్ల తగ్గింపు ఉండాలని తన అభిప్రాయాన్ని గట్టిగా వినిపించారు. ఆహార ధాన్యాల ధరలు తక్కువగా ఉండడం అసాధారణమని, ఇవి పెరిగేందుకు ఒత్తిళ్లు ఉన్నాయని అభిప్రాయపడిన ఆయన మోస్తరు రేట్ల కోతనే ఎంచుకున్నారు. నాటి సమావేశపు వివరాలు (మినిట్స్) తాజాగా వెల్లడయ్యాయి. ద్రవ్యోల్బణేతర వృద్ధికి పాలసీ రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని కచ్చితంగా బదిలీ చేయడం ఎంతో ముఖ్యమని ఉర్జిత్ పటేల్ పేర్కొన్నారు. బ్యాంకులకు ఇప్పటికీ రేట్లు తగ్గించేందుకు అవకాశాలున్నాయని ఆయన అన్నారు. ఎంపీసీ సమావేశంలో మెజారిటీ సభ్యుల అభిప్రాయాలకు అనుగుణంగా కీలకమైన రెపో, రివర్స్ రెపో రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన విషయం తెలిసిందే. ఆరుగురు సభ్యులకు గాను నలుగురు పావు శాతం తగ్గింపునకు ఓటేయగా, ఒకరు అర శాతం తగ్గింపునకు అనుకూలంగా ఉన్నారు. మరొకరు తటస్థంగా ఉండిపోయారు. అయితే, పారిశ్రామిక, ఇతర వర్గాలు ఇంతకంటే ఎక్కువ తగ్గింపునే ఆశించాయి. ఇటీవలి కాలంలో ఆహార విభాగంలో ప్రతి ద్రవ్యోల్బణం స్థిరంగా ఉందని, సాధారణ వర్షాలే ఉన్నప్పటికీ ఈ విషయంలో మరింత సమాచారం అవసరమని పటేల్ అభిప్రాయపడ్డారు. రుణాల వృద్ధి కూడా తక్కువగా ఉండడానికి, మొండి బకాయిల ఒత్తిడే కారణమన్నారు. రుణ వృద్ధికి, పెట్టుబడుల పురోగతికి ఒత్తిడితో కూడిన బ్యాంకుల బ్యాలన్స్ షీట్లకు పరిష్కారం కనుగొనడం కీలకమైన అంశంగా పేర్కొన్నారు.

మరింత పెరగనున్న ధరలు



- ఆగస్టులో 3 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- నివేదికలో మోర్గాన్ స్టాన్లీ అంచనాలు

న్యూఢిల్లీ: రానున్న నెలల్లో టోకు, రిటైల్ ద్రవ్యోల్బణాలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయని కన్సల్టెన్సీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ ఒక నివేదికలో పేర్కొంది. దీంతో.. రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య పరపతి విధానాన్ని మరింత సడలించే అవకాశాలు తక్కువేనని వివరించింది. జూలైలో పెరిగిన టోకు, రిటైల్ ద్రవ్యోల్బణాలు.. ఇకపై అదే ధోరణిలో కొనసాగుతాయని మోర్గాన్ స్టాన్లీ తెలిపింది. జూన్‌లో 0.90 శాతంగా ఉన్న టోకు ద్రవ్యోల్బణ పెరుగుదల.. ప్రధానంగా కూరగాయలు తదితర ఆహారోత్పత్తుల రేట్లు ఎగియడంతో జూలైలో 1.88 శాతంగా నమోదైంది. పంచదార, కన్ఫెక్షనరీ ఉత్పత్తులు, పొగాకు తదితర ఉత్పత్తుల ధరలు పెరగడం వల్ల రిటైల్ ద్రవ్యోల్బణం 2.36 శాతానికి ఎగిసింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 3.0 శాతానికి, టోకు ద్రవ్యోల్బణం 2.1 శాతానికి పెరగొచ్చని పేర్కొంది. అంతర్జాతీయంగా కమోడిటీల రేట్లు, ఇటు దేశీయంగా ఆహారపదార్థాల రేట్లు పెరుగుతుండటం ఇందుకు కారణమని అధ్యయన నివేదికలో వివరించింది. ద్రవ్యోల్బణం క్రమంగా లక్ష్యిత 4 శాతం స్థాయి దిశగా వెడుతున్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ .. కీలక పాలసీ రేట్లను మరింతగా తగ్గించే అవకాశాలు ఉండకపోవచ్చని పేర్కొంది.

కొటక్ జనరల్.. కొత్త 'ప్రయాణం'

ప్రయాణ బీమాలోకి విస్తరణ...

- ఏడాదిలో ప్రొడక్ట్, పబ్లిక్ లయబులిటీ ఇన్సూరెన్స్ కూడా..
- 2017 క్యూ1లో రూ.36 కోట్ల వ్యాపారం
- దేశంలో రూ.84 కోట్ల వ్యాపారం; తెలంగాణ, ఏపీ వాటా 5 శాతం
- కొటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ మహేశ్ బాలసుబ్రమణియన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:

కొటక్ మహీంద్రా బ్యాంక్‌కు చెందిన 100 శాతం అనుబంధ సంస్థ కొటక్ జనరల్ ఇన్సూరెన్స్ 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఇతర బీమా విభాగాల్లోకి విస్తరించనుంది. ముందుగా ప్రయాణ బీమా పాలసీలను ఆ తర్వాత ప్రొడక్ట్, పబ్లిక్ లయబులిటీ ఇన్సూరెన్స్, ఇంజనీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ బీమా పాలసీలను ప్రారంభిస్తామని కంపెనీ ఎండీ అండ్ సీఈఓ మహేశ్ బాలసుబ్రమణియన్ చెప్పారు. బుధవారమిక్కడ 'సాక్షి బిజినెస్' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయనింకా ఏమన్నారంటే..

ఏపీ, తెలంగాణ వాటా 8 శాతం..: 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.84 కోట్ల ప్రీమియంలను సమీకరించాం. ఈ ఆర్థిక సంవత్సరంలో మూడింతల వృద్ధితో రూ.200 కోట్ల ప్రీమియంలను లక్ష్యించాం. 2017 తొలి త్రైమాసికంలో రూ.36 కోట్ల వ్యాపారాన్ని చేరుకున్నాం. గత ఆర్థిక సంవత్సరం క్యూ1లో రూ.10.50 కోట్ల వ్యాపారాన్ని చేశాం. మా మొత్తం వ్యాపారంలో మహారాష్ట్ర తర్వాత అతిపెద్ద మార్కెట్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాలే. ఇక్కడి నుంచి 8 శాతం వ్యాపారం జరుగుతోంది. గతేడాది దేశీయ సాధారణ బీమా పరిశ్రమ 32 శాతం వృద్ధి రేటుతో రూ.1.27 లక్షల కోట్లకు చేరింది.

ఏడాదిలో 10 సంస్థలతో ఒప్పందం..

ప్రస్తుతం వాహన, ఆరోగ్య, గృహ విభాగాల పాలసీలందిస్తున్నాం. దేశవ్యాప్తంగా 1.75 లక్షల పాలసీలుండగా.. రెండేళ్లలో మూడింతల వృద్ధితో 3 లక్షల పాలసీలను లక్ష్యించాం. ఆన్‌లైన్‌లో పాలసీల కొనుగోళ్ల వాటా 20 శాతం వరకూ వుంటుంది. కొటక్ బ్యాంక్ కస్టమర్లే కాకుండా డిస్ట్రిబ్యూటర్లు, ప్రైవేట్ సంస్థలు, ఇతర బ్యాంకుల నుంచి కూడా మాకు కస్టమర్లున్నారు. వీరి వాటా 35 శాతం వుంటుంది. చెన్నైకు చెందిన ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ముంబైకి చెందిన సూర్యోదయ్ ఫైనాన్స్ బ్యాంకులతో ఒప్పందం చేసుకున్నాం. ఏడాదిలో మరో 10 సంస్థలతో ఒప్పందాలు చేసుకోనున్నాం. పలు ఎన్‌బీఎఫ్‌సీలు, గృహ రుణ సంస్థలతో చర్చలు జరుపుతున్నాం.

జీఎస్‌టీ ప్రయోజనం వేచి చూడాలి..

కొటక్ మహీంద్ర బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్, బ్రోకింగ్, మ్యూచువల్ ఫండ్స్, ప్రైవేట్ ఈక్విటీ విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తుంది. 2014లో లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలోకి అడుగుపెట్టాం. ఇప్పటివరకు కొటక్ మహీంద్రా నుంచి రూ.175 కోట్ల నిధులు సమీకరించాం. గతంలో బీమా రంగానికి 15 శాతంగా ఉన్న పన్నులను.. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)లో 18 శాతంలో శ్లాబును కేటాయించారు. దీంతో ప్రీమియం ధరలు కూడా 3 శాతం పెరిగాయి. అయితే పెరిగిన ప్రీమియంల కారణంగా కస్టమర్ల పాలసీ విషయంలో ఎలాంటి మార్పుల్లేవు. దీర్ఘకాలంగా ఎలాంటి ప్రయోజనాలుంటాయో వేచి చూడాలి.



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

సరుకు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ.4,850 (కనిష్టం) రూ.5,245 (గరిష్టం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.2,000 (కనిష్టం) రూ.4,600 (గరిష్టం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.3,200 (కనిష్టం) రూ.7,871 (గరిష్టం) (11న ముగింపు)
ఉల్లి (కర్నూలు)	రూ.260 (కనిష్టం) రూ.840 (గరిష్టం) (20న ముగింపు)
చక్కెర (చెన్నై)	రూ.4,080
బియ్యం (కరీంనగర్)	రూ.3,600 (హెచ్‌ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,800
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	రూ.6,781

రిలయన్స్ డిఫెన్స్ పేరు మార్పు

కొత్త పేరు రిలయన్స్ నేవల్ అండ్ ఇంజనీరింగ్



న్యూఢిల్లీ: రిలయన్స్ డిఫెన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్‌డీఈఎల్) సంస్థ పేరు మార నుంది. రిలయన్స్ నేవల్ అండ్ ఇంజనీరింగ్ లిమిటెడ్‌గా పేరును మార్చేందుకు షేర్‌హోల్డర్ల అనుమతి కోరనున్నట్లు సంస్థ తెలిపింది. భారత నౌకాదళం, కోస్ట్ గార్డ్ దళాలకు అందించే సర్వీసులకు అనుగుణంగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ఆగస్టు 22న జరిగే వార్షిక సర్వసభ్య సమావేశంలో ఇందుకోసం వాటాదారుల అనుమతి తీసుకుంటామని పేర్కొంది. ఆర్‌డీఈఎల్ గతంలో పిపావవ్ డిఫెన్స్ అండ్ ఆఫ్‌షోర్ ఇంజనీరింగ్ కంపెనీ పేరుతో ఉండేది. 2016లో పిపావవ్ డిఫెన్స్‌లో కీలక వాటాలు కొనుగోలు చేసిన తర్వాత రిలయన్స్ గ్రూప్.. ఈ సంస్థ పేరును ఆర్‌డీఈఎల్ కింద మార్చింది.

ఐడీఎఫ్‌సీ నుంచి కార్పొరేట్ బెనిఫిట్ కార్డ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐడీఎఫ్‌సీ బ్యాంక్ డిజిటల్ పేమెంట్ కంపెనీ జెటాతో కలిసి ఐడీఎఫ్‌సీ బెనిఫిట్స్ కార్డును అభివృద్ధి చేసింది. దీంతో కార్పొరేట్ ఉద్యోగులు ఒకే కార్డుతో ఉద్యోగ ప్రయోజనాలన్నీ పొందే వీలుంటుంది. అంటే సంప్రదాయ బ్యాంక్ విధానాలతో అవసరం లేకుండా ఉద్యోగులు తమ ఖర్చులు, క్లెయిమ్స్‌ను డిజిటైజ్ చేసుకునే వీలుంటుందన్నమాట.

నేటి బోర్డు మీటింగ్స్

- ఎరిస్ లైఫ్‌సైన్సెస్
- విమ్టా ల్యాబ్స్
- డిష్ టీవీ ఇండియా
- సొమానీ సెరామిక్స్
- తాల్బ్రోస్ ఇంజనీరింగ్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	28,805
బంగారం (99.5, 10గ్రా)	28,655
వెండి (కిలో)	38,255
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	--
బంగారం (22 క్యారెట్లు)	27,480
వెండి (కిలో)	--
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	29,510
బంగారం (22 క్యారెట్లు)	27,590
వెండి(కిలో)	38,815
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	29,750
బంగారం (22 క్యారెట్లు)	27,590
వెండి(కిలో)	39,500
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	29,950
బంగారం (22 క్యారెట్లు)	27,550
వెండి(కిలో)	40,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	29,900
బంగారం (22 క్యారెట్లు)	27,700
వెండి(కిలో)	39,800
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	29,770
బంగారం (22 క్యారెట్లు)	27,560
వెండి(కిలో)	39,480

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

వడ్డీ రేట్లు

బేస్‌రేట్ రేంజ్	9.00 – 9.55
డిపాజిట్ రేట్ రేంజ్ (ఏడాది)	6.25 – 6.75
డాలర్ లిబార్ (6 నెలలు)	1.45

అంకెలు శాతాల్లో

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	మంగళవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	46.86	$47.55
బ్రెంట్	50.31	$50.80

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 17-8-2017

విశాఖ	362-00
చిత్తూరు	390-00
వరంగల్	357-00
ముంబై	400-00
చెన్నై	397-00
విజయవాడ	359-00
గోదావరి	359-00
నమక్కల్	384-00
16-8-2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	355-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	380-00
ఢిల్లీ	370-00
కోల్‌కతా	393-00

సెన్సెక్స్ 322 పాయింట్లు జంప్

నిఫ్టీ 103 పాయింట్లు అప్

- నెలరోజుల్లో అత్యధిక లాభం
- అమెరికా – ఉత్తర కొరియా ఉద్రిక్తతలు సడలిన నేపథ్యం



ముంబై: అమెరికా– ఉత్తరకొరియాల మధ్య ఉద్రిక్తతలు తగ్గడంతో ఇన్వెస్టర్లు వరుసగా రెండో ట్రేడింగ్ సెషన్లో జోరుగా కొనుగోళ్లు జరిపారు. దాంతో బీఎస్‌ఈ సెన్సెక్స్ మరో 322 పాయింట్లు పెరిగి 31,771 పాయింట్ల వద్ద ముగిసింది. ఆగస్టు 9 తర్వాత ఇదే గరిష్ట ముగింపు. అలాగే నెలరోజుల్లో ఈ స్థాయిలో సెన్సెక్స్ పెరగడం ఇదే ప్రథమం. క్రితం రోజు స్వాతంత్ర్య దినోత్సవం కారణంగా మార్కెట్లకు సెలవుకాగా, సోమవారం సెన్సెక్స్ 226 పాయింట్లు పెరిగిన సంగతి తెలిసిందే. ఈ రెండు ట్రేడింగ్ సెషన్లలో కలిపి దాదాపు 550 పాయింట్లు లాభపడినట్లయ్యింది. ఇదేరీతిలో ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 103 పాయింట్లు జంప్‌చేసి 9,897 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. ద్రవ్యోల్బణం పెరిగినట్లు డేటా వెలువడిన నేపథ్యంలో ట్రేడింగ్ తొలిదశలో సూచీలు ఒడిదుడుకులకు లోనై, కొద్ది నిమిషాలపాటు నష్టాల్లోకి జారుకున్నప్పటికీ, మధ్యాహ్న సెషన్ సమయంలో యూరప్ సూచీలు పరుగులు తీస్తున్న నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీలు కూడా ఒక్కసారిగా ర్యాలీ ప్రారంభించాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. జీఎస్‌టీ రేటు సవరించే అవకాశాలున్నాయన్న అంచనాలతో ఎఫ్‌ఎంసీజీ షేర్లపై ఇన్వెస్టర్లు దృష్టినిలిపారని, అమెరికా– ఉత్తరకొరియాల మధ్య ఉద్రిక్తతలు తగ్గడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ మార్కెట్ స్ట్రాటజిస్ట్ ఆనంద్ జేమ్స్ వివరించారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	4,402
ఎన్‌ఎస్‌ఈ (ఈక్విటీ)	26,122
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	8,49,970
ఎఫ్‌ఐఐ	-1,090
డీఐఐ	1,337

ఎఫ్‌ఎంసీజీ, ఫార్మాల జోరు...

కొద్ది వారాలపాటు అదేపనిగా క్షీణించిన ఫార్మా షేర్లు వరుసగా రెండో రోజు ఎగిశాయి.సిప్లా 3.7 శాతం ర్యాలీ జరిపి రూ. 590 వద్ద క్లోజ్‌కాగా, సన్‌ఫార్మా 2.9 శాతం ఎగిసి రూ. 485 వద్ద ముగిసింది. ఎఫ్‌ఎంసీజీ షేర్లు ఐటీసీ, హిందుస్తాన్ యూనీలీవర్‌లు 2.8 శాతం చొప్పున పెరిగాయి. టాటా మోటార్స్ 3.57 శాతం ఎగిసి సెన్సెక్స్–30 షేర్లలో టాప్‌గెయినర్‌గా నిలిచింది. 4.4 శాతం ర్యాలీ జరిపిన టెక్ మహీంద్రా నిఫ్టీ–50లో అత్యధికంగా లాభపడిన షేరుగా నమోదయ్యింది. ఉక్కు దిగ్గజం టాటా స్టీల్ 1 శాతంపైగా పెరిగి ఆరేళ్ల గరిష్ట స్థాయి రూ. 631 వద్ద క్లోజయ్యింది. బ్యాంకింగ్ షేర్లలో ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు 1–2 శాతం మధ్య ర్యాలీ జరిపాయి.

ఐటీసీ.. ఫ్యూచర్స్ సిగ్నల్స్

బుధవారం ప్రధాన సూచీల భారీ ర్యాలీకి ముఖ్య కారణం సూచీల్లో అధిక వెయిటేజీ కలిగిన ఎఫ్‌ఎంసీజీ షేర్లు ఐటీసీ, హిందుస్తాన్ లీవర్‌లు 2 శాతంపైగా పెరగడం. వీటిలో ఐటీసీ 2.9 శాతం ఎగిసి 6 రోజుల గరిష్టస్థాయి రూ. 279.20 వద్ద ముగిసింది. స్పాట్ ధరతో సమానంగానే ఫ్యూచర్ కాంట్రాక్టు ధర ముగిసింది. ఎటువంటి ప్రీమియంగానీ, డిస్కౌంట్‌గానీ లేదు. కానీ షార్ట్ కవరింగ్ కారణంగా ఫ్యూచర్ కాంట్రాక్టు నుంచి 18.76 లక్షల షేర్లు (3.67 శాతం) కట్ అయ్యాయి. దాంతో ఫ్యూచర్ ఓపెన్ ఇంట్రస్ట్ (ఓఐ) 4.92 కోట్లకు తగ్గింది. ఆప్షన్స్ విభాగంలో రూ. 280 స్ట్రయిక్ వద్ద స్వల్పంగా కాల్ రైటింగ్, పుట్ రైటింగ్ జరిగాయి. ఈ స్ట్రయిక్ వద్ద కాల్ ఆప్షన్లో 22.76 లక్షల షేర్లు, పుట్ ఆప్షన్లో 13.84 లక్షల షేర్ల చొప్పున బిల్డప్ వుంది. నియర్ స్ట్రయిక్స్ రూ.285, రూ. 290 వద్ద మాత్రం 2.50 లక్షల షేర్ల చొప్పున బిల్డప్ తగ్గడం విశేషం. ఈ రెండు స్ట్రయిక్స్ వద్ద వరుసగా 17.52 లక్షలు, 48.24 షేర్ల చొప్పున బిల్డప్ వుంది. పుట్ ఆప్షన్లలో అత్యధికంగా రూ. 270 స్ట్రయిక్ వద్ద 25.29 లక్షల షేర్ల బిల్డప్ వుంది. సమీప భవిష్యత్తులో ఈ షేరు రూ. 280పైన స్థిరపడితే క్రమేపీ రూ. 290 స్థాయికి చేరవచ్చని, రూ. 280 స్థాయిని దాటలేకపోతే..క్రమేపీ రూ. 270 స్థాయికి తగ్గవచ్చని ఆప్షన్ డేటా సూచిస్తున్నది.

డీఎల్‌ఎఫ్ ఫ్యూచర్ సంకేతాలు ఎలా వున్నాయి? ఈ వివరాలు www.sakshibusiness.comలో

హ్యాకర్ల కొత్త ఎత్తుగడలు.. స్టార్టప్సే లక్ష్యం..

డేటా లీక్ అయ్యిందంటూ హెచ్చరికలు

- అటుపై సాయమందిస్తామంటూ హామీ
- చివరకు సేవల పేరుతో ఆదాయం



ముంబై: మోసపూరిత ఈ–మెయిల్స్/కాల్స్.. బ్యాంక్ అకౌంట్ల వివరాలు తెలుసుకోవడం.. క్రెడిట్ కార్డుల సమాచారం కొట్టేయడం.. ఇలా వివిధ మార్గాల్లో హ్యాకర్లు డబ్బు సంపాదిస్తున్నారు. ఇప్పుడు వీరు స్టార్టప్స్‌పై పడుతున్నారు. వీటిని భయపెట్టి ఆదాయం పొందాలని చూస్తున్నారు. అదెలాగంటే.. దేశీ క్రెడిట్ స్కోర్ మేనేజ్‌మెంట్ కంపెనీ 'క్రెడిట్‌సేవ' హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీని సర్వర్‌లో నిక్షిప్తమై ఉన్న దాదాపు 40,000 మంది రుణగ్రహీతల వివరాలు లీక్ అయ్యాయని ఒక యూరోపియన్ సైబర్ సెక్యూరిటీ సంస్థ దీన్ని హెచ్చరించింది. జరిగిన తప్పును సరిదిద్దుకునేందుకు సాయమందిస్తామని హామీ కూడా ఇచ్చింది. అలర్ట్ అయిన క్రెడిట్‌సేవ సంస్థ వ్యవస్థలో ఎక్కడ లోపాలున్నాయో, పొరపాటు ఎక్కడ జరిగిందో తెలుసుకునేందుకు ప్రయత్నించింది. కానీ లీక్‌కు సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. దీంతో డేటా భద్రంగానే ఉందని, ఎవరి చేతుల్లోకి వెళ్లలేదని ఊపిరి పీల్చుకుంది. అయితే లండన్‌కు చెందిన ఒక బ్లాగర్ కూడా డేటా లీక్ జరిగిందని కథనం వడ్డించేసింది. కానీ క్రెడిట్‌సేవ సీఈవో సత్య విష్ణుభొట్ల మాత్రం డేటా లీక్ అవ్వలేదని, భద్రంగానే ఉందని స్పష్టం చేశారు.

సమస్య సృష్టించేదీ...సొల్యూషన్ ఇచ్చేదీ వారే...

ఇక్కడ మరొక కొత్త సమస్య ఉత్పన్నమౌతోంది. కొందరు నిష్ణాతులైన సెక్యూరిటీ ప్రొఫెషనల్స్ ఇండియన్ కంపెనీలను భయపెడుతున్నారు. వీరు ఎలాంటి వారంటే వ్యాపారం కోసం సిస్టమ్ హ్యాక్ చేయడానికి కూడా వెనకాడరు. అంటే వారే సమస్యను సృష్టించి, దానికి సొల్యూషన్‌ను అందిస్తారు. స్టార్టప్స్ ఈ ఉదాహరణను ఒక హెచ్చరిక లాగా తీసుకోవాలని స్థానిక సెక్యూరిటీ సంస్థ ఒకటి హెచ్చరించింది. ఫిన్‌టెక్ విభాగంలో బిజినెస్‌కు సంబంధించి సెక్యూరిటీ అనేది ముఖ్యమైన అంశమని తెలిపింది. స్టార్టప్స్ ఎప్పుడూ వ్యాపార విస్తరణతో పాటు సైబర్ దాడులు, డేటా భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని పేర్కొంది.

స్టార్టప్‌ను నడిపించడం కష్టమైన పనే. మీ సిస్టమ్‌లో లోపాలున్నాయని, సమస్య పరిష్కారానికి మా సేవలు ఉపయోగపడతాయని కొందరు సెక్యూరిటీ కన్సల్టెంట్స్ మీ వద్దకు వస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో స్టార్టప్ నిర్వహణ మరింత కష్టంగా అనిపిస్తుంది. ఎందుకంటే వీరి సేవలు తీసుకోవడానికి మనం నిరాకరిస్తే.. డేటా లీక్ అయ్యిందంటూ వీరు మీడియాకు తెలియజేస్తారు. మా పోర్ట్‌ఫోలియోలోని ఒక కంపెనీలో ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. మీ వరకు కూడా ఈ సమస్య రావొచ్చు. తస్మాత్ జాగ్రత్త.

– స్టీవెన్ టంగ్, బూట్‌క్యాంప్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్, క్రెడిట్‌సేవ ఇన్వెస్టర్

కేవీబీలో ఆధార్ నమోదు కేంద్రం

ప్రైవేటు రంగ బ్యాంకులో దేశంలోనే తొలిసారి



ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభోత్సవంలో గజారే (మధ్య వ్యక్తి)

కొరుక్కుపేట (చెన్నై): దేశంలోనే తొలిసారిగా ప్రైవేటు రంగ బ్యాంకులో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్ (ఆధార్ నమోదు కేంద్రం)ను చెన్నై నెల్సన్ మాణిక్యం రోడ్డులోని కరూర్ వైశ్యా బ్యాంకు (కేవీబీ)శాఖలో ఏర్పాటుచేశారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ), బెంగళూరు రీజనల్ ఆఫీసు అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ గజారే ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గజారే మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా కరూర్ వైశ్యా బ్యాంకులో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు.త్వరలో దేశవ్యాప్తంగా 75కు పైగా బ్రాంచుల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ఐపీవో మైలురాయి దాటిన కొచ్చిన్ షిప్‌యార్డ్

కేంద్ర షిప్పింగ్ శాఖ వెల్లడి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ కొచ్చిన్ షిప్‌యార్డ్ .. మైలురాయిలాంటి ఐపీవో ప్రక్రియను పూర్తి చేసుకుందని కేంద్ర షిప్పింగ్ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆఫర్ విలువ రూ. 1,442 కోట్లు కాగా.. ఇష్యూ ఏకంగా 75 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయిందని, రూ. 1.11 లక్షల కోట్ల మేర నిధులను ఆకర్షించిందని వివరించింది. సమీకరించిన నిధులను కార్యకలాపాల విస్తరణ కోసం వినియోగించనున్నట్లు తెలిపింది. కొచ్చిన్ షిప్‌యార్డ్ (సీఎస్‌ఎల్) ఆగస్టు 11న బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలో లిస్టయింది. రిటైల్ విభాగం నుంచి ఇష్యూకి మంచి స్పందన లభించింది. 20 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఇక లిస్టింగ్ రోజున మార్కెట్లు నష్టాల్లో ఉన్నప్పటికీ.. ఇష్యూ ధర కన్నా స్టాక్ 20 శాతం అధిక రేటు దగ్గరే ప్రారంభమైంది. 1972లో ప్రారంభమైన సీఎస్‌ఎల్ నౌకల నిర్మాణం, రిపేర్లతో పాటు మెరైన్ ఇంజనీరింగ్ శిక్షణ తదితర కార్యకలాపాలు సాగిస్తోంది. దాదాపు 45 నౌకలను విదేశీ కస్టమర్లకు ఎగుమతి చేయడంతో పాటు భారతీయ నౌకాదళం కోసం దేశీ పరిజ్ఞానంతో తొలి ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌ను రూపొందించిన ఘనత కూడా సీఎస్‌ఎల్‌దే. 2016–17లో రూ. 2,059 కోట్ల ఆదాయంపై రూ. 322 కోట్లు లాభం ఆర్జించింది.

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ACC LIMITED	1811.2	1784.8
ADANI PORT	397.55	396.2
AMBUJA CEME	270.05	265.1
ASIAN PAINT	1141.3	1154
AXIS BANK L	499.5	491.75
BAJAJ AUTO	2849.2	2831.6
BANK OF BAR	147.15	142.25

A B C D

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
3M INDIA LI	13879.95	13860.65
63 MOONS TE	63.85	62.55
8K MILES SO	498.5	486.25
AARTI DRUGS	515.25	513.15
AARTI INDUS	871.7	874.95
ABAN OFFSHO	163.15	163.95
ABBOTT INDI	4336.9	4317.55
ACCELYA KAL	1371.4	1350.2
ACCORD SYNE	55.6	55.5
BEARDSELL L	53.65	52.35
BEML LIMITE	1717.2	1749.7
BERGER PAIN	246.6	247.4
BF INVESTME	165.15	161.8
BF UTILITIE	339.4	337.2
BGR ENERGY	132.9	128.75
BHAGERIA IN	265.3	263.75
BHANSALI EN	76.75	76.55
BHARAT BIJL	1217.85	1192.35
BHARAT FIN	823.45	802.75
BHARAT FORG	1187.3	1180.8
BHARAT GEAR	146.25	139.05
DHUNSERI TE	289.2	285
DIC INDIA L	522.35	523.6
DILIP BUILD	526.95	523.55
DISH TV IND	72.1	73.4
DOLLAR INDU	2088.8	2093.5
DOLPHIN OFF	77.9	78.55
DONEAR IND.	59.95	60.1
DR. LAL PAT	806.7	806.35
DWARIKESH S	66.35	68.35
DYNAMATIC T	2160.15	2144.05
DYNEMIC PRO	119.95	117.7

E F G H

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
GUJARAT MIN	140.3	137.45
GUJARAT PIP	141	140.35
GUJARAT STA	184	183.95
GULF OIL LU	834.1	819.1
GULSHAN POL	79	82.6
HARITA SEAT	761.15	743.3
HARRISON MA	77.25	75.95
HATSUN AGRO	626.2	631.5
HEALTHCARE	273.35	271.05
HEG LTD	468.2	476.85
HEIDELBERGC	119	118.1
HERCULES HO	133.9	132.6

I J K L

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
JIND POL IN	59.95	65.05
JINDAL DRIL	158.15	156.7
JINDAL PHOT	68.05	66.7
JINDAL POLY	372.1	365.15
JINDAL SAW	93.45	92.55
JINDAL STAI	82.45	80.75
JINDAL STAI	172.9	166.1
JINDAL STEE	138.4	136.65
JINDAL WORL	803.7	796.75
JK CEMENT L	1032.25	1037.4
JK LAKSHMI	418.55	421.2
JK PAPER LI	92.2	90.8

M N O P

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
MANAKSIA LT	74.05	71.85
MANAPPURAM	90.3	88.55
MANG.CHEM.F	63.15	62
MANGALAM CE	360.85	356.1
MANGALAM DR	139.35	133.9
MANPASAND B	802.85	802.5
MARATHON NX	284.95	283.25
MASTEK LTD	278.8	276.9
MAWANA SUGA	90.15	90.2
MAX FINANCI	607.35	601.2
MAX INDIA L	143	144.05
MAX VENTURE	86.55	86.5
PENNAR ENG	92.6	97.75
PENNAR INDU	56.3	53.15
PERSISTENT	625.2	610.35
PFIZER LTD	1787.25	1799.25
PG ELECTROP	350.05	328.6
PHILIPS CAR	629.6	626.2
PHOENIX LAM	203.3	205.1
PI INDUSTRI	743	712.35
PINCON SPIR	55.45	57.5
PLASTIBLEND	254.3	252.4
PNB GILTS L	52.95	51.95
PNB HOUSING	1544.95	1509.4

R S T U

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
SCHAEFFLER	4396	4413.1
SCHNEIDER E	121.15	119.3
SEAMEC LIMI	160.95	164.35
SECURITY IN	812.55	802.85
SELAN EXPLO	162.4	162.45
SEQUENT SCI	116.7	114.8
SESHASAYEE	700.6	703.05
SHAKTI PUMP	491.85	471.35
SHANKARA BL	1067.8	1019.3
SHANTHI GEA	131.3	133.65
SHARDA CROP	436	445.8
SHARDA MOTO	2648.6	2616.25
THE GE SHPG	377	382
THE GROB TE	303	282.6
THE HI-TECH	339.45	343.5
THE INDIA C	185	184.45
THE INDIAN	125.95	125.05
THE MANDHAN	152.5	149.3
THE P K TEA	145.75	144.05
THE PHOENIX	524.65	509.3
THE RAMCO C	693.5	673.8
THE RUBY MI	314.4	306.85
THE STATE T	154.65	150.85
THE TINPLAT	138.45	133

V W Y Z

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

బీఎస్‌ఈలో ఎస్ఎంఈ స్టాక్స్


వై.రామవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

విషాహారంతో విద్యార్థినులకు అస్వస్థత

ఆస్పత్రికి తరలింపు ● తూర్పుగోదావరి జిల్లాలో ఘటన

వై.రామవరం (రంపచోడవరం): తూర్పు గోదావరి జిల్లా వై.రామవరం మండలం, తోటకూరపాలెం గ్రామంలోని కస్తూర్బా పాఠశాల బాలికల విద్యాలయంలో ఆహారం వికటించి 36 మంది బాలికలు బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు కావడంతో వారిని 108 వాహనంలో వై.రామవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా తయారు చేసిన బిర్యానీని బుధవారం ఉదయం అల్పాహారంగా పెట్టడంతోనే ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని వారి తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ప్రతి రోజూ మిగిలిన భోజనాన్ని మరోపూట పెడుతున్నారని విద్యార్థులు ఆరోపించారు. చికిత్స పొందుతున్న పూసం ఝాన్సీ రాణి, తాటి లలితకుమారి, ఎం.పార్వతి, వెదుళ్ల రమ్యశ్రీ అనే విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రంపచోడవరం ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, ఐటీడీఏ పీవో దినేశ్‌కుమార్ విద్యార్థినులను పరామర్శించారు.

కరుణానిధికి శస్త్ర చికిత్స

చెన్నై కావేరి ఆస్పత్రిలో ఆహారనాళం మార్పిడి చేసిన వైద్యులు

సాక్షి ప్రతినిధి, చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు కరుణానిధికి బుధవారం శస్త్రచికిత్స చేశారు. ఏడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న కరుణానిధి జనరల్ చెకప్ కోసం బుధవారం ఉదయం చెన్నై కావేరి ఆస్పత్రికి వచ్చారు. అనంతరం ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కరుణానిధి సులువుగా ఆహారం తీసుకునేందుకు ఆయన గొంతులో గతంలో అమర్చిన ఆహారనాళాన్ని (ట్రాకోస్టోమీ) తొలగించి కొత్తది అమర్చారు. తర్వాత సాయంత్రం కరుణానిధి తిరిగి ఇంటికి వెళ్లిపోయారు.

కాకిలెక్కలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

సీఎంపై పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి ధ్వజం



అనంతపురం సెంట్రల్: స్వాతంత్య్ర దినోత్సవం రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధిపై కాకిలెక్కలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించారని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి విమర్శించారు. బుధవారం అనంతపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను ప్రారంభిస్తూ వాటిని తానే నిర్మించినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో ఫ్యాక్షన్ రాజకీయాలు చేసేలా సీఎం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో చంద్రబాబు, కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ఇద్దరూ ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విభజన చట్టంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేయడంలేదన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కోటా సత్యనారాయణ, పీసీసీ అధికార ప్రతినిధులు రమణ, నాగరాజు పాల్గొన్నారు.

4.8 కిలోల బంగారం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం

రొంపిచర్ల: అక్రమంగా తరలిస్తున్న 4.8 కిలోల బంగారు ఆభరణాలు, రూ.1.3 లక్షల నగదును గుంటూరు జిల్లా రొంపిచర్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నక్కా ప్రకాశ్‌రావు సిబ్బందితో రొంపిచర్లలోని చెరువుగట్టు సెంటర్‌లో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నరసరావుపేటకు చెందిన మహ్మద్ రఫీ అనే వ్యక్తి కారులో పిడుగురాళ్ల వైపు వెళ్తుండగా వాహనాన్ని తనిఖీ చేశారు. బంగారు ఆభరణాలు, నగదు ఉండటం, ఎలాంటి రశీదులు లేకపోవడంతో పాటు పోలీసు విచారణలో రఫీ సరైన వివరాలు చెప్పకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. పూర్తి విచారణ చేయనున్నట్లు సీఐ కె.ప్రభాకర్‌రావు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును సీటీవో కార్యాలయానికి పంపుతామన్నారు.

విదేశీ యాత్రలకు సీఎస్ కళ్లెం

అధికారులు ఏడాదిలో నాలుగు దఫాలకు మించి వెళ్లరాదు
- కేంద్రంతో పాటు సీఎస్ అధ్యక్షతన స్క్రీనింగ్ కమిటీ ఆమోదం పొందాలి
- కాంట్రాక్టర్లను విదేశాలకు తీసుకువెళ్లరాదు
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ దినేశ్‌కుమార్

సాక్షి, అమరావతి

ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మంత్రులతోపాటు ఉన్నతాధికారులు, రాజధానికి చెందిన ఉద్యోగుల విదేశీ పర్యటనలు జోరుగా సాగుతున్నాయి. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తొలి ప్రాధాన్యతగా చంద్రబాబు విదేశీ పర్యటనలనే ఎంచుకోవటంతో అధికార యంత్రాంగం సైతం అదేదారిలో నడుస్తోంది. విదేశీ పర్యటనల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 150 జీవోలను జారీ చేసింది. విదేశీ పర్యటనకు ముందు కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీ ఆమోదం తీసుకోవాలి. గత మూడేళ్లుగా ఈ నిబంధనలను పాటించకుండా మంత్రులు, ఉన్నతాధికారులు విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చాక తాపీగా అనుమతుల కోసం ఫైళ్లను సాధారణ పరిపాలన శాఖకు పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ పర్యటనలకు కళ్లెం వేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. మంత్రులతో సహా అధికారులు కూడా తప్పనిసరిగా



స్క్రీనింగ్ కమిటీ ఆమోదం తీసుకోవాల్సిందేనని సీఎస్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అధికారులతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ గ్రాంటు పొందుతున్న వారంతా ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు.

ఆర్థిక శాఖకు ఫైళ్లు పంపడం లేదని రవిచంద్ర ఆగ్రహం

ప్రధానమైన విదేశీ పర్యటనలకు సంబంధించిన ఫైళ్లను ఆర్థిక శాఖకు పంపించకపోవడంపై ఆ శాఖ ఇన్‌చార్జి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. ఇక నుంచి తప్పనిసరిగా ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనుమతి తీసుకోవాలని రవిచంద్ర ఆదేశాలు జారీ చేశారు.

విదేశీ పర్యటనలపై కొన్ని మార్గదర్శకాలు..

- నిర్దేశించిన బడ్జెట్ పరిధిలోనే విదేశీ పర్యటన ముగించాలి. అదనంగా పైసా కూడా ఇవ్వరు.
- అధికారిక విదేశీ పర్యటనకు కాంట్రాక్టర్లను తీసుకెళ్లరాదు.
- నాణ్యత తదితర అంశాల పరిశీలన కోసం కాంట్రాక్టర్లను విదేశాలకు పంపాల్సి వస్తే సంబంధిత శాఖలు ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించుకోవాలి.
- వరదలు, శాసనసభ సమావేశాల సమయంలో విదేశీ పర్యటనలను అనుమతించరు.
- ఒక శాఖకు చెందిన కార్యదర్శిని, శాఖాధిపతిని ఒకేసారి విదేశీ పర్యటన కోసం ప్రతిపాదనలు పంపరాదు.
- ప్రయాణ సమయంతో పాటు విదేశీ పర్యటన ఏడు రోజులకు మించరాదు.
- ఆర్థిక సంవత్సరంలో ఒక అధికారి నాలుగు సార్లు కన్నా విదేశీ పర్యటనలకు వెళ్లరాదు.
- విదేశీ పర్యటనలకు సంబంధించి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పది రోజులు ముందుగానే ప్రతిపాదనలను పంపించాలి. దీనిపై ఆర్థిక శాఖ తన అభిప్రాయాన్ని మూడు రోజుల్లోగా తెలపాలి. అనంతరం స్క్రీనింగ్ కమిటీ ఆమోదం తీసుకోవాలి.
- విదేశీ పర్యటన ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి, విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శికి పంపించాలి.
- విదేశీ పర్యటన అనంతరం వారం రోజుల్లోగా సీఎస్‌కు నివేదిక ఇవ్వాలి.

టీటీడీ నిధుల్ని రోడ్లకు వినియోగించవద్దు

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి కలూర్ క్రాస్ రోడ్డు వరకు తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ (తుడా) చేపట్టే రహదారి సుందరీకరణ పనులకు టీటీడీ నిధులు కేటాయించాలన్న ఏపీ సర్కార్ నిర్ణయాన్ని అమలు చేయరాదని బుధవారం తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. జీవో నంబర్ 699 ప్రకారం నిధుల్ని విడుదల చేయరాదని టీటీడీ కార్యనిర్వాహణాధికారికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రహదారి సుందరీకరణ పనులకు టీటీడీ నిధులు రూ.10 కోట్లను కేటాయిస్తూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని నిలిపివేస్తూ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. జీవో నంబర్ 699పై తిరుపతికి చెందిన పి.నవీన్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. 'టీటీడీ నిధుల్ని తిరుపతి రోడ్లు, విద్యుత్ దీపాలు, సుందరీకరణ వంటి వాటికి ఉపయోగించాలని ఏ నిబంధనల ప్రకారం దేవాదాయశాఖ నిర్ణయం తీసుకుంది. టీటీడీ నిధుల్ని వాడుకునే అధికారం ప్రభుత్వానికి ఎక్కడుంది. రహదారి సుందరీకరణ పనుల్ని తుడా నిధులతోనే చేసుకోవాలి.' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రతివాదులు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ఆదేశించిన ధర్మాసనం విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

'వంశధార'లో రణరంగం!

- నిర్వాసితులపై పోలీసుల లాఠీచార్జి
- బురద, రాళ్లు రువ్విన ఆందోళనకారులు


వంశధార జలాశయం లోపల నిర్వాసితులను చెదరగొడుతున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: తమ సమస్యలు పూర్తిగా పరిష్కరించకుండా గ్రామాలను ఖాళీ చేయించడానికి ప్రభుత్వం ప్రయత్నించడంపై శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు నిర్వాసితులు బుధవారం ఆందోళనకు దిగారు. ఇది కాస్తా పోలీసుల లాఠీచార్జికి దారి తీసింది. పోలీసులపైకి ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. 25 మంది రైతులు గాయపడ్డారు. కొంతమంది పోలీసులకూ గాయాలయ్యాయి. దాదాపు 30 మంది ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లకు తరలించారు. వంశధార జలాశయం గట్టు నిర్మాణ పనులు పోలీసు పహారాలో గత వారం నుంచి జరుగుతున్నాయి. ఇప్పటికే రైతులు వరినాట్లు పూర్తి చేసిన పొలాలను, గట్లను పోలీసులు పొక్లెయినర్లతో రెండ్రోజులుగా నాశనం చేయిస్తున్నారు. బుధవారం ఉదయం తులగాం, దుగ్గుపురం పరిధిలోని పొలాల్లోకి పొక్లెయిన్లు రాగా రైతులు అడ్డుకున్నారు. మధ్యాహ్నం తర్వాత వరిపొలాల ధ్వంసం మళ్లీ ప్రారంభించారు. దీంతో దుగ్గుపురం, పాడలి గ్రామాల నుంచి రైతులతో పాటు మహిళలు, యువకులు పెద్దఎత్తున పొలాల్లోకి వచ్చారు. కర్రలతో పొక్లెయినర్లపై దాడి చేశారు. అడ్డుకునేందుకు వచ్చిన కొంత మంది పోలీసులపై ఆందోళనకారులు బురద విసిరారు. దీంతో కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై రెవెన్యూ అధికారులను నిలదీసేందుకు హిరమండలం తహసీల్దారు కార్యాలయానికి వెళ్తామంటూ మహిళలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య కాసేపు వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. కొంతమంది నిర్వాసితులు బురద, రాళ్లు రువ్వడంతో చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేశారు. దాదాపు 30 మందిని వ్యానుల్లోకి ఎక్కించి జిల్లాలోని పలు పోలీసుస్టేషన్లకు తరలించేశారు. వారిలో పలువురికి స్వల్ప గాయాలై రక్తం కారుతున్నా విడిచిపెట్టలేదు. కాస్త పెద్ద గాయాలైన సుమారు 25 మందిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించినట్లు తెలిసింది.

విలువలు కాలరాస్తున్న చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ ఎంపీ మేకపాటి ధ్వజం
- బాబు దృష్టిలో ఎన్నికలంటే డబ్బుతోనే
- జగన్ ప్రసంగాలను పరిశీలించటమే మంత్రుల పని



కోవూరు: సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువల్ని తుంగలో తొక్కి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి విమర్శించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఇనమడుగులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నంద్యాల ఉపఎన్నిక కోసం టీడీపీ విపరీతంగా సొమ్ము వెదజల్లుతూ విచ్చలవిడిగా ఖర్చు చేస్తోందన్నారు. చంద్రబాబు విలువలకు నీళ్లొదిలి అరాచకాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికలంటే కేవలం డబ్బుతోనే నిర్వహిస్తారన్న ధోరణిలో ఆయన ముందుకు పోతున్నారన్నారు. ఇటీవల కడప ఎమ్మెల్సీ ఎన్నికల్లో దాదాపు రూ.70 నుంచి రూ.80 కోట్లు ఖర్చు చేశారన్నారు. ప్రస్తుతం నంద్యాల ఉపఎన్నికలో అంతకు రెండింతలు ఖర్చు చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలంతా ప్రజాస్వామ్య మనుగడను కాపాడుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ ఎలా మాట్లాడుతున్నారో పరిశీలించడమే టీడీపీ ప్రభుత్వానికి సరిపోతోందన్నారు. నంద్యాలలో ఉన్న మంత్రులు జగన్ బహిరంగ సభల ఉపన్యాసాలపై దృష్టి పెట్టి ఉన్నారన్నారు. 21 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనుగోలు చేసి నలుగురికి మంత్రి పదవులు కట్టబెడ్డటం ఎంతవరకు సబబో చెప్పాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి బిల్డింగ్ వర్కర్ల కమిటీ సమావేశాలు

ఏపీ బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

సూర్యారావుపేట (విజయవాడ సెంట్రల్): విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఈ నెల 29, 30వ తేదీల్లో కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీడబ్ల్యూఎఫ్‌ఐ) అఖిల భారత కమిటీ సమావేశాలను నిర్వహించనున్నారు. కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొదటిసారిగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు ఏపీ బిల్డింగ్ వర్కర్స్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సదస్సులో 29 రాష్ట్రాల ప్రతినిధులు, ఫెడరేషన్ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింగారవేలు, దేబంజన్ చక్రవర్తి పాల్గొంటారని వెల్లడించారు. కాగా, భవన నిర్మాణ రంగంలో రోజురోజుకు యంత్రాల వినియోగం పెరిగిపోయి కార్మికుల పనిదినాలు తగ్గిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్మాణాల్లో తప్పని సరిగా కార్మికుల ద్వారానే పనులు చేయించాలనే డిమాండ్‌పై సమావేశంలో చర్చిస్తామన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి నర్సింహారావు మాట్లాడుతూ.. నిర్మాణ రంగానికి ప్రధాన ముడి సరుకైన సిమెంట్, స్టీల్, కలప, రంగులు వంటి వాటిపై జీఎస్టీ పేరుతో పన్నులు పెంచారని చెప్పారు. సమావేశంలో ఫెడరేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పి.అప్పారావు, కార్యదర్శి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నిట్ డైరెక్టర్ నియామకానికి కేంద్రం ఆమోదం

3 నాన్ టీచింగ్ పోస్టులకూ కేబినెట్ ఆమోదముద్ర

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట ప్రకారం ఏపీలో ఏర్పాటు చేసిన నిట్‌కు డైరెక్టర్ నియామకానికి కేంద్రం ఆమోదం తెలిసింది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ మేరకు ఆమోద ముద్ర వేసింది. డైరెక్టర్‌తోపాటు మూడు నాన్ టీచింగ్ పోస్టులు (రిజిస్ట్రార్, లైబ్రేరియన్, ఎస్‌ఏఎస్ అధికారి) నియామకానికి ఆమోదం తెలిపింది. నిట్ నిర్వహణకు వీరు బాధ్యులుగా ఉంటారని కేంద్రం పేర్కొంది.

పీఎంకేఎస్‌వై ప్రాజెక్టులకు నిధులు పెంపు..

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన కింద ఎంపిక చేసిన 99 ప్రాజెక్టులకు నాబార్డు ద్వారా అందించే రుణ సాయం పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2017–18 ఏడాదికిగానూ రుణసాయాన్ని రూ.9,020 కోట్ల పెంపునకు ఆమోదించింది. పీఎంకేఎస్‌వై కింద ఏపీలో 8, తెలంగాణలో 11 ప్రాజెక్టులు ఉన్నాయి.

బావిలో పడ్డ చిరుత

రక్షించిన అటవీ సిబ్బంది



కేకే నగర్ (తమిళనాడు): తమిళనాడు దిండుగల్ జిల్లా వయనాడు సమీపంలోని బావిలో చిరుత పులి జారి పడింది. దీన్ని అటవీశాఖ సిబ్బంది మంగళవారం సాయంత్రం రక్షించారు. వయనాడు 6వ మైల్ ప్రాంతానికి చెందిన హనీఫా అనే రైతుకు చెందిన తోటలో బావి ఉంది. ఆ బావి నీటిని గ్రామ ప్రజలు వాడుకుంటారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ ప్రాంత ప్రజలు నీళ్ల కోసం బావికి వెళ్లగా, అందులో చిరుత పడి ఉండటం చూసి, ఈ సమాచారాన్ని అటవీశాఖ అధికారులకు చేరవేశారు. దీంతో అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని ఓ బోనును బావిలోకి దింపి, చిరుతను పైకి లాగారు. అనంతరం చిరుతను అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

మరణంలోనూ భార్య వెంటే...


పెద ముత్యాలు (ఫైల్)


నారాయణమ్మ (ఫైల్)


మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

సాలూరు: మరణంలోనూ ఆ దంపతులు బంధాన్ని వీడలేదు. భార్య మరణించిన కొద్ది గంటల్లోనే ఆమె భర్త కూడా తనువు చాలించాడు. విజయనగరం జిల్లా సాలూరులోని బంగారమ్మ కాలనీకి చెందిన పాలవలస నారాయణమ్మ (67), పెద ముత్యాలు (80) దంపతులు. వారు తమ చిన్న కుమార్తె దాసరి ఈశ్వరమ్మ వద్ద ఉంటున్నారు. కొంతకాలంగా వారు అనారోగ్యంతో మంచం పట్టునే ఉంటున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు నారాయణమ్మ తనువు చాలించారు. కష్ట సుఖాల్లో తోడూ నీడై నిలిచిన భార్య ఇకలేదని కుమిలిపోయిన పెద ముత్యాలు కూడా మధ్యాహ్నం 2 గంటల సమయంలో తుదిశ్వాస విడిచాడు. దీంతో వారి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

బీసీల గొంతుకోసేందుకు బాబు యత్నం

బీసీ జేఏసీ చైర్మన్ అన్నా రామచంద్రయాదవ్

తిరుపతి సిటీ: టీడీపీకి బీసీలే వెన్నెముక అని చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పుడు వారి గొంతుకోసేందుకు ప్రయత్నిస్తున్నారని బీసీ జేఏసీ చైర్మన్ అన్నారామచంద్ర యాదవ్ మండిపడ్డారు. బుధవారం తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాపులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని చంద్రబాబు ఇటీవల ప్రకటించి, రాష్ట్ర జనాభాలో 57 శాతం ఉన్న బీసీల మనోభావాలు దెబ్బతీశారని తెలిపారు. బీసీ కులాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు చంద్రబాబుకు బుద్ధి చెప్పాలన్నారు. 2019 ఎన్నికల్లో బీసీలంతా ముక్తకంఠంతో బలమైన ప్రజా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మంజునాథ కమిషన్ రిపోర్టు రాకముందే కాపులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని చంద్రబాబు ప్రకటించడం తగదన్నారు. దీనికి సంబంధించి ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాల ప్రతినిధులతో విజయవాడలో సమావేశం నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సంఘర్షణ సమితి నాయకులు సాకం ప్రభాకర్, అశోక్‌సామ్రాట్‌యాదవ్, ముసగాని లక్ష్మయ్య, చంద్రయాదవ్ పాల్గొన్నారు.

తమిళ సీఎం, కలెక్టర్‌ను విమర్శించిన వ్యక్తి అరెస్ట్

వేలూరు (తమిళనాడు): తమిళనాడులోని పాలారులో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోలేదంటూ ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామిని, వేలూరు జిల్లా కలెక్టర్‌ను విమర్శిస్తూ వాట్సాప్‌లో పోస్టులు పెట్టిన యువకుడిని మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. వేలూరు జిల్లా వాలాజ సమీపంలోని తిరుమలచ్చేరి గ్రామానికి చెందిన విఘ్నేష్ ఎమ్మెస్సీ చదివి ఇంట్లోనే ఉంటున్నాడు. వాలాజ వీసీ మోటూరు, రాణిపేట, ఆర్కాడు వంటి ప్రాంతాల్లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండటం వల్ల భూగర్భ జలాలు అడుగంటి సాగు, తాగునీరుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ ముఖ్యమంత్రి ప్రత్యేక విభాగానికి, ఎస్పీ, కలెక్టర్ కార్యాలయాలకు విఘ్నేష్ తరచూ ఫిర్యాదులు చేసేవాడు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరేవాడు. అయితే విఘ్నేష్ ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆగ్రహించి విఘ్నేష్ ముఖ్యమంత్రి, కలెక్టర్ రామన్, ఎస్పీ పగలవన్‌లను వాట్సాప్ ద్వారా 'చేతకాని వారు' అంటూ విమర్శించాడు. ఈ పోస్టును ఇతర అధికారులకు, మిత్రులకు, పలు గ్రూపులకు వాట్సాప్ ద్వారా పంపాడు. వీటిపై వీఏవో సంపత్ వాలాజ పోలీసులకు ఫిర్యాదు చేయగా, విఘ్నేష్‌ను మంగళవారం అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

మరో ఆరు నెలలు ఆగాల్సిందే!

ఏపీపీఎస్సీ కొత్త నోటిఫికేషన్లకు ఆర్థిక శాఖ అనుమతుల్లేవ్!
- ఖాళీ పోస్టుల వివరాలివ్వని ఇతర శాఖలు
- నిమ్మకునీరెత్తినట్లున్న సర్కారు
- వయోపరిమితి దాటుతుందని నిరుద్యోగుల ఆందోళన



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఏటా క్యాలెండర్ ప్రకారం పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆదిలోనే గండికొడుతోంది. 2014లో అసెంబ్లీ ఎన్నికల అనంతరం రెండున్నరేళ్ల దాటాక 2016 చివరికి కానీ నోటిఫికేషన్లు ఇవ్వలేదు. రాష్ట్రంలో 1.42 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నా కేవలం 10 వేల పోస్టులకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా అందులో ఏపీపీఎస్సీ ద్వారా 4,275 పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చారు. ఇప్పటికింకా ఆ నోటిఫికేషన్ల పరీక్షలు ముగియలేదు. ఒకటీ అరా తప్పితే ఆయా నోటిఫికేషన్ల ప్రకారం పోస్టింగులూ ఇంకా ఇవ్వలేదు. ఏటా నోటిఫికేషన్లు ఇవ్వడానికి వీలుగా క్యాలెండర్‌ను ప్రకటిస్తామన్న ప్రభుత్వం కేవలం ఒక్క ఏడాదికి మాత్రమే ఆ నోటిఫికేషన్లు విడుదల చేయించింది. 2017కు సంబంధించి కూడా నోటిఫికేషన్లు ఇచ్చేందుకు ఏపీపీఎస్సీ ఈ ఏడాది ఆరంభంలోనే 42 నోటిఫికేషన్ల వివరాలతో క్యాలెండర్‌ను రూపొందించింది. జూలైలోనే ఈ నోటిఫికేషన్లు ఇస్తామని ప్రకటించింది. అయితే 8 నెలలు అవుతున్నా ప్రభుత్వ శాఖల నుంచి పూర్తి స్థాయిలో పోస్టుల సమాచారం రాక కొత్త నోటిఫికేషన్లకు అతీగతీ లేకుండా పోయింది. కొన్ని శాఖల నుంచి అరకొర ఖాళీల సమాచారం వచ్చినా వాటికి సంబంధించి ఆర్థిక శాఖ నుంచి ఆమోదం రాలేదు. ఇప్పటికిప్పుడు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినా నోటిఫికేషన్లు ఇవ్వడానికి డిసెంబర్ వరకు సమయం పడుతుందని, వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి పరీక్షల నిర్వహణకు వీలుంటుందని ఏపీపీఎస్సీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఈ ఏడాది లేనట్లే!

ఇప్పటి వరకు ఖాళీలపై ప్రభుత్వ శాఖల నుంచే సమాచారం లేని తరుణంలో ఈ ఏడాదికి నోటిఫికేషన్లు వెలువడే అవకాశాలు కనిపించడం లేదు. ఖాళీల సమాచారం కోసం ఏపీపీఎస్సీ ఈ ఏడాది ఆరంభంలోనే అన్ని ప్రభుత్వ శాఖలకు లేఖలు రాసినా వారి నుంచి స్పందన కరువైంది. దీనిపై ఏపీపీఎస్సీ పలుమార్లు ప్రభుత్వ ముఖ్యుల దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోవడం లేదు. ఫలితంగా క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్ల జారీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా మారింది. ఏపీపీఎస్సీ రాసిన లేఖలకు కొన్ని శాఖలు మాత్రమే స్పందించాయి. దాదాపు 6 వేల వరకు ఖాళీల సమాచారం వస్తుందని ఎదురు చూసిన కమిషన్‌కు కేవలం 2 వేల పోస్టుల వివరాలే అందాయి. గ్రూప్–2, గ్రూప్–3 కేడర్‌కు సంబంధించిన పోస్టుల సమాచారం ఇంకా రావలసి ఉంది.

వయోపరిమితి దాటిపోయే ప్రమాదం

ఇలా ఉండగా ప్రభుత్వ నిర్వాకం వల్ల ఏపీపీఎస్సీ ఈ ఏడాది నోటిఫికేషన్లు జారీచేసే అవకాశాలు సన్నగిల్లడంతో నిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన వయోపరిమితి దాటిపోతే తమకు ఇక దరఖాస్తు చేసే అవకాశం కూడా లేకుండాపోతుందని వారు వాపోతున్నారు. కొన్నేళ్లుగా నోటిఫికేషన్లు లేక వయోపరిమితి దాటిపోయిందని, ఏపీపీఎస్సీ గత ఏడాది 32 నోటిఫికేషన్లు జారీ చేసినా ఆ పోస్టుల సంఖ్య నామమాత్రంగానే ఉందని నిరాశ వ్యక్తపరుస్తున్నారు.

104 టెండర్ రద్దు తీర్పు అమలు నిలుపుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 104 సంచార వైద్య సేవల పనుల కేటాయింపు టెండర్ రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు ధర్మాసనం 4 వారాలపాటు నిలుపుదల చేసింది. చంద్రన్న సంచార వైద్య చికిత్స ప్రాజెక్టు పేరుతో గ్రామీణ వైద్యం కోసం నిర్దేశించిన 104 సంచార వైద్య సేవల్ని పిరామల్ స్వాస్థ్య మేనేజిమెంట్ అండ్ రీసెర్చ్ సంస్థకు 2016 జనవరి 5న టెండర్ ద్వారా ఏపీ సర్కార్ అప్పగించింది. ఈ నిర్ణయాన్ని ఈగల్ హంటర్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ హైకోర్టులో సవాల్ చేయగా సింగిల్ జడ్జి ఆ టెండర్ విధానాన్ని కొట్టేస్తూ తిరిగి టెండర్లను ఆహ్వానించాలని అదే ఏడాది జూన్ 16న తీర్పు చెప్పారు. టెండర్లపై అధికారుల నిర్ణయం సరిగా లేదని, 2017 ఆగస్టు 31లోగా తిరిగి టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని, అప్పటి వరకు పిరామల్ సంస్థ సేవల్ని కొనసాగించుకోవచ్చునంటూ సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పు 4 వారాలపాటు నిలిచిపోయింది. సింగిల్ జడ్జి తీర్పుపై ఏపీ సర్కార్‌తోపాటు పిరామల్ సంస్థ వేరువేరుగా దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్లను బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం విచారించింది.

మెట్రో రైలుకు ప్రైవేట్ ఇం'ధనం'

- మెట్రో ప్రాజెక్టుల్లో ప్రైవేట్ భాగస్వామ్యం తప్పనిసరి
- నూతన విధానానికి కేంద్ర కేబినెట్ ఆమోదం
- నిధుల సేకరణ వినూత్న పంథాలో సాగాలని ప్రతిపాదన



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మెట్రో రైలు నెట్‌వర్క్‌ను మరింత విస్తృతం చేయడానికి కేంద్రం నూతన మెట్రో రైలు విధానాన్ని ఆమోదించింది. ప్రైవేట్ రంగంతో పాటు ఇతర మార్గాల ద్వారా వినూత్న పద్ధతి (వీసీఎఫ్- వాల్యూ క్యాప్చరింగ్ ఫైనాన్సింగ్, బాండ్ల జారీ)లో నిధులు సేకరించేందుకు ఇందులో చర్యలు ప్రకటించింది. తాము చేపట్టబోయే మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఆర్థిక సాయం పొందాలంటే రాష్ట్రాలు ప్రైవేట్ సంస్థలతో జట్టుకట్టడం తప్పనిసరి చేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పట్టణాల అభివృద్ధి, వ్యయం తగ్గింపునకు ఈ విధానంలో ప్రాధాన్యమిచ్చారు. మెట్రో ప్రాజెక్టుల అమలుకు ఏకీకృత నిబంధనలను రూపొందించడంతో పాటు, నిధుల సేకరణకు సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఈ మేరకు బుధవారం ప్రధాని మోదీ నేతృత్వంలో సమావేశమైన కేంద్ర కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు.

మెట్రో రైలు పాలసీ–2017 ముఖ్యాంశాలు

- ➤ నిధుల డిమాండ్‌ను తట్టుకోవాలంటే ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం తప్పనిసరి.
- ➤ మొత్తం ప్రాజెక్టులో లేదా అనుబంధ విభాగాలైన చార్జీల వసూలు, నిర్వహణలో ప్రైవేట్ సంస్థ పాలు పంచుకోవాలి.
- ➤ ప్రైవేట్ రంగంలోని వనరులు, నిపుణత, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవడానికే ఈ నిర్ణయం.
- ➤ స్టేషన్‌లో వాణిజ్య ఆస్తుల అభివృద్ధి, స్థలాల లీజులు, వాణిజ్య ప్రకటనల ద్వారా లభించే ఆదాయానికి సంబంధించి తీసుకునే చర్యలను రాష్ట్రాలు తమ ప్రాజెక్టు రిపోర్టులో సవివరంగా తెలియజేయాలి.
- ➤ సమయానుగుణంగా చార్జీలను సవరించేలా నిబంధనల మార్పునకు, ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసుకోవడానికి రాష్ట్రాలకు అధికారం కల్పించారు.
- ➤ కేంద్రం నుంచి నిధులు పొందే మార్గాలు: వయబిలిటీ గ్యాప్ ఫండ్, కేంద్ర గ్రాంట్లు (ప్రాజెక్టులో 10% వ్యయానికి సమానం), 50:50 నిష్పత్తిలో కేంద్రం, రాష్ట్రాల మధ్య ఈక్విటీ షేరింగ్.


విద్యా సెస్‌తో నిధి: సెకండరీ, ఉన్నత విద్య ద్వారా సమకూరే సెస్ నిధులతో కార్పస్ ఫండ్‌ను ఏర్పాటుచేయాలని కేంద్రం నిర్ణయించింది. 'మాధ్యమిక్ అండ్ ఉచ్చార్ శిక్షా కోశ్'(ముస్క్)గా పిలిచే ఈ నిధి మానవ వనరుల శాఖ నిర్వహణలో కొనసాగుతుంది. ముస్క్ నిధులను మాధ్యమిక, ఉన్నత విద్య పథకాలకు వెచ్చిస్తారు.

నిధుల సేకరణకు నాబార్డ్‌కు గ్రీన్‌సిగ్నల్

బాండ్ల జారీ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రూ.9,020 కోట్ల అదనపు బడ్జెట్ నిధులు(ఈబీఆర్) సమకూర్చుకోవడానికి నాబార్డ్‌కు కేంద్రం అనుమతిచ్చింది. ప్రధాన్ మంత్రి కృషి సించాయి యోజన(పీఎంకేఎస్‌వై) కింద 99 సాగునీటి ప్రాజెక్టులకు ఈ నిధులను వినియోగిస్తారు. దీంతో శీఘ్ర సాగునీటి ప్రయోజనాల కార్యక్రమం(ఏఐబీపీ), కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్(సీఏడీ) పనులకు నిధులు ఏడాదికి 6 శాతం వడ్డీ చొప్పున లభిస్తాయి. 2019 డిసెంబర్ నాటికి పీఎంకేఎస్‌వై-ఏఐబీపీ కింద 99 ప్రాజెక్టులను పలు దశల్లో పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

కోస్ట్‌గార్డుకు రూ.32 వేల కోట్లు

రూ.32 వేల కోట్ల విలువైన తీర ప్రాంత భద్రతా దళ కార్యాచరణ ప్రణాళికకు కేంద్రం పచ్చజెండా ఊపింది. దీని ప్రకారం కోస్ట్‌గార్డుకు ఆఫ్‌షోర్ గస్తీ నౌకలు, శత్రువులను అడ్డగించేందుకు ప్రత్యేక పడవలు, హెలికాప్టర్లు, అత్యవసర మౌలిక వసతులు తదితరాలను కల్పించాలని ప్రతిపాదించారు.



ఫొటోలో ఉన్నవాటిని గుర్తుపట్టేందుకు ప్రయత్నిస్తున్నారా?.. అవి చైనాలోని అన్‌హూయ్ ప్రావిన్సులోని లుయాంగ్ జిల్లా పట్టణాభివృద్ధి కార్యాలయంలో పడి ఉన్న వేలాది సైకిళ్లు. సమస్యల వలయంగా మారిన సైకిల్-షేరింగ్ రంగాన్ని క్రమబద్ధీకరించేందుకు చైనా సర్కారు కొత్త మార్గదర్శకాలు జారీచేసింది

కేబినెట్ పునర్వ్యవస్థీకరణ దిశగా..

- పార్టీ పదవులు, గవర్నర్లు, నామినేటెడ్ పోస్టుల నియామకంపైనా...
- కార్యాచరణ ప్రారంభించిన ప్రధాని మోదీ

సాక్షి ప్రత్యేక ప్రతినిధి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు, పార్లమెంటు సమావేశాలు పూర్తవడంతో పార్టీ పదవులు, కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి పెట్టారు. ఆరు రాష్ట్రాలకు గవర్నర్లు, ప్రభుత్వంలోని ఇతర కీలక పదవులనూ ఆయన భర్తీ చేయనున్నారు. వీలైనంత త్వరగా ఈ ఖాళీలను భర్తీ చేయాలన్న ఉద్దేశంతో ప్రధాని కార్యాచరణ ప్రారంభించినట్లు బీజేపీ, ప్రధానమంత్రి కార్యాలయ వర్గాల సమాచారం. 'ఈ ఏడాది గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో వచ్చే ఏడాది ఆరంభంలో పలు ఇతర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. వీలైనంత త్వరగానే ఈ పునర్వ్యవస్థీకరణ జరుగుతుంది. 2019 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ ఖాళీల భర్తీ ఉంటుంది' అని బీజేపీ ముఖ్య నేత ఒకరు తెలిపారు. అన్నాడీఎంకేలోని రెండు వర్గాలు విలీనమైనట్లు ధ్రువీకరణ జరిగితే.. ఆ పార్టీని ఎన్డీయేలో చేర్చుకోవడంతోపాటు ఒకరికి కేబినెట్‌లో చోటు కల్పించే అవకాశాలున్నట్లు చెప్పారు. జేడీయూ నుంచి ఒకరికి కేబినెట్‌లో చోటు దక్కవచ్చన్నారు. వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికవటంతో ఆయన చేపట్టిన సమాచార, ప్రసార శాఖ, పట్టణాభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన శాఖలు.. అరుణ్ జైట్లీ వద్ద అదనంగా ఉన్న రక్షణ శాఖ, దివంగత మంత్రి అనిల్ దవే నేతృత్వంలోని అటవీ, పర్యావరణ శాఖలను భర్తీ చేయాల్సి ఉంది. 75 ఏళ్లు దాటిన కల్‌రాజ్ మిశ్రాతోపాటుగా సరైన పనితీరు కనబరచని మంత్రులపైనా వేటు తప్పదని తెలుస్తోంది. కొత్తగా ఎంపిక చేసుకునే మంత్రులు, వారి శాఖల విషయంలో ప్రాంతీయ, కుల సమీకరణాలను ప్రధాని పరిగణనలోకి తీసుకోనున్నారని సమాచారం. వివాదాస్పద రికార్డులున్న వారికి సీనియారిటీ ఉన్నా చోటు దక్కకపోవచ్చని తెలుస్తోంది. అటు పార్టీలోనూ చాలాకాలంగా పునర్వ్యవస్థీకరణ జరగలేదు. 2014లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికవరకూ పదాధికారుల బాధ్యతలు మార్చలేదు. పార్టీలో ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు కేంద్ర మంత్రి వర్గంలో చోటు కల్పించటంతో పార్టీలో వారి పదవులు ఖాళీగానే ఉన్నాయి. మధ్యప్రదేశ్, తమిళనాడు, బిహార్, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ రాష్ట్రాలకు పూర్తిస్థాయి గవర్నర్లను నియమించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకూ కొత్త గవర్నర్లను కేటాయించే అవకాశాలున్నట్లు చర్చ జరుగుతోంది. ఎలక్షన్ కమిషనర్ (ముగ్గురికి గానూ ఇద్దరే బాధ్యతల్లో ఉన్నారు), నీతి ఆయోగ్‌కు కొత్త సభ్యులు, బ్యాంకులకు నామినేటెడ్ పోస్టులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కమిషన్ల పదవులనూ మోదీ వీలైనంత త్వరగా భర్తీ చేయనున్నారని సమాచారం.



కేబినెట్‌లోకి రాం మాధవ్?



కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ నుంచి ఒకరికి చోటు దక్కనుందనే ఊహాగానాలు వినబడుతున్నాయి. విశాఖ ఎంపీ హరిబాబు లేదా పార్టీ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌లలో ఒకరికి బెర్త్ ఖాయమని తెలుస్తోంది. ఆగస్టు 28 నుంచి ఏపీలో పర్యటించనున్న అమిత్ షా ఇప్పటికే పరిస్థితులను అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. ఇన్నాళ్లూ టీడీపీ తెరచాటు పార్టీగా ఉన్న బీజేపీని సొంత కాళ్లపై నిలబెట్ట డం అమిత్ షాకు అంత సులువేం కాదు. వెంకయ్య ఉపరాష్ట్రపతిగా ఎన్నికవడంతో రాంమాధవ్, హరిబాబుల్లో ఒకరిని కేబినెట్‌లోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

ప్రత్యేక హోదా రాష్ట్రాలకు 'జీఎస్టీ' మద్దతు

న్యూఢిల్లీ: ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలు, ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో పారిశ్రామికాభివృద్ధికోసం పదేళ్లపాటు రూ. 27, 413 కోట్లు ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. జీఎస్టీ కన్నా ముందు ఆయా రాష్ట్రాలకు సెంట్రల్ ఎక్సైజ్ పన్ను మినహాయింపు ఉండేది. ఇప్పుడు జీఎస్టీ అమల్లోకి వచ్చిన కారణంగా.. ఇప్పుడు ఆ రాష్ట్రాల్లోని పరిశ్రమలకు ఆ మొత్తాన్ని ఆర్థిక సాయంగా అందించాలని ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయించింది. జూలై 1, 2017 నుంచి మార్చి 31, 2027 వరకు ఇది వర్తిస్తుంది. ఈశాన్య రాష్ట్రాల్లో పారిశ్రామిక, పెట్టుబడుల ప్రోత్సాహక పాలసీ–2007ను సిక్కింతోపాటుగా ప్రత్యేక హోదా పొందుతున్న జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలోనూ కేంద్రం అమలు చేస్తోంది. ఈ పాలసీ ప్రకారం ప్రకారం ప్రత్యేక హోదా పొందుతున్న రాష్ట్రాల్లో పరిశ్రమల్లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమైన తొలి పదేళ్ల పాటు ఎక్సైజ్ పన్ను మినహాయింపు ఉంటుంది. కేంద్రం తీసుకున్న నిర్ణయం ద్వారా 4,284 పరిశ్రమలకు ప్రత్యక్ష నగదు సరఫరా ద్వారా రీఫండ్ జరుగుతుందని ప్రభుత్వం వెల్లడించింది.

అత్యంత నివాసయోగ్యంగా మెల్‌బోర్న్

న్యూయార్క్: ప్రపంచంలోనే నివసించడానికి అత్యంత యోగ్యమైన నగరంగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ ఎంపికైంది. ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) తాజాగా నిర్వహించిన ప్రపంచ నివాసయోగ్య నగరాల సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 140 నగరాలపై స్థిరత్వం, ఆరోగ్య సేవలు, సంస్కృతి, పర్యావరణం, విద్య, మౌలిక వసతులు తదితర 30 అంశాలను ఆధారంగా చేసుకుని ఈఐయూ ఈ సర్వే చేసింది. మొదటి లేదా చివరి పది సిటీల్లో ఏ భారత నగరానికీ చోటు దక్కలేదు. ఆస్ట్రియా రాజధాని వియన్నా, కెనడాలోని వాంకోవర్, టొరంటో, కల్గరీ వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నాయి.

ఐన్‌స్టీన్‌నే మించినోడు!



లండన్: బ్రిటన్‌లో ఓ టీవీ షోలో పాల్గొన్న 12 ఏళ్ల భారత సంతతి బాలుడు ఒక్కరోజులో హీరో అయ్యాడు. చానెల్ 4లో ప్రసారమైన 'చైల్డ్ జీనియస్' కార్యక్రమం తొలిరౌండ్‌లో రాహుల్ అనే బాలుడు 14 ప్రశ్నలకు సరిగ్గా సమాధానమిచ్చి అబ్బురపరిచాడు. వారం పాటు నిర్వహించే ఈ పోటీలో పాల్గొన్న 8–12 ఏళ్లున్న 20 మంది బాలల నుంచి ఒకరిని విజేతగా ప్రకటిస్తారు. ఈ వారంతంలో ఫైనల్ జరుగుతుంది. స్పెల్లింగ్ టెస్ట్‌లో రాహుల్ పూర్తి మార్కులు పొందగా, జ్ఞాపక శక్తి పరీక్షలో 15 ప్రశ్నల్లో 14 ప్రశ్నలకు సరిగా సమాధానం చెప్పాడు. అతని ఐక్యూ 162గా నిర్ధారించారు. ప్రముఖ శాస్త్రవేత్తలు ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ కన్నా ఇది ఎక్కువ కావడం విశేషం. ప్రపంచంలో అత్యధిక ఐక్యూ కలిగిన వారి క్లబ్ అయిన మెన్సాలో సభ్యుడయ్యేందుకు రాహుల్ అర్హత సాధించాడు.

ఎమ్మెల్యే పదవికి వాఘేలా రాజీనామా

అహ్మదాబాద్: కాంగ్రెస్ బహిష్కృత నేత, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి శంకర్‌సిన్హ్ వాఘేలా(77) తన ఎమ్మెల్యే సభ్యత్వానికి రాజీనామా సమర్పించారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సమయంలో బీజేపీలోకి చేరనున్నారన్న వార్తలను కొట్టిపారేసిన వాఘేలా.. బుధవారం గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్‌రూపానీ, డిప్యూటీ సీఎం నితిన్ పటేల్ ఇతర బీజేపీ నేతలు తోడురాగా తన రాజీనామాను అసెంబ్లీ స్పీకర్ రమణ్‌లాల్ వోరేకు అందజేశారు.

ఎన్‌కౌంటర్‌లో లష్కరే కమాండర్ హతం

శ్రీనగర్: బుధవారం కశ్మీర్‌లో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ఉగ్రసంస్థ లష్కరే తోయిబా జిల్లా కమాండర్ అయూబ్ లెహరీ హతమయ్యాడు. పుల్వామా జిల్లాలోని కాకాపోరా ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కున్నారనే సమాచారంతో భద్రతాబలగాలు ఉగ్రవ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. ఆపరేషన్‌లో భాగంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో అయూబ్ చనిపోయాడని ఒక పోలీసు అధికారి చెప్పారు. అయూబ్ మరణం.. ఉగ్రవాదంపై కొనసాగుతున్న పోరులో మరో విజయమని అధికారి వ్యాఖ్యానించారు.

హిజ్బుల్ విదేశీ ఉగ్రసంస్థ.. అమెరికా: కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని రచ్చగొడుతున్న 'హిజ్బుల్ మొజాహిదీన్'ను విదేశీ ఉగ్రసంస్థగా అమెరికా ప్రకటించింది. పాక్‌లో ఉన్న హిజ్బుల్ సంస్థ చీఫ్ సయ్యద్ సలావుద్దీన్‌ను ప్రపంచ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించిన రెండునెలల్లోపే ఆ సంస్థపై ఉగ్రముద్ర వేయడం గమనార్హం.

మోదీ వల్లే పాక్‌కు అవకాశం

- కశ్మీర్‌లో పరిస్థితులపై రాహుల్ గాంధీ మండిపాటు
- పొరుగుదేశాలనూ దూరం చేసుకుంటున్నారని వ్యాఖ్య
- బెంగళూరులో ఇందిర క్యాంటీన్లకు శ్రీకారం



బెంగళూరులో 'ఇందిర క్యాంటీన్'లో భోజనం చేస్తున్న రాహుల్, సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు: నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్లే జమ్మూకశ్మీర్‌లో దాయాది దేశం పాకిస్తాన్‌కు అవకాశం చిక్కుతోందని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. బుల్లెట్లు, విమర్శలు కశ్మీరీల సమస్యలను తీర్చవన్న ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవం ప్రసంగంపై స్పందించిన రాహుల్ ''విద్వేషంతో కూడిన వాతావరణాన్ని మోదీ జమ్మూకశ్మీర్‌లో సృష్టించారు. ఇలా మొదలైన హింస.. ద్వేషం వల్ల లాభపడుతున్నది పాకిస్తానే''అని వ్యాఖ్యానించారు. బుధవారం బెంగళూరులో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ అంశంపై పదేళ్ల పాటు మన్మోహన్, చిదంబరం, జైరాంరమేశ్‌తో కలసి పదేళ్ల పాటు తాను శ్రమించి శాంతి నెలకొనేలా చేశానని, కానీ మోదీ ఒక్క నెలలోనే దానిని నాశనం చేశారని ఆరోపించారు. కశ్మీర్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించామని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించామని, మహిళలను బ్యాంకులకు వచ్చేలా చేశామని, కశ్మీర్‌లో శాంతి, సామరస్యం నెలకొనాలనే ఇవన్నీ చేశామని చెప్పారు. శాంతియుత కశ్మీర్‌లో పాకిస్తాన్‌కు అవకాశం లేకుండా చేశామన్నారు. అయితే ప్రస్తుతం మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల కశ్మీర్‌లో పాక్‌కు అవకాశం చిక్కుతోందని తెలిపారు. మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానాలపైనా రాహుల్ విరుచుకుపడ్డారు. పాకిస్తాన్, చైనా మినహా పొరుగు దేశాలన్నీ మనకు అనుకూలంగా ఉండేవని, కానీ ఇప్పుడు ఒక్కో పొరుగుదేశాన్నీ మోదీ దూరం చేస్తున్నారని విమర్శించారు. చరిత్రలో తొలిసారిగా రష్యా.. పాకిస్తాన్‌కు ఆయుధాలను అమ్ముతోందని, దీనికి కారణం మోదీ విధానాలేనని ఆరోపించారు.

ఇందిర క్యాంటీన్లకు శ్రీకారం..

పేదలకు తక్కువ ధరకే ఆహారం అందించేందుకు కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన ఇందిర క్యాంటీన్లను రాహుల్ బుధవారం బెంగళూరులో ప్రారంభించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కలసి అక్కడే భోజనం కూడా చేశారు. తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందిస్తున్న కర్ణాటక ప్రభుత్వాన్ని అభినందించిన రాహుల్.. ఈ పథకం వల్ల బెంగళూరులో ఒక్కరు కూడా ఆకలితో అలమటించరని పేర్కొన్నారు. ప్రసంగం సందర్భంగా ఇందిర క్యాంటీన్లకు బదులు.. అమ్మ క్యాంటీన్లు అని తడబడిన రాహుల్.. వెంటనే సర్దుకుని ఇందిర క్యాంటీన్లు అని సరిచేసుకున్నారు. ఇందిర క్యాంటీన్ ద్వారా రూ.5కు పలహారం, రూ.10కే లంచ్ లేదా డిన్నర్‌ను అందించనున్నారు. తొలుత నమ్మ క్యాంటీన్లుగా నామకరణం చేయాలని భావించినా.. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వీటికి ఇందిరా క్యాంటీన్లని పేరుపెట్టారు. బృహత్ బెంగళూరు మహానగర పాలికలోని 198 వార్డుల్లో వంద కోట్లతో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు. తొలివిడతగా బుధవారం 101 క్యాంటీన్లను ప్రారంభించారు. మరో 97 క్యాంటీన్లను అక్టోబర్ 2న ప్రారంభించనున్నారు. ఈ క్యాంటీన్లను మిగతా నగరాలకు విస్తరిస్తామని సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు.

శరద్‌యాదవ్.. బల ప్రదర్శన

హాజరుకానున్న మన్మోహన్, సోనియా, ఏచూరి

న్యూఢిల్లీ: జేడీ(యూ) నేత శరద్‌యాదవ్ ప్రతిపక్షాలతో కలసి నేడు బల నిరూపణకు దిగనున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నుంచి మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అహ్మద్ పటేల్, గులామ్ నబీ ఆజాద్, సీపీఎం నుంచి సీతారాం ఏచూరీ, సీపీఐ నుంచి డి.రాజా, ఆర్‌జేడీ నుంచి లాలూ ప్రసాద్ యాదవ్, సమాజ్‌వాదీ నుంచి అఖిలేశ్‌యాదవ్ హాజరవుతున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా శరద్‌యాదవ్ మాట్లాడుతూ.. 'నైతిక విలువతో కూడిన' రాజకీయాలు దేశానికి ఆత్మ లాంటివని, దాన్ని మేల్కొలిపేందుకే ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నామని అన్నారు. పీహెచ్‌డీ విద్యార్థి రోహిత్ వేముల మరణం, జేఎన్‌యూ యూనివర్సిటీ విద్యార్థి నజీబ్ అహ్మద్, రైతు ఆత్మహత్యలు.. ఇలా పలు అంశాలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.



కృత్రిమ మోకాలి చిప్పల ధర తగ్గింపు

న్యూఢిల్లీ: మోకాలి మార్పిడి శస్త్రచికిత్సల్లో ఉపయోగించే కృత్రిమ మోకాలి చిప్పల ధరలను ప్రభుత్వం గణనీయంగా తగ్గించింది. ప్రైవేటు వైద్యశాలలు వాస్తవ వెల కన్నా లక్ష రూపాయకుల పైగా అధిక ధరలు వసూలు చేస్తుండటంతో వీటి ధరలపై ప్రభుత్వం గరిష్ట పరిమితిని విధించింది. కేంద్రం తాజా ఉత్తర్వులతో కృత్రిమ మోకాలి చిప్పలు 70% తగ్గి... రకాన్ని బట్టి రూ.54 వేల నుంచి గరిష్టంగా రూ.1.14 లక్షల వరకు ఉండనున్నాయి. అక్రమంగా, అన్యాయంగా ప్రైవేటు వైద్యశాలలు రోగులను దోచుకుంటూ ఉంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి అనంత్ కుమార్ చెప్పారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశంలో మోకాలి మార్పిడి చికిత్సలు అవసరమైనవారు దాదాపు 2 కోట్ల మంది ఉండగా, వారిలో ఏడాదికి దాదాపు ఒకటిన్నర లక్షల మంది శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నారు. కొత్త ధరల ప్రకారం ప్రస్తుతం విస్తృతంగా వాడే కోబాల్ట్–క్రోమియం కృత్రిమ మెకాలి చిప్ప ధర రూ.54,720. ఇప్పటి వరకు ఆసుపత్రులు దీనికి రూ. 1.6 లక్షల వరకు వసూలు చేస్తుండేవి. 80% శస్త్రచికిత్సల్లో ఈ రకం మోకాలి చిప్పలనే వాడుతున్నారు. క్యాన్సర్, కణతిలతో బాధపడుతున్న రోగులకు వాడే ప్రత్యేక మోకాలి చిప్పల ధరను ప్రభుత్వం రూ.1,13,950గా నిర్ణయించింది. ఇంతకుముందు దీనికి ఆసుపత్రులు గరిష్టంగా దాదాపు 9 లక్షల వరకు వసూలు చేసేవి. కొత్త ధరల కన్నా అధికంగా డబ్బులు వసూలు చేస్తే ఆసుపత్రులు, దిగుమతిదారులు, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అనంత్ కుమార్ హెచ్చరించారు.

'లవ్ జిహాద్' కేసు ఎన్ఐఏకు..

సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ: ఓ హిందూ యువతి ఇస్లాం మతాన్ని స్వీకరించి, ముస్లిం వ్యక్తిని పెళ్లి చేసుకున్న కేసును దర్యాప్తు చేయాలని జాతీయ దర్యాప్తు బృందాన్ని (ఎన్ఐఏ) సుప్రీంకోర్టు ఆదేశించింది. కేరళలో జరిగిన ఈ వివాహం యాదృచ్ఛికంగా జరిగింది కాదని, క్రమక్రమంగా అక్కడ ఈ పద్ధతి రూపుదిద్దుకుంటోందని కోర్టుకు ఎన్ఐఏ వివరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. బుధవారం ఈ మేరకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌వీ రవీంద్రన్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టాలని ఆదేశిస్తూ న్యాయమూర్తులు చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. యువతను ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న 'బ్లూ వేల్' గేమ్ తరహాలోనే.. ఎవరినైనా ఏదైనా పని చేయడానికి పురిగొల్పవచ్చని లవ్ జిహాద్‌ను ఉద్దేశిస్తూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగాలని, దర్యాప్తు తుది నివేదికను కోర్టు ముందుంచాలని ఎన్ఐఏకు స్పష్టం చేసింది. కేరళ పోలీసులు, స్థానిక మహిళల నుంచి ఎన్ఐఏ తీసుకున్న సమాచారంతో కూడిన నివేదికను పరిగణన లోకి తీసుకున్న తర్వాతే కేసుపై తాము ఓ అభిప్రాయానికి వస్తామంది. సంబంధిత యువతి భర్త, పిటిషనర్ షాఫిన్ జహాన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. సదరు యువతిని న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్టాలని, ఆమెతో మాట్లాడాలని కోర్టును కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఎన్ఐఏ నివేదిక అందిన తర్వాతనే ఆమెతో మాట్లాడతామని చెప్పింది. కేరళకు చెందిన ఓ హిందూ యువతి ముస్లిం వ్యక్తిని ప్రేమించి ఇస్లాం మతం స్వీకరించిన తర్వాత అతడిని 2016లో పెళ్లాడింది. ఈ వ్యవహారం వివాదాస్పదం కావడంతో దీనిపై విచారణ జరిపిన కేరళ హైకోర్టు.. వారిద్దరి పెళ్లి 'లవ్ జిహాద్'కు ఉదాహరణ వంటిదని పేర్కొంటూ వివాహాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది.

ఆర్టికల్ 35ఏ.. మరో తేనెతుట్టె!



జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్–370 , అక్కడి శాశ్వత నివాసితులకు ప్రత్యేక హక్కులు ప్రసాదించే అధికరణం– 35ఏ మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ఈ ప్రత్యేక హక్కులను రద్దు చేయాలంటూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం త్వరలో విచారించనుంది. జమ్మూ కశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ, ఆ రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు ఒమర్ అబ్దుల్లా ఆర్టికల్–35ఏకు అనుకూలంగా మాట్లాడుతుండగా కొందరు వ్యతిరేకిస్తున్నారు. దీనిపై చర్చకు తెరతీస్తే అది తేనెతుట్టెను కదిపినట్టేనని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

ఏమిటీ అధికరణం 35ఏ?

జమ్మూ కశ్మీర్‌లో 'శాశ్వత నివాసులు' అన్న పదాన్ని నిర్వచించడానికి, వారికి ప్రత్యేక హక్కులు, సౌకర్యాలను కల్పించేందుకు ఆ రాష్ట్ర శాసనసభకు ఆర్టికల్ 35ఏ అధికారం ఇస్తోంది. రాజ్యాంగ సవరణ లేకుండా, పార్లమెంటులో ప్రవేశపెట్టకుండా కేవలం రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారానే 1954లో ఈ అధికరణాన్ని రాజ్యాంగంలో చేర్చారు. దీన్ని ఉపయోగించి శాసనసభ శాశ్వత నివాసులను నిర్ధారించింది. దాని ప్రకారం 1911కు ముందు జమ్మూ కశ్మీర్‌లో జన్మించిన లేదా స్థిరపడిన వారు లేదా అంతకు కనీసం పదేళ్ల ముందు ఆ రాష్ట్రంలో స్థిరాస్తులు కొన్నవారు మాత్రమే శాశ్వత నివాసులు. ఆ తర్వాత జమ్మూ కశ్మీర్‌కు వచ్చిన వారెవరూ అక్కడ స్థిరాస్తులు కొనకూడదు. ప్రభుత్వోద్యోగాలు చేయకూడదు. ఉపకార వేతనాలు, ప్రభుత్వం నుంచి సాయం పొందేందుకు అనర్హులు. ఓటు వేయకూడదు. ఎన్నికల్లో పోటీ చేయకూడదు. అలాగే శాశ్వత నివాసి అయిన కశ్మీరీ అమ్మాయి, శాశ్వత నివాసి కాని వ్యక్తిని పెళ్లి చేసుకుంటే ఆమెకున్న హక్కులు కూడా హరించుకుపోతాయి. కానీ కశ్మీరీ అబ్బాయిల విషయంలో ఇది వర్తించదు. అయితే 2002 అక్టోబరులో జమ్మూ కశ్మీర్ హైకోర్టు చరిత్రాత్మక తీర్పునిస్తూ, శాశ్వత నివాసి కాని వ్యక్తిని పెళ్లి చేసుకున్న మహిళకు కూడా హక్కులు ఉంటాయనీ, అయితే వారి పిల్లలకు మాత్రం ఏ హక్కులూ ఉండవని స్పష్టం చేసింది.

సుప్రీంకోర్టులో పిటిషన్...

ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగాన్ని సవరించకుండా, పార్లమెంటులో చర్చించకుండా అధికరణం 35ఏను రాజ్యాంగంలో చేర్చారనీ, కాబట్టి అది చెల్లదని ఢిల్లీకి చెందిన 'వ్యు ద సిటిజన్స్' అనే స్వచ్ఛంద సంస్థ 2014లో సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. అలాగే ఆర్టికల్ 35ఏ తమ పిల్లలకు ఓటు హక్కు లేకుండా చేస్తోందని ఇద్దరు కశ్మీరీ మహిళలు గత నెలలో సుప్రీంను ఆశ్రయించారు.

ఎన్డీఏ ప్రభుత్వం దీనిపై కోర్టులో అఫిడవిట్ వేయకుండా, ఈ అంశంపై విస్తృతచర్చ జరగడంతోపాటు దీనిని రాజ్యాంగ ధర్మాసనం తేల్చాలని కోరుకోవడం మరింత వేడి పుట్టిస్తోంది. ఆర్టికల్ 35ఏపై చర్చ అంటే దాదాపుగా ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370పై చర్చగానే భావించాల్సి ఉంటుంది. భారత రాజ్యాంగం జమ్మూకశ్మీర్‌కు కల్పించిన ప్రత్యేక హక్కు లను ప్రశ్నించకుండా అధికరణం 35ఏ చెల్లుబాటును, రాష్ట్రపతి ఉత్తర్వులను ప్రశ్నించలేమని చరిత్రకారుడు శ్రీనాథ్ రాఘవన్ అంటున్నారు. **–సాక్షి నాలెడ్జ్ సెంటర్**



ప్రపంచ పర్యటనకు బయల్దేరనున్న ఆరుగురు మహిళా నావికాధికారులతో ఫొటో దిగిన ప్రధాని మోదీ. 'ఐఎన్ఎస్‌వీ తరిణి' నౌకలో సాహసయాత్రకు వెళ్లనున్న తొలి మహిళా నావికాబృందం ఇదే. గోవాలో బయల్దేరి ప్రపంచాన్ని చుట్టివచ్చి 2018 మార్చిలో గోవాకు చేరుకోనున్నారు. చిత్రంలో నావల్ స్టాఫ్ చీఫ్ అడ్మిరల్ సునీల్ లాంబా.

లతా రజనీకాంత్ స్కూలుకు తాళం

రూ.11 కోట్ల అద్దె బకాయి చెల్లించాలన్న భవన యజమాని



సాక్షి ప్రతినిధి, చెన్నై: సూపర్‌స్టార్ రజనీకాంత్ సతీమణి లతా రజనీకాంత్ చెన్నై గిండీలోని రేస్‌కోర్సు సమీపంలో నడుపుతున్న ఓ ఆశ్రమ పాఠశాల మూతపడింది. లతా రజనీకాంత్ చెన్నైలో నాలుగు ఆశ్రమ పాఠశాలలు నడుపుతున్నారు. వీటిల్లో గిండీ రేస్‌కోర్సు సమీపంలోని ఆశ్రమ పాఠశాల ఒకటి. పదేళ్లుగా అద్దె భవనంలో నడుస్తోన్న ఈ పాఠశాలలో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఈ పాఠశాల భవనానికి సంబంధించి రూ.11 కోట్ల అద్దె బకాయి పడ్డారంటూ యజమాని వెంకటేశ్ మంగళవారం రాత్రి స్కూలుకు తాళం వేసి స్వాధీనం చేసుకున్నారు. కాగా, తాము అద్దె బకాయి పడలేదని ఈ పాఠశాలను మరో భవనానికి మార్చుతున్నామని స్కూలు యాజమాన్యం తరఫు న్యాయవాది రవిచంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఊపిరి తీశారు

- బాలుడి పరిస్థితి తెలిసీ ప్రాణవాయువు అందించడంలో నిర్లక్ష్యం
- రెండు రోజులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడి ప్రాణాలు వదిలిన వైనం

అమలాపురం రూరల్: నిర్విరామంగా కృత్రిమ ప్రాణ వాయువు ఉంటేనే ఆ బాలుడి ఊపిరి నిలుస్తుంది. ఇలాంటి బాలుడిని ఆస్పత్రి అనుమతితోనే తీసుకువచ్చినప్పటికీ సకాలంలో కృత్రిమ ప్రాణ వాయువు అందించడంలో నిర్లక్ష్యం చేయడంతో ఆ చిన్నారి ఆయువు తీరిపోయింది. అల్లవరం మండలం రెల్లుగడ్డ గ్రామానికి చెందిన చాట్ల మంగాయమ్మ కుమారుడు చాట్ల సుధీర్‌వర్మ (13) గత నాలుగేళ్ల నుంచి పల్మనేరియా హైపర్ టెన్షన్ అనే ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధి బారిన పడ్డాడు. లక్ష మందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధి ఇది. ఆ బాలుడికి గత నాలుగేళ్ల నుంచీ కృత్రిమ ప్రాణ వాయువుతోనే ప్రాణం నిలబడుతోంది. వైద్యుల సూచన మేరకు బాలుడికి ఇంట్లోనే ఎప్పుడూ ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచుకుంటారు. సుధీర్ వర్మకు తండ్రి లేడు. తల్లి మంగాయమ్మ, బాలుడి చిన్నాన్న, పెదనాన్నలు కొందరు దాతల సహకారంతో నిర్విరామంగా కృత్రిమ వైద్యం అందిస్తూ ఆ పసి ప్రాణాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు.

ఆస్పత్రి నిర్లక్ష్యం ఇలా...

ప్రముఖ ఊపిరితిత్తుల వ్యాధి నిపుణుడు స్థానిక ఓ కార్పొరేట్ ఆస్పత్రికి సోమవారం రావడంతో సుధీర్ వర్మను ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. రోగి సుధీర్ వర్మ పెదనాన్న చాట్ల సత్యనారాయణ ఆస్పత్రి వర్గాలకు ఫోన్ చేసి 'మీ ఆస్పత్రి వరకూ ప్రత్యేక అంబులెన్స్‌లో తీసుకుని వస్తాం. అక్కడి నుంచి ఆక్సిజన్ సిలెండర్‌తోనే వైద్యం అందిస్తూనే ఆస్పత్రిలోకి తీసుకెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అందుకు ఆస్పత్రి సిబ్బంది కూడా అంగీకరించారు. వారిచ్చిన భరోసాతో అంబులెన్స్‌లో రోగిని ఆస్పత్రికి సోమవారం మధ్యాహ్నం తీసుకుని వచ్చారు. ఆస్పతి నుంచి పై అంతస్తులో ఉన్న ఓపీ విభాగానికి ఆక్సిజన్ సిలిండర్‌తో ఉన్న చక్రాల కుర్చీలో రోగిని తీసుకు వెళ్లిన పది నిమిషాలకే తనకు ఊపిరి అందడం లేదని రోగి కేకలు వేశాడు. తీరా చూస్తే ఆ సిలిండర్లో ఆక్సిజన్ అయిపోయిందని గుర్తించారు. మరో సిలిండర్ ఏర్పాటు చేసినప్పటికీ అందులోనూ ఆక్సిజన్ లేకపోవడంతో బాలుడు కోమాలోకి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి 50 గంటలపాటు కొన ఊపిరితో ఆస్పత్రిలో వైద్యం పొందుతూ బాలుడు బుధవారం ఉదయం ప్రాణాలు విడిచాడు. ఆస్పత్రిలో ఆక్సిజన్ సిలిండర్ల నిల్వలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుందని పిల్లాడి బంధువులు మండిపడ్డారు. నాలుగేళ్ల నుంచి ఆక్సిజన్ సిలిండర్లను ఇంట్లోనే పెట్టుకొని అన్ని వేళలా కాపడుకుంటూ వచ్చామని, ఇప్పుడు ఆస్పత్రి వారి నిర్లక్ష్యం కారణంగా మరణించాడని తల్లి మంగాయమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. బాధిత కుటుంబీకులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తారన్న భయంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అమలాపురంలో ఆక్సిజన్ సిలిండర్ ఏర్పాటులో జరిగిన నిర్లక్ష్యంతో ప్రాణాలు విడిచిన సుధీర్ వర్మ

గ్యాస్ నొప్పి వల్లే మృతి

తమ ఆస్పత్రిలో చేరిన సుధీర్ వర్మ గ్యాస్ నొప్పి వల్ల మృతి చెందారని, ఆక్సిజన్ సిలిండర్ అందకపోవడం వల్ల అనడంలో వాస్తవం లేదని అమలాపురం ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.సుబ్బారావు స్పష్టం చేశారు. తమ సిబ్బంది అంబులెన్స్ నుంచి ఆక్సిజన్ సిలండర్‌తోనే వార్డులోకి తీసుకుని వెళ్లారని... 100 సీసీ గ్యాస్ సామర్థ్యం ఉన్న సిలిండర్ పెట్టినా రోగికి శ్వాస తీసుకోలేకపోయడని చెప్పారు. ఆకస్మికంగా అతనికి ఊపిరి నొప్పి (గ్యాస్ నొప్పి) రావడంతో ఐసీలో ఉంచి వెంటిలేటర్ ద్వారా వైద్యం అందించామన్నారు. ఈ ఘటనపై తమ ఆస్పత్రి ఓ ప్రత్యేక కమిటీ ద్వారా విచారణ జరిపించామని తెలిపారు.

– ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావు

'రాజీవ్ హంతకులను విడుదల చేయవద్దు'

సాక్షి ప్రతినిధి, చెన్నై: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న రాబర్ట్‌పయాస్, జయకుమార్‌లను ముందుగా బెయిల్‌పై విడుదల చేయొద్దని తమిళనాడు ప్రభుత్వం నివేదించింది. ఈ మేరకు మద్రాసు హైకోర్టుకు బుధవారం తన అభిప్రాయాన్ని తెలియజేసింది. వీరిద్దరిపై వచ్చిన అభియోగాలు రుజువుకావడం, జైల్లో ఖైదీలుగా ఉంటూ కూడా పశ్చాత్తాప పడకపోవడం, 2009లో జైల్లో శాంతిభద్రతల సమస్యలు సృష్టించినందు వల్ల ముందస్తుగా విడుదల చేసేందుకు అవకాశం లేదని ప్రభుత్వం పిటిషన్‌లో పేర్కొంది. దీనిని న్యాయమూర్తులు జస్టిస్ సెల్వం, జస్టిస్ పోన్ కలైయరసన్ విచారిస్తున్నారు. బుధవారం ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. దీనిని పరిశీలించిన కోర్టు ఈ కేసును ఆగస్టు 18వ తేదీకి వాయిదా వేసింది.

ఏవీ సుబ్బారెడ్డి ఆస్తులపై మంత్రి అఖిలప్రియ ఆరా?

- ఆధార్ నంబర్ల ద్వారా వివరాల సేకరణ
- సిమెంట్ కంపెనీలో ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టుపై కన్ను!
- అది తమకే ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్న వైనం



అఖిలప్రియ ఏవీ సుబ్బారెడ్డి

సాక్షి ప్రతినిధి, కర్నూలు: భూమా నాగిరెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఏవీ సుబ్బారెడ్డి ఆస్తులపై మంత్రి అఖిలప్రియ ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన ఆస్తుల మొత్తం చిట్టాను సేకరించే పనిలో ఆమె నిమగ్నమైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఏవీతో పాటు ఆయన కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డు నంబర్ల ఆధారంగా వివరాలు సేకరిస్తున్నట్లు ఆ పార్టీకే చెందిన కొందరు నేతలు చెబుతున్నారు. భూమాకు, ఏవీకి మధ్య ఎంతో సాన్నిహిత్యం ఉండేది. వీరిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో ఏనాడూ పొరపొచ్చాలు రాలేదు. ఒకరికి తెలియకుండా మరొకరు వ్యవహారాలు చక్కదిద్దిన పరిస్థితి కూడా ఏనాడూ లేదు. భూమా నాగిరెడ్డి.. కుటుంబ సభ్యులకైనా కొన్ని విషయాలు చెప్పేవారు కాదేమోగానీ, ఏవీకి తెలియకుండా ఏమీ చేయరనే పేరుంది. భూమా మరణించిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఏవీ ఒంటరివారై పోయారనే అభిప్రాయముంది. భూమా నాగిరెడ్డి హయాంలో ఏవీ.. ఒక సిమెంటు కంపెనీలో ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టు సంపాదించారు. ఈ కాంట్రాక్టు ద్వారా ప్రతినెలా రూ.10 లక్షల వరకూ ఆదాయం వస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ కాంట్రాక్టు తమకే ఇవ్వాలని మంత్రి అఖిలప్రియ డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. మొత్తమ్మీద వీరిద్దరి మధ్య నెలకొన్న తగాదా చిలికిచిలికి గాలివానలా మారి ఆస్తుల పంచాయితీ వరకూ వెళ్లినట్టు అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఏవీ సుబ్బారెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు నంబర్లను మంత్రి అఖిలప్రియ సంపాదించినట్టు సమాచారం. ప్రస్తుతం ప్రతి పనికీ ఆధార్ కార్డు తప్పనిసరి అయ్యింది. కొత్త వాహనం, స్థలం, ఇల్లు.. కొనాలంటే ఆధార్ తప్పనిసరి. ఎస్‌ఆర్‌డీఎస్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా ఆధార్ నంబరు ఆధారంగా ఆస్తుల వివరాలను తీసుకునే వెసులుబాటు ఉంది. ప్రస్తుతం మంత్రి అఖిలప్రియ ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ఏవీ ఆస్తుల చిట్టాను సంపాదించే పనిలో పడినట్టు సమాచారం. చాలా రోజులుగా సదరు మంత్రి అఖిలప్రియ, ఏవీల మధ్య సత్సంబంధాలు లేవు. ఇద్దరి మధ్య పచ్చగడ్డి కాదు కదా.. ఏ గడ్డీ వేయకపోయినా భగ్గుమంటోంది. ఉప ఎన్నిక ప్రచారంలో కూడా ఇద్దరూ కలిసి పాల్గొన్న సందర్భాలు లేవు. ఏవీ ఆస్తులన్నీ తమవే అని మంత్రి అఖిల భావిస్తుండటమే ఈ ఆరాకు కారణమని టీడీపీకి చెందిన ఓ నాయకుడు 'సాక్షి'కి తెలిపారు. తాజా పరిణామాలను గమనిస్తే ఇది నిజమేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

మంత్రి ఆదిని పదవి నుంచి తొలగించాలి

వైఎస్సార్‌సీపీ తెలంగాణ ఎస్సీ విభాగం అధ్యక్షుడు రవికుమార్

సాక్షి, హైదరాబాద్: దళితులను అవమానించే విధంగా మాట్లాడిన ఏపీ మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డిని వెంటనే భర్తరఫ్ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఎస్సీ విభాగం అధ్యక్షుడు ఎన్.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితులు చదువుకోరని, శుభ్రంగా ఉండరని మాట్లాడిన ఆదినారాయణరెడ్డి చేత వెంటనే క్షమాపణ చెప్పించాలన్నారు. వైఎస్సార్‌సీపీ టిక్కెట్టుతో గెలిచి తెలుగుదేశం పార్టీలోకి ఫిరాయించి మంత్రి పదవి పొందిన ఆద్ది దళితుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రాజెక్టుల్లో అక్రమాలపై కాగ్ కన్ను

- జలవనరులశాఖ అధికారులతో ఏజీ విభాగం భేటీ
- ప్రకాశం బ్యారేజీ, కృష్ణా డెల్టా ఆధునికీకరణ పనుల్లో అవతవకలపై ఆరా
- అధికారుల వివరణను తోసిపుచ్చిన వైనం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో అక్రమాలపై కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) దృష్టి సారించింది. గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల తనిఖీల్లో వెల్లడైన అంశాలపై వివరణ కోరేందుకు అకౌంటెంట్ జనరల్ (ఏజీ) విభాగం ఉన్నతాధికారులు బుధవారం సచివాలయంలో జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ (పరిపాలన) ఎం.గిరిధర్‌రెడ్డి తదితరులతో సమావేశమయ్యారు. జలవనరులశాఖ అధికారులు ఇచ్చిన వివరణలను ఏజీ విభాగం ఉన్నతాధికారులు చాలావరకు తోసిపుచ్చినట్లు సమాచారం. ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా చేపట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరుపై ఏజీ విభాగం తనిఖీలు నిర్వహిస్తుంది. పలు అంశాలపై సంబంధిత శాఖల వివరణను ఆ విభాగం అధికారులు కోరుతారు. ఆ వివరణలు సహేతుకంగా ఉంటే.. వాటిని కాగ్ నివేదిక నుంచి మినహాయిస్తారు. ఒకవేళ సంతృప్తికరంగా లేకపోతే నివేదికలో పొందుపరుస్తారు. ఈ విధంగానే రాష్ట్రంలో 2016–17లో సాగునీటి ప్రాజెక్టుల పనుల తీరుపై ఏజీ విభాగం ఉన్నతాధికారులు ఇటీవల విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రూ.138 కోట్లతో చేపట్టిన ప్రకాశం బ్యారేజీ ఆధునికీకరణ పనుల్లో నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్‌కు రూ.35 కోట్లకు పైగా లబ్ధి చేకూర్చినట్లు ఆ తనిఖీల్లో వెల్లడైనట్లు అధికారవర్గాలు తెలిపాయి. అలాగే గతేడాది రూ.568 కోట్లతో చేపట్టిన కృష్ణా డెల్టా ఆధునికీకరణ పనుల్లోనూ భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్లుగా గుర్తించినట్లు తెలిసింది. కాంట్రాక్టర్లు చేసిన పనులకన్నా అధికంగా బిల్లులు చెల్లించినట్లు తనిఖీల్లో తేలింది. హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకంలో అవసరం లేకపోయినా రూ.291.54 కోట్లతో ఎత్తిపోతల పథకాలను చేపట్టి.. నామినేషన్ పద్ధతిలో అప్పగించారని కూడా గుర్తించారు. ఇదే ప్రాజెక్టులో విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం వల్ల ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్)కు రూ.11 కోట్ల మేర అనవసరంగా జరిమానా చెల్లించాల్సి వచ్చిందని తేల్చింది. ఈ నేపథ్యంలోనే బుధవారం జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో ఏజీ విభాగం ఉన్నతాధికారులు సమావేశమయ్యారు.

తమిళనాడుకు నీట్ మినహాయింపు ఒక్క ఏడాది మాత్రమే..

సాక్షి, చెన్నై: నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) నుంచి తమిళనాడుకు 2017–18 సంవత్సరానికిగాను మినహాయింపు లభించింది. తమిళనాడు విద్యా విధానం మేరకు వైద్య సీట్ల భర్తీకి కేంద్రం ఆమోద ముద్రవేసింది. వైద్య కోర్సుల భర్తీలో ఉమ్మడి ప్రవేశ పరీక్షను మొదటి నుంచి తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకిస్తూ వచ్చింది. రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానాలు సైతం చేశారు. దీనిపై సీఎం పళనిస్వామి పలుమార్లు ప్రధాని నరేంద్ర మోదీని కలసి విజ్ఞప్తి కూడా చేశారు. ఈ నేపథ్యంలో తమిళనాడులో ఇప్పటి వరకు నీట్ నియమనిబంధనల మేరకు వైద్య సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరగలేదు. దీంతో ఈ ఒక్క ఏడాదికైనా మినహాయింపు ఇవ్వాలని, తమిళనాడు స్టేట్ సిలబస్ విద్యార్థులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ, ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ సిద్ధం చేసింది. సోమవారం ఈ ఆర్డినెన్స్‌ను ఢిల్లీకి పంపగా, కేంద్రం బుధవారం రాత్రి ఆమోద ముద్ర వేసింది. ఈ మినహాయింపు ఈ ఒక్క ఏడాదికి మాత్రమే వర్తిస్తుంది.

బీజేపీకి 'మిత్ర'పోటు'

- కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని అడుగడుగునా మోసం చేస్తున్న టీడీపీ
- 9 డివిజన్లలో మూడింట టీడీపీ నాయకులే
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పోటీ చేస్తున్న డివిజన్‌లోనూ టీడీపీ రెబల్
- రగిలిపోతున్న బీజేపీ శ్రేణులు..



కాకినాడ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ అసలు రంగు బయటపడింది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో మిత్రపక్షమైన బీజేపీకి టీడీపీ అడుగడుగునా వెన్నుపోటు పొడుస్తోంది. తమకు పట్టులేని డివిజన్లను బీజేపీకి కేటాయించిన టీడీపీ.. ఆ తర్వాత ప్లేటు తిప్పేసింది. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిన 9 డివిజన్లలో మూడింట తమ నాయకులనే రెబల్స్‌గా బరిలోకి దించింది. టీడీపీ తీరుతో ఖిన్నులైన బీజేపీ నాయకులు ఇక తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అన్ని డివిజన్లలోనూ టీడీపీ అభ్యర్థులను ఓడించడం ద్వారా తమ సత్తా చాటాలని అంతర్గతంగా నిర్ణయించినట్లు తెలిసింది. మొత్తం 48 డివిజన్లలో 9 డివిజన్లను బీజేపీకి కేటాయించారు. మిగిలిన 39 స్థానాల్లో టీడీపీ బరిలోకి దిగింది. బుధవారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిపోయింది. అయితే మిత్రపక్షాల ఒప్పందం ప్రకారం బీజేపీకి కేటాయించిన 9, 35, 47 డివిజన్లలో నామినేషన్లు వేసిన టీడీపీ అభ్యర్థులు మాత్రం తమ నామినేషన్లను ఉపసంహరించుకోలేదు. టీడీపీ అధినాయకులు నామినేషన్లు వేసిన తమ అభ్యర్థులందరితో ముందుగానే నామినేషన్ల ఉపసంహరణ పత్రాల మీద సంతకాలు చేయించుకొని తమ వద్ద ఉంచుకున్నారు. అయితే ఈ డివిజన్లలోని టీడీపీ అభ్యర్థుల నుంచి మాత్రం నామినేషన్ల ఉపసంహరణ పత్రాలపై సంతకాలు చేయించుకోలేదు. టీడీపీ అధినాయకులు వ్యూహాత్మకంగానే ఈ డివిజన్లలో కూడా తమ అభ్యర్థులను బరిలోకి దింపినట్టు తెలుస్తోంది. దీనిపై బీజేపీ స్థానిక నాయకులు తమ అధిష్టానానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య టీడీపీ తీరుపై తమ పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికీ తప్పని 'మిత్ర'పోటు..

9వ డివిజన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య బీజేపీ తరఫున బరిలో ఉన్నారు. ఇక్కడ టీడీపీ రెబల్ అభ్యర్థిగా శ్రీకోటి అప్పలకొండ నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పోటీ చేస్తున్న డివిజన్‌లోనే టీడీపీ రెబల్ అభ్యర్థి బరిలోకి దిగడంపై ఆ పార్టీ నాయకులు సీరియస్‌గా ఉన్నారు. 35వ డివిజన్‌ను బీజేపీకి కేటాయించడంతో ఆ పార్టీకి చెందిన కొండాబత్తుల ప్రసాదరావు పోటీ చేస్తుండగా.. రమా ఆప్టికల్స్ రాంబాబు టీడీపీ రెబల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. బీజేపీ నాయకుల ఒత్తిడితో ఆయన్ని సంప్రదించిన టీడీపీ నేతలు.. వెంటనే నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే 47వ డివిజన్‌లో టీడీపీకి చెందిన కోశాబత్తుల అప్పారావు కూడా తన నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదు. అక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా బి.పద్మ పోటీలో ఉన్నారు. కాగా, నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 241 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినట్లు అధికారులు చెప్పారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.

వైఎస్ఆర్ జిల్లా
సాక్షి ఫ్యామిలీ
గురువారం
17-8-2017

నెలసరి... సమస్యలిక సరి
పక్క పేజీలో...

అచ్చంగా అర్జునుడిలా...
సినిమా పేజీలో...

నా బ్యాగ్‌లో ఏమున్నాయంటే!
సినిమా పేజీలో...



బుడగలొచ్చేవన్నీ షాంపూలు కావు
నురగలొచ్చేవన్నీ కూడా షాంపూలు కావు
షాంపూలన్నీ అందరికీ మంచివి కావు
ఒకరికి బాగా పనిచేసిన షాంపూ
ఇంకొకరి మాడును ఎండబెట్టొచ్చు.
ఒకరి జుట్టును సిల్కీ అండ్ స్మూత్ చేసిన షాంపూ
మరొకరి వెంట్రుకలను
కొబ్బరిపీచులా చేయవచ్చు.
ఏది మంచిదో, ఏది కాదోనని
తలగోక్కుంటున్నారా?
ఎంచుకోండి...
జుట్టు బాగా పెంచుకోండి...
షాంపూర్ణ కథ.

తలగోక్కుంటున్నారా?



షాంపూ నుంచి మనం ఆశించేదేమిటి?

వాడకం విస్తృతం అయిన నేపథ్యంలో ఇప్పుడు ఏది మంచి షాంపూ అనే ప్రశ్న ఉద్భవిస్తుంది. ఏయే పనులు చేస్తే దాన్ని మంచి షాంపూగా పరిగణిస్తామో, దాని నుంచి ఏయే ప్రయోజనాలు ఆశిస్తామో చూద్దాం.

● ముందుగా వెంట్రుకలకు హాని కలగకుండానే వాటిని పూర్తిగా శుభ్రం చేయాలి. మాడునూ శుభ్రపరచాలి ● మనకు, మన వెంట్రుకలకు అది సరిపడాలి. అంటే దాన్ని ఉపయోగించాక అలర్జీల్లాంటి కొత్త సమస్యలు రాకూడదు ● పరిశుభ్రత తర్వాత మంచి సువాసన వస్తే మేలు ● ఫ్రెష్‌నెస్, ఫ్రాగ్రెన్స్... ఎంత ఎక్కువ సేపు ఉంటే అంత మేలు ● వీలైనంత త్వరగా... చేతులకు చాలా తక్కువ శ్రమ ఇస్తూ త్వరగా నురగ వచ్చేయాలి ● మంచినీటిలో మాత్రమే కాదు... ఉప్పునీళ్లలోనూ అలాగే నురగవస్తే ఇంకా మంచి షాంపూ అనుకోవచ్చు ● తలస్నానం తర్వాత వెంట్రుకలు బిరుసుబారకుండా, వీలైనంత మృదువుగా ఉండాలి ● వెంట్రుకలను మెరిసేలా చేయాలి. అవి స్టైలింగ్ కోసం అనువుగానూ ఉండాలి. ఆ కురుల నిగారింపు చాలాసేపు కొనసాగాలి. వెంట్రుకలు ఒకదానితో ఒకటి అతుక్కోకూడదు. అలాగని తేమ కూడా తొలగిపోకూడదు ● వెంట్రుకలు విరిగిపోవడంగానీ, అవి బలహీనపడటం గానీ, అనారోగ్యంగా కనిపించడంగానీ జరగకూడదు. అంటే షాంపూను ఉపయోగించడం వల్ల వెంట్రుక ఆరోగ్యం దెబ్బతినకూడదు.

ఈ అన్ని ప్రయోజనాలు ఉన్న 'షాంపూ'ను మాత్రమే మంచి 'షాంపూ'గా పరిగణించవచ్చు.

షాంపూను ఎలా నిర్వచించవచ్చు...

ఇప్పుడు షాంపూను కేవలం తలవెంట్రుకలు, మాడును శుభ్రపరిచే ద్రవరూపంలో ఉన్న సబ్బుగా మాత్రమే పరిగణించలేం. ఎందుకంటే రానురాను ఇందులో ఎన్నో కొత్త కొత్త సౌకర్యాలు వచ్చి చేరుతున్నాయి. అంటే కురుల అందాన్ని ఇనుమడింపజేసేలా వాటి తేమను పరిరక్షించేవి, వెంట్రుకలు పలచబారకుండా చేసేవి, నిగనిగలాడుతూ మెరిసేలా కనిపింపజేసేవి అంటూ రకరకాల షాంపూలు అందుబాటులోకి వస్తున్నాయి. అలాగే చుండ్రులాంటి ఏదైనా సమస్య వస్తే వాటిని తొలగించేవి కూడా తయారవుతున్నాయి. కాబట్టి... అందం, శుభ్రం, ఆరోగ్యం అనే బహుళ ప్రయోజనాలను ఇచ్చే సాధనంగా 'షాంపూ'ను నిర్వచించవచ్చు.





గతంలో దాదాపు అందరూ తలస్నానం కోసం శీకాయ, కుంకుడుగాయలను ఉపయోగించేవారు. కుంకుడుకాయలను కొట్టుకోవడం, నీళ్లలో వేసి నానబెట్టడం, రసం పిండడం, నురుగు వచ్చే వరకు తలను కుంకుడురసంతో రుద్దడం... ఇదీ ప్రక్రియ. దీంతో తలస్నానం ఆలస్యమయ్యేది. దాంతో కొందరు డిటర్జెంట్ సబ్బు లేదా ముల్తానీ మట్టిని తలస్నానం కోసం ఉపయోగించేవారు. అయితే ఈ రెండూ వెంట్రుకలపై నుంచి తేమను పూర్తిగా తీసివేయడంతో అవి నిర్జీవంగా కనిపించేవి. డిటర్జెంట్ తీవ్రతను తగ్గించి, మైల్డ్‌గా మార్చారు. దాన్ని మంచినీళ్లలోనూ, ఉప్పునీళ్లలోనూ త్వరగా నురగ వచ్చేలా శుభ్రం చేయగలవిగా చేశారు. ఇలా ద్రవంరూపంలోకి మార్చిన సబ్బుకు 'షాంపూ' అని పేరు పెట్టి మార్కెట్‌లోకి పంపించారు. అంతే... తలను శుభ్రపరిచేందుకు ఇక అంతకు మునుపు ఉన్న సంప్రదాయ పద్ధతులన్నీ దాదాపు మటుమాయం అయిపోయాయి. సౌకర్యవంతమైన ఉత్పాదనే మనుగడ సాగిస్తుందన్నది మరోమారు నిరూపితమైంది. వెరసి తలస్నానం కోసం షాంపూ మారుమూల పల్లెల్లోనూ నిత్యావసర వస్తువైంది.



వెంట్రుకలను దెబ్బతీసే అంశాలివే...

తమ కురులకు ఎలాంటి హానీ జరగకూడదని ప్రతివారూ కోరుకుంటారు. వెంట్రుకలను దెబ్బతీసే అంశాలేమిటో తెలుసుకుంటే దాన్ని బట్టి ఎవరెవరు ఎలాంటి షాంపూలు ఎంచుకోవచ్చో తెలుస్తుంది. వెంట్రుకలను దెబ్బతీసే అంశాలివి... ● కురులు ఎండకు ఎక్స్‌పోజ్ కావడం ● కాలుష్యం ● వెంట్రుకలను మాటిమాటికీ తడుపుతూ ఉండటం ● తరచూ బ్లీచింగ్ చేయించడం, సౌందర్యసాధనాలు (హెయిర్ ప్రాడక్ట్స్) ఉపయోగించడం లేదా తరచూ స్ట్రెయిటెనింగ్ చేయిస్తూ ఉండటం ● హెయిర్ బ్లోయింగ్ మెషిన్ వేడిగాలికి వెంట్రుకలను ఎక్స్‌పోజ్ చేయడం ● మాటిమాటికీ దువ్వడం.

ప్రతి వెంట్రుకపైనా దానికి నునుపైన ఫినిషింగ్ ఇచ్చే క్యూటికిల్ అనే పొర ఉంటుంది. అంతేకాదు... ప్రతి రోమాంకురం దగ్గర నూనె లాంటి ద్రవాన్ని స్రవించే గ్రంథి కూడా ఉంటుంది. ఈ నూనె అంతా క్యూటికిల్‌పైన ఒకేలా (ఈవెన్‌గా) విస్తరించి వెంట్రుకకు నునుపునూ, నిగారింపునూ ఇస్తుంది. ఈ నూనెలాంటి స్రావాన్ని 'సీబమ్' అంటారు. ఏదైనా కారణాల వల్ల క్యూటికిల్ దెబ్బతింటే వెంట్రుక విరిగిపోతూ ఉంటుంది. ఏదైనా కారణాల వల్ల వెంట్రుకపై నూనెలాంటి సీబమ్ సమంగా అంటుకోకపోయినా నిగారింపు దెబ్బతింటుంది. అప్పుడవి నిర్జీవంగా, అనారోగ్యంగా కనిపిస్తాయి. కాబట్టి మనకు అవసరమైన ప్రయోజనాన్ని బట్టి మనకు కావాల్సిన షాంపూను ఎంచుకోవాల్సి ఉంటుంది.

షాంపూలో ఏయే రసాయనాలుంటాయి...

షాంపూలలో నురగను ఇచ్చేలా చేసే సర్ఫెక్టెంట్స్, కో- సర్ఫెక్టెంట్స్, సోడియమ్ క్లోరైడ్, సుగంధ ద్రవ్యాలు, చాలాకాలం షాంపూ నిల్వ ఉంచే ప్రిజర్వేటివ్స్ వాడతారు. సర్ఫ్‌యాక్టెంట్‌లలో సోడియమ్ లారిల్ సల్ఫేట్, సోడియమ్ లారేట్ సల్ఫేట్, అమోనియమ్ లారిల్ సల్ఫేట్, అమోనియమ్ లారేట్ సల్ఫేట్ వంటి రసాయనాలు ఉంటాయి. ఇవి జుట్టు మీద ఉన్న మురికిని పోగొట్టి, నురగ వచ్చేలా చేసి, తలను కూడా శుభ్రం చేస్తాయి. కో-సర్ఫ్‌యాక్టెంట్‌లు... షాంపూ చిక్కగా చేయడానికి ఉపయోగపడతాయి. సోడియం క్లోరైడ్ వంటి సాల్ట్స్... షాంపూలోని చిక్కదనం అంతటా సమంగా ఉండేలా చేస్తాయి. గ్లైకోల్ స్టిరేట్ వంటి వ్యాక్స్‌లు... షాంపూలను ముత్యంలా మిలమిలలాడేలా (పర్ల్ లుక్ వచ్చేలా) చేస్తాయి. వీటిలో ఇంకా ఇతర విటమిన్లు, ప్రొటీన్లను కలుపుతారు. షాంపూలను విటమిన్-ఈ లేదా టోకోఫెరోల్ వంటివాటిని కూడా కలిపి తయారు చేస్తారు.



ఎవరెవరికి ఏయే షాంపూలు...

అందరి తలవెంట్రుకలు ఒక్కలా ఉండవు. కొందరి వెంట్రుకలు అంత జిడ్డుగా కాకుండా, అంత పొడిగానూ కాకుండా సాధారణంగా ఉంటాయి. వీటిని నార్మల్ హెయిర్ అనవచ్చు. కొందరి వెంట్రుకలు నూనె రాసినట్లుగా మెరుస్తూ ఉంటాయి. వాటిని జిడ్డు కురులు (ఆయిలీ హెయిర్)గా చెప్పవచ్చు. మరికొందరి వెంట్రుకలు చాలా పొడిగా ఉంటాయి. వాటిని 'డ్రై హెయిర్'గా పేర్కొంటారు. కొందరికి తలలో చుండ్రు, పొడి పొలుసులు పొట్టుగా రాలిపోవడం వంటి ఆరోగ్య సమస్యలు ఉంటాయి. మరికొందరికి తల గీరుకున్నప్పుడు జిడ్డు గోళ్లలోకి వస్తుంది. ఇలా అందరి వెంట్రుకలు ఒక్కలా ఉండవు కాబట్టే... అందరి షాంపూ అవసరాలూ ఒకేలా ఉండవు. దాంతో మన అవసరాలను బట్టి రకరకాల షాంపూలు అందుబాటులోకి వచ్చాయి. మన అవసరాలను బట్టి మనం ఎలాంటి షాంపూలను ఎంచుకోవచ్చో చూద్దాం.

అందరూ వాడదగ్గవి : ఇందులో శుభ్రపరిచే సామర్థ్యం (క్లెన్సింగ్ ఎబిలిటీ) నార్మల్‌గా ఉంటుంది. సాధారణంగా లారిల్ సల్ఫేట్ అనే నురగవచ్చే పదార్థంతో తయారయ్యే షాంపూ ఇది. దాంతోపాటు రకరకాల సుగంధ ద్రవ్యాలను చేర్చి మంచి సువాసన వచ్చేలా చేస్తారు. ధర అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం ద్వారా వాటిని అందరూ వాడేలా రూపొందిస్తారు.

పొడి వెంట్రుకలు ఉండేవారికి : వీటిలో క్లెన్సింగ్ ఏజెంట్స్ మరీ తీవ్రంగా లేకుండా చూస్తారు. అంటే మైల్డ్ క్లెనింగ్ ఏజెంట్స్‌ను వాడుతారు. దాంతో పాటు వెంట్రుక కండిషనింగ్ కోసం అందులో సిలికోన్ వంటి ఏజెంట్స్, కెటాయినిక్ పాలిమర్స్‌ను కలుపుతారు. దాంతో ఆ సిలికోన్ పొడి వెంట్రుకల మీద సమంగా ఒక కోటింగ్‌లా విస్తరిస్తుంది. కాబట్టి పొడి వెంట్రుకలు ఉన్నవారికి సిలికోన్, కెటాయినిక్ పాలిమర్స్ ఇంటి ఇన్‌గ్రేడియెంట్స్ ఉన్నవి మంచి షాంపూలుగా పరిగణించవచ్చు.

జిడ్డు వెంట్రుకలు ఉన్నవారికి : ఈ షాంపూలను మాడుపైన, వెంట్రుకపైన ఉన్న అదనపు సీబమ్‌ను తొలగించేలా డిజైన్ చేస్తారు. ఇందులో క్లెన్సింగ్ ఏజెంట్‌గా లారిల్ సల్ఫేట్‌తో పాటు అదనపు నూనెవంటి స్రావాలను తొలగించడానికి సల్ఫోసక్సినేట్ వంటి రసాయనాలు ఉంటాయి. జిడ్డు కురులు ఉన్నవారికి రూపొందించే షాంపూలలో కండిషనింగ్ తక్కువగా ఉండేలా చూస్తారు. కాబట్టి పైన పేర్కొన్న కాంబినేషన్స్ ఉన్నవి జిడ్డు కురుల వారు ఉపయోగించవచ్చు. అయితే వీటిని ఎక్కువగా ఉపయోగిస్తే కురులు మరీ నిర్జీవంగా, పీచులా మారిపోతాయి.

బేబీ షాంపూలు : చిన్నారులు, శిశువుల వెంట్రుకలపై నూనె వంటి స్రావం చాలా తక్కువ. పైగా వాళ్ల చర్మం చాలా మృదువు.



అందుకే బేబీ షాంపూలలో క్లెన్సింగ్ ఏజెంట్స్ తీవ్రత తక్కువగా ఉండాలి. అలాగే నూనె తొలగించే సామర్థ్యమూ తక్కువగానే ఉండాలి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ షాంపూలు తయారు చేస్తారు. కాబట్టి 'బీటెయిన్స్' అనే క్లెన్సింగ్ ఏజెంట్స్ ఉండి, కళ్లకు హాని చేయని విధంగా అందులోని రసాయనాలుంటే చిన్నారులకు మేలు. కాబట్టి ఇన్‌గ్రేడిమెంట్స్‌లో ఈ ప్రధాన (బేసిక్) అంశాలు చూసి ఎంపిక చేసుకోవడం మంచిది.

మెడికేటెడ్ (ఔషధాలున్న) షాంపూలు : ఇవి కేవలం వారి వారి ఆరోగ్య సమస్యల ఆధారంగా వాడాల్సిన షాంపూలు. ఉదాహరణకు కొందరికి తలలో రింగ్‌వార్మ్ అనే మాడుపై వచ్చే ఒక రకం ఫంగల్ ఇన్ఫెక్షన్ వస్తుంది. దీన్ని టీనియా కాపిటిస్ అని అంటారు. ఈ సమస్య వచ్చినవారికి చికిత్సతో పాటు యాంటీఫంగల్ ఏజెంట్స్ ఉండే షాంపూలు వాడాల్సి ఉంటుంది. అలాగే స్టెఫలోకోకస్ లేదా సూడోమోనాస్ వంటి బ్యాక్టీరియా కారణంగా ఫాలిక్యులైట్ అనే సమస్య వస్తే యాంటీబ్యాక్టీరియల్ షాంపూలు వాడాలి. ఇక అందరిలోనూ కనిపించే పొట్టురాలిపోయే సమస్య ఉన్నవారు షాంపూలో సెలీనియమ్ సల్ఫైడ్, జింక్ పైరోథియాన్, తార్, శాల్సిలిక్ ఆసిడ్ లేదా ఆయిల్ ఆఫ్ లేడ్, కార్టికోస్టెరాయిడ్ లోషన్లు ఉన్న షాంపూలను వాడాలి. అంటే వేర్వేరు రకాల సమస్యలకు వేర్వేరు రకాల షాంపూలన్నమాట. అందుకే తలలో దురద, మంట... వంటివి ఉన్నవారు తమ స్నేహితులు చెప్పేమాటలతో ప్రభావితం కాకుండా డాక్టర్‌ను సంప్రదించాకే షాంపూను వాడాలి.

ఎంత ఫ్రీక్వెంట్‌గా వాడవచ్చంటే...


షాంపూను ఎంత ఫ్రీక్వెంట్‌గా వాడవచ్చన్నది వారి వ్యక్తిగత సౌకర్యంతో పాటు ఇంకా అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. తల ఎంత జిడ్డుగా ఉంటోంది, వృత్తి ఏమిటి (అంటే నిత్యం సిమెంటు, మట్టిలో ఉండే నిర్మాణ రంగంలోని సైట్ ఇంజనీర్లు ఎక్కువసార్లు తలస్నానం చేయాలి), తలకి ఎంతగా చెమట పడుతోంది, నివాస ప్రాంతపు వాతావరణంలోని తేమ శాతం (అంటే సముద్రతీర ప్రాంతాల్లో తేమ ఎక్కుగా ఉండగా ఎత్తైన ప్రదేశాల్లో ఉండే వాతావరణం పొడిగా ఉండటం)... వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. తాము ఎన్నిసార్లు తలస్నానం చేయాలో వ్యక్తిగతంగా ఎవరికి వారు నిర్ణయించుకోవాలి. కొందరు ప్రతిరోజూ తలస్నానం చేస్తుంటారు. అది వారి జుట్టుకు (హెయిర్ స్ట్రాండ్)కు హాని చేయనంతవరకు పరవాలేదు. అయితే దీనివల్ల కొందరిలో జుట్టు సహజత్వాన్ని కోల్పోయి, త్వరగా చిట్లిపోతుంది. అదేవిధంగా అవసరమైనన్ని సార్లు తలస్నానం చేయకపోతే జుట్టంతా జిడ్డుగా మారి సహజత్వాన్ని కోల్పోయి, చిక్కులు పడిపోతుంది. అందుకే తమకు ఎన్నిసార్లు తలస్నానం చేస్తే అనువుగా ఉంటుందన్న విషయాన్ని అనుభవం మీద తెలుసుకొని ఆ మార్గాన్ని అనుసరించాలి. అలాగే వ్యక్తిగత జుట్టు స్వభావాన్ని బట్టి, సమస్యను బట్టి ఒకసారి డాక్టర్‌ను సంప్రదించి తమ షాంపూను ఎంచుకోవడం మేలు.



డాక్టర్ స్వప్నప్రియ, డర్మటాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్

ఆత్మీయం

నిశ్చలత్వమే యోగం



ఈ భౌతిక ప్రపంచంలో మంచి జరిగినా, చెడు జరిగినా తాము దాన్ని ప్రశంసించకుండా, విమర్శించకుండా ఎవరైతే ఉంటారో, ఎటువంటి భావాన్నీ వెలిబుచ్చక కలత చెందక నిశ్చలంగా ఉంటారో అటువంటి వారినే యోగులంటారు. నిలకడగల జ్ఞాని లేదా యోగి తాబేలు వంటివాడు. ఏదైనా అవసరం కలిగినప్పుడు తాబేలు తన అవయవాలను లోపలికి ముడుచుకునే సౌకర్యం ఏవిధంగా కలిగి ఉంటుందో, అదేవిధంగా తన ఇంద్రియాలను అదుపులో పెట్టుకోగలిగిన వాడే సమగ్రమైన జ్ఞాని, యోగి.

సమదర్శనులు రమణమహర్షి వలె జనన మరణ స్థితులను జయించిన వారై ఉంటారు. అటువంటి సమదర్శనులయిన జ్ఞానుల చేత ఈ దేహం, సంసార బంధాలలో తగులుకోక జనన మరణ చక్రాన్ని జయించబడింది. అటువంటి వారు బ్రహ్మమువలె దోషం లేని వారయినందువల్ల బ్రహ్మములోనే ఉన్నవారు కాగలరు. అంటే అన్నింటిలోనూ సమదృష్టి గల మనస్సు, ఆత్మ సాక్షాత్కారం గల వారి హృదయానికి ప్రతీకయే గాక సాక్షాత్తూ దేవుని వలె రాగద్వేషాలకు అతీతులం కాగలం. దోషరహితులమై ఆధ్యాత్మికానందాన్ని అనుభవించగలం.

బ్యూటిప్స్



● తలస్నానం చేయడానికి ముందు జుట్టును వెడల్పు పళ్లున్న దువ్వెనతో చక్కగా చిక్కులు వదిలే వరకు దువ్వాలి. ● తలను గోరువెచ్చటి నీటితో తడపాలి. షాంపూను చిన్న కప్పులోకి తీసుకుని గోరువెచ్చటి నీటితో కలపాలి. ఒక వంతు షాంపూకి అంతే మోతాదులో నీటిని కలపాలి. షాంపూ నీటిలో సమంగా కలిసిన తర్వాత జుట్టుకు పట్టించాలి. ● షాంపూ పట్టించిన తర్వాత జుట్టు కుదుళ్లను, మాడును మసాజ్ చేస్తున్నట్లు వేళ్లతో వలయాకారంగా రుద్దాలి. తర్వాత జుట్టు చివర్ల వరకు రెండు చేతులతో మృదువుగా రుద్దాలి. ● చన్నీరు లేదా గోరువెచ్చటి నీటితో తలను శుభ్రం చేయాలి. అలాగే రెండవ దఫా కూడా చేయాలి. అయితే రెండవ సారి పావు వంతు షాంపూ మాత్రమే తీసుకోవాలి. నీటిని ఎక్కువగా కలిపి ఉపయోగించాలి. ● తలకు, జుట్టుకు పట్టిన షాంపూ పూర్తిగా వదిలిన తర్వాత తలకు మెత్తటి టవల్‌ను చుట్టాలి. ● జుట్టు మరీ బిరుసుగా ఉంటే కండిషనర్ అప్లయ్ చేయవచ్చు. కండిషనర్ జుట్టు కుదుళ్లకు అంటకూడదు. మాడుకు తగలకుండా జుట్టుకు మాత్రమే పట్టించాలి.

గుడ్‌ఫుడ్



జుట్టు ఆరోగ్యంగా పెరగాలంటే రోజువారీ ఆహారంలో ఇవన్నీ ఉండాలి.

ప్రోటీన్ ఫుడ్: పప్పు లేదా కోడిగుడ్లు రోజూ తీసుకోవాలి

ఐరన్ : పాలకూరలోని ఐరన్, మినరల్స్ జుట్టు కుదుళ్లను దృఢంగా ఉంచుతాయి.

విటమిన్ సి : రోజుకు ఒక నిమ్మకాయ రసం లేదా కమలా, బత్తాయి వంటివి కూడా తీసుకోవచ్చు. సి విటమిన్ సమృద్ధిగా అందినప్పుడే దేహం ఇతర పోషకాలను సక్రమంగా గ్రహించగలుగుతుంది.

ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్‌లు: బాదం, వాల్‌నట్, అవిసె గింజల్లో ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్‌లు ఎక్కువగా ఉంటాయి. ఇవి జుట్టు దట్టంగా పెరిగేలా చేస్తాయి.

మైక్రో న్యూట్రియెంట్స్: గోధుమల వంటి పొట్టుతో కూడిన ధాన్యాల సూక్ష్మపోషకాలుంటాయి.

విటమిన్ ఎ: రోజుకు ఒక గ్లాసు క్యారట్ రసం తాగితే దేహానికి అవసరమైన ఎ విటమిన్ అందుతుంది. ఇది జుట్టు టిష్యూలను ఆరోగ్యంగా ఉంచుతుంది.

విటమిన్ ఇ: జుట్టు కుదుళ్లలోని నూనెలను సమపాళ్లలో ఉంచి పెరుగుదలకు దోహదం చేస్తుంది. పాలకూర, వేరుశనగపప్పు, వెజిటబుల్ ఆయిల్స్‌లో విటమిన్ ఇ ఉంటుంది.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
గురువారం
17-8-2017

నెలసరి... సమస్యలిక సరి

మహిళల్లో క్రమ రహిత ఋతుచక్రం ఇప్పుడు సర్వసాధారణం. ఉండాల్సిన దానికన్నా తక్కువ బరువు ఉండడం, ఒబేసిటీ, అనెరెక్సియా (బరువు పెరుగుతామనే భయంతో తక్కువగా తినడం) మానసిక ఒత్తిడి, గర్భ నిరోధక మాత్రలు, హార్మోన్ల సమస్యలు, థైరాయిడ్, పిసిఒడి... వంటివన్నీ కారణాలే. యోగలో దీనికి చక్కని పరిష్కారాలున్నాయి.

* * *


ఋతుక్రమ సమస్య రజస్వల అయిన 5 సంవత్సరాల వరకూ, మెనోపాజ్‌కి 3 సంవత్సరాల ముందు ఎక్కువగా బాధిస్తుంటుంది. ఈ అవస్థ నుంచి బయటపడడానికి విటమిన్‌డి, కాల్షియం సప్లిమెంట్స్, సోయా, ఫ్లాక్స్ సీడ్ (అవిసెగింజలు) వాడడం, హెర్బల్ మెడిసిన్స్ వాడవచ్చు. వీటన్నింటికన్నా క్రమం తప్పని యోగ సాధన ఎంతైనా ఉపయుక్తం. నిలబడి చేసే ఆసనాల్లో తాలాసన, తాడాసన, త్రికోణాసన, పార్శ్వకోణాసన, కూర్చుని చేసే వాటిలో వక్రాసన, మరీచాసన, భరద్వాజాసన, ఉష్ట్రాసన, అర్ధ ఉష్ట్రాసన, అథోముఖ శ్వానాసన, బద్ధ కోణాసన, బోర్లాపడుకుని చేసే వాటిలో భుజంగాసన, ధనురాసన వంటివి ఉపకరిస్తాయి. వీటిని సాధన చేస్తే పునరుత్పత్తి వ్యవస్థ బాగా ప్రభావితమై సమస్య పరిష్కారమవుతుంది.



1

భరద్వాజాసనం

కాళ్లు రెండూ ఎడమవైపు మడిచి శ్వాస తీసుకుంటూ చేతులు రెండూ శరీరానికి కుడివైపు నేలమీద ఉంచి తలను, ఛాతీని, నడుమును, వెనుకకు పూర్తిగా తిప్పుతూ 2,3 సాధారణ శ్వాసల తర్వాత శ్వాస వదులుతూ తల, ఛాతీ మధ్యలోకి తీసుకురావలెను. ఇదే విధంగా వ్యతిరేక దిశలో చేయవలెను. ఈ ఆసనాన్ని 3 లేదా 5 సార్లు రిపీట్ చేయవచ్చు.



2

పరివృత్త పార్శ్వకోణాసనం

సమస్థితిలో నిలబడాలి. కుడికాలు ముందుకి ఎడమ కాలు వెనుకకి (కాళ్ళ మధ్యలో 3 లేదా 4 అడుగుల దూరం) ఉంచాలి. కుడి మోకాలు ముందుకు వంచి ఎడమ కాలిని వెనుకకు బాగా స్ట్రెచ్ చేయాలి, నడుమును ట్విస్ట్ చేస్తూ ఛాతీని కుడివైపుకి తిప్పి, ఛాతీని తొడభాగానికి నొక్కుతూ ఎడమ ఆర్మ్‌పిట్ (చంకభాగం) కుడి మోకాలు మీదకు సపోర్టుగా ఉంచి వెనుకకు చూస్తూ రెండు చేతులు నమస్కార ముద్రలో ఉంచాలి. కొంచెం సౌకర్యంగా ఉండటానికి ఎడమ మడమను పైకి లేపి పాదాన్ని, కాలి వేళ్ళను ముందు వైపుకి తిప్పవచ్చు. 3 లేదా 5 శ్వాసలు తరువాత తిరిగి వెనుకకు వచ్చి ఇదే విధంగా రెండో వైపు కూడా చేయాలి. నమస్కార ముద్రలో చేతులు ఉంచలేని వాళ్లు ఎడమ అరచేతిని పూర్తిగా నేలమీద ఉంచి కుడిచేతిని కుడి చెవికి ఆనించి ముందుకు స్ట్రెచ్ చేస్తూ కుడి అరచేతిని చూసే ప్రయత్నం చేయవచ్చు.



ఎ.ఎల్.వి కుమార్
ట్రెడిషనల్ యోగా ఫౌండేషన్



మోడల్
ఈషా హిందోచా

3

అర్ధ ఉష్ట్రాసనం

వజ్రాసనంలో... అంటే మోకాళ్లు మడిచి మడమలు పాదాల మీద (మోకాళ్లు రెండింటి మధ్య ఒక అడుగు దూరం ఉంటే సౌకర్యంగా ఉంటుంది) కూర్చోవాలి. అవసరం అయితే మడమల కింద ఒక దిండును ఉపయోగించండి. ఎడమ అరచేయి ఎడమ పాదం వెనుకగా భూమి మీద ఉంచి చేతిని నేలకు ప్రెస్ చేస్తూ సీట్ భాగాన్ని పైకి లేపుతూ కుడి చేయిని ముందు నుండి పైకి తీసుకు వెళ్లి శ్వాస తీసుకున్న స్థితిలో శరీరాన్ని విల్లులాగా వెనుకకు వంచుతూ పొట్టను ముందుకు నెట్టే ప్రయత్నం చేయాలి. (ఎడమ అరచేయి భూమిమీద సపోర్ట్‌గా ఉంచినట్టయితే వెన్నెముకకు డ్యామేజ్ జరగదు). శ్వాస వదులుతూ తిరిగి వజ్రాసనంలోకి రావాలి. అదే విధంగా రెండవ వైపు కూడా చేయాలి. అనుభవం ఉన్న సాధకులు ఎడమ అరచేతిని ఎడమ పాదం మీద ఉంచి పొట్టను ముందుకు నెట్టే ప్రయత్నం చేయవచ్చు.

– సమన్వయం: **ఎస్. సత్యబాబు,**
ఫొటోలు: **పోచంపల్లి మోహనాచారి**

ఉష్ట్రాసనం

వజ్రాసనంలో కూర్చుని రెండు అరచేతులతో పాదాలను పట్టుకుని శ్వాస తీసుకుంటూ పొట్టను ముందుకు నెడుతూ శరీరాన్ని వెనుకకు వంచవలెను. శ్వాస వదులుతూ యథాస్థితి వజ్రాసనంలోకి రావలెను. ఉష్ట్రాసనం చేయలేని వారు ఇంతకు ముందు చెప్పిన అర్ధ ఉష్ట్రాసనాన్ని 3 లేదా 5 సార్లు రిపీట్ చేస్తే మంచిది.

4



యోగ కాయ చికిత్స

పైన చెప్పిన ఆసనాలతో పాటు యోగ కాయ చికిత్స కూడా మంచి ఫలితాన్నిస్తుంది. న్యూరాన్ ట్రాన్స్‌మిషన్ చానెల్స్‌కి సంబంధించిన బయోఫీడ్ మెకానిజంతో పనిచేయడమే ఈ యోగ కాయ చికిత్స. ఈ చికిత్సను 21 లేదా 40 రోజులు గాని క్రమం తప్పకుండా చేస్తే పిసిఒడి సమస్య, పొట్టలో లేదా ఛాతీలో ఏర్పడిన గడ్డలు (ఫైబ్రాయిడ్స్) కరిగిపోతాయి.

చేసే విధానం

పొట్ట మీద గడియారం దిశలో కొంచెం మీడియం సైజ్ సర్కిల్‌లో మృదువుగా అరచేతితో మర్దన చేయాలి. పొత్తికడుపు కింది భాగం నుంచి పైకి బొడ్డు భాగం వరకూ అప్‌వార్డ్ దిశలో... బొడ్డు భాగం నుంచి పక్కలకు పై నుంచి కిందకు డయాగ్నల్‌గా రోజూ 20 నిమిషాల చొప్పున ఉదయం సాయంత్రం మర్దన చేయాలి. ప్రాణయామాలు, తేలికపాటి ఆసనాలు తప్ప పొట్ట మీద ఒత్తిడి కలిగించే ఆసనాలు పీరియడ్స్ టైమ్‌లో చేయకూడదు.

ధనురాసనం

నేలపై బోర్లాపడుకుని మోకాళ్ళని వంచి చేతుల్ని వెనక్కి తీసుకెళ్ళి కాలి చీలమండల్ని పట్టుకోవాలి. నెమ్మదిగా శ్వాస తీసుకొని వదిలేస్తూ మోకాళ్ళని పైకెత్తుతూ రెండు కాళ్ళని, ఛాతీని పైకెత్తాలి. పొట్ట మాత్రమే నేలను తాకుతూ ఉంటుంది. శరీరం బరువు మొత్తం పొట్ట మీద ఉంటుంది. శరీరం ధనుస్సు మాదిరిగా ఉంటుంది. ముందు కాళ్ళను పైకెత్తుతూ, ఛాతీని పైకెత్తితే నడుము మీద ఒత్తిడి పడదు. కాళ్ళను పైకెత్తే క్రమంలో మోకాళ్ళను ఎడంగా ఉంచాలి. అప్పుడు ఆసనంలోకి వెళ్ళటం తేలిక అవుతుంది. సాధ్యమైనంత సేపు ఆసనంలో ఉండి నెమ్మదిగా ఛాతీ నేలకు ఆనించి తర్వాత కాళ్ళను నేలకు ఆనించి నిదానంగా బయటకు రావాలి.

5



క్యాన్సర్ అంటువ్యాధా... వంశపారంపర్యమా?



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421, Kurnool 08518273001

కుటుంబ సభ్యుల్లో చాలా దగ్గరి వారికి క్యాన్సర్ అని తెలిశాక విలవిలలాడిపోతారు. ఇక అది లేట్ స్టేజ్ అని తెలిశాక ఇంకా నిస్సహాయమైన పరిస్థితి. ఆ షాక్ నుంచి తేరుకోడానికి చాలాకాలం పడుతుంది. అయితే డాక్టర్ల ద్వారా రోగులకు అందించాల్సిన సేవల గురించి తెలుసుకొని, వారు ఉండే ఆ కొంతకాలం వారికి అన్ని సౌకర్యాలూ కల్పిస్తారు. వారు సంతోషంగా ఉండటానికి కావాల్సిందంతా చేస్తారు. అయితే ఇలా సేవలు చేసే సమయంలో కొన్ని సందేహాలు కలుగుతాయి. పైగా వారు పడుతున్న బాధ చూస్తున్నప్పుడు, వారి చికిత్సను గమనిస్తున్నప్పుడు, ఆ చికిత్స సమయంలో వస్తున్న ఇతర కాంప్లికేషన్లు పరికిస్తున్నప్పుడు పగవారికి కూడా ఆ బాధ వద్దు అనిపించడం సహజం. ఇక ఆ వ్యాధితో బాధపడే వారు పెద్దవయసు వారైతే... ఆ వయసులో వచ్చే ఇతర అనర్థాలు... క్యాన్సర్ బాధతో కలగలసి వారిని చూసేవారిని, ఆ సేవలు చేసేవారిని మరింత వేదనకు గురిచేస్తాయి. ఆ వేదన నుంచి అనేక సందేహాలు తలెత్తుతాయి. ఆ సందేహాలలో అనేకం అపోహలే అయి ఉంటాయి. అందులో ముఖ్యమైనది... క్యాన్సర్ అంటువ్యాధా? ఇంత దగ్గరగా ఉండి సేవలు చేయడం వల్ల మనకూ వస్తుందా? ఇలా ఎన్నో సందేహాలూ... సంశయాలు.

ఏది వాస్తవం... ఎంత వాస్తవం?

క్యాన్సర్ అంటువ్యాధి అన్న మాట ఎంతమాత్రమూ వాస్తవం కాదు. క్యాన్సర్ ఒంట్లోని కణం నుంచి పక్క కణానికి మాత్రమే పాకుతుంది. అంతేగాని... ఒకరి ఒంటి నుంచి మరొకరికి అంటదు. ఇక మరి కొందరిలో మరో సంశయం. ''క్యాన్సర్ ఉన్నదని తెలిశాక చాలా మంది సర్జరీ వద్దని సలహా ఇచ్చారు. కత్తి తగిలితే క్యాన్సర్ కణం మరింత రెచ్చిపోతుందని కొందరు చెప్పారు. అయినా వినకుండా సర్జరీ చేయించాం. అందుకే ఇది అంతగా పెచ్చరిల్లిందా? శస్త్రచికిత్స చేయించకపోతే రోగి మరింత కాలం బతికేవాడా?'' అనే సందేహాలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఈ అపోహ కూడా ఎంతమాత్రమూ సరి కాదు. క్యాన్సర్ గడ్డ అయినప్పుడు, దాన్ని సర్జరీ ద్వారా తొలగించడానికి వీలున్నప్పుడు శస్త్రచికిత్సే సరైన చికిత్స. అది జరగకపోయి ఉంటే రోగి మరింత త్వరగా చనిపోయేవాడన్నది గుర్తించాలి. కొన్ని సందర్భాల్లో క్యాన్సర్ గడ్డ తొలగించడానికి వీల్లేనంత సంక్లిష్టమైన చోట ఉంటే తప్ప దాన్ని వదలరు. తొలగించే సౌలభ్యం ఉన్నప్పుడు దాన్ని తొలగించి... ఒంట్లో మరెక్కడా క్యాన్సర్ కణం లేదని నిర్ధారణ చేసుకున్నప్పుడు ఆ రోగి అందరిలాగే సంపూర్ణ ఆరోగ్యవంతుడుగా జీవించే అవకాశం ఉందని గ్రహించాలి. పథ్యం సరిగా పాటించనందు వల్ల జరగకూడదనుకున్నది జరిగిందా అనే సందిగ్ధ పరిస్థితి మరికొందరిలో ఉంటుంది. కానీ అన్నం సయించి తినగలుగుతున్నప్పుడు రోగి అందరిలాగే సమతులమైన, ఆరోగ్యకరమైన ఆహారం తినాలి. అలా తింటేనే రోగనిరోధకశక్తి పెరిగి మరింత కాలం ఆరోగ్యంగా బతకగలుగుతాడు.

అంటుకోవడం కాదు ఇతర అంశాలే కారణం...

క్యాన్సర్ అంటుకోవడం ఎంత మాత్రమే కారణం కాకపోగా... చాలా ఇతర అంశాలే కారణమవుతాయి. నిర్దిష్టంగా క్యాన్సర్‌కు ఇదీ కారణం అని చెప్పలేకపోయినా... చాలామందిలో నిర్వహించిన అధ్యయనాల మేరకు పొగతాగడం, ఆల్కహాల్ వంటి దురలవాట్లు, తీవ్రమైన మానసిక ఒత్తిడి, వయసు పైబడటం, దీర్ఘకాలం పాటు కృత్రిమ హార్మోన్లు తీసుకోవడం, పొగాకు నమలడం, ఆస్‌బెస్టాస్ వంటి కంపెనీల్లో పనిచేయడం, వృత్తిపరంగా రేడియేషన్‌కు గురికావడం వంటి అంశాలు తోడ్పడతాయి. ఇక కొందరిలోనైతే ఎలాంటి రిస్క్‌ఫ్యాక్టర్స్ లేకపోయినా క్యాన్సర్ రావచ్చు.

క్యాన్సర్ అంటువ్యాధి కాదు గానీ... క్యాన్సర్‌కు దారితీసే కొన్ని అంటువ్యాధులు...

స్వతహాగా క్యాన్సర్ అంటువ్యాధి కాదు గానీ కొన్ని అంటువ్యాధులు క్యాన్సర్లకు దారితీయవచ్చు. ఉదాహరణకు హెపటైటిస్–బి అనేది అంటువ్యాధి. కలుషితమైన సూదులు, సెక్స్ ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది. ఇది అంటువ్యాధి. ఇది సోకిన వారిలో చాలామందికి ఆ తర్వాతి కాలంలో కాలేయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ. క్యాలేయ క్యాన్సర్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు. కానీ వ్యాధి వ్యాప్తిచేయగల వయసులో హెపటైటిస్–బి మాత్రం ఒకరిని నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఇదీ గమనించాల్సిన అంశం. అలాగే హెచ్‌పీవీ వైరస్. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఆ వైరస్ సోకిన చాలామందిలో ఆ తర్వాతి దశలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ. అయితే ఈ క్యాన్సర్ మాత్రం అంటువ్యాధి కాదు. అదీ తేడా. అయితే ఇప్పుడు హెపటైటిస్–బి ని నివారించడానికీ, హెచ్‌పీవీ నివారణకూ వాక్సిన్లు ఉన్నాయి. ఆ వ్యాక్సిన్లు తీసుకోవడం అంటే... ముందు ఆయా వ్యాధులను నివారించడం, ఆ తర్వాత ఆయా క్యాన్సర్లనూ నివారించడం అన్నమాట.

క్యాన్సర్ వంశపారంపర్యమా?

చాలావరకు కాదు. అయితే క్యాన్సర్ వంశపారంపర్యం కానే కాదు కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. ఎందుకంటే కొన్ని రకాల క్యాన్సర్లు దగ్గరి బంధువుల్లో కనిపించినప్పుడు అవి వారి వారసుల్లో కనిపించే అవకాశాలు కాస్త ఎక్కువే. ముఖ్యంగా మహిళలకు వచ్చే క్యాన్సర్లలో ఇలా వంశపారంపర్యంగా కనిపించే అవకాశాలు పెరుగుతాయి. ఉదాహరణకు దగ్గరి బంధువుల్లో ఇద్దరికి రొమ్ముక్యాన్సర్ కనిపించిందంటే... ఆ కుటుంబంలోని వారికి ఆ క్యాన్సర్ ముప్పు ఎక్కువ అని గుర్తుంచుకోవాలి. క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయా లేవా అని తెలుసుకోవాలంటే బీఆర్‌సీఏ 1, బీఆర్‌సీఏ2 వంటి జీన్ మ్యూటేషన్ పరీక్షలు చేయించుకోవాలి. ఈ పరీక్షలు పాజిటివ్‌గా వచ్చాయంటే వారిలో రొమ్ము క్యాన్సర్ కణం ఉన్నట్లు పరిగణించాలి. ఇలాంటి వారికి కౌన్సెలింగ్ అవసరమవుతుంది.

ఫ్యామిలీ డాక్టర్

హోమియో కౌన్సెలింగ్స్

కడుపులో నొప్పి, అజీర్ణం... తగ్గేదెలా?

నా వయసు 42. కడుపులో విపరీతమైన మంట, నొప్పి వస్తున్నాయి. కడుపు ఉబ్బరం. డాక్టర్ గ్యాస్ట్రైటిస్ అన్నారు. ఇది హోమియో ద్వారా నయమవుతుందా?

- ఆర్. రాంబాబు, శ్రీకాళహస్తి

జీర్ణకోశం లోపల ఉండే మ్యూకస్ పొర ఇన్‌ఫ్లమేషన్ లేదా వాపునకు గురికావడాన్ని గ్యాస్ట్రైటిస్ అంటారు. తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు మెదడు లాగే జీర్ణవ్యవస్థ మీద కూడా ప్రభావం పడుతుంది. గ్యాస్ట్రిక్ సమస్యలు ఆకస్మికంగా మొదలై కొన్ని రోజుల వరకు ఉండి తగ్గిపోతే అక్యూట్ గ్యాస్ట్రైటిస్ అంటారు. దీర్ఘకాలికంగా కొనసాగితే క్రానిక్ గ్యాస్ట్రైటిస్ అంటారు. కొందరిలో గ్యాస్ట్రిక్ సమస్య ముదిరితే అవి కడుపులో అల్సర్స్ లేదా పుండ్లుగా ఏర్పడతాయి.

కారణాలు: 20 – 50 శాతం అక్యూట్ గ్యాస్ట్రైటిస్‌లకు వైరస్, బ్యాక్టీరియా (ముఖ్యంగా హెలికోబ్యాక్టర్ పైలోరీ) కారణమవుతుంది • తీవ్రమైన మానసిక ఒత్తిడి, మద్యం ఎక్కువగా తీసుకోవడం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం • కొన్ని రకాల మందులు... పెయిన్ కిల్లర్స్ వాడటం • పైత్య రసం వెనక్కి ప్రవహించడం • కొన్ని జీర్ణకోశ వ్యాధులు (క్రాన్స్ డిసీజ్), కొన్ని ఆటో ఇమ్యూన్ వ్యాధులు • శస్త్ర చికిత్స లేదా వంశపారంపర్య చరిత్ర ఉన్నవారిలో • వేపుళ్లు, మసాలాలు, కారం, పులుపు ఎక్కువగా తీసుకునే వారిలో గ్యాస్ట్రైటిస్ సమస్య కనిపిస్తుంది.

లక్షణాలు: కడుపు నొప్పి, మంట • కడుపు ఉబ్బరం, కొంచెం తిన్నా కడుపు నిండుగా అనిపించడం • అజీర్ణం, వికారం, రక్తంతో కూడిన వాంతులు • ఆకలి తగ్గిపోవడం • మలం రంగు మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

చికిత్స: హోమియో వైద్య విధానంలో గ్యాస్ట్రిక్ సమస్యలకు చక్కటి పరిష్కారం ఉంది. మూల కారణాలైన ఆమ్లాలు, తీవ్ర రసాయనాల సమతౌల్యతను చక్కదిద్దడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించవచ్చు.



డాక్టర్ శ్రీకాంత్ మోర్లావర్
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్, హైదరాబాద్

మాకు పిల్లలు పుడతారా?

నా వయసు 32. వివాహమై ఎనిమిదేళ్లయింది. సంతానం లేదు. డాక్టర్‌ను సంప్రదిస్తే కొన్ని వైద్య పరీక్షలు చేసి ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ అని చెప్పారు. ఇన్‌ఫెర్టిలిటీకి కారణాలు ఏమిటి? హోమియోలో నా సమస్యకు శాశ్వత పరిష్కారం ఉందా?

- సరోజ, కోదాడ

ఇటీవల చాలా మందిలో సంతానలేమి సమస్య కనిపిస్తోంది. దీనికి అనేక అంశాలు కారణమవుతాయి. సమస్య మహిళల్లో లేదా పురుషుల్లో ఉండవచ్చు.

స్త్రీలలో సాధారణంగా కనిపించే కారణాలు: • జన్యుసంబంధిత లోపాలు • థైరాయిడ్ సమస్యలు • అండాశయంలో లోపాలు; నీటిబుడగలు • గర్భాశయంలో సమస్యలు • ఫెలోపియన్ ట్యూబ్స్‌లో వచ్చే సమస్యలు • డయాబెటిస్ • గర్భనిరోధక మాత్రలు అధికంగా వాడటం.

పురుషుల్లో సాధారణంగా కనిపించే కారణాలు : • హార్మోన్ సంబంధిత సమస్యలు • థైరాయిడ్ • పొగతాగడం • శుక్రకణాల సంఖ్య తగ్గిపోవడం

సంతానలేమిలో రకాలు: • ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ • సెకండరీ ఇన్‌ఫెర్టిలిటీ

ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ : అసలు సంతానం కలగకపోవడాన్ని ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ అంటారు. ఇది ముఖ్యంగా జన్యుసంబంధిత లోపాలు, హార్మోన్ సంబంధిత లోపాల వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది.

సెకండరీ ఇన్‌ఫెర్టిలిటీ: మొదటి సంతానం కలిగిన తర్వాత లేదా అబార్షన్ అయిన తర్వాత మళ్లీ సంతానం కలగకపోవడాన్ని సెకండరీ ఇన్‌ఫెర్టిలిటీ అంటారు. గర్భాశయంలో లోపాలు ఏర్పడటం, ఇన్ఫెక్షన్స్ రావడం వల్ల సంభవిస్తుంది.

గుర్తించడం ఎలా: థైరాయిడ్ ప్రొఫైల్, సాల్పింజోగ్రఫీ, అల్ట్రాసోనోగ్రఫీ, ఫాలిక్యులార్ స్టడీ వంటి వైద్య పరీక్షల ద్వారా సమస్యను నిర్ధారణ చేస్తారు.

చికిత్స: హోమియోలో ఎలాంటి సమస్యలకైనా కాన్‌స్టిట్యూషనల్ పద్ధతిలో వ్యక్తి మానసిక, శారీరక లక్షణాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స చేస్తారు. మీ సమస్యకు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి.



డాక్టర్ ఎ.ఎం. రెడ్డి, సీఎండీ
పాజిటివ్ హోమియోపతి, హైదరాబాద్

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ లవ్ గురూ!! నేను త్రీ ఇయర్స్‌గా ఒక అమ్మాయిని లవ్ చేస్తున్నా. ఆ అమ్మాయి కూడా నువ్వంటే నాకూ ఇష్టమే అని చెప్పింది. ఫోన్‌లు, మెసేజ్‌లు, షికార్లు అంటూ బాగానే ఉండేవాళ్లం! కానీ, ఈ మధ్య తనకి ఏమైందో ఏమో... 'ఇవన్నీ వద్దురా... ఆపేద్దాం!' అంటోంది. ఇప్పుడు నేనేం చెయ్యాలి? సలహా ఇవ్వండి ప్లీజ్!!

- సాయి

ఆపెయ్యరా..!

'సార్.. మీ మనసు మట్టి ముద్దా!?!'

వద్దురా...!

'సార్ ఛీ... అసలు మీకు మగాళ్ల ఉత్తరాలు రాయడమే వేస్ట్ సార్...!'

ఇవన్నీ ఆపేయరా! ప్లీజ్...!!

'సార్.. ఏంటి సార్ మీ ప్రాబ్లమ్.. మీకు లవ్ అర్థం కాదా..!?! సార్... అన్యాయం సార్..!'

ఇవన్నీ ఆపేయరా... వద్దురా...!

'సార్ అమ్మాయి అలా ఎందుకు అంటోంది అని అడుగుతున్నాడు సార్..'

వద్దురా ఆపేయరా...!

'సార్ ముందు ప్రేమించింది. ఫోన్లు, మెసేజ్‌లు, షికార్లు, బాసలు, కాసులు అన్నీ ఖర్చయ్యాకా వద్దురా! గిద్దురా!! ఆపేద్దాం! గీపేద్దాం!! అంటే ఎలా సార్..? పాపం సాయి... క్యా కర్నా.. గిలగిల కొట్టుకుంటున్నాడు సార్.. మంచి అడ్వయిజ్ ఇస్తే మంచి అరటిపండు ఇస్తా సార్!'

ఏదో తేడా కొట్టింది. అమ్మాయికి క్లారిటీ వచ్చింది. కారణం ఏదయినా ఈ రిలేషన్‌షిప్ మంచిది కాదని అనుకుంది. తానే కాదు.. సాయి కూడా ఫ్యూచర్‌లో హర్ట్ అవుతాడని క్లారిటీ వచ్చి... చాలా ప్రేమగా వద్దురా.. ఇవన్నీ ఆపేద్దామని చెప్పింది! ఊరికే ఫీల్ అవకుండా త్రీ ఇయర్స్ లవ్‌ని లైఫ్ లాంగ్ గుండెల్లో ఉంచుకుని, అప్పుడప్పుడు బయటికి తీసి చూసుకొని సంతోషించాలి కానీ, ఎక్కువ ఫీల్ అయితే హర్ట్ అవుతాడు!!

'మీ చెల్లెలు వేస్ట్ సార్.. మీకు అరటిపండు వేస్ట్ సార్!!'

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి. లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

	7		3		4	8	2	
2			5	8				7
		8	2	9				
		4	6		2	9	3	5
			4		1			
5	2	6	9		8	7		
				2	3	5		
8				4	9			3
	3	1	7		5		8	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

1	5	2	8	9	4	7	6	3
8	4	9	6	3	7	2	1	5
7	3	6	2	5	1	8	4	9
9	2	1	3	4	8	5	7	6
6	8	5	1	7	9	3	2	4
4	7	3	5	6	2	9	8	1
2	1	4	9	8	3	6	5	7
5	9	7	4	2	6	1	3	8
3	6	8	7	1	5	4	9	2

చిరంజీవి అభిమానులు తియ్యని కబురు కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఆయన నటించబోయే 151వ చిత్రం ప్రకటన కోసం కొన్ని నెలలుగా ఫ్యాన్స్ వెయిటింగ్. కొన్నాళ్లుగా ఈ చిత్రం కోసం చిరంజీవి కసరత్తులు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ 22న ఆయన బర్త్‌డే. ఆ రోజున ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తారేమో



● అల్లు అరవింద్, పరుచూరి గోపాలకృష్ణ, పరుచూరి వెంకటేశ్వరరావు, చిరంజీవి, సురేందర్ రెడ్డి, రామ్‌చరణ్, సురేఖ, వాకాడ అప్పారావు

ఐదు రోజులు ముందే గుడ్ న్యూస్

అనుకున్నారు. కానీ, ఐదు రోజులు ముందే ఆ గుడ్ న్యూస్ చెప్పేశారు. చిరంజీవి హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో కొణిదెల ప్రొడక్షన్స్‌పై చిరు తనయుడు, హీరో రామ్‌చరణ్ నిర్మించనున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలు బుధవారం హైదరాబాద్‌లో జరిగాయి. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. చిరంజీవి పుట్టినరోజు నాడు ఈ సినిమా టైటిల్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేయాలని దర్శక-నిర్మాతలు భావిస్తున్నారు. కాగా, ఈ చిత్రానికి 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి', 'మహావీర' అనే టైటిల్స్ ప్రచారంలో ఉన్నాయి. మరి.. ఈ రెండిటిలో ఒక టైటిల్‌ని సెలక్ట్ చేస్తారో? వేరే టైటిల్ పెడతారో చూడాలి.

అచ్చంగా అర్జునుడిలా...

అర్జునుడు సవ్యసాచి. కురుక్షేత్ర రణరంగంలో ఈ ధీశాలి రెండు చేతులతో శత్రువులపై బాణాలు సంధించాడు. నాగచైతన్య కూడా అచ్చంగా అర్జునుడిలానే. అప్పుడు అర్జునుడు బాణాలు వేయ గలిగితే, ఇప్పుడు చైతూ రెండు చేతులతో శూలాలు వేయగ లుగుతాడు. ఇదంతా సినిమా కోసమేనని ఊహించే ఉంటారు. చందు మొండేటి దర్శకత్వంలో రూపొందనున్న 'సవ్యసాచి' చిత్రంలో చైతూ పవర్‌ఫుల్ రోల్ చేయనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ చిత్రం సెప్టెంబర్‌లో ప్రారంభం కానుంది. ఈ సినిమా టైటిల్ లోగోను, ప్రీ-లుక్‌ను బుధవారం విడుదల చేశారు. ''చందు మొండేటి రాసిన హీరో క్యారెక్టరైజేషన్‌కు 'సవ్యసాచి' అనేది యాప్ట్ టైటిల్. హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనుంది. త్వరలో పూర్తి వివరాలను వెల్లడిస్తాం. 'ప్రేమమ్' తర్వాత నాగచైతన్య, చందు మొండేటిల హిట్ కాంబినేషన్ ఈ చిత్రంతో రిపీట్ అవుతోంది'' అని మైత్రీ మూవీ మేకర్స్ పేర్కొంది.



● నాగచైతన్య

మంచి లవ్‌స్టోరీతో వస్తున్నాం - నిర్మాత కేఎస్ రామారావు



● వల్లభ, సాయిధరమ్ తేజ్, కరుణాకరన్, 'డార్లింగ్' స్వామి, కె.ఎస్. రామారావు

'అభిలాష', 'ఛాలెంజ్', 'స్వర్ణకమలం', 'చంటి', 'క్రిమినల్', 'మాతృదేవోభవ'... ఇరవై, ముప్పై ఏళ్ల క్రితం వచ్చిన ఈ సినిమాలు ఇప్పటికీ ప్రేక్షకులకు గుర్తే. క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై ఇలాంటి హిట్స్ ఎన్నో తీసిన కె.ఎస్ రామారావు నేటి తరం హీరోలు ఎన్టీఆర్‌తో 'దమ్ము' వంటి యాక్షన్ ఎంటర్‌టైనర్, శర్వానంద్‌తో 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' వంటి లవ్‌స్టోరీ తీశారు. ఇప్పుడు సాయిధరమ్ తేజ్ హీరోగా 'తొలి ప్రేమ' ఫేమ్ ఎ. కరుణాకరన్ దర్శకత్వంలో ఓ లవ్‌స్టోరీకి శ్రీకారం చుట్టారు. కె.ఎస్. రామారావు, కె.ఎ. వల్లభ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ దైవ సన్నిధానంలో జరిగింది. కె.ఎస్. రామారావు మాట్లాడుతూ- ''మా క్రియేటివ్ కమర్షియల్స్ బేనర్ స్థాపించి 35 ఏళ్లయింది. ఇది మాకు 45వ సినిమా. కరుణాకరన్ చెప్పిన కథ నచ్చి, రామారావుగారు నిర్మాత అయితే బాగుంటుందని నన్ను కలిసి, ఈ సినిమా స్టార్ట్ అయ్యేలా చేసిన తేజూ (సాయిధరమ్ తేజ్)కి థ్యాంక్స్. అందమైన సినిమాలు తీసే కరుణాకరన్‌గారితో మంచి లవ్‌స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నందుకు ఆనందంగా ఉంది. కరుణాకరన్‌తో రైటర్ 'డార్లింగ్' స్వామి మంచి సినిమాలు చేశారు. గోపీసుందర్ మంచి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రానికి మంచి టీమ్ కుదిరింది. కరుణాకరన్‌గారు ఎంతమంచి సినిమా తీద్దామనుకుంటే అంత మంచి ఏర్పాట్లు చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. ఎందుకంటే దమ్మూ, ధైర్యం ఉన్న నిర్మాతను. ఈ దసరాకు షూటింగ్ స్టార్ట్ చేసి వచ్చే వేసవిలో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు. సాయిధరమ్ మాట్లాడుతూ- ''కరుణాకరన్ నాకోసమే ఈ కథ రాశారేమో అనిపిస్తోంది. కె.ఎస్. రామారావుగారితో ఏడాదిగా చేయాలను కుంటున్న ప్రాజెక్ట్ ఇప్పటికి కుదరడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ప్యూర్ కలర్‌ఫుల్ అండ్ రొమాంటిక్ లవ్‌స్టోరీ ఇది'' అన్నారు కరుణాకరన్. అనుపమా పరమేశ్వరన్ కథానాయికగా నటించనున్న ఈ చిత్రానికి మాటలు: 'డార్లింగ్' స్వామి, కెమెరా: ఆండ్రూ, ఆర్ట్: సురేశ్, ఎడిటింగ్: ఎస్.ఆర్ శేఖర్.

నా బ్యాగ్‌లో ఏమున్నాయంటే!



● శ్రుతీహాసన్

కమల్‌హాసన్ నాస్తికుడు. కానీ, ఆయన మొదటి కూతురు శ్రుతీహాసన్‌కు మాత్రం దేవుడంటే నమ్మకం. ఏ రేంజ్‌లో నమ్ముతారంటే తన హ్యాండ్‌బాగ్‌లో ఇష్టదైవాలు శివపార్వతుల బొమ్మలు పెట్టుకున్నారు. శ్రుతి ఎక్కడికెళ్లినా హ్యాండ్ బ్యాగ్ కంపల్సరీగా తీసుకెళతారు. అందుకే శివపార్వతులు తనతోనే ఉన్నట్లు భావిస్తారామె. ఈ బ్యూటీ హ్యాండ్‌బాగ్‌లో ఇంకా ఏమేం ఉన్నాయనే విషయానికి వస్తే.. లిస్టు చాలానే ఉంది. ''ఇంటి తాళాలు, హెడ్‌ఫోన్స్, క్రెడిట్ కార్డ్స్'' తప్పకుండా ఉంటాయన్నారు శ్రుతి. మరి.. అమ్మాయిల బ్యాగులో అలంకార వస్తువులు ఉండాలి కదా? అంటే ''అవి కూడా ఉన్నాయి. లిప్‌స్టిక్, పర్‌ఫ్యూమ్స్, హెయిర్ బ్యాండ్, అద్దం ఉంటాయి'' అని పేర్కొన్నారు శ్రుతీహాసన్. ఇవి మాత్రమే కాదు.. నోట్‌ప్యాడ్, సన్‌గ్లాసెస్ కూడా ఉంటాయి. అంతేనా? 'లెన్సెస్' కూడా కంపల్సరీ. మిగతా లిస్టులో ఏదొకటి మరచిపోయినా.. లెన్సులను మాత్రం శ్రుతి మరచిపోరు. ఎందుకంటే, అవి లేకపోతే సరిగ్గా కనపడదంటున్నారు శ్రుతీహాసన్.

క్షణక్షణం ఉత్కంఠ

● లావణ్యా త్రిపాఠి, సందీప్ కిషన్



సందీప్ కిషన్, లావణ్యా త్రిపాఠి జంటగా, హిందీ నటుడు జాకీష్రాఫ్ ప్రధాన పాత్రలో సీవీ కుమార్ దర్శకత్వంలో తమిళంలో తెరకెక్కిన చిత్రం 'మాయావన్'. ఈ సినిమాను 'ప్రాజెక్ట్ జెడ్' పేరుతో ఎస్.కె. బషీద్ సమర్పణలో ఎస్.కె. కరీమున్నీసా తెలుగు ప్రేక్షకులకు అందించనున్నారు. సెప్టెంబర్ తొలివారంలో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఎస్.కె.బషీద్ మాట్లాడుతూ- ''ఆద్యంతం ఉత్కంఠ కలిగించే అంశాలతో తెరకెక్కిన చిత్రమిది. సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకుల ఆసక్తి తగ్గదు. సందీప్ కిషన్ నటన హైలైట్. లావణ్యా త్రిపాఠి ఇప్పటి వరకు కనిపించని పాత్రలో నటించారు'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గిబ్రాన్, కెమెరా: గోపి అమర్నాథ్, డైలాగ్స్: శశాంక్ వెన్నెలకంటి.

నువ్వు హీరోనా...? అన్నారు - ఆనంద్ రవి

''ఆనంద్ రవి డైరెక్ట్ చేసిన 'పేరెంట్స్' మూవీ చూసిన రోజే ఇతను మంచి దర్శకుడు అవుతాడనుకున్నా. తను 'నెపోలియన్' సినిమాలో నటిస్తున్నాడని తెలియగానే ఎందుకు నటన పట్ల ఆసక్తి చూపుతున్నాడనిపించింది. ట్రైలర్, పోస్టర్స్ చూడగానే ఈ సినిమాను తనే డైరెక్ట్ చేసి, హీరోగా చేయడం కరెక్ట్ అనిపించింది'' అని నిర్మాత కె.ఎల్.దామోదర్ ప్రసాద్ అన్నారు. ఆనంద్ రవి, కోమలి, రవివర్మ, కేదార్ శంకర్, మధుమణి, అల్లు రమేశ్ ప్రధాన పాత్రల్లో ఆనంద్ రవి దర్శకత్వంలో బోగేంద్ర గుప్త మడుపల్లి నిర్మిస్తున్న చిత్రం 'నెపోలియన్'. ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాత కె.ఎల్.దామోదర్ ప్రసాద్, హీరో సందీప్‌కిషన్ విడుదల చేశారు. ఆనంద్ రవి మాట్లాడుతూ- ''నేనీ కథతో చాలా మందిని కలిశా. 'నీడపోయింది' అనే పాయింట్ చెప్పగానే షార్ట్ మూవీయా? అన్నారు. హీరోగా నేనే చేయబోతున్నా అనగానే.. 'నువ్వు హీరోనా! ప్రొడ్యూసర్ ఎవరు?' అనడిగారు. అందరి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చుకుంటూ ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. థ్రిల్లర్ జోనర్ సినిమా అయినా, కొత్త కాన్సెప్ట్‌తో ఉంటుంది. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా'' అన్నారు. ఈ సందర్భంగా నిర్మాత బోగేంద్ర గుప్తాకు చెందిన ట్రిపుల్ ఎస్ అనే ఎన్.జి.ఓ సంస్థ అనారోగ్యంతో బాధపడుతున్న సినిమా జర్నలిస్ట్ వరప్రసాద్‌కు 25,000 చెక్‌ను సీనియర్ పాత్రికేయులు బీఏ రాజు, పసుపులేటి రామారావులకు అందజేశారు.



● కోమలి
ఆనంద్ రవి

ఫ్యామిలీ పేజీలపై మీ అభిప్రాయాలనూ, సూచనలనూ తెలియచేయండి. ప్రియదర్శిని రామ్, ఫీచర్స్ ఎడిటర్. features.sakshi@gmail.com

సాక్షి స్పోర్ట్స్
గురువారం 17-8-2017

కాస్పరోవ్‌ను నిలువరించిన ఆనంద్



సెయింట్ లూసియా అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ గ్యారీ కాస్పరోవ్ (రష్యా)ను భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ నిలువరించాడు. కాస్పరోవ్‌తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను ఆనంద్ 31 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఆరో రౌండ్ తర్వాత ఆనంద్ 2.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా నాలుగో స్థానంలో ఉన్నాడు.

కెరీర్‌లో మొదటిసారి...

రామ్‌కుమార్‌కు తొలి 'మాస్టర్స్' విజయం



రామ్

ఒహాయో: అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న భారత యువ టెన్నిస్ తార రామ్‌కుమార్ రామనాథన్ తన కెరీర్‌లో తొలి 'మాస్టర్స్' విజయాన్ని సాధించాడు. సిన్సినాటి మాస్టర్స్ సిరీస్-1000 టోర్నమెంట్‌లో ఈ చెన్నై ప్లేయర్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. తొలి రౌండ్‌లో రామ్‌కుమార్ 6-7 (5/7), 6-1, 6-4తో క్రిస్టోఫర్ యుబ్యాంక్స్ (అమెరికా)పై విజయం సాధించాడు. గంటా 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్ ఏకంగా 14 ఏస్‌లు సంధించాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల తర్వాత రెండో అత్యున్నత స్థాయి హోదా మాస్టర్స్ సిరీస్ టోర్నమెంట్‌లకు ఉంది. వాస్తవానికి ఈ టోర్నీలో క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లోనే రామ్‌కుమార్ ఓడిపోయినా... టోర్నమెంట్ మొదలయ్యాక మెయిన్ 'డ్రా'లోని ఇతర ఆటగాళ్లు గాయాల కారణంగా వైదొలిగారు. దాంతో నిర్వాహకులు 'లక్కీ లూజర్' హోదాలో రామ్‌కుమార్‌కు మెయిన్ 'డ్రా'లో ఆడే అవకాశం ఇచ్చారు. రెండో రౌండ్‌లో జారెడ్ డొనాల్డ్‌సన్ (అమెరికా)తో రామ్‌కుమార్ ఆడతాడు. రామ్‌కుమార్ ఇటీవలే వాషింగ్టన్‌లో జరిగిన సిటీ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో తొలి రౌండ్‌లో, అంటాల్యా ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు.

పేస్-జ్వెరెవ్ జంట ఓటమి

మరోవైపు ఇదే టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో లియాండర్ పేస్ (భారత్)-అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) జంట తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. గంటా 21 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో పేస్-జ్వెరెవ్ ద్వయం 6-2, 6-7 (2/7), 6-10తో 'సూపర్ టైబ్రేక్'లో ఫెలిసియానో లోపెజ్-మార్క్ లోపెజ్ (స్పెయిన్) జోడీ చేతిలో పరాజయం పాలైంది. 44 ఏళ్ల పేస్‌తో 20 ఏళ్ల జ్వెరెవ్ తొలిసారి జతకట్టాడు. 1997లో పేస్ తన కెరీర్‌లో ఆరు డబుల్స్ టైటిల్స్ గెలిచిన ఏడాదే జ్వెరెవ్ జన్మించడం విశేషం. గతవారం రోజర్స్ కప్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ ఫైనల్లో ఫెడరర్‌ను ఓడించిన జ్వెరెవ్ సీజన్‌లో ఐదో సింగిల్స్ టైటిల్‌ను గెలిచాడు.



నాన్నకు ప్రేమతో...

- ప్రతికూల పరిస్థితుల్లోనూ తప్పని గురి
- ఆసియా షూటింగ్‌లో పతకాలు నెగ్గిన హైదరాబాదీ షూటర్

రష్మీ రాథోడ్ విజయగాథ

సాక్షి, హైదరాబాద్

ఏడేళ్లుగా షూటింగ్‌లో నిలకడగా రాణింపు... జాతీయ స్థాయిలో 14 పతకాలు... అయితే ఆశించిన 'పెద్ద' విజయం మాత్రం ఇంకా దక్కలేదు. ఏడాది క్రితం త్రుటిలో కోల్పోయిన ఆ పతకాన్ని ఈ సారి దక్కించుకోవాలని ఆమె పట్టుదలగా శ్రమించింది. అన్ని విధాలుగా పోటీలకు సిద్ధమైంది. ఇంతలో పెద్ద కుదుపు... తన చేతికి తుపాకీ అందించి మార్గదర్శిగా నిలిచిన తండ్రి హఠాన్మరణం! మరో పక్షం రోజుల్లో ఆసియా చాంపియన్‌షిప్ పోటీలకు వెళ్లాల్సి ఉంది. కానీ తన ఆటపై సందేహాలు. అయితే చివరకు ఆమె బాధను దిగమింగి ఆడేందుకే సిద్ధమైంది. కజకిస్తాన్‌లో జరిగిన ఈ పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన రష్మీ రాథోడ్ సత్తా చాటింది. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణపతకం సాధించిన రష్మీ... మహిళల టీమ్ ఈవెంట్‌లో రజతం కూడా గెలుచుకుంది. అయితే ఈ విజయానందాన్ని చూసేందుకు తండ్రి మాత్రం లేరు. 'పోటీ ముగిసిన తర్వాత ఒకవైపు ఆనందం, మరోవైపు బాధ. నాకు అన్ని విధాలా నాన్నే స్ఫూర్తిగా నిలిచారు. ఈ విజయం ఆయనకు అంకితం. ఆయన ఉండి ఉంటే చాలా సంతోషించేవారు' అని రష్మీ ఉద్వేగంగా చెప్పింది.

తుపాకులు, కత్తులు...

రష్మీ తండ్రి వైఎస్ రాథోడ్ ఆర్మీలో కెప్టెన్‌గా పని చేశారు. దాంతో సహజంగానే తుపాకులపై ఆసక్తి పెరిగింది. అయితే అది ఎంతగా అంటే ఆమె ఆట వస్తువుల్లో గన్స్, డాగర్స్ తప్ప మరొకటి లేదు. అమ్మాయిలు ఇష్టపడే బార్బీలాంటి బొమ్మలతో అసలు తానెప్పుడూ ఆడుకోనే లేదు. అయితే ప్రొఫెషనల్‌గా షూటింగ్‌లో వెళ్లాలని రష్మీ కూడా అనుకోలేదు. 2005లో చదువు పూర్తి చేసిన తర్వాతనే ఆమె ఆసక్తి దీని వైపు మళ్లింది. ఆ సమయంలో గచ్చిబౌలి రేంజ్‌లో జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ చూసేందుకు నాన్నతో పాటు వెళ్లింది. అదే ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. వచ్చే ఏడాది నువ్వు కూడా ఈ పోటీల్లో పాల్గొనాలంటూ ప్రోత్సహించిన తండ్రి, అందు కోసం తగిన రీతిలో అక్కడే శిక్షణ ఇప్పించారు. అయితే షాట్‌గన్ ప్రాక్టీస్‌లో 'రీ కాయిల్' (బుల్లెట్ ఫైర్ చేశాక వచ్చే కుదుపు) చాలా ఎక్కువగా ఉండటంతో ఆరంభంలో గాయాలపాలైంది. కానీ పట్టుదలతో ఫిట్‌నెస్‌ను పెంచుకొని తీవ్రంగా సాధన చేసింది. ఆ తర్వాత మూడేళ్ల పాటు నిలకడగా రాణించిన రష్మీ, 2008లో భారత షూటింగ్ జట్టులో భాగంగా మారింది. ఈ క్రమంలో జాతీయ స్థాయిలో 6 స్వర్ణాలు, 6 రజతాలు, 2 కాంస్యాలు గెలుచుకుంది.

గురి కుదిరింది...

రెండేళ్ల క్రితం భారత కోచ్‌గా ఎనియో ఫాల్కో వచ్చిన తర్వాత రష్మీ షూటింగ్ మరింత మెరుగైంది. భారత క్యాంప్‌లో తన లోపాలు సరిదిద్దుకుంటూ మంచి ఫలితాలు సాధించింది. గత ఏడాది కువైట్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో 67/75 స్కోర్ చేసిన ఆమె పతకం సాధించడంలో విఫలమైంది. ఆ తర్వాత షూటర్లకు అవసరమైన మానసిక బలం కోసం స్పోర్ట్స్ సైకాలజిస్ట్ వైభవ్ అగషే సహాయం తీసుకోవడం రష్మీని దృఢంగా మార్చింది. సంవత్సరం తర్వాత తగిన ఫలితాన్నిచ్చింది. కజకిస్తాన్ ఈవెంట్‌లో సింగిల్స్ విభాగంలో కూడా రష్మీ నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో పతకం కోల్పోయింది. రష్మీ తల్లి ఆనీ మ్యాథ్యూ ప్రస్తుతం నెదర్లాండ్స్‌లో భారత రాయబార కార్యాలయంలో ప్రొటోకాల్ అధికారిణిగా పని చేస్తోంది. స్కూల్ నుంచి డిగ్రీ వరకు హైదరాబాద్‌లోనే చదివిన రష్మీ నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో అకౌంటింగ్స్ అండ్ కంట్రోల్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. 34 ఏళ్ల రష్మీ ప్రస్తుతం చదువు, ఉద్యోగంలాంటివి పక్కన పెట్టి పూర్తిగా షూటింగ్‌పైనే దృష్టి పెట్టి పెద్ద లక్ష్యాలను చేరుకునే ప్రయత్నంలో ఉంది.



కజకిస్తాన్‌లో సాధించిన పతకాలు నా కెరీర్‌లో మేలిమలుపు. 17 డిగ్రీల చలి వాతావరణంలో, గాలి దిశ మార్చుకుంటున్న ప్రతికూల వాతావరణంలో విజయం సాధించడం నా ఆటపై పెరిగిన పట్టుకు నిదర్శనం. ఈ విజయం చాలా సంతోషాన్నిచ్చింది. త్వరలో మాస్కోలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌కు సిద్ధమవుతున్నా. అక్కడ పోటీ చాలా ఉంటుంది. ఈ టోర్నీలో విజయం సాధించగలిగితే చాలా గొప్ప ఘనత అవుతుంది. ఒలింపిక్స్‌లో పతకం సాధించాలనే నా లక్ష్యానికి అది చేరువ చేస్తుందని నా నమ్మకం. కేవలం షూటింగ్ అంటే పిచ్చి వల్లే నేను ఆటలో కొనసాగుతున్నాను. విజయాలకు అడ్డు కావద్దని పెళ్లి తదితర వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా పక్కన పెట్టాను. షూటింగ్‌లో వయసు పెద్ద అడ్డంకి కాదు కాబట్టి నేను దానిని పట్టించుకోను.

-రష్మీ రాథోడ్, షూటర్

ఆఫీస్ బేరర్లను తొలగించండి

సంస్కరణల అమలులో విఫలమయ్యారు • సుప్రీం కోర్టును కోరిన సీఓఏ



న్యూఢిల్లీ: జస్టిస్ ఆర్‌ఎం లోధా ప్యానెల్ సూచించిన సంస్కరణల అమలు తీరుపై పరిపాలక కమిటీ (సీఓఏ) తీవ్ర అసంతృప్తితో ఉంది. ఈ విషయంలో ఏమాత్రం సహకారం అందించడం లేదని, బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కోశాధికారి అనిరుధ్ చౌదరి, కార్యదర్శి అమితాబ్ చౌదరి సహా ఆఫీస్ బేరర్లను తొలగించాలని సుప్రీం కోర్టును కోరింది. ఈ మేరకు తమ ఐదో స్టేటస్ రిపోర్టును కోర్టుకు అందించింది. ఈ 26 పేజీల నివేదికలో బోర్డు పనితీరుపై ఘాటుగా స్పందించింది. వీరిని తొలగించాక బోర్డు పరిపాలనను ఎన్నికలు జరిగే వరకు సీఈవో రాహుల్ జోహ్రి ఆధ్వర్యంలోని ప్రొఫెషనల్ గ్రూప్‌తో పాటు తమకు అందించాలని వినోద్ రాయ్, డయానా ఎడుల్జీలతో కూడిన సీఓఏ పేర్కొంది. 'గతంలో అనురాగ్ ఠాకూర్, అజయ్ షిర్కేలను తొలగించినట్టుగానే ప్రస్తుత ఆఫీస్ బేరర్లను కూడా పక్కన పెట్టాలి. ఎందుకంటే కోర్టు సూచించినట్టుగా సంస్కరణలను అమలు చేసే పరిస్థితిలో వారు లేరు. ఇప్పటికే ఆరు నెలల సమయం వృథా అయ్యింది. గతంలో కోర్టు ఇచ్చిన తీర్పును కావాలనే తప్పుగా అర్థంచేసుకుని ఎస్‌జీఎంలోనికి రాహుల్ జోహ్రిని అనుమతించలేదు' అని సీఓఏ ఆరోపించింది.

బీసీసీఐ కార్యదర్శి ఖర్చు రూ.కోటి 56 లక్షలు

సుప్రీం కోర్టుకు సమర్పించిన తమ నివేదికలో సీఓఏ.. బీసీసీఐ ఆఫీస్ బేరర్లు పెట్టిన ఖర్చు వివరాలను కూడా పొందుపరిచింది. అత్యధికంగా బోర్డు కోశాధికారి అనిరుధ్ చౌదరి రూ. కోటి 71 లక్షలను ఖర్చు చేయగా... కార్యదర్శి అమితాబ్ చౌదరి ఖర్చు రూ. కోటి 56 లక్షలుగా పేర్కొంది. 2015-16, 2016-17 (జూన్ వరకు) మధ్య చేసిన ఈ ఖర్చుల్లో వారి విమాన ప్రయాణాలు, టీఏ/డీఏ, వసతి, విదేశీ కరెన్సీ మార్పు, అలవెన్స్ తదితర అంశాలున్నాయి. అయితే మాజీ కార్యదర్శి అజయ్ షిర్కే బోర్డు నుంచి రూపాయి కూడా తీసుకోలేదని తెలిపింది. అనురాగ్ ఠాకూర్ (రూ.24 లక్షలు), సీకే ఖన్నా (రూ.6.50 లక్షలు) వీరితో పోలిస్తే చాలా తక్కువ స్థాయిలో ఖర్చు చేశారని సీఓఏ తెలిపింది.

వైస్ కెప్టెన్సీ నాకు దక్కిన గౌరవం: రోహిత్ శర్మ



పల్లెకెలె: భారత వన్డే క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్టు ఓపెనర్ రోహిత్ శర్మ తెలిపాడు. తన పదేళ్ల కెరీర్‌లో అతను వన్డే టీమ్‌లో అనేక సార్లు వస్తూ పోతూ ఉండగా, టెస్టు ఫార్మాట్ తుది జట్టులో ఇప్పటికీ నిలకడైన స్థానం లేదు. ఇటీవలి శ్రీలంక టెస్టు సిరీస్‌లోనూ రోహిత్ బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. 'పదేళ్ల క్రితం నేను జట్టుకు ఆడితే చాలనుకునేవాడిని. కానీ ఇప్పుడు అదే జట్టుకు వైస్ కెప్టెన్ కావడం చాలా గర్వంగా అనిపిస్తోంది ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఐపీఎల్‌లో మా జట్టు ముంబై ఇండియన్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించినా అంతర్జాతీయ క్రికెట్ అనుభవం వేరుగా ఉంటుంది. వైస్ కెప్టెన్‌గా నా పాత్ర పెద్దగా ఏమీ లేకపోయినా ఈ హోదాలో బరిలోకి దిగేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నాను. ఈ పదేళ్ల కెరీర్‌లో ఎత్తుపల్లాలు ఉన్నాయి. ఇది ప్రతీ ఆటగాడికి సహజమే. ఆ అనుభవాల నుంచి చాలా నేర్చుకున్నాను' అని రోహిత్ పేర్కొన్నాడు.

హారిక మూడో గేమ్ 'డ్రా'

న్యూఢిల్లీ: అబుదాబి అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఖాతాలో తొలి డ్రా చేరింది. అబుదాబిలో జరుగుతున్న ఈ టోర్నీలో స్టుపాక్ కిరిల్ (బెలారస్)తో జరిగిన మూడో గేమ్‌ను హారిక 78 ఎత్తుల్లో డ్రా చేసుకుంది. రెండో గేమ్‌లో హారిక 56 ఎత్తుల్లో రవూఫ్ మమెదోవ్ (అజర్‌బైజాన్)పై, తొలి గేమ్‌లో 34 ఎత్తుల్లో మిథిల్ (భారత్)పై గెలిచింది.

క్వార్టర్స్‌లో వైష్ణవి పరాజయం

న్యూఢిల్లీ: బల్గేరియా ఓపెన్ అంతర్జాతీయ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలుగు అమ్మాయి జక్కా వైష్ణవి రెడ్డి పోరాటం ముగిసింది. సోఫియాలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో వైష్ణవి రెడ్డి 21-16, 17-21, 17-21తో మరియా దెల్‌చేవా (బల్గేరియా) చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో లక్ష్య సేన్ (భారత్) 21-19, 21-14తో దినుకా కరుణరత్న (శ్రీలంక)పై గెలిచి ఫైనల్‌కు చేరాడు.

భారత కుర్రాళ్ల క్లీన్‌స్వీప్

టాంటన్: అన్ని విభాగాల్లో రాణించిన భారత అండర్-19 జట్టు ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌ను 5-0తో సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన చివరిదైన ఐదో వన్డేలో భారత కుర్రాళ్ల జట్టు ఒక్క వికెట్ తేడాతో గెలిచింది. తొలుత ఇంగ్లండ్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లకు 222 పరుగులు చేసింది. భారత బౌలర్లలో రాహుల్ చహర్ నాలుగు, అభిషేక్ శర్మ 3 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 49.2 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 226 పరుగులు చేసి విజయం సాధించింది. కెప్టెన్ పృథ్వీ షా (45 బంతుల్లో 52; 7 ఫోర్లు, ఒక సిక్స్), హర్విక్ దేశాయ్ (44; 4 ఫోర్లు, ఒక సిక్స్), కమలేశ్ నాగర్‌కోటి (26 నాటౌట్; 4 ఫోర్లు) రాణించారు.

తెలుగు టైటాన్స్‌కు ఏడో ఓటమి

ప్రో కబడ్డీ లీగ్

అహ్మదాబాద్: ప్రో కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ మళ్లీ నిరాశపరిచింది. బుధవారం గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 19-29తో పరాజయం చవిచూసింది. ఈ టోర్నీలో తెలుగు జట్టుకిది ఏడో పరాజయం కావడం గమనార్హం. ఆరంభంలో తమిళ్ తలైవాస్‌తో ఆడిన తొలి మ్యాచ్‌లో గెలిచిన రాహుల్ చౌదరి సేన ఆ తర్వాత ఒక్క మ్యాచ్‌లోనూ నెగ్గలేకపోయింది. గుజరాత్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో పేలవంగా ఆడింది. తొలి అర్ధభాగం ముగిసే సరికే 8-20తో పరాజయాన్ని దాదాపు ఖాయం చేసుకున్న టైటాన్స్ రెండో అర్ధభాగంలోనూ చెప్పుకోదగ్గ ఆటతీరును కనబరచడంలో విఫలమైంది. రైడింగ్, టాకిల్‌లో గుజరాత్ ఆటగాళ్ల ఆధిపత్యమే కొనసాగింది. తెలుగు జట్టు తరఫున రాహుల్, వికాస్ చెరో మూడు పాయింట్లు చేయగా, రాకేశ్ కుమార్, విశాల్ భరద్వాజ్ చెరో 2 పాయింట్లు సాధించారు. గుజరాత్ ఆటగాళ్లలో సచిన్ (11) అద్భుతంగా రాణించాడు. సుకేశ్ హెగ్డే 7, అబోజర్ మిగని 4 పాయింట్లు చేశారు. అంతకుముందు జరిగిన హర్యానా స్టీలర్స్, తమిళ్ తలైవాస్ మ్యాచ్ 25-25తో టై అయ్యింది. నేడు జరిగే పోటీల్లో దబంగ్ ఢిల్లీతో తమిళ్ తలైవాస్, గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్‌తో బెంగాల్ వారియర్స్ తలపడతాయి. ఈ మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.



టైటాన్స్ రైడర్ నీలేశ్‌ను పట్టేసిన గుజరాత్ జెయింట్స్ ఆటగాళ్లు

మంచి ఫలితాలతోనే మార్పు

బైచుంగ్ భూటియా

ఈ ఏడాది అక్టోబరులో భారత్ ఆతిథ్యమివ్వనున్న అండర్-17 ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌తో దేశంలో ఒక్కసారిగా ఈ ఆటపై అందరూ దృష్టి సారించారు. సామాజిక మాధ్యమంలోనూ ఫుట్‌బాల్ పట్ల విప్లవం కనిపిస్తోంది. ఈ మెగా ఈవెంట్‌కు సంబంధించి మూడు నెలల క్రితం టికెట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. భారత మ్యాచ్‌ల టికెట్లను చాలా మంది ఉత్సాహంతో కొనుగోలు చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ప్రారంభానికి సరిగ్గా 50 రోజుల సమయం ఉంది. ఈ టోర్నమెంట్ నిర్వహణ భారత ఫుట్‌బాల్‌లో కొత్త మార్పునకు నాంది పలుకుతుందని గట్టిగా విశ్వసిస్తున్నాను. భారత్‌లో తొలిసారి జరుగనున్న ప్రపంచస్థాయి ఈవెంట్‌కు నేను కూడా ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నాను.



ఒలింపిక్స్ క్రీడల తర్వాత అత్యంత ఆదరణ కలిగిన ఈవెంట్‌గా ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీకి ఉంది. ఈ మెగా టోర్నీకి ఆతిథ్యమిచ్చిన దేశాల్లో ఈ ఆటలో ఎంతో పురోగతి కనిపించింది. ఆటకు సంబంధించి మౌలిక వసతుల్లో మెరుగుదల ఉండటం, స్టేడియాల ఆధునీకరణ ఫుట్‌బాల్ పురోభివృద్ధికి దోహదం చేస్తాయి. ఫుట్‌బాల్ ఆట కోటీ పది లక్షల మందికి పరిచయం కావాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న 'ద మిషన్ ఎలెవన్ మిలియన్' కార్యక్రమం విజయవంతమైంది. పక్కా ప్రణాళిక ఉంటే భారత్‌లో ఈ ఆటకు పూర్వ వైభవం లభిస్తుందని నేను ఎంతో కాలంగా చెబుతున్నాను. క్షేత్రస్థాయి నుంచి ఈ ఆటకు ఆదరణ పెరగాలనే ఉద్దేశంతో ఎనిమిదేళ్ల క్రితం మేము ముందుకురాగా... అప్పుడు ఐదు అకాడమీలు మాత్రం ఆసక్తి చూపించాయి. ప్రస్తుతం దేశంలోని ప్రతి రాష్ట్రంలో ఫుట్‌బాల్ అభివృద్ధి కోసం ఎవరో ఒకరు తమవంతుగా కృషి చేస్తున్నారు. ఇక ఈ మెగా టోర్నమెంట్‌లో అమెరికా, ఘనా, కొలంబియా జట్లతో గ్రూప్ 'ఎ'లో భారత్‌కు చోటు కల్పించారు. అమెరికా టైటిల్ ఫేవరెట్ కాగా... ఘనా, కొలంబియా జట్లను తక్కువ అంచనా వేయలేం. ఈ మేటి జట్లకు దీటుగా భారత్ ఆడాలని అభిమానులందరూ కోరుకుంటున్నారు. అభిమానుల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత భారత యువ ఆటగాళ్లపై ఉంది. వారు మెరుగ్గా రాణించి మంచి ఫలితాలు సాధిస్తే దేశంలో ఈ ఆటకు మళ్లీ జీవం వస్తుందనడంలో సందేహం లేదు. అంతర్జాతీయంగా ఫుట్‌బాల్‌కు ఎంతో పేరు ఉండగా... భారత ఫుట్‌బాల్ కూడా తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవాలని, అభిమానుల హృదయాల్లో నిలిచిపోవాలని ఆశిస్తున్నాను.

ఆటలకు అండగా నిలుస్తాం!

కేరళ బ్లాస్టర్స్ యజమాని నిమ్మగడ్డ ప్రసాద్

- హైదరాబాద్ ఫుట్‌బాల్ అకాడమీతో ఒప్పందం



సాక్షి, హైదరాబాద్: క్రీడలను అభిమానించేవారి సహకారం లేకుండా ఏ క్రీడలు కూడా అభివృద్ధి చెందలేవని ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ జట్టు కేరళ బ్లాస్టర్స్ సహ యజమాని నిమ్మగడ్డ ప్రసాద్ అన్నారు. ఇదే కారణంతో గత కొంత కాలంగా తాము అన్ని రకాల క్రీడలకు అండగా నిలిచేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో ప్రతిభ గల చిన్నారులను గుర్తించి వారికి తగిన శిక్షణ ఇచ్చేందుకు ప్రసాద్ ముందుకు వచ్చారు. ఈ క్రమంలో హైదరాబాద్ ఫుట్‌బాల్ అకాడమీ (హెచ్‌ఎఫ్‌ఏ)తో బ్లాస్టర్స్ జత కట్టింది. దీని ద్వారా హెచ్‌ఎఫ్‌ఏలో ఇప్పటికే శిక్షణ పొందుతున్న దాదాపు 300 మంది ట్రైనీలకు బ్లాస్టర్స్ యాజమాన్యం సాంకేతిక సహకారం అందిస్తుంది. 'ఇక్కడ శిక్షణ పొందిన మెరికల్లాంటి ఆటగాళ్లు త్వరలో మా జట్టుతో పాటు భారత జట్టులో చోటు దక్కించుకుంటారని ఆశిస్తున్నాం. కేరళ టీమ్ కోచ్‌లు కూడా ఈ అకాడమీలో అవసరమైన ట్రైనింగ్ అందిస్తారు. గతంలో భారత ఫుట్‌బాల్‌లో అనేక మంది దిగ్గజాలు హైదరాబాద్‌కు చెందినవారే. నాటి వైభవం తిరిగి తీసుకు వచ్చే ప్రయత్నంలోనే ఇక్కడ ఈ కార్యక్రమం మొదలు పెట్టాం' అని ప్రసాద్ చెప్పారు. హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ ఆటకు మరింత గుర్తింపు తెచ్చేందుకు తమ అకాడమీ కృషి చేస్తోందని హెచ్‌ఎఫ్‌ఏ ఫౌండర్ మొహమ్మద్ ఆతిఫ్ హైదర్ పేర్కొన్నారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎఫ్‌ఏ ప్రతినిధులు తేజో అనంత్ దాసరి, పవన్ కుమార్ దువ్వా, కోచ్ తంగ్‌బోయ్, బ్లాస్టర్స్ ఆటగాళ్లు రినో, ప్రశాంత్‌లతో పాటు చాముండేశ్వరీనాథ్ పాల్గొన్నారు.

పీబీఎల్-3లో మరో రెండు కొత్త జట్లు

చెన్నై: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) మూడో సీజన్‌లోకి మరో రెండు కొత్త జట్లు రాబోతున్నాయి. డిసెంబర్ 22 నుంచి జనవరి 14 వరకు జరిగే పీబీఎల్-3లో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్, గువాహటి ఈస్టర్న్ వారియర్స్ ఆడనున్నాయి. దీంతో పీబీఎల్‌లో జట్ల సంఖ్య ఆరు నుంచి ఎనిమిదికి చేరింది. 'బాయ్' ఆధ్వర్యంలో ఈసారి నాలుగు నగరాల్లో మ్యాచ్‌లు జరుగనుండగా ఫైనల్‌కు చెన్నై వేదిక కానుంది. ఈ ఏడాది జనవరిలో ముగిసిన రెండో సీజన్‌ను పీవీ సింధు నేతృత్వంలోని చెన్నై స్మాషర్స్ జట్టు గెలుచుకుంది.